

‘ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 | సంచిక: 70

SUNDAY Special | ఆదివారం 1-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సమ్మర్ స్పెషల్.. వేసవిలో వర్షాలు!

ఈ వేసవి కూల్‌గా గడిచిపోయింది. సీజన్‌లో కురవాల్సిన సాధారణ వర్షాల కంటే 203 శాతం అధికంగా వానలు పడ్డాయి.

- వివరాలు 12లో



నేడు ఐపీఎల్ క్వాలిఫయర్-2

అహ్మదాబాద్‌లో జరిగే పోరులో ముంబై ఇండియన్స్‌తో పంజాబ్ కింగ్స్ తలపడనుంది. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్‌కు చేరుతుంది.

- వివరాలు 14లో



మహిళలు కన్నెర్ర చేస్తే..

పాకిస్తాన్ ఉగ్రవాదులు, వారి వెనుక ఉన్న సూత్రధారులు భారత నారీశక్తిని సవాలు చేసి స్వయంగా వినాశనాన్ని కొనితెచ్చుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. - 6లో



రాజ్యాంగం వల్లే దృఢమైన భారత్

సంక్షోభ సమయాల్లోనూ దేశాన్ని ఐక్యంగా, బలంగా నిలబెట్టిన ఘనత రాజ్యాంగానిదే అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ చెప్పారు. - 6లో



జూన్ 10న దేశవ్యాప్త బంద్

నంబాలతో పాటు మరో 26 మంది మావోయిస్టులను హతమార్చడాన్ని నిరసిస్తూ ఈనెల 10న దేశవ్యాప్త బంద్ పాటించాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. - 5లో



ఉక్కు, అల్యూమినియంపై 50%..

ట్రంప్ మరో బాంబు పేల్చారు. తమ దేశంలో ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని, ఇందుకోసం విదేశీ ఉక్కుపై సుంకాన్ని రెండు రెట్లు చేస్తామని అన్నారు. - 6లో

మిస్ వరల్డ్ చువాంగ్‌శ్రీ

థాయ్ భామను వరించిన అందాల కిరీటం..

ఒపల్ సుచాత చువాంగ్‌శ్రీకి రూ. 6.5 కోట్ల విలువైన బ్లూక్రౌన్‌ను అలంకరించిన ప్రస్తుత మిస్ వరల్డ్ క్రిష్టినా పిష్కోవా

థాయ్‌లాండ్‌కు తొలిసారి కిరీటం.. విజేతకు రూ. 8.5 కోట్ల ప్రైజ్‌మనీ, నగలు, డిజైనర్ దుస్తులు

టాప్-8లోకే చేరుకోలేకపోయిన మిస్ ఇండియా నందినీ గుప్తా

ఫస్ట్ రన్నరప్‌గా ఇథియోపియా సుందరి, రెండో రన్నరప్ పోలాండ్ భామ, మూడో రన్నరప్‌గా మార్టినిక్ సుందరి..

సాక్షి, హైదరాబాద్: మిస్ వరల్డ్–2025గా థాయ్‌లాండ్ భామ ఒపల్ సుచాత చువాంగ్‌శ్రీ(21) ఎంపికైంది. హైదరాబాద్‌లోని హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఉత్కంఠభరితంగా జరిగిన 72వ ఎడిషన్ మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలేలో ఆమె విజయం సాధించింది. ప్రస్తుత మిస్ వరల్డ్ క్రిష్టినా పిష్కోవా ఆమెకు రూ. 6.5 కోట్ల విలువైన బ్లూ క్రౌన్‌ను అలంకరించింది. ఈ విజయంతో ఆమె దాదాపు రూ. 8.5 కోట్ల ప్రైజ్‌మనీతో పాటు లండన్‌లో ఏడాదిపాటు నివాసం, డిజైనర్ దుస్తులు, నగలు వంటి బహుమతులు, ఏడాదిపాటు ప్రపంచవ్యాప్తంగా ఉచిత విమాన ప్రయాణ సౌలభ్యం, స్టార్ హోటళ్లలో ఉచిత బస వసతి పొందనుంది. మొదటి రన్నరప్‌గా ఇథియోపియాకు చెందిన మిగతా 16వ పేజీలో ▶



మిస్ వరల్డ్-2025గా ఎంపికైన ఒపల్ సుచాత చువాంగ్‌శ్రీ (థాయ్‌లాండ్)కి బ్లూక్రౌన్‌ను అలంకరిస్తున్న మిస్ వరల్డ్-2024 క్రిష్టినా పిష్కోవా

16 ఏళ్లకే రొమ్ము కేన్సర్ బారినపడ్డా..

- సకాలంలో గుర్తించడంతో ముప్పు నుంచి బయటపడ్డా
- ముందుగా గుర్తిస్తే వ్యాధి నివారణ సాధ్యమేనని ప్రచారం చేస్తున్నా
- హైదరాబాద్ ఆతిథ్యాన్ని మరువలేను: మిస్ వరల్డ్ చువాంగ్‌శ్రీ

16లో

కొన్ని జెట్లను కోల్పోయాం



ఆరు అబద్ధం.. ఎన్నో చెప్పం
సీడీఎస్ జనరల్ చౌహాన్ వెల్లడి

‘సిందూర్’ తొలి దశ నష్టాలవి..

మే 7 నాటి దాడుల్లో జరిగాయి

నష్టం కంటే కారణాలేమిటన్నదే కీలకం

రెండ్రోజుల్లోపే కనిపెట్టి సరిదిద్దుకున్నాం

తర్వాత పాక్ వెన్ను విరిచామన్న సీడీఎస్

ఆయన వ్యాఖ్యలపై రాజకీయ దుమారం

మోదీ ఇప్పటికైనా నిజాలు చెప్పాలి: కాంగ్రెస్

సిందూర్‌పై పార్లమెంటులో చర్చకు డిమాండ్

యుద్ధ సన్నద్ధతపై స్వతంత్ర విచారణ: ఖర్గే

6లో

“ మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టిన రోజు నష్టాలు జరిగాయి. అయితే అసలు సమస్య యుద్ధ విమానాలను కోల్పోవడం కాదు. అలా జరగడం వెనక కారణాలను త్వరగా తెలుసుకోవడం చాలా ముఖ్యం. జరిగిన వ్యూహాత్మక తప్పిదాలను రెండు రోజుల్లోపే కనిపెట్టగలిగాం.



సీడీఎస్‌పైనా దేశ ద్రోహి ముద్రవేస్తారా?

- పాక్‌తో యుద్ధంలో విమానాలు కూలాయని సీడీఎస్ చెప్పారు
- సీడీఎస్ కామెంట్స్‌పై కేంద్రం వివరణ ఇవ్వాలి: మంత్రి ఉత్తమ్

5లో

న్యూస్‌రీల్

ఇండియా ఫస్ట్.. తెలంగాణ ఫస్ట్ మా నినాదం



అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధే తమ అభిమతమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇంగ్లండ్‌లోని వార్విక్ యూనివర్సిటీలో ఆయన శనివారం నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించారు.

- వివరాలు 12లో

కేసీఆర్‌కు నోటీసులు ఎందుకిచ్చారు?



కేసీఆర్‌కు నోటీసులు ఎందుకిచ్చారు? కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణను సస్యశ్యామలం చేసినందుకా? అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. ఆమె శనివారం బంజారాహిల్స్‌లో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు.

- వివరాలు 12లో

కీచైన్ స్కాన్ చేస్తే.. ఆర్టీసీ సమాచారం



ఆ కీచైన్ స్కాన్ చేయగానే.. ఆర్టీసీ ప్రయాణ సమాచారం తెలుస్తుంది. తాము ఎక్కాల్సిన బస్సు ఎక్కడుందో తెలియజేసే గమ్యం యాప్‌తోపాటు అఫీషియల్ ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సహా పది రకాల సేవలు ఇందులో ఉన్నాయి.

- వివరాలు 5లో

అమ్మ బాధ.. చిన్నారి మానసిక వ్యథ



తల్లులకు ‘గృహహింస’తో పిల్లలపై ప్రభావం

యుక్తవయసులో మానసిక సమస్యలు

ఒత్తిడి, ఆందోళనకు గురవుతున్న టీనేజర్లు

3లో

గోశాలల విస్తీర్ణం 50 ఎకరాలకు తగ్గొద్దు



గోవులు స్వేచ్ఛగా తిరుగాడేలా ఉండాలి

స్థలాలను గుర్తించి.. బడ్జెట్ ప్రణాళికలు సిద్ధం చేయండి

గోశాలలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

నాలుగైదు రోజుల్లో ఎంకేపల్లి గోశాల తుది డిజైన్ ఖరారు

సాక్షి, హైదరాబాద్: గోవుల సంరక్షణ సులువుగా ఉండేలా గోశాలలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణపై ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి దశలో భాగంగా పశువైద్య విశ్వవిద్యాలయం, వ్యవసాయ విశ్వవిద్యాలయం, వాటి అనుబంధ కళాశాలలు, దేవాలయాల భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని సూచించారు. గోశాలల ఏర్పాటు కోసం ప్రత్యేక కమిటీని నియమించాలని, నిర్ణీత గడువులోగా మిగతా 3వ పేజీలో ▶

కోడెల సంరక్షణపై శ్రద్ధ పెట్టాలి..

అధికారులకు సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశం

గోశాలను తనిఖీ చేసిన కలెక్టర్.. రెండో రోజు మరో 5 కోడెలు మృతి

- వివరాలు 5లో

‘హరిహర వీరమల్లు’ని ఆపడం కోసమే బంద్ అనడం దుర్మార్గం..



పర్సంటేజీ అంశాన్ని పక్కదారి పట్టించి ‘హరిహర వీరమల్లు’ని ఫోకస్ చేయడం దారుణం

ఆ సినిమాతో లింకు పెట్టడం సరికాదు

పర్సంటేజీ విధానంతో ఇండస్ట్రీకి మేలు

సింగిల్ థియేటర్లు, చిన్న నిర్మాతలను బతికించాలి

- వివరాలు 14లో



ఆయిల్‌పామ్ సాగుకు దిగుమతి సుంకం దెబ్బ

- క్రూడ్ ఎడిబుల్ ఆయిల్స్‌పై సుంకాన్ని 20% నుంచి 10 శాతానికి తగ్గించిన కేంద్రం
- విదేశాల నుంచి భారీగా దిగుమతి కానున్న ఎడిబుల్ ఆయిల్స్
- పామాయిల్ గెలల ధరలు తగ్గే అవకాశం!
- ఆందోళనలో ఆయిల్‌పామ్ రైతులు

15లో



నేర దర్యాప్తుపై ఇంత నిర్లక్ష్యమా?

- లోపభూయిష్ట విచారణతో క్రిమినల్ జస్టిస్ వ్యవస్థకు ప్రమాదం
- పోలీసుల తీరుపై హైకోర్టు మండిపాటు.. అత్యాచారం కేసులో కల్నల్ రిషిశర్మ జీవిత ఖైదు రద్దు
- నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు

12లో



కరోనా కలకలం

3,395కు పెరిగిన కేసులు

కేరళలోనే 1,336 కేసులు

తర్వాత మహారాష్ట్ర, ఢిల్లీ

24 గంటల్లో 9 మరణాలు

దేశంలో కరోనా కలకలం క్రమంగా పెరుగుతోంది. శనివారం నాటికి దేశంలో 3,395 యాక్టివ్ కరోనా కేసులు నమోదయ్యాయి. అయితే కరోనా బారినపడ్డ వారిలో అత్యధికులకు తీవ్ర లక్షణాలేమీ లేవని, ఇళ్లలోనే చికిత్స తీసుకుంటున్నారని కేంద్రం తెలిపింది.


6లో

కాళేశ్వరంపై ఇక ఎదురుదాడి!

ప్రాజెక్టు పూర్వాపరాలను వివరించనున్న హరీశ్‌రావు

2న కాళేశ్వరంపై తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్

4న ప్రవాస తెలంగాణ వాసులతో కేటీఆర్ జూమ్ సమావేశం



సాక్షి, హైదరాబాద్: ఒక వైపు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటైన పీసీ ఘోష్ కమిషన్ ముందు విచారణకు హాజరయ్యేందుకు సన్నద్ధమవుతున్న బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. మరో వైపు ఈ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ప్రజల్లో ఎండగట్టేందుకు పార్టీ నాయకులు, కేడర్‌ను సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఇందులో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టు పూర్వాపరాలు, స్థితిగతులను పార్టీ నాయకులకు వివరించే బాధ్యతను మాజీ మంత్రి హరీశ్‌రావుకు అప్పగించారు. ఇప్పటికే రెండు సార్లు కేసీఆర్‌తో భేటీ అయిన హరీశ్‌రావు.. ఆయన ఆదేశాల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టుపై ‘పవర్ పాయింట్ ప్రజెంటేషన్’ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారని బీఆర్‌ఎస్ వర్గాల ద్వారా మిగతా 3వ పేజీలో ▶

ఇంతంజాఅకత్



అలాగే సీఎం లాలూప్రసాద్‌యాదవ్ అని అనకండీ!! మీరే సీఎం!!

ఇక సర్వే నంబర్లు మార్చుకోవచ్చు



రికార్డుల్లో ఒక సర్వే నంబర్.. కబ్జాలో ఉన్న భూమిది మరొకటి

రాష్ట్రంలో చాలా ఏళ్లుగా ఈ సమస్య

రైతుకు ఇష్టమైతే సర్వే నంబర్లు మార్చాలని సర్కారు నిర్ణయం

సరికొత్త పద్ధతికి శ్రీకారం చుడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

సర్వే నంబర్ మాత్రమే మారుస్తాం.. భూ విస్తీర్ణం మార్చబోము

మంత్రి పొంగులేటి వెల్లడి

అందరికీ తెలిసేలానే మార్పు..

రికార్డుల్లో సర్వే నంబర్ల మార్పు కార్యక్రమాన్ని పద్ధతి ప్రకారం చేయాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది. భూమి ఓ సర్వే నంబర్‌లో ఉండి రికార్డుల్లో మరో సర్వే నంబర్ ఉంటే.. ఆ రెండు సర్వే నంబర్లలోని రైతుల్లో ఎవరైనా రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అప్పుడు రెండు సర్వే నంబర్లలోని రైతులకు వారం రోజుల నోటీసును రెవెన్యూ యంత్రాంగం ఇస్తుంది. ఆ వారం రోజుల్లో అభ్యంతరాలు వస్తే పరిశీలిస్తుంది. లేదంటే గ్రామసభ పెట్టి అక్కడే రైతుల నుంచి సంతకాలు తీసుకుని వారిద్దరి సర్వే నంబర్లలోని రికార్డులను మార్పు చేసి వాస్తవంగా కబ్జాలో ఉన్న సర్వే నంబర్‌ను పాస్‌బుక్‌లో చేరుస్తారు. ఈ సర్వే నంబర్ సమస్య ఒకే రైతుకు ఉంటే ఆ రైతుకు నోటీసు ఇచ్చి ఆ తర్వాత రికార్డు మారుస్తారు. అయితే, ఇక్కడ సర్వే నంబర్‌ను మాత్రమే మారుస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ భూమి విస్తీర్ణం మార్చబోమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

సాక్షి, హైదరాబాద్: రికార్డులో ఒక సర్వేనంబర్ ఉంటుంది.. భూమి మరో సర్వే నంబర్‌లో ఉంటుంది.. పాసు పుస్తకంలో ఉండే సర్వే నంబర్‌కు, రైతు కబ్జాలో ఉన్న వాస్తవ సర్వే నంబర్‌కు పొంతనే ఉండదు. తెలంగాణలోని చాలా వ్యవసాయ భూముల పరిస్థితి ఇదే. ఇప్పుడీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రెవెన్యూ వ్యవస్థలో నూతన కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రైతుకు ఇష్టమైతే పాస్ పుస్తకంలోని సర్వే నంబర్‌ను మార్చి కబ్జాలో ఉన్న వాస్తవ సర్వే నంబర్‌ను చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

పాతదే అయినా.. పట్టించుకోలేదు: దశాబ్దాల తరబడి తెలంగాణలో భూముల సర్వే జరగని కారణంగా సర్వే నంబర్లు తప్పుగా నమోదయినా మార్చుకునే అవకాశం లేకుండా పోయింది. ఏ సర్వే నంబర్ అయితే ఏముందిలే... ఉన్న భూమి రికార్డులో ఉంటే చాలంటూ రైతులు కూడా ఆ సమస్యను సీరియస్‌గా తీసుకోలేదు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూ శాఖలో అనేక మార్పులు చేపడుతోంది. గ్రామ నక్షాలు లేని 413 గ్రామాలను గుర్తించిన ప్రభుత్వం.. 5 గ్రామాల్లో పైలట్ పద్ధతిలో భూముల రీసర్వేకు పూనుకుంది. ఈ రీసర్వేలో సర్వే నంబర్ల సమస్య వెలుగులోకి వచ్చింది. రీసర్వే జరుగుతున్న సమయంలోనే రాష్ట్ర వ్యాప్తంగా 32 మండలాల్లో భూభారతి చట్టాన్ని పైలట్‌గా అమలు చేస్తూ రైతుల భూసమస్యలపై దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఈ దరఖాస్తుల్లోనూ సర్వే నంబర్ల మార్పిడి విజ్ఞాపనలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతుకు ఇష్టమైతే తన పాసుపుస్తకంలోని సర్వే నంబర్‌ను మార్చాలని నిర్ణయించింది.



సమ్మర్ క్యాంప్స్‌లోనూ ఏఐ

ఆటలకు బదులు సాంకేతికతకు మొగ్గు

ఫిజికల్ టు డిజిటల్‌కు మారిన వైనం

వేసవిలోనేకాదు, ఏడాదంతా శిక్షణ

మారిన సమ్మర్ క్యాంప్స్ తీరుతెన్నులు

16లో

ADITYA UNIVERSITY

nirf Rank Band 201-300 | NBA TIER 1 ACCREDITED | ACCREDITED BY NAAC A++ GRADE

25 Years EXCELLENCE

STEP INTO THE WORLD OF OPPORTUNITIES

EAPCET COUNSELLING CODE

ADTPPU



PLACEMENTS

INTERNSHIP OFFERS

2026

Company	Students Selected	Stipend
Google	1 Student Selected	₹1.32 LAKH PER MONTH
Walmart	16 Students Selected	₹1 LAKH PER MONTH
AUTODESK	29 Students Selected	₹60,000 PER MONTH
AIRBUS	1 Student Selected	₹30,000 PER MONTH

2027

Company	Students Selected	Stipend
Flipkart	1 Student Selected	₹50,000 PER MONTH

2025 PLACEMENTS

HITACHI Inspire the Next ₹35.36 Lakhs Per Annum	JMC ₹34.95 Lakhs Per Annum	TOYOTA connected ₹34.12 Lakhs Per Annum	Aisan ₹33.51 Lakhs Per Annum
JEMS ₹32.84 Lakhs Per Annum	Daiseki ₹31.70 Lakhs Per Annum	IHARA ₹29.02 Lakhs Per Annum	AD-TEC ₹28.61 Lakhs Per Annum
HITACHI ₹27.29 Lakhs Per Annum	Hitachi Industrial Equipment Systems Co., Ltd. ₹27.16 Lakhs Per Annum	SANSUI ₹25.08 Lakhs Per Annum	Walmart ₹22.60 Lakhs Per Annum
pennant ₹20 Lakhs Per Annum	UiPath ₹17 Lakhs Per Annum	darwinbox ₹16.3 Lakhs Per Annum	3225+ Offers & Still Counting...

INTRODUCING IN THIS ACADEMIC YEAR

SCHOOL OF BUSINESS

- BBA
- BBA - Digital Marketing
- BBA - Business Analytics
- Master of Business Administration
- Ph.D. in Management Studies

SCHOOL OF SCIENCES

- B.Sc. - Forensic Science
- B.Sc. - Cyber Security & Digital Forensics
- M.Sc. - Forensic Science
- M.Sc. - Cyber Security & Digital Forensics

SCHOOL OF PHARMACY

- B.Pharmacy
- Pharma D
- M.Pharmacy

EMPOWERING EDUCATION THROUGH GLOBAL TIE-UPs

Student Exchange | Global Immersion | Dual/Joint Degrees | Research Collaborations









PROGRAMS OFFERED

SCHOOL OF ENGINEERING

BACHELOR OF TECHNOLOGY

- Civil Engineering.
- Electronics and Communication Engg.
- Electrical and Electronics Engineering.
- Mechanical Engineering.
- Computer Science and Engineering.
- Information Technology.
- Artificial Intelligence & Machine Learning.
- Data Science.
- Petroleum Technology.
- Mining Engineering.
- Agricultural Engineering.

MASTER OF TECHNOLOGY

- Structural Engineering.
- Power Electronics & Drives.
- Energy Science & Technology.
- VLSI Design.
- Computer Science & Engineering.
- CSE (AI&ML).

MASTER OF COMPUTER APPLICATIONS

- Ph.D. in All Disciplines

ADMISSIONS OPEN

Start Your Journey
Scan to Apply

₹5 Crore WORTH MERIT SCHOLARSHIPS

Contact us: +91 70360 76661, 70950 76663/4 | WhatsApp: 95536 49666 | www.adityauniversity.in

Aditya Nagar, ADB Road, Surampalem - 533 437, Kakinada Dist., Andhra Pradesh.



అమ్మ బాధ... చిన్నారి మానసిక వ్యథ

ఇంట్లో భర్త లేదా అత్తమామల వేధింపులు.. మహిళల మీదే కాదు, చిన్నారుల మీదా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా టీనేజర్లలో ఇవి మానసిక సమస్యలకు దారితీస్తున్నాయి. వారిలో ఆందోళన, ఒత్తిడికి కారణమవుతున్నాయి. బెంగళూరుకు చెందిన 'జాతీయ మానసిక ఆరోగ్యం, న్యూరో సైన్సెస్ ఇన్‌స్టిట్యూట్', సీవేదా కన్సార్షియం, అంతర్జాతీయ సంస్థల పరిశోధనలో తేలిన అంశమిది. ప్రముఖ 'ప్లోస్ వన్'జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం 2,800 మంది టీనేజీ యువత, తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించారు. మనదేశంలో గృహహింస సర్వ సాధారణమైపోయింది. చాలామంది మహిళలు మౌనంగా దీన్ని భరిస్తుంటారు. కొద్దిమంది మాత్రమే ఎదిరించి పోరాడతారు. మౌనంగా భరించే తల్లులతోనే ఈ సమస్య ఆగడం లేదు.. వారి పిల్లలపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. అమెరికాకు చెందిన పబ్లిక్ లైబ్రరీ ఆఫ్ సైన్స్ 'ప్లోస్ వన్'జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ఇదే తేల్చింది. ఈ అధ్యయనం కోసం వారు.. దేశంలో ఏడు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని 12-17 ఏళ్ల మధ్య యువతను ఎంచుకున్నారు. మానసిక రుగ్మతలు: మానసిక, శారీరక, లైంగిక వేధింపులకు గురైన వారి తల్లులను పరిశీలించారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

తల్లులకు 'గృహహింస'తో పిల్లలపై ప్రభావం | యుక్తవయసులో మానసిక సమస్యలు | టీనేజీ యువత, వారి తల్లులపై అధ్యయనం | ఒత్తిడి, ఆందోళనకు గురవుతున్న టీనేజర్లు | అవగాహనా కార్యక్రమాలే శరణ్యం

గృహ హింసకు గురైన తల్లుల్లో ఆందోళన, ఒత్తిడి వంటి మానసిక సమస్యలు స్పష్టంగా కనిపించాయి. ఇందులోనూ ముఖ్యంగా.. భౌతిక, లైంగిక దాడులకు గురైన తల్లుల్లో ఆందోళన వంటి రుగ్మతలు ఎక్కువగా కనిపించగా.. మానసిక, భౌతిక, లైంగిక దాడులకు గురైన వారిలో తీవ్ర ఒత్తిడి వంటి సమస్యలు కనిపించాయి. మనదేశంలో ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు గృహ హింసకు గురవుతున్నారని అంచనా. ఇవి

ఆత్మహత్యలకూ పురికొల్పుతున్నాయి

వారిలో బయటకు చెప్పలేని బాధకు కారణమవడమే కాకుండా.. ఆత్మహత్యలకు కూడా పురికొల్పుతున్నాయి. పాశ్చాత్య దేశాల్లో చేసిన అధ్యయనాల్లో ఈ విషయం ఇప్పటికే రుజువైందని అధ్యయనకర్తలు తెలిపారు.

అమ్మతనం ప్రతి స్త్రీకి ఒక కల. ప్రసవమంటే వేదన. కానీ, పుట్టే బిడ్డ కోసం ఎంత కష్టమైనా భరిస్తుంది. ఆ కష్టానికి గృహహింస కూడా తోడై మహిళలను మరింత కష్టపెడుతోంది. మనదేశంలో గృహ హింస కారణంగా మహిళలు గర్భధారణ సమయంలోనూ అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. గర్భం మధ్యలోనే పోవడం, నెలలు నిండకుండానే పిల్లలు పుట్టడం జరుగుతున్నాయి. ఇవి పుట్టే పిల్లలపైనా ప్రభావం చూపుతున్నాయి. వారిలో భావోద్వేగ, నడవడిక/ప్రవర్తనాపరమైన సమస్యలతోపాటు చదువులోనూ వెనకబడేలా చేస్తున్నాయి. 'ఉమ్మడి కుటుంబ వ్యవస్థ

గర్భధారణ సమయంలోనూ..

మహిళల పాలిట వరమూ కాగలదు, శాపమూ కాగలదు. భర్త చెడ్డవాడై, అత్త మామలు మంచి వాళ్లయితే.. మహిళకు వాళ్లు మానసికంగా బలాన్ని ఇవ్వగలుగుతారు. అదే అత్తమామలు ఆమెను వేధిస్తే ఆమెకు అదో కొత్త సమస్య. భర్త, అత్తమామల వేధింపులకు గురిచేస్తే నరకమే'అని ఈ సర్వే చేసినవాళ్లు అభిప్రాయపడ్డారు.

'కౌమారం'పై జరిగే దాడి

భార్యలను అనుక్షణం తిట్లతో మానసికంగా వేధించడం, బెదిరించడం, వాళ్లకు ఇంట్లో అన్నం, నీళ్ల వంటివి ఇవ్వకుండా పస్తులుండేలా చేయడం.. ఇవన్నీ ఇంట్లో ఉండే చిన్నారులు చూస్తుంటారు. భర్తలు అరిచేటప్పుడు చాలామంది చిన్నారులు బిక్కచచ్చిపోయి ఉండిపోతారు. మరికొందరు ఏడుస్తారు. ఇలా తమ తల్లులపై జరుగుతున్న దాడిని ప్రత్యక్షంగా చూసిన ఆ చిన్నారుల లేత మెదళ్ల తీవ్రంగా ప్రభావితమై వారిలో మానసిక రుగ్మతలకు కారణమవుతాయి. వారి నడతను ప్రభావితం చేసి.. వారి చదువుపైనా ప్రతికూల ప్రభావం చూపుతాయి. జీవితంలో టీనేజీ /యవ్వనం చాలా ప్రధానమైన దశ. మన ఆలోచనా విధానం మొగ్గతొడిగేది అప్పుడే. ఆశలు, ఆశయాలు ఊపిరిపోసుకునేదీ అప్పుడే. మనం సమాజంలో ఎలా నడుచుకోవాలో, వ్యక్తిత్వం ఎలా ఉండాలో నేర్చుకునేదీ అప్పుడే. కానీ అదే సమయంలో.. తమ తల్లులను ఇంట్లోనివారు పెట్టే హింసలు, తల్లులు అనుభవించే మానసిక వేదన వారి లేత మనసులను గాయపరుస్తున్నాయి. వారి విపరీత మానసిక ధోరణికి కారణమవుతున్నాయి. అయితే, గృహహింసను ఎదుర్కొనే మహిళలకు పుట్టే పిల్లల్లో ఇలాంటి మానసిక సమస్యలు ఎలా వస్తున్నాయో శాస్త్రీయంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని ఈ సర్వే అభిప్రాయపడింది. అంతేకాకుండా ఉమ్మడి కుటుంబాలు, సాంస్కృతికపరమైన అంశాలపైనా పరిశోధన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

గృహహింస అంటే..

- కట్నం కోసమో మరే ఇతర అవసరాల కోసమో భార్యలను భర్తలు వాళ్ల పుట్టింటికి వెళ్లిపోయేలా హింసించడం.
- వాళ్లపై భౌతికదాడి చేయడం, యాసిడ్ వంటివి పోసి గాయపర్చడం
- కత్తుల వంటి వాటితో గాయపర్చడం, వాతలు పెట్టడం



- అమ్మాయి పుడితే హింసించడం, అబ్బాయి పుట్టేవరకు వేధించడం

టీనేజర్లలో ఈ సమస్య పరిష్కారానికి...

- పాఠశాలల్లో ఇలాంటి పిల్లలను గుర్తించాలి.
- వారిలో ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు పోగొట్టేందుకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి
- మహిళలపై గృహహింస జరగకుండా నిరోధించాలి.

గోశాలల విస్తీర్ణం 50 ఎకరాలకు తగ్గొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

ఈ కమిటీ పూర్తిస్థాయి ప్రణాళికలతో సిద్ధం కావాలని కోరారు. గోశాలల ఏర్పాటుకు సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలను రూపొందించాలని ఆదేశించారు.

గోవులు స్వేచ్ఛగా తిరిగేలా ఉండాలి: ఇరుకు స్థలాల్లో బంధించినట్టుగా కాకుండా.. గోవులు మేత మేసేందుకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా గోశాలల్లో మార్పులు తేవాలని సీఎం సూచించారు. గోశాలల నిర్వహణ, సంరక్షణలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. సమీక్షలో భాగంగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాలకు సంబంధించిన పలు డిజైన్లను సీఎం పరిశీలించారు. షెడ్ల నిర్మాణం, ఇతర డిజైన్లలో పలు మార్పులను సూచించారు. ఈ గోశాల తుది డిజైన్‌ను నాలుగైదు రోజుల్లో ప్రభుత్వం ఖరారు చేయనుంది. సమావేశంలో సీఎం కార్యాలయ అధికారులు శేషాద్రి, శ్రీనివాసరాజు, మాణిక్‌రాజ్, అజిత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుపోషణ విభాగం డైరెక్టర్ బి.గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై ఇక ఎదురుదాడి!

▶ మొదటి పేజీ తరువాయి

తెలిసింది. ఈ నెల 2న మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ ముఖ్య నేతలకు తెలంగాణ భవన్‌లో ఆయన కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు.

జూన్ 4న జూమ్ సమావేశం: ఇప్పటికే యూకే, అమెరికా పర్యటనలో ఉన్న కేటీ రామారావు ప్రవాస తెలంగాణ వాసులతో కాళేశ్వరంపై జూన్ 4న జూమ్ సమావేశం నిర్వహించనున్నారు. అమెరికా నుంచి నిర్వహించే ఈ జూమ్ సమావేశంలో కేటీఆర్‌తో పాటు హైదరాబాద్ నుంచి హరీశ్‌రావు కూడా పాల్గొని కాళేశ్వరం ప్రాజెక్టు స్థితిగతులను వివరిస్తారని పార్టీ వర్గాల సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉపయోగపడుతుందని పార్టీ నేతలు చెపుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ కాళేశ్వరం ప్రాజెక్టుపై చేస్తున్న విమర్శలు, లేవనెత్తుతున్న సందేహాలు అన్నింటికీ సమాధానం ఇచ్చేలా ఈ ప్రజెంటేషన్‌ను రూపొందించారని తెలుస్తోంది. మరోవైపు మేడిగడ్డ ప్రాజెక్టు మరమ్మతు, గోదావరి జలాలను ఒడిసి పట్టడంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపేలా ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంటుందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

అటు అభివృద్ధి.. ఇటు సంక్షేమం

- అధికారం చేపట్టినప్పటి నుంచి అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించిన ప్రభుత్వం
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా ప్రగతి నివేదిక విడుదల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి అటు అభివృద్ధి, ఇటు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుకెళ్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రతిష్టాత్మక పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపాయి. అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు చేపట్టిన అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలతో కూడిన ప్రగతి నివేదికను ప్రభుత్వం శనివారం విడుదల చేసింది.

పథకాలు.. కార్యక్రమాలు..

ప్రజాభవన్‌కు మహాత్మా జ్యోతిబా పూలే పేరు పెట్టి ప్రజలందరికీ ప్రవేశం కల్పించినప్పటి నుంచి సంగారెడ్డి జిల్లాలో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మచ్నూర్ కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించే వరకు చేపట్టిన కార్యక్రమాలను ప్రగతి నివేదికలో ప్రభుత్వం పొందుపరిచింది. ప్రజావాణి, ప్రజా పాలన, హైదరాబాద్ రైజింగ్, మహాలక్ష్మి పథకం అమలు, చేయూత, రాజీవ్ ఆరోగ్యశ్రీ, గృహజ్యోతి, రూ. 500కే వంట గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం, రాజీవ్ యువవికాసం, పంట రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యం కొనుగోళ్లు, ఉచిత విద్యుత్, రైతు బీమా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు నేస్తం, రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటు, సన్నబియ్యం తదితర పథకాల అమలును నివేదికలో వివరించింది. వివిధ శాఖల్లో అమలు చేసిన కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, గత ప్రభుత్వ అప్పులకు చేసిన చెల్లింపులను అందులో పేర్కొంది. అలాగే తెలంగాణ వేదికగా బయో ఆసియా, ఏఐ గ్లోబల్ సమ్మిట్, లీడర్‌షిప్ సమ్మిట్, కామన్వెల్త్ మీడియేషన్, ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు, సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశాలు, ఆటోమోటివ్స్ ఫెస్టివల్, సైబర్ సెక్యూరిటీ కాంక్లేవ్, భారత్ సమ్మిట్ మొదలైనవి జరిగినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

అభివృద్ధి ప్రణాళికలు కూడా..

సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కుల సర్వే–2024 కోసం చేపట్టిన చర్యలను నివేదికలో ప్రభుత్వం వివరించింది. బీసీలకు రిజర్వేషన్లు, ఎస్సీల వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానాలు చేసిన తీరును వివరించడంతోపాటు ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం చేసిన ప్రణాళికలను వెల్లడించింది. మెట్రో విస్తరణ, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటు, హైడ్రా ఆవిర్భావం, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం తీసుకున్న చర్యల గురించి తెలియజేసింది. కొత్త ఉద్యోగ నియామకాలను శాఖలవారీగా వెల్లడించింది. భూభారతితోపాటు స్పీడ్ పథకం కింద చేపట్టిన 19 ప్రాజెక్టులు, మూసీ పునరుద్ధరణ లాంటి కార్యక్రమాల అమలు గురించి వివరించింది. సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను కూడా ఈ నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావించింది.

సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 1,266 కోట్ల సాయం

ప్రగతి నివేదికలో భాగంగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా అందించిన సాయాన్ని ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. సీఎంఆర్ఎఫ్ కార్యక్రమంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టామని.. ప్రజాప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి 2.87 లక్షల మందికి ఈ నిధి ద్వారా రూ. 1,266 కోట్ల సాయం అందించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

కేటీపీఎస్ ఉద్యోగిలో కరోనా లక్షణాలు

పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ కర్మాగారం ఉద్యోగిలో కరోనా లక్షణాలను గుర్తించినట్లు తెలిసింది. జలుబు, జ్వరంతో బాధపడుతున్న సదరు ఉద్యోగి శనివారం ఒక ఆస్పత్రికి వెళ్లాడు. ఈ మేరకు కరోనా లక్షణాలుగా భావించిన వైద్యులు, ప్రభుత్వ ఆస్పత్రిలో కోవిడ్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ విషయమై కేటీపీఎస్ 7వ దశ సీఈ శ్రీనివాసబాబును వివరణ కోరగా.. కరోనా లక్షణాలు ఉన్నట్లు మాత్రమే వైద్యులు గుర్తించి రిఫర్ చేశారని వెల్లడించారు. పూర్తి స్థాయిలో నిర్ధారణ జరగలేదని స్పష్టం చేశారు.



నీ మాటలను బట్టి నీతిమంతుడివని తీర్పునొందుదువు.
నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పునొందుదువు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.షష్ఠి రా.12.02 వరకు తదుపరి సప్తమి, **నక్షత్రం:** ఆశ్లేష రా.1.42 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ప.2.24 నుండి 4.01 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.46 నుండి 5.38 వరకు, **అమృత ఘడియలు:** రా.12.15 నుండి 1.50 వరకు.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం : 6.27
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మహానాడు 'ఆత్మ'కథ!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగించుకొని చనిపోయిన వారి ఆత్మలను ఆవాహన చేయొచ్చన్న మాట. తెలుగుదేశం పార్టీ మహానాడును చూసిన తరువాత ఈ సంగతి తెలిసి వచ్చింది. ఆవాహన చేసుకున్న ఆత్మలతో మన పుర్రెకు తోచిన విధంగా మాట్లాడించవచ్చు. చరిత్రను చెరిపేయవచ్చు. వక్రీకరించవచ్చు. నిజాలపై నీళ్లు చల్లవచ్చు. అసత్యాలకు ఆజ్యం పోయవచ్చు. మన మేధోజనిత స్క్రిప్టును చనిపోయిన వారి ఆత్మలతో చదివించవచ్చు. కొత్త పుంతలు తొక్కిన ఈ టెక్నాలజీ వాడకాన్ని చూసిన తర్వాత వింత వింత అనుమానాలు కలుగుతున్నాయి. ముందు ముందు మహాత్ముడి ఆత్మను ఆవాహన చేయించి గాడ్సేకు కితాబునిప్పించే రోజులు కూడా వస్తాయేమో! గాడ్సే భక్తులు పుట్టుకొస్తున్న కాలం కదా ఇది.

మహానాడు వేదికపై స్క్రీన్ మీద కనిపించిన ఎన్టీఆర్ బొమ్మ విచిత్రంగా మాట్లాడుతుంది. తెలుగుదేశం పార్టీ ఆశయాలను తన తర్వాత చంద్రబాబు గొప్పగా కొనసాగిస్తున్నారట! హైదరాబాదుకు తాను సాంస్కృతిక వారధిగా నిలబడితే, చంద్రబాబు సాంకేతిక వారధిగా నిలిచిపోయారట! రెండు రూపాయలకు కిలో బియ్యంతో తాను పేదవారి కడుపు నింపితే, 'పి–4' పథకం తెచ్చి పేదరికాన్ని పారద్రోలేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారట! ఎన్టీఆర్ బొమ్మలోని కృత్రిమ ఆత్మ పలికిన పలుకులే ఇవి. ఎన్టీఆర్‌కు వారసుడు ఎవరో కూడా ఆత్మ తేల్చేసింది. తన వారసత్వానికి వన్నె తెస్తున్న లోకేష్‌ను 'భళా మనవడా' అని కూడా ఏఐ ఆత్మ ఆశీర్వదించింది.

ఎన్టీఆర్ జీవించి ఉన్న రోజుల్లో ఒకసారి తన వారసునిగా బాలకృష్ణ పేరును ఆయన ప్రకటించిన సంగతి అప్పటి వారికి గుర్తుండే ఉంటుంది. మహానాడులో ఎన్టీఆర్ ఆత్మ ప్లేట్ మారుస్తుందని బాలయ్యకు ముందే తెలుసా? అందుకే ఈ కార్యక్రమానికి డుమ్మా కొట్టారా? మహానాడు కంటే అతి ముఖ్యమైన మరో కార్యంలో లగ్నమై ఉన్నందువల్ల కూడా రాకపోయి ఉండవచ్చు. ఒక్క బాలయ్యే కాదు... నందమూరి వంశాంకురాలేవీ ఈ జాతరలో కనిపించలేదని మీడియా రిపోర్టులు వెల్లడిస్తున్నాయి. ఈ మహానాడులో నారా వారసుడే చక్రం తిప్పుతారని అందరూ ఊహించిందే. కాకపోతే పార్టీని శాసించే స్థాయి తనదేనని ఆయనే స్వయంగా ప్రకటించుకుంటారని ఎవరూ ఊహించలేదు.

పార్టీ కోసం లోకేష్ ఆరు శాసనాలను ప్రకటించారు. శాసనమంటే అందరూ శిరసా వహించవలసిందే కదా! ఆరు శాసనాల పేర్లు కూడా విచిత్రంగా ఉన్నాయి. సామాన్య కార్యకర్తలు ఆ పేర్ల భావాన్ని అర్థం చేసుకోవడానికి ప్రత్యేకంగా ఒక ఎల్లో బుక్కును అచ్చేయవలసిన అవసరం రావచ్చు. సరిగ్గా 30 ఏళ్ళ కింద ఎన్టీఆర్‌కు చంద్రబాబు బృందం వెన్నుపోటు పొడిచి పార్టీని, ప్రభుత్వాన్ని లాగేసుకున్న సంగతి జగమెరిగిన చరిత్ర. మూడు దశాబ్దాల తర్వాత ఇప్పుడు ఆయన ఆత్మకు సైతం బాబు పార్టీ వెన్నుపోటు పొడవడం విస్మయానికి గురి చేస్తున్నది. మరణానికి ముందు వివిధ ఇంటర్వ్యూలలో, ప్రెస్ మీట్‌లలో చంద్రబాబు గురించి ఎన్టీఆర్ ఏమని మాట్లాడారో తెలియని వారెవరు?

తండ్రిని కారాగారంలో బంధించి, సోదరులను హతమార్చి సింహాసనాన్ని హస్తగతం చేసుకున్న ఔరంగజేబుతో చంద్రబాబును ఎన్టీఆర్ పోల్చారు. తన దగ్గర వినయం నటిస్తూనే పథకం ప్రకారం గోతులు తవ్విన నమ్మకద్రోహిగా నిందించారు. చరిత్ర హీనుడు అతగాడని ధ్వజమెత్తారు. చంద్రబాబుపై ఎన్టీఆర్ చేసిన విమర్శలకు సంబంధించిన వీడియోలు ఇప్పటికీ అందుబాటులోనే ఉన్నాయి. అంతలోనే ఆయన ఆత్మ (అటువంటివి ఉంటాయని నమ్మితే) యూ–టర్న్ తీసుకున్నట్టు ఎలా చిత్రించగలిగారు? జాతీయస్థాయిలో ఎన్డీఏ కూటమికి పెద్దన్నగా ఉన్న పార్టీ వెయ్యేళ్ల భారత చరిత్రను తిరగరాసే పనిలో ఉన్నది. అదే స్ఫూర్తితో ఈ ముప్ఫయ్యేళ్ల ఆంధ్ర చరిత్రను బాబు కూటమి తిరగరాయాలని భావిస్తున్నదా? గూగుల్‌లో వెన్నుపోటు అనే అక్షరాలు టైప్ చేస్తే చంద్రబాబు బొమ్మ కనిపించని రోజు రావాలని ప్రయత్నిస్తున్నదా?



ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే అది నిజమైపోతుందనే గోబెల్స్ సూత్రాన్ని గడచిన 30 ఏళ్లుగా చంద్రబాబు పార్టీ, ఎల్లో మీడియా బాగా ఒంట పట్టించుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటినుంచే ప్రయత్నం చేస్తే ఇంకో పదేళ్లకో, ఇరవై ఏళ్లకో వెన్నుపోటు కథను బుట్టదాఖలు చేయవచ్చనే విశ్వాసంతో ఉన్నట్టు కనిపిస్తున్నది. అటువంటిదేమీ జరగలేదని, ఎన్టీఆర్ ప్రోద్బలంతోనే, ఆయన ఆశీర్వాదంతోనే చంద్రబాబు ఈ పవిత్ర కార్యాన్ని నెరవేర్చారని చెప్పే కొత్త పరిశోధనలు కూడా ఎల్లో మీడియా వెలువరించవచ్చు. అందుకు ఈ మహానాడులో నాంది పలికారనుకోవాలి.

ఒక పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంలో జరుగుతున్న పార్టీ మహాసభల మీద ప్రజలకు కొంత ఆసక్తి ఉంటుంది. ఎన్నికల హామీల అమలుపై సమీక్ష ఉంటుందని, అమలు చేయలేకపోయిన అంశాలపై వివరణ ఉంటుందని, పరిపాలనా తీరుతెన్నులపై ఆడిట్ ఉంటుందని ఆశిస్తారు. విచిత్రంగా ఈ మహానాడులో ఇవేమీ జరగలేదు. ప్రతిపక్ష నాయకుడైన జగన్ మోహన్ రెడ్డిని తిట్టిపోయడమనేది ప్రతి వక్త ప్రసంగంలోనూ తప్పనిసరి అంశంగా నిర్ధారించినట్టున్నారు. అధినేతల దగ్గర మార్కులు కొట్టేయడానికి వక్తలందరూ దాన్ని తూచా తప్పకుండా పాటించారు.

మహానాడు తేదీలకు ముందే తెనాలిలో జరిగిన దారుణ సంఘటన వెలుగులోకి వచ్చింది. దళిత యువకులను బహిరంగంగా నడిరోడ్డుపై పడుకోబెట్టి వారి కాళ్లు కదలకుండా ఒక పోలీసు తొక్కిపట్టి మరో పోలీసు అధికారి వారి అరికాళ్ళ మీద లాఠీతో బాదుతున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. బాధతో ఆ యువకులు చేస్తున్న ఆర్తనాదాలు హృదయ విదారకంగా ఉన్నాయి. ఈ అమానుష ఘటన మహానాడులో చర్చకు వచ్చి ఉండాలి. హోం మంత్రి సంజాయిషీ ఇచ్చి ఉండాలి. అటువంటిదేమీ లేకపోగా జరిగిన సంఘటనను పోలీసు ఉన్నతాధికారులు నిస్సిగ్గుగా సమర్థించుకుంటున్నారు.

మహానాడు సమయంలోనే టెన్త్ క్లాస్ పరీక్ష పత్రాల రీవాల్యుయేషన్ బాగోతం బయటపడింది. పరీక్ష పత్రాల మూల్యాంకనం ఒక ప్రణాళిక, పద్ధతి లేకుండా ఇష్టారాజ్యంగా జరిగి, ఆరు లక్షల కుటుంబాల్లో ఆవేదన నింపింది. ఫలితంగా ఎన్నడూ లేనంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు పెట్టుకున్నారు. పదకొండు వేల పరీక్షా పత్రాల మార్కుల లెక్కింపులో పొరపాట్లు జరిగినట్టు వెల్లడైంది. ఆ పొరపాటు ఒకటి రెండు మార్కులు కాదు. కొన్ని పేపర్లలో యాభై మార్కుల వరకు తేడాలొచ్చాయి. కొన్ని సమాధానాలకు మార్కులే వేయని వైనం కూడా బయటపడింది. ఇది అసాధారణం. రికార్డు సమయంలో ఫలితాలు వెల్లడించాలన్న దుగ్ధతో టీచర్ల మెడ మీద కత్తి పెట్టినందువల్లనే ఇలా జరిగిందని అనుభవజ్ఞులు చెబుతున్నారు.

జగన్ మోహన్ రెడ్డి అపురూపంగా చూసుకున్న విద్యా వ్యవస్థను ఒక్క ఏడాదిలోనే నేలకేసి కొట్టిన ఈ నిర్లక్ష్యంపై సర్వత్రా అసహనం వ్యక్తమవుతున్నది. దీనిపై మహానాడులో చర్చ జరిగి ఉండాలని జనం కోరుకుంటారు. విద్యామంత్రి వివరణ ఇస్తారని ఆశిస్తారు. కానీ ఆయన వివరణ ఇవ్వలేదు. హాజరైన ప్రతినిధులు అడిగే సాహసం చేయలేదు. ఈ రెండు అంశాలే కాదు, పాలనాపరమైన ఏ అంశం పైనా చర్చ జరగలేదు. నిర్వాహకులు రాసిచ్చిన తీర్మానం కాపీని చదవటమే నాయకులు చేసిన పని. ఎన్నికలకు ముందు ఇబ్బడిముబ్బడిగా చేసిన వాగ్దానాల గురించి గానీ, అందులో ముఖ్యమైన 'సూపర్ సిక్స్' గురించి గానీ ఏ చర్చా లేదు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పినట్టున్నారు. 15 నెలల అధికారం కరిగిపోయిన తర్వాత అమలు చేస్తారట! త్వరలో 'తల్లికి వందనం' ఇస్తామని చెబుతున్నారు. 80 లక్షల మంది విద్యార్థులకు ఇవ్వాల్సిన గత సంవత్సరపు బకాయి గురించి మాత్రం మాట్లాడటం లేదు. 'అన్నదాతా సుఖీభవ', 'నిరుద్యోగ భృతి', 'ఆడబిడ్డ నిధి' వంటి కీలకమైన హామీల సంగతి మాట మాత్రంగానైనా మహానాడులో ప్రస్తావనకు రాలేదు.

మరి మహానాడులో ఏం మాట్లాడారు? తండ్రి–కొడుకుల భజన, ప్రతిపక్ష నేతపై దూషణ... ఈ రెండూ కంపల్సరీ సబ్జెక్టులుగా కనిపించాయి. వీటితో పాటు అసత్య వాణి, మోసపూరిత వైఖరి, వంచనా శిల్పం, అధికార దాహం అనే నాలుగు అంశాలు మహానాడులో అంతర్లీనంగా ప్రవహించాయి. చరిత్రను వక్రీకరించే విధంగా కృత్రిమ మేధ సాయంతో ఎన్టీఆర్ 'ఆత్మ' పేరుతో చెప్పించిన మాటల దగ్గర నుంచి మూడు రోజులపాటు జరిగిన అన్ని ఉపన్యాసాల్లో అసత్యాలు, అర్ధసత్యాలు కోకొల్లలుగా కనిపిస్తాయి. ఎన్టీఆర్ పట్ల ప్రకటించిన భక్తి, వినయం అన్నీ బూటకమేనని, మోసపూరితమైనవని సభ జరిగిన తీరే తేటతెల్లం చేసింది.

> ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే అది నిజమైపోతుందనే గోబెల్స్ సూత్రాన్ని గడచిన 30 ఏళ్లుగా చంద్రబాబు పార్టీ, ఎల్లో మీడియా బాగా ఒంట పట్టించుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటినుంచే ప్రయత్నం చేస్తే ఇంకో పదేళ్లకో, ఇరవై ఏళ్లకో వెన్నుపోటు కథను బుట్టదాఖలు చేయవచ్చనే విశ్వాసంతో ఉన్నట్టు కనిపిస్తున్నది. అటువంటిదేమీ జరగలేదని, ఎన్టీఆర్ ప్రోద్బలంతోనే, ఆయన ఆశీర్వాదంతోనే చంద్రబాబు ఈ పవిత్ర కార్యాన్ని నెరవేర్చారని చెప్పే కొత్త పరిశోధనలు కూడా ఎల్లో మీడియా వెలువరించవచ్చు. అందుకు ఈ మహానాడులో నాంది పలికారనుకోవాలి.
>
> ఒక పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంలో జరుగుతున్న పార్టీ మహాసభల మీద ప్రజలకు కొంత ఆసక్తి ఉంటుంది. ఎన్నికల హామీల అమలుపై సమీక్ష ఉంటుందని, అమలు చేయలేకపోయిన అంశాలపై వివరణ ఉంటుందని, పరిపాలనా తీరు తెన్నులపై ఆడిట్ ఉంటుందని ఆశిస్తారు. విచిత్రంగా ఈ మహానాడులో ఇవేమీ జరగలేదు. ప్రతిపక్ష నాయకుడైన జగన్ మోహన్ రెడ్డిని తిట్టిపోయడమనేది ప్రతి వక్త ప్రసంగంలోనూ తప్పనిసరి అంశంగా నిర్ధారించినట్టున్నారు. అధినేతల దగ్గర మార్కులు కొట్టేయడానికి వక్తలందరూ దాన్ని తూచా తప్పకుండా పాటించారు.

ఎన్టీ రామారావుకు భారతరత్న పురస్కారం దక్కాలన్న కోరిక తెలుగుదేశం శ్రేణులతో పాటు తెలుగు ప్రజల్లో చాలామందికి ఎప్పటినుంచో ఉన్నది. ఆ కోరిక మేరకు కనీసం కంటి తుడుపుగా ఒక తీర్మానాన్ని కూడా మహానాడు ఆమోదించలేదు. నిజానికి ఆ పురస్కారం కోసం కేంద్రంపై ఒత్తిడి తేగల స్థితిలో ఇప్పుడు తెలుగుదేశం పార్టీ ఉన్నది. ఆ పార్టీ మద్దతుపైనే కేంద్ర సర్కార్ ఆధారపడి ఉన్నది. అయినా చంద్రబాబు ఆ డిమాండ్ చేయరు. గతంలో వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు తాను చక్రం తిప్పానని చంద్రబాబు పలుమార్లు చెప్పుకున్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న కావాలనే డిమాండ్ మాత్రం ఆయన ఎప్పుడూ చేయలేదు. ఇప్పుడు కూడా చేయబోరని మహానాడు మరోసారి నిరూపించింది. ఈ మహానాడులో నందమూరి వంశస్థులు ఎవరూ కనిపించలేదని చెబుతున్నారు. బహుశా వచ్చే మహానాడులో నందమూరి తారక రామారావు బొమ్మ కూడా అదృశ్యం కావచ్చు.

వంచనా శిల్పం కూడా అడుగడుగునా కనిపించింది. ఎన్నికలకు ముందు చేసిన 'సూపర్ సిక్స్'ను పక్కన పెట్టి యువనేత శాసన 'సిక్స్'ను ప్రవేశపెట్టారు. ఈ శాసనాలకు రూపకర్తలు ఎవరో చెప్పలేదు గనుక వాటి గురించి ప్రసంగించిన ఆయననే ఏకసభ్య శాసనసభగా పరిగణించాలి. అందులో 1) తెలుగు జాతి విశ్వఖ్యాతి, 2) యువగళం, 3) స్త్రీ శక్తి, 4) పేదల సేవలో సోషల్ రీ ఇంజనీరింగ్, 5) అన్నదాతకు అండగా, 6) కార్యకర్తే అధినేత. ఈ పదబంధాల అర్థతాత్పర్యాలను ఏలినవారు ప్రత్యేకంగా విడుదల చేసిన తర్వాతే వీటి గుణదోషాల గురించి మాట్లాడగలుగుతాము. మహానాడులో కనిపించిన మరో అంశం అంతులేని అధికార దాహం. స్వయంగా పార్టీ అధ్యక్షుడైన ముఖ్యమంత్రి తరతరాలు తమ కుటుంబమే పరిపాలించాలన్న కోరికను ఎటువంటి శషభిషలు లేకుండా కుండబద్దలు కొట్టి చెప్పారు. ఒకసారి గెలిపించటం మరోసారి ఓడించడం వంటి వైకుంఠపాళీ వద్దని, ఎప్పటికీ తమనే గెలిపించినట్లయితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, లేదంటే లేదని ఆయన మనోగతాన్ని బయటపెట్టారు. ఇదీ తెలుగుదేశం పార్టీ ప్రజాస్వామ్య స్ఫూర్తి!

vardhelli1959@gmail.com

ఒమర్ అబ్దుల్లా (జమ్మూకశ్మీర్ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

జ్ఞాపకాల స్తూపాలను నిర్మించుకోగలం. పోగొట్టుకున్న నమ్మకాల సౌధాలను పునర్నిర్మించుకోగలమా?!

కశ్మీర్ ఖాళీ అయిపోయింది! కశ్మీర్ గుండె పట్టి గ్రీష్మాన్ని ఊపిరి తీసి వదులుతోంది. ఒక్క వాన చుక్క... ధైర్యం చేసి జారి పడే ఒక్క వాన చుక్క కోసం... మోరెత్తి లోయలోకి చూస్తోంది. లోయే కశ్మీర్ ఆకాశం. టూరిస్టులే వాన జల్లులు, మురిసి కురిసిపోయే కరి మబ్బులు.

కశ్మీర్ నన్ను అడుగుతోంది. "ఏమయ్యా ఒమర్ అబ్దుల్లా... ఈ దాల్ సరస్సుని, మొఘల్ సొగసుని, గుల్మార్గ్ పూతల్ని, సలీం అలీ పార్క్ పిట్టల్ని, శంకరాచార్యుల వారిని, వైష్ణోదేవిని ఎవరికి సాక్షాత్కరింప చేసుకోమంటావ్?! కొండా కోనలున్నా చూసే కన్నే లేకుంటే ఏం చేసుకోను ఈ వరాలన్నీ?!" అని అడుగుతోంది.

కశ్మీర్ కంట్లో వాన చుక్క!

ఇప్పుడంతా ప్రశాంతంగా ఉందని చెప్పటానికి పెహల్గామ్‌లో నేను సైకిల్ మీద తిరుగుతున్నప్పుడు ఓ గడప దగ్గర కశ్మీర్ నన్ను ఆపింది. "నీ కోసమే చూస్తున్నా ఒమర్!" అంది.

"చెప్పండి అమ్మీజాన్..." అన్నాను, సైకిల్ దిగి స్టాండ్ వేసి అమ్మీ పాదాలకు నమస్కరిస్తూ.



"నీకు తెలుసు కదా ఒమర్! తెర్లుతున్న తేయాకు నీటిలో యాలకులు, దాల్చిన చెక్క దంచి వేసి, కుంకుమ పువ్వుతో 'కావా' టీని నేను ఎంత చక్కగా కాస్తానో! నాక్కాస్త నమ్మకం ఇవ్వు ఒమర్. నా ఇంటికి మళ్లీ అతిథులు వస్తారని, నా చేతి టీని ప్రియంగా సేవిస్తారని..." అంటోంది అమ్మీజాన్.

"అందుకోసమే పెహల్గాం వచ్చాను అమ్మీజాన్. మంత్రులందర్నీ రప్పించి ఇక్కడే మీటింగ్ కూడా పెడుతున్నాను..." అన్నాను.

"మీటింగ్ పెడితే మంత్రులు వస్తారు కానీ, నా ఇంటికి అతిథులు వస్తారంటావా ఒమర్?!" అంది అమ్మీజాన్ నిస్పృహగా. "వస్తారు, నన్ను నమ్మండి..." అని చెప్పాను.

పెహల్గాంలో కేబినెట్ మీటింగ్‌కి వెళుతున్నప్పుడు కూడా బయట కొందరు నా దగ్గరకు పరుగున వచ్చి, "ఒమర్‌జీ! మాక్కాస్త నమ్మకం ఇవ్వగలరా..?" అని అడిగారు... నా చేతిని స్పృశించే ప్రయత్నం చేస్తూ! మనిషి స్పర్శకు మనిషెంతగా అలమటించి ఉన్నాడు!!

వారి చేతిని మృదువుగా అందుకున్నాను.

"ఒమర్‌జీ! మేము కశ్మీర్‌కు వచ్చిన టూరిస్టులం. ధైర్యం చేసి వచ్చేశాం. ధైర్యం మేము చేస్తాం. నమ్మకం మీరు ఇవ్వండి చాలు. ఇస్తారా ప్లీజ్..." అన్నారు.

అతిథులు వస్తారని కశ్మీర్‌కు, కశ్మీర్ ఎదురు చూస్తోందని అతిథులకు నమ్మకం ఇవ్వాలి. ఒకవైపు నమ్మకమే సరిపోదు.

"కశ్మీర్ మీ అతిథి గృహం. మీ అతిథి గృహానికి నేను కాపలాదారుడిని..." అని వారితో చెప్పాను.

రెండో రోజు గుల్‌మార్గ్‌లో నాకు మరి కొందరు ఎదురుపడ్డారు. అయితే వాళ్లు, "మాక్కాస్త నమ్మకం ఇవ్వండి" అని అడగటానికి వచ్చినవాళ్లు కాదు. "మీ మీద నమ్మకం లేదు" అని చెప్పటానికి వచ్చినవాళ్లు! "కశ్మీర్‌ను బహిష్కరించండి" అని నినాదాలు చేస్తున్నారు. వాళ్లంతా యువకులు. ఉడుకు రక్తాన్ని పిడికిలి పట్టి ఉన్న వారు.

"ఉగ్రవాదులు కూడా ఇదే కోరుకుంటున్నారు మిత్రులారా..! 'కశ్మీర్‌ను బహిష్కరించండి' అన్నదే వారి పిలుపు కూడా. వాళ్లు దేశానికి శత్రువులు. మీరు, వాళ్లూ ఒకటి కాదనే అనుకుంటున్నాను..." అన్నాను.

వాళ్లేమీ మాట్లాడలేదు. నన్ను దాటుకుని ముందుకు వెళ్లిపోయారు. వాళ్ల నినాదం వాళ్లను అనుసరిస్తూ వెళ్లిపోయింది.

ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళిగా పెహల్గామ్‌లో ఒక స్మారక స్తూపం నిర్మించాలని కేబినెట్ మీటింగ్‌లో అనుకున్నాం. మరి కోల్పోయిన నమ్మకానికి తిరిగి ఎలా ప్రాణ ప్రతిష్ఠ చేసుకోవటం?

ఉర్దూ కవి ఫైజ్ అహ్మద్ ఫైజ్ నా లోపల అంటున్నారు.. "హృదయం నిస్సహాయంగా ఏం లేదు. ప్రస్తుతానికి ఓడిపోయిందంతే! దుఃఖపు సాయంత్రం సుదీర్ఘంగా ఉంది. కావచ్చు కానీ, ఇది ఒక సాయంత్రం మాత్రమే"!

కృత్రిమ మేధకు భాషల సవాళ్లు!

సందర్భం



టి.వి. వెంకటేశ్వరన్

హిందీ, బెంగాలీ, ఉర్దూ, మరాఠీ, తెలుగు, తమిళం... మాట్లాడేవారి సంఖ్యను బట్టి చూస్తే ప్రపంచంలోనే టాప్ ఇరవై భాషల్లో ఉంటాయి ఇవి. కానీ... ఇప్పటివరకూ ఏ భారతీయ భాషతోనూ కృత్రిమ మేధ టూల్స్ అనేవి లేవు. ఎందుకిలా? ఈ వెనుకబాటుకు కారణాలేమిటి?

ఈ ప్రశ్నకు సమాధానాలు తెలుసుకునే ముందు అసలు ఈ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం) అంటే ఏమిటో తెలుసుకోవాలి. ఛాట్ జీపీటీ వంటి ఈ ఎల్ఎల్ఎం ఒక సూపర్ స్మార్ట్ కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్. కోట్ల పుస్తకాలు, డాక్యుమెంట్స్, సంభాషణలను ఆకళింపు చేసుకుని రూపుదిద్దుకుంది ఇది. మనతో మన మాదిరిగా మాట్లాడగలదు. రాయగలదు. ఇంకోలా చెప్పాలంటే ఇంటర్నెట్ సమాచారం ఆధారంగా పనిచేసే 'టెక్స్ట్ ప్రిడిక్టింగ్ రోబో' ఇది.

సహజంగానే ఇప్పుడు మనలో మెదిలే ఇంకో ప్రశ్న... ఈ ఎల్ఎల్ఎంలు ఒక భాషను ఎలా నేర్చుకుంటాయన్నది! ఎల్ఎల్ఎం భాషను అర్థం చేసుకునేందుకు విస్తృతంగా 'చదవాలి'. ఎంత ఎక్కువ చదివితే అంత మేలన్నది ఇక్కడ కీలకం. అందుకే గూగుల్, ఓపెన్ ఏఐ వంటి పెద్ద పెద్ద కంపెనీలు తమ ఎల్ఎల్ఎంలకు లక్షల కోట్ల పదాలు నేర్పిస్తున్నాయి. ఇదే సమయంలో ఇక్కడే భారతీయ భాషల సమస్య కూడా వచ్చేస్తుంది!

భారతీయ లిపిలో రాసిన ఒక వంటల పుస్తకాన్ని ఉదాహరణగా తీసుకుందాం. దీంట్లో ఎంత వివరంగా వంటల గురించి రాసినా... ఆ భాష రాకపోతే ప్రయోజనం సున్నా. డిజిటల్ యుగం తొలినాళ్లలో రకరకాల టైప్ ఫేస్‌లు తయారయ్యాయి. కీబోర్డుల తాలూకూ లే అవుట్‌లు, ఎన్‌కోడింగ్ సాఫ్ట్‌వేర్లు వీటికి తగ్గట్టుగా రెడీ చేశారు. ఒకే అక్షరానికి వేర్వేరు గ్లిఫ్‌లు, టైప్‌ఫేస్‌లు ఉన్నాయి. ఫాంట్ల డిజైనింగ్ లోపాల వల్ల కొన్ని కొన్ని అస్పష్టమైనవి అందుబాటులోకి వచ్చాయి. ఇవన్నీ ఒక ఎత్తైతే... భారతీయ డిజిటల్ డెవలపర్లు వేర్వేరు కీబోర్డులను అభివృద్ధి చేయడం సమస్యను మరింత జటిలం చేసింది. ఫలితంగా భారతీయ భాషల్లోని సమాచారాన్ని ఎల్ఎల్ఎంలకు అందించడం అన్నది సంక్లిష్టమవుతోంది.

యాసల్లో తేడాలు (తెలంగాణ, ఆంధ్ర), భోజ్‌పురి, హిందీ, దక్కని, ఉర్దూల్లోని తేడాలు, తరచూ అలవోకగా కలిసిపోయే ఇంగ్లీషు పదాలు సమస్య తీవ్రతను మరింత పెంచుతున్నాయి. భారతీయ భాషల్లోని సమాచారంలో ఎక్కువశాతం ప్రభుత్వ వర్గాల నుంచి, లేదంటే వార్తల నుంచే వస్తుంది. ఇందులో వైవిధ్యం తక్కువ. ఆరోగ్యం, చట్టాల వంటివాటిపై సమాచారం తక్కువే. ఈ దృష్టికోణం నుంచి చూస్తే డిజిటల్ అంతరం ఇప్పటికీ కొనసాగుతున్నట్లే. అంతేకాదు... భారతీయ భాషలు మాట్లాడే వారిలో ఎక్కువమంది నెట్ వినియోగదారులు కాదు. వీటన్నింటి కారణంగా శిక్షణకు లభించే సమాచారంలో



పక్షపాతపూరితమైన సమాచారం ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పర్యవేక్షణ, నియంత్రణ తక్కువ కాబట్టి తప్పుడు సమాచారం లభిస్తుందన్నమాట. కాబట్టి భారతీయ భాషలకు సంబంధించిన ఏఐ రూపకల్పనలో ఉన్న ప్రధాన లోపం విస్తృత స్థాయి డేటాసెట్లు లేకపోవడం! అలాగే కృత్రిమ మేధకు, మానవ మేధకు మధ్య సమన్వయం అవసరం.

భారతీయ భాషలు చాలా సంక్లిష్టమైనవి. ఒత్తులు, గుణింతాలు, వాటి మేళవింపులు, నామవాచకాలు... ఇలా బోలెడంత సంక్లిష్టత. పొడవైన, సంక్లిష్ట వాక్యాలు, విభక్తులు, వ్యాకరణం వంటివి ఎల్ఎల్ఎంల శిక్షణకు చాలా సమస్యాత్మకం. ఈ నేపథ్యంలోనే ఛాట్‌జీపీటీ వంటివి పరిమితమైన భారతీయ భాషల సమాచారం అన్న సమస్యను అధిగమించేందుకు ద్రావిడ ప్రాణాయామం చేశాయి. శిక్షణకు లభించే సమాచారంలో 60 శాతం వరకూ ఇంగ్లీషే కాబట్టి... దానిపైనే ఆధారపడ్డాయి.

పాశ్చాత్యదేశాలను కాసేపు పక్కనబెడితే.. చైనా, కొరియా, జపాన్ లు ఆసియా ప్రాంతంలో ముఖ్యమైన ఇతర ప్రాంతాలు. వీటికి మనలా టైప్‌ఫేస్‌ల సమస్య లేదు. తొలినాళ్లలోనే లిపి, కీబోర్డు లే అవుట్ల వంటివాటిని ప్రామాణీకరించారు. చైనా ప్రభుత్వం జీబీ18030ను ప్రజలు తప్పనిసరిగా అనుసరించేలా చూసింది. యూనీకోడ్‌తోనూ పనిచేసేలా చేయడం ద్వారా ప్రపంచం మొత్తం చైనీస్ యూనీకోడ్‌నే అనుసరించేలా చేసుకోగలిగింది. 2018 నాటి యూఎస్ క్లౌడ్ యాక్ట్‌ను అనుసరించడం ద్వారా చైనా తమ దేశంలో పుట్టిన సమాచారాన్ని భద్రంగా ఉంచుకుంది. డేటా సార్వభౌమత్వాన్ని ఆ సమాచారానికి దఖలు పరిచింది. ఇలా స్థానికంగా ఉండిపోయిన సమాచారం ఇప్పుడు బైడూ, అలీబాబా, టెన్ సెంట్, హువాయి, బైట్‌డ్యాన్స్‌వంటి వాటికి ఎల్ఎల్ఎంల సృష్టిలో ఎంతో ఉపయోగ పడ్డాయి.

దక్షిణ కొరియా కూడా హైపర్‌క్లోవా, ఎల్‌జీ ఎక్సావన్‌ల పేరుతో తమదైన ఎల్ఎల్ఎంలు తయారు చేసుకున్నాయి. కొరియా ఎల్ఎల్ఎంలు వికీపీడియా, కామన్ క్రాల్ వంటి అంతర్జాతీయ డేటా సెట్లతోపాటు స్థానికంగా అందుబాటులో ఉన్న నావెర్ సెర్చ్ ఫలితాలు, కకావులోని సంభాషణలు, కే–పాప్ డ్రామా సబ్ టైటిల్స్‌లను కలిపి వాడుకున్నాయి. తద్వారా తమ భాషకు సంబంధించిన సున్నితాంశాలను ఒడిసిపట్టుకోగలిగాయి.

భారతీయ భాషల విషయానికి వస్తే... ఏఐ4భారత్, ఇండిక్‌బీఈఆర్‌టీ (ఐఐటీ మద్రాస్), కేంద్ర ప్రభుత్వపు భాషిణి, సర్వం ఏఐ తాలూకూ ఓపెన్ హాథీ, గూగుల్ మురిల్, మైక్రోసాఫ్ట్ శిక్ష వంటివి ప్రస్తుతం కొంత ఆశ రేకెత్తిస్తున్న ఎల్ఎల్ఎం మోడళ్లు!

కొరియాలో మాదిరే భారత్‌లో ఏఐకి డిమాండ్ తక్కువే. అందుకే ప్రభుత్వాల మద్దతు ఎక్కువ అవసరమవుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏఐకి ఏకంగా యాభై వేల కోట్ల డాలర్ల పెట్టుబడిపై హామీ ఇచ్చారు. చైనా ఇంకో మూడు అడుగులు ఎక్కువ వేస్తోంది. రానున్న పదిహేనేళ్లలో 1.5 లక్షల కోట్ల డాలర్లు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోంది. దక్షిణ కొరియాలో 2021–26 మధ్యకాలంలో 150 కోట్ల డాలర్లు ఒకే ఒక్క భాషపై ఖర్చు పెట్టేలా ప్రణాళికలు అమలు చేస్తున్నారు. వీటితో పోలిస్తే... భారత్ రానున్న ఐదేళ్లలో... 22 భాషలపై కేవలం వంద కోట్ల డాలర్లే ఖర్చు చేసే ప్రయత్నం చేస్తూండటం ఏ రకంగానూ సారూప్యత లేని అంశం.

వ్యాసకర్త మొహాలీలో ఐసర్ విజిటింగ్ ప్రొఫెసర్

వైజ్ఞానిక వేగుచుక్కలు - 24

తొలి మహిళా భౌతిక శాస్త్రవేత్త

అణుకేంద్రకంలో ఉండే 'మెసాన్' ద్రవ్యరాశిని తొలిసారి లెక్కించిన శాస్త్రవేత్త బిభా చౌదురి! అంతేకాదు మనదేశంలో 'హై ఎనర్జీ ఫిజిక్స్' విభాగపు తొలి మహిళా శాస్త్రవేత్త, ఇంకా టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సంస్థ తొలి మహిళా శాస్త్రవేత్త కూడా. ఈమె మహాశాస్త్రవేత్త జగదీశ్ చంద్ర బోస్‌కు బంధువు; ఆయన మేనల్లుడు దేవేంద్రమోహన్ బోస్‌తో కలిసి పరిశోధన చేశారు. ఆమె పిహెచ్‌డీ పట్టాకు పర్యవేక్షణ చేసిన పీఎమ్ ఎస్ బ్లాకెట్ తర్వాత దశలో భారత ప్రధాని నెహ్రూకు సైన్స్ పరిశోధనలకు సంబంధించిన సలహాదారు. అంతే కాకుండా ప్రఖ్యాత శాస్త్రవేత్తలు హోమీ జహంగీర్ భాభా, విక్రమ్ సారాభాయ్ స్థాపించిన పరిశోధనా సంస్థలలో శాస్త్రవేత్త; ప్రముఖ శాస్త్రవేత్తలు ఎంజీకే మీనన్, యశ్పాల్‌లకు సహ పరిశోధకురాలు; ఇటీవల కన్నుమూసిన కస్తూరి రంగన్‌కు మొదట న్యూక్లియర్ ఫిజిక్స్ బోధించిన ఉపాధ్యాయురాలు! ఆశ్చర్యమేమిటంటే 2018లో జీవిత చరిత్ర వచ్చేదాకా ఆమె పేరు భార తీయ పరిశోధనా రంగంలో తెలియకుండా పోవడమే!



బిభా చౌదురి

బిభా చౌదురి 1913 జులై 3న కలకత్తాలో జన్మించారు. కలకత్తా విశ్వ విద్యాలయంలో ఎమ్మెస్సీ పూర్తి కాగానే అదే విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న దేవేంద్ర మోహన్ బోస్ దగ్గర పరిశోధక విద్యార్థినిగా చేరారు. 1935లో సైద్ధాంతికంగా సూచింపబడిన మెసోట్రాన్ (మెసాన్ తొలి పేరు) గురించి బిభా పరిశోధనలలో దిగిపోయారు. తమ ప్రయోగాల్లో వారు ఒక కొత్త న్యూక్లియర్ పార్టికల్ సంబంధించిన ఆనవాళ్లు ఉన్నట్టు గుర్తించడమే కాకుండా అవి కిందకు ప్రయాణం చేసే కొద్దీ ద్రవ్యరాశిని కోల్పోతున్నాయి అని కూడా గమనించారు. వాటి ద్రవ్యరాశి, శక్తి, ద్రవ్యవేగం వంటి విలువలను కూడా లెక్కకట్టడానికి ప్రయత్నించారు. ఈ ప్రయోగాల ఫలితాల ఆధారంగానే 'నేచర్' వంటి రీసెర్చ్ జర్నల్‌లో 1941–'43 మధ్యకాలంలో 4 పరిశోధనాపత్రాలు ప్రచురింపబడటం గొప్ప విషయం. రెండో ప్రపంచ యుద్ధం వల్ల ఆమె పరిశోధనకు అంతరాయం కలిగింది.

కుటుంబం ప్రోత్సహించడంతో 1945లో బిభా ఇంగ్లాండ్ వెళ్లి, మాంచెస్టర్ యూనివర్సిటీలో విశ్వకిరణాల మీద పెద్ద ఎత్తున పరిశోధనలు చేస్తున్న పీఎంఎస్ బ్లాకెట్ వద్ద పీహెచ్‌డీలో చేరారు. తన సిద్ధాంత గ్రంథం సమర్పించిన 1949 లోనే ఆమె పర్యవేక్షకుడికి నోబెల్ బహుమతి రావడం విశేషం. ఇండియా తిరిగి వచ్చిన తర్వాత అనేక స్థాయుల్లో ఆమె సేవలు అందించారు. ఆ మధ్య రెండు గొప్ప గౌరవాలు ఆమెకు లభించాయి. 2019 డిసెంబర్ 17న ది ఇంటర్నేషనల్ అస్ట్రోనామికల్ యూనియన్ సెక్స్‌టాన్స్ నక్షత్రం మండలంలోని తెల్లని–పచ్చ నక్షత్రానికి భారతీయ మహిళా శాస్త్రవేత్త 'బిభా' అని పేరు పెడుతున్నట్టు ప్రకటించారు. 2020 మార్చిలో భారత ప్రభుత్వపు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన 11 పీఠాల్లో ఫిజిక్స్ పీఠం బిభా చౌదురి పేరున ఉండటం గర్వకారణం.

– డా॥ నాగసూరి వేణుగోపాల్, ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

క్లుప్తంగా...

అందుబాటులో సబ్సిడీ పచ్చిరొట్ట విత్తనాలు


- రైతులు సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ నేషనల్ సీడ్ కార్పొరేషన్ ద్వారా ఒప్పందం చేసుకుందని, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచిందని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటివరకు 89,302.10 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను ఆగ్రో రైతు సేవ కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పంపిణీకి సిద్ధం చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అందులో ఇప్పటివరకు 1,17,912 మంది రైతులు 56,262.10 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను కొనుగోలు చేశారని, ఇంకా రాష్ట్ర వ్యాప్తంగా 33,040 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

విత్తన సంస్థల మోసాలను ఉపేక్షించకండి

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆదేశం
- సూర్యాపేట జిల్లా రైతుల ఫిర్యాదుపై స్పందన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులను మోసగించే విత్తన సంస్థలను ఉపేక్షించవద్దని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధికారులను ఆదేశించారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం కుక్కడం గ్రామానికి చెందిన 10 మంది రైతులు విత్తన ధాన్యం పండించే విషయంలో.. మోసపోయామని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి ఫిర్యాదు చేశారు. యాసంగి పంటలో విత్తన ధాన్యం ఉత్పత్తి కోసం శక్తి సీడ్ సంస్థ తమతో ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఆ సమయంలో పంట సాగుకు ఉచితంగా వడ్లు, పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ.20 వేలు, పంట పూర్తయ్యాక క్వింటాకు రూ.12,500 చొప్పున చెల్లిస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు. కానీ, కాంటా అయ్యాక, ధాన్యం బస్తాలను లారీలోకి ఎక్కించాక.. క్వింటాకు 10 కేజీల కట్టింగ్ ఉంటుందని శక్తి సీడ్ సంస్థ యాజమాన్యం చెప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి.. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజాస్ నందన్ పవార్‌తో పాటు వ్యవసాయ అధికారులతో మాట్లాడి.. రైతులను మోసగించే సీడ్ సంస్థలపై కఠినంగా వ్యవహరించాలన్నారు.

ఒక్కరోజు ఈఎన్‌సీ

- బాధ్యతలు స్వీకరించిన రోజే.. ఉద్యోగ విరమణ

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆనందం..కొన్ని గంటల్లోనే మంచులా కరిగిపోయింది. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వి.మోహన్‌కుమార్ నిబంధనల ప్రకారం ఈఎన్‌సీగా పదోన్నతి అందుకోవాల్సి ఉంది. అయితే కాళేశ్వరం ప్రాజెక్టు కేసులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్... పలువురు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిఫారసు చేయడంతో ఆ శాఖలో పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయింది. అయితే శనివారం ఉద్యోగ విరమణ చేయనున్న మోహన్‌కుమార్‌కు ఈఎన్‌సీగా ఒక్కరోజు అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఆయనకు సీడీవో విభాగ ఈఎన్‌సీగా పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెడుతూ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఈఎన్‌సీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మోహన్‌కుమార్ ఉద్యోగ విరమణ చేశారు. ఇప్పటికే కాళేశ్వరం ఈఎన్‌సీగా ఒక్కరోజు పనిచేసిన పీపీ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించిన రోజే రిటైర్డ్ అయిన విషయం తెలిసిందే.

సీఈ సీడీవోగా కాశీ విశ్వనాథం

సాక్షి, హైదరాబాద్: హైడ్రాలజీ విభాగంలో ఎస్ఈగా పనిచేస్తున్న కాశీ విశ్వనాథంను సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) సీఈగా నియమించారు. అక్కడే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పనిచేస్తున్న జహీర్‌ను సీడీవో ఎస్ఈగా నియమించారు. మెదక్ ఎస్ఈగా ఎస్.వెంకటేశ్వర్‌రావు, చేవెళ్ల ఎస్ఈగా పి.మధుసూదన్‌రెడ్డి, సీహెచ్.తిరుపతిరావును మహాదేవ్‌పూర్ డివిజన్ ఈఈగా, పి.నాగభూషణరావును ఎల్ఎండీ కాలనీ ఎస్ఈగా ఎం.రామసుబ్బారెడ్డిని సీఈ సీడీవోలో ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాహుల్ బొజ్జా శనివారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఒకరి ఉద్యోగంతో ఆ కుటుంబానికి లబ్ధి

- పరిశ్రమల శాఖ డైరెక్టర్ మల్సూర్

సాక్షి, హైదరాబాద్: కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వస్తే.. ఆ కుటుంబం బాగుపడుతుందని పరిశ్రమల శాఖ డైరెక్టర్ మల్సూర్ అన్నారు. డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీట్) ద్వారా ఉద్యోగాలు సాధించిన పలువురు నిరుద్యోగులకు.. డీట్ వింగ్ ఆధ్వర్యంలో డైరెక్టర్ మల్సూర్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీట్‌లో ఇప్పటి వరకు 900 సంస్థల్లో 75వేల మంది నమోదు చేసుకున్నారన్నారు. ఇందులో 8వేలకు పైగా ఉద్యోగాలు సాధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో డీట్ డైరెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గో మరణాల కారకుల్ని శిక్షించాలి

- విశ్వహిందూ పరిషత్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: వేములవాడ రాజన్న దేవాలయంలో గోవులకు మరణ శాసనం రచిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. సామర్థ్యానికి మించి ఇరుకైన స్థలంలో వందలాది కోడెదూడలను కుక్కడంతో, తొక్కిసలాటకు గురై చనిపోతుండటం బాధాకరమని రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల ఆలనా పాలన కరువైన కారణంగా.. కోడె దూడల మృత్యు ఘోష కొనసాగుతోందని విమర్శించారు. రెగ్యులర్ డాక్టర్ లేకపోవడం, పార్ట్‌టైం అసిస్టెంట్లు పట్టించుకోకపోవడంతో.. నిరంతరం కోడెదూడలు చనిపోవడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు.







సంకల్పం చిగురిస్తోంది

బయ్యారం: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలకేంద్రంలో అంతర్భాగంగా ఉన్న రంగాపురంలో ముత్యాలమ్మ తల్లి గుడి వద్ద 150 ఏళ్ల క్రితం నాటిన మర్రిచెట్టు.. గత ఏప్రిల్‌లో వచ్చిన ఈదురుగాలికి వేళ్లతో సహా నేలకూలింది. దీంతో స్థానికులు ఆ చెట్టుపై ఆశలు వదులుకున్నారు. ఆలయ నిర్వాహక పెద్దలు గుండా మధుకర్‌రెడ్డి, చల్లగుండ్ల వెంకటనారాయణ, ఎనుగుల కోటయ్య, బండారి మల్లయ్య, రావుల శ్రీశైలం, మొగిలిచర్ల భిక్షం తదితరులు.. పడిపోయిన చెట్టును అదే ప్రాంతంలో తిరిగి నాటాలని నిర్ణయించారు. చెట్టు కొమ్మలను తొలగించి.. మొదలును యంత్రాల సాయంతో తిరిగి నాటారు. ప్రస్తుతం ఆ చెట్టుకి ఆకులు, చిన్న కొమ్మలు చిగురిస్తున్నాయి. తమ సంకల్పం నెరవేరుతుండటంతో ఆలయ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీడీఎస్‌పైనా దేశ ద్రోహి ముద్రవేస్తారా?

- పాక్‌తో యుద్ధంలో ఒక విమానం కూలిందని సీడీఎస్ చెప్పారు
- రాహుల్ గాంధీ మొదటి నుంచి దీనిపైనే కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నారు
- సీడీఎస్ కామెంట్స్‌పై కేంద్రం వివరణ ఇవ్వాలి: మంత్రి ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: 'ఆపరేషన్ సిందూర్‌లో ఎంత నష్టం జరిగింది? ఎన్ని రఫేల్ విమానాలను కోల్పోయామనే విషయాన్ని బహిర్గతం చేయాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు అడిగితే.. వారిని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ నేతలు దేశ ద్రోహులుగా ముద్రవేశారు. ఆపరేషన్ సిందూర్‌లో ఒక యుద్ధ విమానాన్ని భారత్ కోల్పోయిందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ ఒక విదేశీ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఇప్పుడు ఆయనపై కూడా దేశద్రోహి ముద్ర వేస్తారా?' అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో కాంగ్రెస్ అడుగుతున్న ప్రశ్నలకు సీడీఎస్ వ్యాఖ్యలు బలాన్ని చేకూర్చాయని అన్నారు. శనివారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీడీఎస్ ప్రకటనపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'యుద్ధ విమానాల విషయంలో కాంగ్రెస్ రాజకీయాలు చేయదల్చుకోలేదు. సీడీఎస్ చెప్పిన అంశాలనే మేము అడుగుతున్నాం. ప్రస్తుతం భారత్ వద్ద 31 యుద్ధ విమానాలు ఉన్నాయని, సరిపడా లేవని, ఆయుధాల సరఫరాలో జాప్యం జరుగుతోందని వైమానిక దళం చీఫ్ స్వయంగా చెప్పారు. టాలెంట్ ఉన్నవాళ్లు ఎయిర్‌ఫోర్స్‌లోకి రావడం లేదని అన్నారు. ఇది ఆందోళన కలిగించే విషయం. చైనా, పాకిస్తాన్‌లతో భారత్‌కు ముప్పు ఉన్న నేపథ్యంలో దేశ భద్రతను మరింత పటిష్టం చేయాలి. ప్రతిభావంతులైన యువత వైమానిక దళంలో చేరేలా కేంద్రం చర్యలు తీసుకోవాలి. పార్లమెంట్ డిఫెన్స్ కమిటీలో సభ్యుడిగా ఉన్న నేను అనేకమార్లు దేశ రక్షణ విషయంపై కేంద్రానికి సూచనలు చేశాను. దేశ సమగ్రత, ఐక్యత కోసం గాంధీ కుటుంబానికి చెందిన ఇద్దరు ప్రధానులు ఉగ్రఘాతుకానికి బలయ్యారు. గాంధీ కుటుంబం కంటే గొప్ప దేశ భక్తులు దేశంలో ఎవరూ లేరు. అలాంటి కుటుంబాన్ని దేశ ద్రోహులంటూ బీజేపీ నేతలు అవమానించడం దారుణం. ఆపరేషన్ సిందూర్ పేరుతో సాధించిన విజయాలను బీజేపీ గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. కానీ, ఈ సందర్భంగా జరిగిన నష్టాన్ని ప్రజలకు తెలియకుండా ఎందుకు దాస్తోంది? ఆపరేషన్ సిందూర్ అద్భుతమైంది. భారత వైమానిక దళం సాధించిన విజయాల పట్ల మాజీ ఫైటర్ జెట్ పైలట్‌గా నేను, కాంగ్రెస్ పార్టీ గర్విస్తున్నాం. ఇందులో ఎవరికీ ఎలాంటి అపోహలు, అనుమానాలు అవసరం లేదు' అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.



నాడు ఫైటర్ జెట్ పైలట్‌గా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

10న దేశవ్యాప్త బంద్

- మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పిలుపు
- మే 21 భారత విప్లవోద్యమ చరిత్రలో చీకటి రోజు

సాక్షి, హైదరాబాద్/చర్ల: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో పాటు మరో 26 మంది మావోయిస్టు పార్టీ, పీఎల్‌జీఏ కార్యకర్తలను హతమార్చడాన్ని నిరసిస్తూ ఈనెల 10న దేశవ్యాప్త బంద్ పాటించాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. అలాగే, ఈనెల 11 నుంచి ఆగస్టు 3 వరకు అమరుల స్మారక సభలను నిర్వహించాలని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట శనివారం లేఖ విడుదలైంది. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్‌తో పాటు కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు బసవరాజు సహా 27 మందిని హత్య చేసిన మే 21 భారత విప్లవోద్యమ చరిత్రలో చీకటి రోజు అని పార్టీ పేర్కొంది. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా ఆదేశాలతో భారత సైన్యం, పారామిలటరీ, కమాండో బలగాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఈ ఘటనకు పాల్పడ్డారని తెలిపారు. అంతేకాక భద్రతా బలగాల పనితీరుపై గర్వంగా ఉందని మోదీ, చరిత్రాత్మక విజయమని అమిత్‌షా ప్రకటించడం వారి నరహంతక స్వభావానికి పరాకాష్ట అని లేఖలో పేర్కొన్నారు. జస్టిస్ చంద్రకుమార్ నాయకత్వాన హైదరాబాద్‌లో శాంతి చర్చల కమిటీ ఏర్పడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని ప్రకటన విడుదల చేసిందని గుర్తు చేశారు. ఈ విషయమై తాము కూడా ప్రకటన విడుదల చేశామని తెలిపారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫాసిస్టు పద్ధతుల్లో యుద్ధాన్ని కొనసాగిస్తూ కేశవరావును పొట్టన పెట్టుకున్నాయని పేర్కొన్నారు. 'గత సంవత్సరం జనవరి నుంచి ఇప్పటివరకు దాదాపు 540 మంది విప్లవకారులను, సాధారణ ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హత్య చేశాయి. మార్చి 31, 2026 వరకు ఈ హత్యాకాండను కొనసాగిస్తామని దేశప్రధాని, హోంమంత్రి పదేపదే ప్రకటిస్తున్నారు. శాంతి చర్చలకు సిద్ధమేనని ప్రకటించినప్పటి నుంచి దాదాపు గత 2 నెలలుగా మేము ప్రభుత్వ సాయుధ బలగాలపై దాడులు చేయకుండా సంయమనం పాటించాం. ఈ స్థితిలో శాంతి చర్చలకు సిద్ధంగా లేని బీజేపీ పాలిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫాసిస్టు వైఖరికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బలమైన, విశాలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిందిగా యావత్తు దేశ ప్రజానీకానికి పిలుపునిస్తున్నాం' అని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు దేశవ్యాప్త బంద్ పాటించడంతో పాటు అమరుల స్మారక సభలు నిర్వహించాలని ఆయన లేఖలో కోరారు.

జహీరాబాద్ ఆస్పత్రి సూపరింటెండెంట్ సస్పెన్షన్

- ఆస్పత్రిలో జేసీ చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీ
- సెల్‌ఫోన్ లైట్‌తో రోగులకు చికిత్సపై విచారణ

సాక్షి ఎఫెక్ట్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మే 31న 'సెల్‌ఫోన్ లైట్‌తో రోగులకు చికిత్స' శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించి విచారణకు ఆదేశించారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఆదేశాలతో.. జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి అంతటా కలియదిరిగి రోగులు, సిబ్బందితో మాట్లాడారు. సెల్‌ఫోన్ లైట్‌తో రోగికి ఎందుకు చికిత్స చేయాల్సి వచ్చిందని మండిపడ్డారు. రోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు జనరేటర్‌ను ఆన్ చేయడంలో నిర్లక్ష్యం వహించినట్లు విచారణలో తేలింది. అనంతరం విచారణ నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈ మేరకు ప్రభుత్వం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కోడెల సంరక్షణపై శ్రద్ధ పెట్టాలి

- అధికారులకు సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశం
- అకాల వర్షాలు, అనారోగ్య కారణాలతో 8 కోడెలు మృతి చెందాయి
- గోశాలను తనిఖీ చేసిన కలెక్టర్
- రెండోరోజు మరో 5 కోడెలు మృతి

వేములవాడ అర్బన్: వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం గోశాలలోని కోడెల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సాక్షిలో 'దేవుడి కోడెలకు మరణశాసనం' శీర్షికతో శనివారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. కోడెలకు అందిస్తున్న మేత నాణ్యత, గోశాలలో పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాలు, అనారోగ్య కారణాలతో శుక్రవారం 8 కోడెలు మృతిచెందినట్లు తెలిపారు. సోషల్‌మీడియాలో దీనిపై అసత్య ప్రచారాలు చేయొద్దని సూచించారు. పశువైద్యాధికారులు అంజిరెడ్డి, రాహుల్, అభిలాష్, సాహితి, దీప్తి ఆధ్వర్యంలో కోడెలకు నిరంతరం వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కోడెలను మరింత బాధ్యతగా చూసుకోవాలని అధికారులకు సూచించారు. వాటికి పచ్చిగడ్డి పెట్టాలని, గోశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.



రాజన్న గోశాలలో కోడెల చికిత్స తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



చనిపోయిన కోడెలను మూలవాగులో ఖననం చేస్తున్న దృశ్యం

మరో ఐదు కోడెలు మృతి

ఇదిలా ఉండగా వేములవాడ రాజన్న గోశాలలో వరుసగా రెండో రోజు శనివారం మరో ఐదు కోడెలు మృత్యువాత పడ్డాయి. తిప్పాపూర్‌లోని గోశాలలో పరిమితికి మించి కోడెలు ఉండటంతో తొక్కిసలాట జరగడం, సరైన మేత అందకపోవడంతోనే అవి చనిపోతున్నట్లు తెలిసింది. అధికారుల నిర్లక్ష్యంతోనే కోడెలు చనిపోతున్నాయని భక్తులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చనిపోయిన కోడెలను మూలవాగులో ఖననం చేశారు. కాగా, గోశాలలో అన్ని వేళల్లో పశువైద్యాధికారి అందుబాటులో ఉండేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

కీచైన్ స్కాన్ చేస్తే.. ఆర్టీసీ సమాచారం

జగిత్యాల డిపోలో ప్రయాణికులకు పంపిణీ

జగిత్యాలటౌన్: ఆ కీచైన్ స్కాన్ చేయగానే..ఆర్టీసీ ప్రయాణ సమాచారం తెలుస్తుంది. తాము ఎక్కాల్సిన బస్ ఎక్కడుందో తెలియజేసే గమ్యం యాప్‌తోపాటు అఫీషియల్ ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సహా పది రకాల సేవలు ఇందులో ఉన్నాయి. జగిత్యాల డిపోలో ఐదు రోజుల క్రితం డిపో మేనేజర్ క్యూఆర్‌కోడ్ ఉన్న కీ చైన్‌లను ప్రయాణికులకు పంపిణీ చేశారు. దీంతో ప్రయాణం మరింత సులభతరం అయ్యిందని ప్రయాణికులు చెబుతున్నారు. మర్యాద వారోత్సవాల్లో భాగంగా వీటిని ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు అందజేస్తున్నారు.

కీచైన్‌ను వినియోగించే విధానం

స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ క్రోమ్ ఓపెన్ చేయగానే సెర్చ్‌బార్ పక్కన కెమెరా గుర్తు చూపిస్తుంది. దానిని ప్రెస్ చేయగానే గూగుల్ లెన్స్ ఓపెన్ అవుతాయి. అప్పుడు కీచైన్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆర్టీసీకి సంబంధించిన పది రకాల సేవల యాప్‌లు, వెబ్‌సైట్లు కనిపిస్తాయి. అందులో ప్రయాణికుడికి కావాల్సిన సమాచారం ఎంచుకొని వినియోగించుకోవచ్చు.



క్యూఆర్‌కోడ్ కీచైన్లు

సౌకర్యవంతంగా ఉంది



ఉద్యోగరీత్యా తరచూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తా. కీచైన్ క్యూఆర్‌కోడ్ చాలా సౌకర్యవంతంగా ఉంది. గమ్యం యాప్‌లో బస్సు ఎక్కడ నుంచి ఎక్కడి వరకు వచ్చిందనే వివరాలతోపాటు ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యంలాంటి పలు సేవలు ఉన్నాయి.

– అల్లె రాజేందర్, ప్రభుత్వ ఉద్యోగి, జగిత్యాల

ప్రయాణికుల నుంచి మంచి స్పందన



సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించాలనే లక్ష్యంతో రూపొందించిన క్యూఆర్‌కోడ్ కీచైన్ సేవలపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నేటి డిజిటల్ యుగంలో ఇది ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– కల్పన, డిపో, మేనేజర్ జగిత్యాల

మేం ప్రస్తావించిన అంశాలేమీ రికార్డు కాలేదు

- గోదావరి బోర్డు సమావేశపు మినట్స్‌పై తెలంగాణ తీవ్ర ఆక్షేపణ
- చైర్మన్, మెంబర్ సెక్రటరీ తీరును నిరసిస్తూ ఈఎన్‌సీ లేఖ

సాక్షి, హైదరాబాద్: గోదావరినది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశంలో తాము లేవనెత్తిన అంశాలను మినట్స్‌లో చేర్చకపోవడాన్ని తెలంగాణ తీవ్రంగా ఖండించింది. తాము ప్రస్తావించిన అంశాలు అందులో రికార్డు కాలేదని గుర్తు చేసింది. ఈ మేరకు గోదావరి బోర్డు చైర్మన్ ఏకే ప్రధాన్‌కు తెలంగాణ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ మే 30న ఒక లేఖ రాశారు. బోర్డు అంటే తెలుగు రాష్ట్రాల అధికారులతో కూడిన విభాగమని, చైర్మన్‌కు ప్రత్యేకంగా ఎటువంటి అధికారాలు ఉండవని స్పష్టం చేశారు. బోర్డు సభ్యకార్యదర్శి ఆరోపణలపై విచారణ కోసం ప్రత్యేకంగా కమిటీ వేయాలని తెలుగు రాష్ట్రాలు డిమాండ్ చేయగా, సమావేశంలో అంగీకారం తెలిపి, తర్వాత బోర్డు సభ్యకార్యదర్శి వ్యవహారశైలిపై చర్చించే అధికారం తెలుగు రాష్ట్రాలకు లేదని ఏ విధంగా మినట్స్‌లో చేర్చుతారని ప్రశ్నించారు. ఏ నిర్ణయమైన బోర్డుకు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- నిందితులకు ఏడేళ్ల వరకు జైలు శిక్ష
- డీజీపీ జితేందర్ హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: రైతులకు కల్తీ, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని డీజీపీ జితేందర్ హెచ్చరించారు. అదేవిధంగా విత్తనాల సాగు వివరాలకు సంబంధించి రికార్డులు నమోదు చేయకపోయినా, విత్తన శుద్ధి, మొలకశాతానికి సంబంధించిన నిబంధనలు పాటించకపోయినా, ప్రముఖ కంపెనీల పేరిట నకిలీ విత్తనాలు అమ్మినా చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ మేరకు డీజీపీ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీజీ–3 కాటన్‌పై కేంద్ర ప్రభుత్వ నిషేధం ఉన్నందున ఈ రకం విత్తనాలు సాగు చేయకూడదని సూచించారు. నకిలీ, నాసిరకం విత్తనాల విక్రయాలు అరికట్టేందుకు పోలీస్‌శాఖ, వ్యవసాయశాఖ, విత్తన కార్పొరేషన్ ఉద్యోగులతో కలిపి జిల్లాలలో జాయింట్ టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని, నేరం నిరూపణ అయితే ఏడేళ్ల వరకు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. రైతుల జీవితాలతో ఆటలు ఆడే నకిలీ విత్తన ముఠాల విషయంలో తెలంగాణ పోలీసులు అత్యంత కఠిన వైఖరి ప్రదర్శిస్తారని డీజీపీ స్పష్టం చేశారు. నకిలీ విత్తన ముఠాలపై అవసరం మేరకు పీడీయాక్ట్ కేసులు సైతం నమోదు చేస్తున్నట్టు తెలిపారు. రైతులు అధికారిక డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని డీజీపీ జితేందర్ సూచించారు. నకిలీ, నాసిరకం విత్తన విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

సమాజానికి 'పద్మశ్రీ' అంకితం: మందకృష్ణ

హనుమకొండ అర్బన్/ఖిలా వరంగల్: తనకు ప్రదానం చేసిన పద్మశ్రీ పురస్కారాన్ని సమాజానికి అంకితం చేస్తున్నానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు. ఇటీవల ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న మంద కృష్ణ.. శనివారం రాత్రి ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలులో వరంగల్ రైల్వేస్టేషన్‌లో దిగారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం డప్పుచప్పుళ్లతో రైల్వేస్టేషన్ నుంచి ర్యాలీగా బయల్దేరి హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రానికి చేరుకున్నారు. అనంతరం కళాక్షేత్రం వేదికపై ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ పురస్కారం.. సమాజాభివృద్ధిలో తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఇందుకు సహకరించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.



ర్యాలీలో మంద కృష్ణకు గజమాలతో స్వాగతం పలుకుతున్న అభిమానులు



బీఎస్‌ఎఫ్ అధికారిణి నేహాకు పురస్కారం

జమ్మూ: సరిహద్దు భద్రతా దళం(బీఎస్‌ఎఫ్)లో అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న నేహా భండారీకి శుక్రవారం ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ ప్రశంసా పురస్కారం అందజేశారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ సమయంలో జమ్మూ యుద్ధ క్షేత్రంలో నేహా అసమాన ధైర్య సాహసాలను, ఎంతో సమయస్ఫూర్తితో వ్యవహరించారని కొనియాడారు. అంతర్జాతీయ సరిహద్దుల్లోని పాకిస్తానీ పోస్ట్‌కు అత్యంత సమీప జీరో లైన్‌లోని బీఎస్‌ఎఫ్ పోస్టుకు సారథ్య బాధ్యతలు తీసుకున్న నేహా భండారీ..తన సహచరులను ప్రోత్సహిస్తూ శత్రువుకు చెందిన మూడు పోస్టులను నేలమట్టం చేసి, తగు గుణపాఠం చెప్పారని ఆయన అన్నారు. ఈ పోస్టులో నేహాతోపాటు ఆరుగురు మహిళా కానిస్టేబుళ్లున్నారు. వీరంతా ఏకమై అంతర్జాతీయ సరిహద్దుల్లోని అఖ్నూర్, సాంబ, ఆర్‌ఎస్ పురా సెక్టార్ల వెంబడి ఉన్న శత్రువును తీవ్రంగా దెబ్బతీశారు. ఉత్తరాఖండ్‌కు చెందిన నేహాది ఆర్మీ నేపథ్యమున్న కుటుంబం. 'మా తాత ఆర్మీలో పని చేశారు. మా అమ్మానాన్న కూడా సీఆర్‌పీఎఫ్‌లో పనిస్తున్నారు'అని నేహా చెప్పారు.



మేఘపై ఎంఐటీ క్రమశిక్షణ చర్య

పాలస్తీనా అనుకూల ప్రసంగం ఫలితం

మస్సాచుసెట్స్: పాలస్తీనా అనుకూల ప్రసంగం చేసిన భారత సంతతికి చెందిన మేఘ వేమూరిపై మస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. మేఘ పేరును ప్రస్తావించకుండా ఇందుకు సంబంధించి ఒక ప్రకటన చేసింది. 'ఆ వ్యక్తి నేడు జరిగే స్నాతకోత్సవంలో పాల్గొనాల్సి ఉంది. అయితే, ఈ రోజు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనకుండా నిషేధం విధించామన్న విషయాన్ని తెలియజేశాం'అని ఎంఐటీ ప్రతినిధి కింబర్లీ అలెన్ చెప్పారు. 'ఎంఐటీ వాక్ స్వాతంత్ర్యానికి మద్దతుగా నిలుస్తుంది. ఆ వ్యక్తి ఉద్దేశపూర్వకంగా, పదే పదే నిర్వాహకులను తప్పుదారి పట్టించి, వేదికపై నుంచి నిరసనకు నాయకత్వం వహించింది. ఒక ముఖ్యమైన వేడుకకు అంతరాయం కలిగించినందుకు ప్రతిస్పందనగా తీసుకున్న చర్యకు కట్టుబడి ఉన్నాం'అని తెలిపారు. గురువారం మేఘ పాలస్తీనాకు అనుకూలంగా చేసిన ప్రసంగం ఆన్‌లైన్‌లో వైరలవుతోంది. కాగా, శుక్రవారం జరిగే స్నాతకోత్సవం ప్రధాన కార్యక్రమంలో మేఘ షెడ్యూల్ ప్రకారం ప్రసంగించాల్సి ఉంది. అయితే, వివాదం నేపథ్యంలో ఆమెకు అధికారులు అనుమతి నిరాకరిస్తున్నట్లు ప్రకటించారు.



ఆపరేషన్ సిందూర్‌పై పోస్టు... ఇన్‌స్టా ఇన్‌ఫ్లూయెన్సర్ శర్మిష్ట అరెస్ట్

గురుగ్రామ్: ఆపరేషన్ సిందూర్‌పై బాలీవుడ్ నటులు మౌనంగా ఉన్నారంటూ మత విద్వేష వ్యాఖ్యలు చేసిన ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్‌ను కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. కోల్‌కతాకు చెందిన శర్మిష్ట పనోలిని చేసిన ఇన్‌స్టాలో చేసిన వ్యాఖ్యలను పలువురు తీవ్రంగా ఖండించారు. కొందరైతే బెదిరింపు మెసేజీలు, కామెంట్లు పెట్టారు. దీంతో, ఆమె తన పోస్టును తొలగించారు. సారీ కూడా చెప్పారు. కుటుంబంతోపాటు ఆమె వేరే చోటుకు మకాం మార్చారు. అయితే, కోల్‌కతాలో కేసు నమోదు కావడంతో పోలీసులు నోటీసులు పంపారు. వాటికి సమాధానం లేకపోవడంతో కోర్టుకెళ్లారు. కోర్టు ఆమెపై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. దీంతో, కోల్‌కతా పోలీసులు శుక్రవారం రాత్రి శర్మిష్టను గురుగ్రామ్‌లో ఉండగా అరెస్ట్ చేశారు.

కొన్ని జెట్లను కోల్పోయాం

ఆరు అబద్ధం.. ఎన్నో చెప్పం : సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్

ఆపరేషన్ సిందూర్ తొలి దశ నష్టాలవి
- మే 7 నాటి దాడుల్లో చోటుచేసుకున్నాయి
- నష్టం కంటే, అందుకు కారణాలేమిటన్నదే కీలకం
- రెండ్రోజుల్లోపే వాటిని కనిపెట్టి సరిదిద్దుకున్నాం
- తర్వాత భారీ దాడులతో పాక్ వెన్ను విరిచామన్న సీడీఎస్
- ఆయన వ్యాఖ్యలపై రాజకీయంగా పెను దుమారం
- మోదీ సర్కార్ ఇప్పటికైనా నిజాలు చెప్పాలి: కాంగ్రెస్
- సిందూర్‌పై పార్లమెంటు ప్రత్యేక భేటీలో చర్చకు డిమాండ్
- యుద్ధ సన్నద్ధతపై స్వతంత్ర విచారణ జరిపించాలి: ఖర్గే



సింగపూర్/న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాక్‌తో జరిగిన ఘర్షణల్లో మనకు వైమానికంగా నష్టం జరిగిందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ అంగీకరించారు. మన ఫైటర్ జెట్లను దాయాది కూల్చేసినట్టు వెల్లడించారు. షాంగ్రిలా డైలాగ్ నిమిత్తం సింగపూర్‌లో పర్యటిస్తున్న ఆయన శనివారం బ్లూంబర్గ్ టీవీకి ఇంటర్వ్యూ ఇచ్చారు. పాక్‌తో యుద్ధం భారత్ ఫైటర్ జెట్లను నష్టపోయిందా అన్న ప్రశ్నకు బదులుగా ఈ మేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. అవి పెను రాజకీయ దుమారానికి దారితీశాయి. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన వాస్తవాలను మోదీ సర్కారు తొక్కిపెట్టిందనేందుకు ఇదే నిదర్శనమని కాంగ్రెస్ దుయ్యబట్టింది. సీడీఎస్ వ్యాఖ్యల నేపథ్యంలో మన యుద్ధ సన్నద్ధతపై స్వతంత్ర విచారణకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఈ మొత్తం ఉదంతంపై లోతుగా చర్చించేందుకు తక్షణం పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

'అణు' స్థాయికి పోలేదు

పాక్‌పై దాడుల సందర్భంగా యుద్ధ విమానాలను నష్టపోయినట్టు వాయుసేన గతంలోనే పరోక్షంగా అంగీకరించింది. పాక్ వైమానిక స్థావరాలపై దాడుల వివరాలను ఆర్మీ, నేవీ సైనిక ఆపరేషన్స్ డైరెక్టర్స్ జనరల్‌తో కలిసి వాయుసేన డీజీ ఎయిర్ మార్షల్ ఎ.కె.భారతి అప్పట్లో ఎప్పటికప్పుడు మీడియాకు వెల్లడించారు. మన ఫైటర్ జెట్లను కూల్చేశామన్న పాక్ ప్రకటన ఏ మేరకు వాస్తవమని మే 11 నాటి భేటీలో విలేకరులు ప్రశ్నించగా, ''యుద్ధమన్నాక నష్టాలు సహజం. కాకపోతే మన పైలట్లంతా సురక్షితంగా తిరిగొచ్చారు. యుద్ధం ఇంకా కొనసాగుతున్నందున మనం ఫైటర్ జెట్లను కోల్పోయామా అన్న ప్రశ్నకు ఈ దశలో బదులివ్వలేను'' అని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో పాక్‌తో సాగిన ఆ నాలుగు రోజుల ఘర్షణల్లో మనకు నష్టం జరిగిందంటూ సైన్యం నుంచి ఇలా తొలిసారి స్పష్టమైన ప్రకటన వెలువడటం, అదీ స్వయానా త్రివిధ దళాలకు అధిపతి అయిన సీడీఎస్ నోటినుంచి రావడం విశేషం. అయితే మనం ఎన్ని విమానాలను నష్టపోయిందీ చెప్పేందుకు జనరల్ చౌహాన్ నిరాకరించారు. అంతేగాక ఆరు భారత యుద్ధ విమానాలను కూల్చేశామన్న పాక్ వాదన కూడా శుద్ధ అబద్ధమన్నారు. ''తొలి దశలో, అంటే మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టిన రోజు నష్టాలు జరిగాయి. అయితే అసలు సమస్య యుద్ధ విమానాలను కోల్పోవడం కాదు. అలా జరగడం వెనక కారణాలను వీలైనంత త్వరగా తెలుసుకోవడం చాలా ముఖ్యం. జరిగిన వ్యూహాత్మక తప్పిదాలను రెండు రోజుల్లోపే కనిపెట్టగలిగాం. కాబట్టే పొరపాట్లను వెంటనే సరిదిద్దుకుని యుద్ధ విమానాలన్నింటినీ తిరిగి రంగంలోకి దించాం. మే 8, 10 తేదీల్లో శత్రువును చావుదెబ్బ తీయగలిగాం. పాక్ లోలోపలికి చొచ్చుకుపోయి మరీ అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాం'' అని ఆయన వివరించారు. ''చైనా అందజేసిన భారీ ఆయుధాలు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు పాక్‌ను ఏ మాత్రమూ ఆదుకోలేకపోయాయి. వాటి గురించి పాక్ చెప్పుకున్న గొప్పలన్నీ వట్టివేనని మన దాడులు రుజువు చేశాయి. ఎందుకంటే పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను తుత్తునియలు చేస్తూ దాని భూభాగంలో 300 కి.మీ. లోపలి దాకా అత్యంత కచ్చితత్వంతో కూడిన దాడులు చేశాం'' అన్నారు. పాక్‌తో ఘర్షణ ఏ దశలోనూ అణుయుద్ధానికి దగ్గరగా రాలేదని స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా మే 7న భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టడం తెలిసిందే. పాక్, పీఓకేల్లోని 9 ఉగ్ర శిబిరాలు, శిక్షణ కేంద్రాలను బ్రహ్మోస్ తదితర అత్యాధునిక క్షిపణులతో నామరూపాల్లేకుండా చేసింది. మర్నాడు పాక్ డ్రోన్లు తదితరాలతో సరిహద్దు గ్రామాలు, పట్టణాలపై ప్రతీకార దాడులకు దిగింది. బదులుగా మన సైన్యం పాక్‌లో కి 11 కీలక వైమానిక స్థావరాలను నేలమట్టం చేసింది. నాలుగు రోజుల ఘర్షణల అనంతరం ఇరుదేశా లు కాల్పుల విరమణకు అంగీకరించాయి. పాక్ సైన్యం విజ్ఞప్తి మేరకే అందుకు ఒప్పుకున్నట్టు భారత్ పేర్కొనగా తానే ఒప్పందం కుదిర్చానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించుకున్నారు.

దేశాన్ని తప్పుదోవ పట్టించిన కేంద్రం: కాంగ్రెస్

పాక్‌తో జరిగిన సాయుధ ఘర్షణ విషయంలో మోదీ సర్కారు దేశాన్ని తప్పుదోవ పట్టించిందంటూ కాంగ్రెస్ మండిపడింది. అది దాచేసిన నిజాలన్నీ ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయని ఫైటర్ జెట్లను కోల్పోయామన్న సీడీఎస్ ప్రకటనను ఉద్దేశించి అభిప్రాయపడింది. పాక్‌తో నాలుగు రోజుల ఘర్షణలో ఎంత నష్టం జరిగిందో వాస్తవాలు వెల్లడించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ''సీడీఎస్ ప్రకటన నేపథ్యంలో సిందూర్‌కు సంబంధించి ఎన్నో కీలక సందేహాలు తలెత్తుతున్నాయి. వాటన్నింటికీ సమాధానాలు లభించాలంటే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలే ఏకైక మార్గం . కాబట్టి తక్షణం వాటిని ఏర్పాటు చేయాలి. అంతేకాదు, మన యుద్ధ సన్నద్ధతపై స్వతంత్ర కమిటీతో దర్యాప్తు జరిపించాలి'' అంటూ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధంపై కూడా వాజ్‌పేయి సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం కమిటీ వేసి సమీక్ష జరిపిందని గుర్తు చేశారు. ''మన వీర పైలట్లు ప్రాణాలకు తెగించి దేశ గౌరవాన్ని కాపాడారు. వారికి వందనం'' అంటూ ఖర్గే కొనియాడారు.

స్వదేశీ శక్తికి తార్కాణం

రక్షణ రంగంలో భారత్ సాధించిన స్వావలంబనకు ఆపరేషన్ సిందూర్ అద్దం పట్టిందని సీడీఎస్ జనరల్ చౌహాన్ అభిప్రాయపడ్డారు. సింగపూర్‌లో జరిగిన ఆసియా స్థాయి రక్షణ శిఖరాగ్ర సదస్సు షాంగ్రిలా డైలాగ్‌ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఆకాశ్ వంటి పూర్తి దేశీయ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు పాక్ దాడులను అత్యంత సమర్థంగా అడ్డుకుని తిప్పికొట్టాయని గుర్తు చేశారు. గగనతల రక్షణకు విదేశాల సాయంపై ఆధారపడకుండా సొంతంగా అభివృద్ధి చేసుకున్న దేశవ్యాప్త సమీకృత రాడార్ వ్యవస్థ అద్భుతంగా రాణించి సత్తా చాటిందన్నారు.

దాయాది విద్వేష మంత్రం

శాంతి కోసం భారత్ ఎన్ని ప్రయత్నాలు చేసినా బదులుగా పాక్ విద్వేషమే వెళ్లగక్కిందని సీడీఎస్ జనరల్ చౌహాన్ దుయ్యబట్టారు. ''2014లో ప్రధాని నరేంద్ర మోదీ పాక్‌కు స్నేహ హస్తం సాచారు. రెండు చేతులు కలవనిదే చప్పట్లు అసాధ్యం. ఇలాంటి పరిస్థితుల్లో పాక్‌ను దూరం పెట్టడమే సరైన వ్యూహం. ఇప్పుడు భారత్ చేస్తున్నది అదే'' అని వివరించారు. ''స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో సామాజికంగా, ఆర్థికంగా, తలసరి ఆదాయంలోనూ పాక్ మనకంటే చాలా ముందంజలో ఉంది. కానీ ఇప్పుడు ప్రతి రంగంలోనూ మనం పాక్ అందుకోలేనంతగా ప్రగతి సాధించాం'' అని గుర్తు చేశారు.

మార్స్ కొంప ముంచిన సౌర గాలులు

- సౌర తుఫాన్లు, గాలుల వల్లే ఆయస్కాంత శక్తి మటుమాయం
- దాంతో మార్స్‌పై నీరు, వాతావరణం కనుమరుగు: నాసా



భూమికి సమీపంలో ఉన్న అంగారక గ్రహం (మార్స్)పై విస్తృతమైన పరిశోధనలు జరుగుతున్నాయి. అక్కడికి వ్యోమగాములను పంపించే ప్రయత్నాలు సైతం మొదలయ్యాయి. ఈ అరుణ గ్రహంపై కోట్లాది సంవత్సరాల క్రితం నీరు, వాతావరణం ఉండేవి. అవి క్రమేపి అంతరించిపోయాయి. మొత్తం శూన్యం ఆవరించింది. జీవుల మనుగడపై ఆస్కారమే లేకుండాపోయింది. మార్స్‌పై నీరు, వాతవరణం కనుమరుగైపోవడానికి కారణం ఏమిటన్నది ఎట్టకేలకు గుర్తించగలిగారు. బలమైన సౌర గాలులు, సౌర తుఫాన్ల కారణంగా అంగారక గ్రహం ఆయస్కాంత శక్తిని కోల్పోయినట్లు తేలింది. ఆయస్కాంత శక్తిని కోల్పోయిన తర్వాత అక్కడున్న ద్రవ రూపంలోని నీరు అంతరిక్షంలోకి ఆవిరైపోయింది. వాతావరణం సైతం నెమ్మదిగా అంతరించింది. దాంతో మార్స్ ఉపరితలంపై ఎర్రమట్టి దిబ్బలు, దుమ్ము, రాళ్లు మాత్రమే మిగిలాయి. మార్స్ అట్మాస్ఫియర్ వోలటైల్ ఎవల్యూషన్(మావెన్) మిషన్‌లో భాగంగా అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ(నాసా) ఈ విషయం కనిపెట్టింది. చాలా ఏళ్లుగా పరిశోధకుల మదిని తొలిచేస్తున్న ప్రశ్నకు సమాధానం దొరికినట్లయ్యింది. సౌర గాలుల్లోని శక్తి కణాలు అంగారకుడి వాతావరణంలోకి చొచ్చుకెళ్లాయని, దాంతో నీరు ఆవిరైందని, తటస్థ కణాలు, అణువులు వాతావరణం నుంచి బయటకు వెళ్లిపోయాయని నిర్ధయానికొచ్చారు. ఈ పరిశోధన కోసం సోలార్ విండ్ అయాన్ అనలైజర్, న్యూట్రల్ గ్యాస్, ఐయాన్ మాస్ స్పెక్ట్రోమీటర్ ఉపయోగించారు. మార్స్‌పై ఒక భాగం పూర్తిగా వెలుతురు, మరో భాగం పూర్తిగా చీకటి ఉంటుంది. ఈ రెండు భాగాల సమగ్ర డేటా సేకరించారు. సౌర గాలులు, తుఫాన్లు అరుణ గ్రహం స్థితిగతులను పూర్తిగా మార్చేసినట్లు స్పష్టమయ్యింది. ఈ మొత్తం పరిశోధన వివరాలను సైన్స్ అడ్వాన్సెస్ పత్రికలో ప్రచురించారు. అంగారకుడిపై మరింత అవగాహన పెంచుకోడానికి, భవిష్యత్తులో చేపట్టే పరిశోధనలకు ఈ వివరాలు దోహదపడతాయని సైంటిస్టులు చెబుతున్నారు. ఒకవేళ మార్స్‌పై నీరు, వాతావరణం యథాతథంగా ఉంటే అది మరో భూగోళంగా మనుషుల మనుగడకు తోడ్పడేదని మనం భావించవచ్చు. సౌర గాలులు, తుఫాన్లు అంగారకుడి కొంప ముంచడమే కాదు.. మన ఆశలనూ నీరుగార్చేశాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

మహిళలు కన్నెర్ర చేస్తే ముష్కరులకు మూడినట్లే

నారీశక్తిని సవాలు చేసి వినాశనం కొనితెచ్చుకున్నారు
- తుపాకీ తూటాకు ఫిరంగి గుండ్లతో సమాధానమిస్తాం
- పాకిస్తాన్‌కు ప్రధాని మోదీ హెచ్చరిక



భోపాల్: పాకిస్తాన్ ఉగ్రవాదులు, వారి వెనుక ఉన్న సూత్రధారులు భారత నారీశక్తిని సవాలు చేసి స్వయంగా వినాశనాన్ని కొనితెచ్చుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. పహల్గాం ఉగ్రవదాడిలో భార్యల కళ్లెదుటే భర్తలు చనిపోయారని అన్నారు. మన ఆడబిడ్డలు కన్నెర్ర చేస్తే ముష్కరులకు మూడినట్లేనని తేల్చి చెప్పారు. ఉగ్రవాదంపై పోరాటంలో దేశ చరిత్రలో 'ఆపరేషన్ సిందూర్' అత్యంత విజయవంతమైన ఆపరేషన్ అని స్పష్టంచేశారు. పహల్గాంలో ఉగ్రవాదులు కేవలం రక్తం పారించలేదని... మన సంస్కృతిపై దాడి చేశారని, మన దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు సాగించారని మండిపడ్డారు. రాణి అహిల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా శనివారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో 'మహిళా సశక్తికరణ్ మహా సమ్మేళన్' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత మన సైనిక దళాలు పాకిస్తాన్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి ఉగ్రవాదుల అడ్డాలను నేలమట్టం చేశాయని అన్నారు. ముష్కరుల ఇళ్లలోకి చొరబడి మరీ అంతం చేయగలని నిరూపించినట్లు తెలిపారు. ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని పేర్కొన్నారు. మరోసారి భారత్‌పై దాడికి పాల్పడే సాహసం చేస్తే ఉగ్రవాదులు, వారి పోషకులు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని మరోసారి స్పష్టంచేశారు.

వీరత్వానికి ప్రతీక సిందూరం

ఉగ్రవాదులను ప్రయోగించి దొంగచాటు యుద్ధాలు చేద్దామనుకుంటే కుదరని పాకిస్తాన్‌కు తేల్చిచెప్పారు. తుపాకీ తూటాలకు ఫిరంగి గుండ్లతో బదులిస్తామని ఘాటుగా హెచ్చరించారు. మన సంప్రదాయంలో సిందూరం మహిళా శక్తికి ప్రతీక అని, రామభక్త హనుమాన్ సైతం సిందూరం ధరిస్తారని తెలిజేశారు. ఇప్పుడు సిందూరం వీరత్వానికి, ఉగ్రవాదంపై ప్రతిఘటనకు గుర్తుగా మారిందన్నారు. మహిళల సాధికారత కోసం నారీ శక్తి వందన్ అధినియం బిల్లు తీసుకొచ్చామని అన్నారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో 75 మంది మహిళా ఎంపీలు ఉన్నారని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని వివరించారు.

ఆపరేషన్ సిందూర్‌లో మహిళలదే కీలక పాత్ర

అసిస్టెంట్ కమాండెంట్ నేహా భండారి నేతృత్వంలో బీఎస్‌ఎఫ్ మహిళా దళం ప్రదర్శించిన ధైర్యసాహసాలను ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ దళం ఆపరేషన్ సిందూర్ సమయంలో జమ్మూకశ్మీర్‌లోని అఖ్నూర్‌లో ఫార్వర్డ్ పోస్టులను పాకిస్తాన్ దాడుల నుంచి విజయవంతంగా కాపాడిందని వెల్లడించారు. రక్షణ శాఖలో భారతీయ మహిళల శక్తి సామర్థ్యాలు ప్రపంచం తిలకిస్తోందని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో మహిళా జవాన్లు కీలక పాత్ర పోషించారని తెలిపారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ)లో 17 మంది తొలి బ్యాచ్ మహిళా కేడెట్లు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకోవడం చరిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు.

యూపీ ఎమ్మెల్యే అబ్బాస్ అన్సారీకి రెండేళ్ల జైలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్, రాజకీయ నేత ముఖ్తార్ అన్సారీ కుమారుడు, ఎమ్మెల్యే అబ్బాస్‌కు విద్వేష పూరిత ప్రసంగం కేసులో రెండేళ్ల జైలు శిక్ష పడింది. మౌలోని ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు శనివారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. మౌసదర్ నియోజకవర్గం నుంచి సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ(ఎస్‌బీఎస్‌పీ) తరఫున అబ్బాస్ అన్సారీ ఎన్నికయ్యారు. తాజా తీర్పుతో ఈయనపై అనర్హత వేటు పడే అవకాశాలున్నాయి. 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పహార్‌పూర్‌లో జరిగిన ర్యాలీలో 'లెక్క సరిచేస్తా. వాళ్లకు బుద్ధి చెబుతా'అంటూ అబ్బాస్ జిల్లా అధికారులను బెదిరించినట్లు ఆరోపణలున్నాయి. మొత్తం మూడు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. విచారించిన న్యాయస్థానం మొత్తం ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. అయితే, శిక్షలను ఏకకాలంలో అనుభవించాలని తీర్పు చెప్పింది. దీంతో, ఎమ్మెల్యే అబ్బాస్ రెండేళ్ల జైలు జీవితం గడపాల్సి ఉంది. అబ్బాస్ సన్నిహితుడు మన్సూర్ అన్సారీకి సైతం కోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రెండేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం జైలు శిక్ష పడిన ప్రజాప్రతినిధులు పదవిని కోల్పోతారు. కాగా, ఎస్‌బీఎస్‌పీ రాష్ట్రంలోని అధికార బీజేపీకి మిత్రపక్షం కాగా ఈ పార్టీ అధ్యక్షుడు కేబినెట్ మంత్రిగా ఉన్నారు.

రాజ్యాంగం వల్లే దృఢమైన భారత్

దేశ అభివృద్ధికి రాజ్యాంగమే కారణం
- సమాజంలో చిట్టచివరి వ్యక్తికి సైతం న్యాయం చేకూర్చాలి
- న్యాయ వ్యవస్థకు సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ పిలుపు




ప్రయాగ్‌రాజ్: సంక్షోభ సమయాల్లోనూ దేశాన్ని ఐక్యంగా, బలంగా నిలబెట్టిన ఘనత మన రాజ్యాంగానిదే అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ చెప్పారు. ఎన్నో విపత్కర పరిస్థితులు, సమస్యలు ఎదురైనప్పటికీ దేశం స్థిరంగా నిలిచి ఉందని, ఆ క్రెడిట్ రాజ్యాంగానికే దక్కుతుందని స్పష్టంచేశారు. శనివారం ఉత్తర ప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టులో అడ్వొకేట్ చాంబర్స్, మల్టీ-లెవెల్ పార్కింగ్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయవాదులను ఉద్దేశించి ప్రసంగించారు. 75 ఏళ్ల క్రితం రాజ్యాంగాన్ని రూపొందించి, తుది ముసాయిదాను రాజ్యాంగ సభకు సమర్పించిన సమయంలో దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయని గుర్తుచేశారు. రాజ్యాంగంలో సమాఖ్య లక్షణాలు అధికంగా ఉన్నాయని కొందరు, ఏకీకృతంగా ఉందని మరికొందరు చెప్పారని వెల్లడించారు. రాజ్యాంగం పూర్తి సమాఖ్యం కాదు, పూర్తి ఏకీకృతం కాదని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బదులిచ్చినట్లు తెలిపారు. యుద్ధం, శాంతితోపాటు ఎలాంటి పరిస్థితుల్లోనైనా దేశాన్ని ఐక్యంగా, దృఢంగా ఉంచే రాజ్యాంగం మనకు లభించిందని హర్షం వ్యక్తం చేశారు.

రాజ్యాంగ స్వర్ణ రథానికి రెండు చక్రాలు

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందంటే అందుకు కారణం రాజ్యాంగమేనని జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు. పొరుగు దేశాల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయో చూస్తూనే ఉన్నామని చెప్పారు. ఈ 75 ఏళ్ల రాజ్యాంగ ప్రయాణంలో దేశంలో సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని తీసుకురావడానికి శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు ఎంతగానో కృషి చేశాయని ఉద్ఘాటించారు. సమాజంలో చిట్టచివరి వ్యక్తికి సైతం న్యాయం చేకూర్చడం మన ప్రాథమిక విధి అని న్యాయమూర్తులు, న్యాయవాదులకు పిలుపునిచ్చారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు ఆఖరి వ్యక్తిదాకా చేరుకోవాలని సూచించారు. భూసంస్కరణలతో ఎంతోమందికి మేలు జరిగిందని జస్టిస్ గవాయ్ తెలిపారు. భూస్వాముల నుంచి భూములు పేదలకు బదిలీ అయ్యాయని పేర్కొన్నారు. భూసంస్కరణ చట్టాలను ఎంతోమంది కోర్టుల్లో సవాలు చేశారని వెల్లడించారు. ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కుల మధ్య ఘర్షణ జరిగితే.. ప్రాథమిక హక్కులదే పైచేయి అవుతుందని సుప్రీంకోర్టు తేల్చిచెప్పినట్లు గుర్తుచేశారు. రాజ్యాంగాన్ని సవరించే హక్కు పార్లమెంట్‌కు ఉన్నప్పటికీ.. దాని మౌలిక స్వరూపాన్ని మార్చే హక్కు లేదని 1973లో అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పు ఇచ్చినట్లు చెప్పారు. భారత రాజ్యాంగానికి ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలే ఆత్మ అని పేర్కొంటూ, రాజ్యాంగ స్వర్ణ రథానికి ఇవి రెండు చక్రాలు అని వ్యాఖ్యానించారు. ఒక్క చక్రాన్ని ఆపినా మొత్తం రథం ఆగిపోతుందన్నారు. బార్, బెంచ్ అనేవి ఒకే నాణేనికి రెండు ముఖాలు అని జస్టిస్ గవాయ్ స్పష్టంచేశారు. బార్, బెంచ్ కలిసికట్టుగా పనిచేయకపోతే రాజ్యాంగ రథం ముందుకు సాగదని చెప్పారు.

3,395 కరోనా కేసులు

24 గంటల్లో 9 మరణాలు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కరోనా కలకలం క్రమంగా పెరుగుతోంది. శనివారం నాటికి దేశంలో 3,395 యాక్టివ్ కరోనా కేసులు నమోదయ్యాయి. వాటిలో 1,336 కేసులు ఒక్క కేరళలోనే వెలుగు నమోదయ్యాయి. మహారాష్ట్ర (467), ఢిల్లీ (375), గుజరాత్ (265), కర్నాటక (234), పశ్చిమబెంగాల్ (205), తమిళనాడుల్లో (185), ఉత్తరప్రదేశ్ (117) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం ఈ మేరకు గణాంకాలు విడుదల చేసింది. గత 24 గంటల్లో 685 కొత్త కేసులు వెలుగు చూశాయని, నాలుగు కరోనా మరణాలు సంభవించాయని పేర్కొంది. నిజానికి గత 24 గంటల్లో మరణాల సంఖ్య తొమ్మిది దాటినట్టు చెబుతున్నారు. మహారాష్ట్రలో ఇద్దరు, ఢిల్లీ, గుజరాత్, కేరళ, కర్నాటక, యూపీ, పంజాబ్, తమిళనాడుల్లో ఒక్కొక్కరు చొప్పున కరోనాకు బలైనట్టు వార్తలు వస్తున్నాయి. దీంతో ఈ ఏడాది కరోనాతో మరణించిన వారి సంఖ్య 24కు చేరింది. అయితే కరోనా బారినపడ్డ వారిలో అత్యధికులకు తీవ్ర లక్షణాలేమీ లేవని, ఇళ్లలోనే చికిత్స తీసుకుంటున్నారని కేంద్రం తెలిపింది. కనుక ఆందోళన పడాల్సిన అవసరమేమీ లేదని స్పష్టం చేసింది. కేరళలో కేసులు భారీగా నమోదవడానికి ఎక్కువ సంఖ్యలో పరీక్షలు చేస్తుండటమే కారణమని అభిప్రాయపడింది. మే 22 నాటికి దేశంలో కేవలం 257 కరోనా కేసులు వెలుగు చూశాయి. మే 25 కల్లా అవి 1,000 మార్కును దాటడం తెలిసిందే. వారం కూడా తిరగకుండానే కేసుల సంఖ్య మూడున్నర వేలు దాటేయడం ఆందోళన కలిగిస్తోంది. ఇందుకు ఒమిక్రాన్ సబ్ వేరియంట్లయిన ఎల్‌ఎఫ్.7, ఎన్‌బీ.1.8.1 కారణమని వైద్యులు ఇప్పటికే తేల్చారు. అయితే ఇప్పటికైతే ప్రపంచ ఆరోగ్య సంస్థ వాటిని ప్రమాదకర జాబితాలో చేర్చలేదు.



సరదాల వేళ... తలుపులతో జాగ్రత్త!

వాషింగ్టన్: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్‌ను ఆయన భార్య ముఖంపై చేతులు వేసి తోసేస్తున్న వీడియో ఇటీవల ప్రపంచవ్యాప్తంగా వైరల్ కావడం తెలిసిందే. దానిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా తాజాగా స్పందించారు. శుక్రవారం మీడియా భేటీ సందర్భంగా విలేకరులు ఈ అంశాన్ని లేవనెత్తారు. ''అది అధ్యక్ష దంపతుల నడుమ సరదా సన్నివేశం మాత్రమే. మాక్రాన్‌తో మాట్లాడాను. వారి మధ్య సమస్యేమీ లేదు. అంతా బానే ఉంది''అని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఓ దేశాధినేతగా వైవాహిక బంధానికి సంబంధించి మరో దేశాధ్యక్షునికి మీరిచ్చే సలహా ఏమిటని ప్రశ్నించగా, ''సరదాల వేళ తలుపులు మూసున్నదీ, లేనిదీ ఒకటికి రెండుసార్లు సరిచూసుకోండి చాలు. అంతకంటే మరేమీ అక్కర్లేదు''అంటూ బదులిచ్చి నవ్వులు పూయించారు.

ఉక్కు, అల్యూమినియంపై 50% సుంకం

బుధవారం నుంచే అమల్లోకి • డొనాల్డ్ ట్రంప్ ప్రకటన

పెన్సిల్వేనియా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. తమ దేశంలో ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని, ఇందుకోసం విదేశీ ఉక్కుపై సుంకాన్ని రెండు రెట్లు చేస్తామని అన్నారు. ఆయన శుక్రవారం పిట్స్‌బర్గ్‌లో ఇర్విన్ స్టీల్ ప్లాంట్ కార్మికులతో మాట్లాడారు. విదేశాల నుంచి దిగుమతి అయ్యే ఉక్కుపై 50% టారిఫ్ విధించనున్నట్లు చెప్పారు. జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ సంస్థ అమెరికా స్టీల్ కంపెనీలో పెట్టుబడులు పెట్టబోతోందని, దీనిపై ఒప్పందం కుదిరిందని చెప్పారు. విదేశీ అల్యూమినియంపైనా టారిఫ్‌ను 50 శాతానికి పెంచనున్నట్లు ట్రంప్ తేల్చిచెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. స్టీల్‌తోపాటు అల్యూమినియంపై పెరిగిన టారిఫ్‌లు బుధవారం నుంచే అమల్లోకి వస్తాయని వెల్లడించారు. ఇదిలా ఉండగా, టారిఫ్‌ల పెంపుల వల్ల అమెరికాలో స్టీల్, అల్యూమినియం ధరలు విపరీతంగా పెరిగిపోతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గృహ నిర్మాణం మరింత భారం కానుంది. ట్రంప్ రెండోసారి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఉక్కు ధరలు ఇప్పటికే 16% పెరిగిపోయాయి. అమెరికా తనకు అవసరమైన స్టీల్, అల్యూమినియంను ఎక్కువగా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటోంది. మరోవైపు భారత్-పాకిస్తాన్ ఘర్షణలపై ట్రంప్ తన నోటి దురుసు ఆపడం లేదు. రెండు దేశాల అణుయుద్ధం జరిగే పరిస్థితిని నివారించినందుకు గర్వపడుతున్నానని మరోసారి చెప్పారు. కాల్పుల విరమణ వెనుక ట్రంప్ ప్రమేయం లేదని భారత్ పదేపదే చెబుతున్నా ఆయన పట్టించుకోవడం లేదు.

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 1 । జూన్ । 2025




అందమా.. అందుమా! విశ్వనగరిలో ప్రపంచ సుందరి మెరిసింది. శనివారం నగరంలోని హైటెక్స్ వేదికగా మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఆయా దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు సుందరీమణులు హొయలొలికించారు.

న్యూస్‌రీల్

రేపు కలెక్టరేట్‌లో ప్రజావాణి రద్దు

లక్డీకాపూల్: హైదరాబాద్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.

జీహెచ్‌ఎంసీకి రూ.1,327 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, సిటీబ్యూరో: 'హై సిటీ' (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టు కింద రాష్ట్ర బడ్జెట్‌లో జీహెచ్‌ఎంసీకి రూ. 2,654 కోట్లు కేటాయించిన రాష్ట్రప్రభుత్వం.. రెండు త్రైమాసికాల్లో(సెప్టెంబర్ వరకు) రూ.1,327 కోట్లు విడుదల చేసినట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్‌ఎంసీ పీడీ ఖాతాలో శుక్రవారం ఈ నిధులు జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు అందజేస్తున్న ఆర్థిక సహాయంతో అప్పులు, పెండింగ్ బిల్లులు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టర్లకు చెల్లింపులు కూడా చేస్తున్నామని, ప్రజా సదుపాయాల కోసం కొత్త మౌలిక సదుపాయాల పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

నాలాల కబ్జాలపై ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలం ప్రారంభం కావడంతో మురుగు, వరద నీరు రహదారులను ముంచెత్తి ట్రాఫిక్ అంతరాయాలకు కారణమవుతోంది. ఈ సమస్యలపై హైడ్రా దృష్టి పెట్టింది. ఇప్పటికే చెరువుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్న హైడ్రా.. వర్షాకాలం కావడంతో నాలాల ఆక్రమణలపై ప్రధానంగా దృష్టి పెట్టింది. నాలాల ఆక్రమణలు, ఇబ్బందులపై ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. జూన్ నెలతో పాటు అవసరమైతే జులై నెలలో కూడా నాలాల సమస్యలపైనే ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఓఆర్ ఆర్ పరిధిలో నాలాల కబ్జాలకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. నాలా ఆక్రమణకు గురైనట్టు రుజువు చేసే చిత్రాలు పాతవి, ప్రస్తుతానివి కూడా తీసుకువచ్చి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని సూచించారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

- కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



లక్డీకాపూల్: తాము చేసిన సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో వివిధ కేటగిరీల్లో పని చేసిన 21 మంది ఉద్యోగులకు శనివారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో పదవీ విరమణ సభ నిర్వహించి, వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ఉద్యోగులందరూ ఎంతో నిబద్ధత, అంకిత భావంతో సేవలందించినట్లు కొనియాడారు. రిటైర్మెంట్ అనేది జీవితంలో కొత్త అధ్యాయం వంటిదని ఆయన పేర్కొన్నారు.



భళా బల్దియా!

విశ్వనగరి బాటలో గ్రేటర్

- 37 ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలు, ఇతరత్రా అభివృద్ధి
- రూ.985 కోట్లతో నాలాల ఆధునికీకరణ
- గత ప్రభుత్వ పనుల కొనసాగింపుగా కాంగ్రెస్ సర్కారు హై సిటీ పనులు
- రూ. 5,942 కోట్ల పనులకు పరిపాలన అనుమతులు, రూ. 2,100 కోట్ల పనులకు టెండర్లు
- తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి నిండిన 11 వసంతాలు

సాక్షి, సిటీబ్యూరో: ఎందరో ఉద్యమకారుల ఆత్మ బలిదానాలు, ఆందోళనలు, నిరసనలు.. ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షలు.. రాజకీయ సమీకరణలు, ఎత్తుగడల.. నేపథ్యంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై నేటికి 11 సంవత్సరాలు అవుతోంది. 2014 జూన్ 2న సాకారమైన రాష్ట్రం రేపు 12వ వసంతంలోకి ప్రవేశించనుంది. పదకొండేళ్ల ప్రస్థానంలో గ్రేటర్ నగరం రూపురేఖలు గుర్తుపట్టలేనంతగా మారిపోయాయి. విశ్వనగరి కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు సైతం తమవంతు పాత్ర పోషించాయి.. పోషిస్తున్నాయి. తాము పోటీ పడేది దేశంలోని ఇతర నగరాలతో కాదని, ప్రపంచస్థాయి నగరాలతోనని ఘంటాపథంగా చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు ప్రభుత్వాల హయాంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో పనులను ఒకసారి అవలోకిస్తే..

2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఎన్నో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలు తదితర పనులు చేపట్టింది. ముఖ్యంగా ట్రాఫిక్ చిక్కుల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యమిచ్చింది. లింక్‌రోడ్లు, స్లిప్‌రోడ్లు, జంక్షన్ల అభివృద్ధి తదితర పనులు చేసింది. ఎస్సార్‌డీపీ (వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం) కింద 42 ప్రాజెక్టులు చేపట్టగా, వాటిలో 37 పూర్తయ్యాయి. వీటితోపాటు వరద నివారణకు రూ. 985 కోట్లతో ఎస్‌ఎన్‌డీపీ కింద నాలాల అభివృద్ధి పనులు చేపట్టింది. ప్రజల సౌకర్యార్థం వైకుంఠధామాలు, పచ్చదనం పెంపు తదితర పనులు సైతం చేసింది.





కాంగ్రెస్ హయాంలో..

2023 చివరిలో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్‌ఎస్ హయాంలోని కొన్ని పనులను కొనసాగిస్తూ, కొన్ని కొత్త ప్రాజెక్టులను ప్రారంభించింది. ఈ ప్రభుత్వం వచ్చి కొద్దినెలలే అయినందున టెండర్లు దాటి పనులు పట్టాలకెక్కలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 'హై సిటీ' (హైదరాబాద్ సిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) కింద రూ. 5942 కోట్ల పనులకు పరిపాలన అనుమతులిచ్చింది. దాదాపు రూ.2,100 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. ఆరాంఘర్–జూపార్క్ (డా.మన్మోహన్‌సింగ్) ఫ్లై ఓవర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి గతంలో డా.వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే పీవీ ఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ ఫ్లై ఓవర్ సహా ఎన్నో పనులు జరిగాయని ప్రస్తావించారు. పెరుగుతున్న నగరానికి అనుగుణంగా 2050 మాస్టర్‌ప్లాన్‌తో నగరాన్ని అభివృద్ధి చేస్తామంటున్నారు.

అప్పుడలా.. ఇప్పుడిలా..

బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన దుర్గంచెరువు కేబుల్ జంక్షన్‌తో పాటు మైండ్‌స్పేస్, బయోడైవర్సిటీ, ఎల్బీనగర్, నాగోల్, కామినేని, బైరామల్‌గూడ, షేక్‌పేట, శిల్పా లేఔట్ తదితర పనుల్ని ఎస్సార్‌డీపీ కింద చేపట్టింది. వాటికి కొనసాగింపుగా కాంగ్రెస్ ప్రభుత్వం హై సిటీ పేరిట కేబీఆర్, ట్రిపుల్ ఐటీ, ఖాజాగూడ, ఎస్‌ఎఫ్‌సీఎల్ తదితర ప్రాంతాల్లో పనులకు శ్రీకారం చుట్టింది. బీఆర్‌ఎస్ హయాంలో దాదాపు రూ. 26వేల కోట్ల పనులకు ప్రణాళికలు రూపొందించగా.. దాదాపు రూ.7 వేల కోట్ల పనులు పూర్తి చేసింది.

5 కారిడార్ల ద్వారా 15 లక్షల వాహనాలు..

బీఆర్‌ఎస్ హయాంలో పూర్తయిన పనుల్లో నగరంలోని 5 ప్రధాన కారిడార్ల ద్వారానే నిత్యం 15 లక్షల వాహనాలు (పీసీయూ) ప్రయాణిస్తున్నాయి. ఆ కారిడార్లు.. వాటి దూరం.. ప్రయాణిస్తున్న వాహనాలు (పీసీయూ) ఇలా ఉన్నాయి.

1. **జేఎన్‌టీయూ- గచ్చిబౌలి కారిడార్:** రాజీవ్‌గాంధీ చౌక్, అయ్యప్ప సొసైటీ, మైండ్‌స్పేస్, బయోడైవర్సిటీ జంక్షన్లు. దూరం 12.10 కి.మీ., పీసీయూ 2.50 లక్షలు.
2. **పంజగుట్ట- కేబీఆర్‌పార్క్- మాదాపూర్ కారిడార్:** రోడ్‌నెంబర్ 45 ఫ్లైఓవర్, దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి, పంజగుట్ట స్టీల్‌బ్రిడ్జి. 14.10 కి.మీ.లు. పీసీయూ 5 లక్షలు.
3. **ఉప్పల్- ఎయిర్‌పోర్టు కారిడార్:** నాగోల్ ఫ్లైఓవర్, కామినేని ఫ్లై ఓవర్, ఎల్బీనగర్ జంక్షన్, బైరామల్‌గూడ ఫ్లై ఓవర్, ఒవైసీ హాస్పిటల్ జంక్షన్, చాంద్రాయణగుట్ట ఫ్లై ఓవర్. 31 కి.మీ.లు. పీసీయూ 2 లక్షలు.
4. **లక్డీకాపూల్-గచ్చిబౌలి (ఓఆర్ఆర్ కారిడార్:** ఓయూ కాలనీ ఫ్లై ఓవర్, బయోడైవర్సిటీ జంక్షన్, శిల్పా లేఔట్ ఫ్లైఓవర్. 31 కి.మీ. పీసీయూ 3.50 లక్షలు.
5. **గచ్చిబౌలి (ఓఆర్ఆర్-మియాపూర్ కారిడార్:** 13.30 కి.మీ. పీసీయూ 2 లక్షలు.

- ఎస్సార్‌డీపీ పనులు చేపట్టక ముందు గంటకు సగటున 14.16 కి.మీ ప్రయాణం సాగగా, ఇప్పటి వరకు జరిగిన పనులతో 16.34 కి.మీ.కు పెరిగింది.
- 2014లో 44.71 లక్షల వాహనాలుండగా ప్రస్తుతం 85.22 లక్షలకు పెరిగాయి.

బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన ఫ్లైఓవర్స్ వల్ల ట్రాఫిక్ లో తేడా స్పష్టంగా కనపడుతోందని చెప్పేవారితో పాటు సరైన ప్రణాళిక లేకుండా నిర్మించిన ఫ్లైఓవర్స్ వల్ల కొన్ని ప్రాంతాల్లో సమస్యలు పెరిగినట్టు చెబుతున్న వారూ ఉన్నారు. ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టినా సామాన్య ప్రజలకు ట్రాఫిక్ చిక్కులు తప్పలేదంటున్న వారూ ఉన్నారు.

తారెత్తిస్తున్న ఔటర్!

ఓఆర్ఆర్‌పై 2024లో పెరిగిన రోడ్డు ప్రమాదాలు

- 2023 సంవత్సరం కంటే పెరిగిన యాక్సిడెంట్లు
- 'వరుస' మారుతున్న ప్రయాణాలతోనూ ముప్పు
- అతివేగం, అజాగ్రత్తలు కూడా ఓ కారణమే



సాక్షి, సిటీబ్యూరో: భాగ్య నగరానికి మణిహారంగా తీర్చిదిద్దిన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రమాదాలకు చిరునామాగా మారింది. ఔటర్ ఎక్కాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఏటా ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. 2023 సంవత్సరం కంటే 2024లో ప్రమాదాలు భారీ సంఖ్యలో పెరిగాయి. అతివేగం, అజాగ్రత్తలే ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

నిత్యం 1.5 లక్షల వాహనాల రాకపోకలు..

హైదరాబాద్ చుట్టూ 158 కి.మీ పొడవుతో 8 వరుసల్లో నిర్మించిన ఓఆర్ఆర్‌పై వాహనాలు 120 కి.మీ వేగంతో ప్రయాణించవచ్చు. ప్రతిరోజూ దాదాపు 1.5 లక్షల వాహనాలు దీనిపై రాకపోకలు సాగిస్తున్నాయి. అత్యాధునికంగా నిర్మించిన ఈ రోడ్డుపై అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాలు నడుపుతుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

ప్రాణాలు హరిస్తున్న అతివేగం..

ఓఆర్ఆర్‌పై ప్రమాదాలకు ప్రధాన కారణం మితిమీరిన వేగం. ఇక్కడ గరిష్టంగా 120 కి.మీ వేగంతో వెళ్లొచ్చు. చాలా వాహనాలు ఏకంగా 140–160 కి.మీ వేగంతో వెళ్తున్నాయని పోలీసులు చెబుతున్నారు. అత్యధికంగా 200 కి.మీ వేగంతో వెళ్లిన వాహనాన్నీ గుర్తించినట్లు తెలిపారు. పరిమితికి మించిన వేగంతో వెళ్లే వాహనాలపై కనీసం రోజుకు అధిక సంఖ్యలో కేసులు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇంత వేగంతో వాహనం వెళ్తున్నప్పుడు ఏదైనా అత్యవసర పరిస్థితిలో అదుపు చేయడం కష్టసాధ్యమే.

'వరుస' మారితే ప్రమాదమే..

ఓఆర్ఆర్‌పై ఒకవైపు 4, మరోవైపు 4 వరుసలున్నాయి. ఒకవైపు మొదటి రెండు వరుసల్లో 120 కి.మీ వేగంతో ప్రయాణించే వీలుంది. మిగిలిన 2 వరుసల్లో వాహన వేగం పరిమితి 80 కి.మీ. ఈ లేన్ల గందరగోళంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. 120 కి.మీ వేగంతో వెళ్లే వాహనాలు ఒక్కసారి పక్కనే ఉన్న 80 కి.మీ లైన్‌లోకి దూసుకొస్తుండటంతో అక్కడున్న వాహనాలను ఢీకొడుతున్నాయి. కొందరు వాహనదారులు అవగాహన లేకుండా ఒక్కసారిగా 80 కి.మీ లేన్ నుంచి 120 కి.మీ లైన్‌లోకి వెళ్తుండటం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. ఔటర్‌పై లారీలు 80 కి.మీ లైన్‌లోనే వెళ్లాలి. కొందరు డ్రైవర్లు 120 కి.మీ లేన్‌లోకి వెళ్లి ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొన్నిసార్లు వేగంగా వెళ్లే లారీని అకస్మాత్తుగా నిలుపుతుండటంతోనూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

ఔటర్‌పై ప్రమాదాలు ఇలా..	
2023	157
2024	224

కారణాలెన్నో..

- ఓఆర్ఆర్ అనేక వంపులతో నిర్మితమైంది. ఈ వంపుల దగ్గర తాము నడుపుతున్న వాహనాన్ని నియంత్రించలేని పరిస్థితుల్లో పక్కన ఉన్న రెయిలింగ్‌కు ఢీకొడుతున్నారు.
- ఏదైనా సమస్యలుంటే వాహనాలు పక్కకు నిలిపి ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నా.. వాటిని పట్టించుకోకుండా రహదారిపైనే భారీ వాహనాలను సైతం నిలిపేస్తున్నారు. పర్యవేక్షణ లోపం కూడా తోడవ్వడంతో ఔటర్‌పై ఈ తరహా ప్రమాదాలు షరామామూలు అయ్యాయి.
- కొన్నిచోట్ల సర్వీస్ రోడ్డు నుంచి ఓఆర్ఆర్‌కి వచ్చేటప్పుడు వాహనాల సిగ్నల్ వ్యవస్థను ఉపయోగించకుండా దూసుకురావడంతో కూడా ప్రమాదాలకు కారణమవుతున్నారు. నడిపేవారి నిద్రలేమితోనూ ప్రమాదాలు జరుగుతున్నాయి.
- ఓఆర్ఆర్‌పై చెట్ల నరికివేత ఇతరత్రా పనులు చేసేటప్పుడు తగిన హెచ్చరిక వ్యవస్థలను కూడా వినియోగించడం లేదు. అదే సమయంలో రోడ్డు పక్కన సిబ్బంది వాహనాలను నిలిపి ఉంచడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.

మహా నగర విస్తరణలో పక్కాగా

స్థానికాభివృద్ధి

- మెగా మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా ఎల్‌ఏడీపీ
- మౌలిక సదుపాయాల అభివృద్ధికి అనుగుణంగా భూసేకరణ
- ట్రిపుల్ ఆర్ వరకు టౌన్‌షిప్‌ల విస్తరణలో పటిష్టమైన ప్రణాళికలు
- హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ వెల్లడి



సర్ఫరాజ్ అహ్మద్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహా నగరాభివృద్ధిలో మరో కీలక అంశానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రీజినల్‌రింగ్ రోడ్డు వరకు హైదరాబాద్ మహానగరాన్ని విస్తరించిన దృష్ట్యా స్థానిక ఏరియా అభివృద్ధి ప్రణాళికకు (ఎల్‌ఏడీపీ) అనుగుణంగా టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయనుంది. భూసేకరణ దశ నుంచి టౌన్‌షిప్పుల నిర్మాణం వరకు అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా ప్రణాళికాబద్ధంగా మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. మెగా మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా ఎల్‌ఏడీపీకి రూపకల్పన చేయనున్నట్లు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. శనివారం హెచ్‌ఎండీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ మహానగరాభివృద్ధిలో భాగంగా చేపట్టనున్న భవిష్యత్ కార్యక్రమాలపై ఆయన వివరించారు.

'ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు రేడియల్ రోడ్లు, టౌన్‌షిప్‌లు, ఇతర మౌలిక సదుపాయాలపై ప్రధానంగా దృష్టి సారించాం. హైదరాబాద్‌లో విలీనమైనప్పటికీ అనేక గ్రామాలు నగరీకరణకు దూరంగానే ఉన్నాయి. ఈ గ్రామాల్లో రైతుల నుంచి పెద్ద ఎత్తున భూములను సేకరించి టౌన్‌షిప్‌లు నిర్మించేందుకు ఎల్‌ఏడీపీ దోహదం చేస్తుంది. 60 శాతం నివాస సముదాయాలు ఉంటే మిగతా 40 శాతం భూమిలో 30 శాతం రహదారులు, పార్కులు, ఆసుపత్రులు, స్కూళ్లు, కాలేజీలు, విద్యుత్ కేంద్రాలు వంటి వాటి కోసం వినియోగిస్తారు. మరో 10 శాతం భూమి హెచ్‌ఎండీఏ వద్ద ల్యాండ్‌బ్యాంక్‌గా ఉంటుంది' అని ఆయన చెప్పారు.

మెగా మాస్టర్‌ప్లాన్‌కు త్వరలో బిడ్డింగ్ ...

ట్రిపుల్‌ఆర్ వరకు హెచ్‌ఎండీఏ పరిధి విస్తరించిన దృష్ట్యా సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్, ఎకనామికల్ డెవలప్‌మెంట్ ప్లాన్, బ్లూగ్రీన్ డెవలప్‌మెంట్‌ప్లాన్‌లను సిద్ధం చేశారు. ఈ ప్రణాళికలను సమన్వయం చేస్తూ సమగ్రమైన మాస్టర్‌ప్లాన్‌ను తయారు చేసేందుకు ఈ నెలలో ఆసక్తిగల కన్సల్టెన్సీల నుంచి ఆన్‌లైన్ బిడ్డింగ్‌లను ఆహ్వానించనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.

1187 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్..

హెచ్‌ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు 1187 చెరువులకు లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. మరో 2,933 చెరువులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఇచ్చినట్లు కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పేర్కొన్నారు.

ఆగస్టులో ఎలివేటెడ్ కారిడార్ పనులు..

- ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్, డెయిరీఫామ్ మార్గాల్లో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌లకు భూసేకరణ సహా వివిధ రకాల పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆగస్టు నుంచి కారిడార్‌ల నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. అలాగే.. కోకాపేట్, బుద్వేల్, మోకిల, లేమూరు, ఇన్ముల్ నెర్వా, కుర్మల్‌గూడ, బాచుపల్లి, తొర్రూరు, కడ్తాల్, కుర్మిద్ద తదితర ప్రాంతాల్లో గతంలో ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించగా మిగిలిన ప్లాట్‌లకు త్వరలో ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏవీ రంగనాథ్

నాలాల్లో వరద

సాఫీగా సాగాలి

హైడ్రా కమిషనర్ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు, రహదారులు మునిగిపోకుండా చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ జీహెచ్‌ఎంసీ, మున్సిపల్ శాఖల్లో నాలాల విభాగానికి చెందిన ఇంజినీరింగ్ అధికారులతో శనివారం హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలాల సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని.. ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నాలాల ఆక్రమణలో నివాసాలుంటే పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని, ఇతర కట్టడాలను మాత్రం తొలగించక తప్పదని తెలిపారు. చెరువుల పునరుద్ధరణతో పాటు నాలాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని.. ఆ క్రమంలోనే కబ్జాల నివారణపై హైడ్రా దృష్టి పెట్టిందని చెప్పారు. నాలాలు కుంచించుకుపోయినా, మధ్యలో ఆటంకాలు ఏర్పడినా, ఆక్రమణలకు పాల్పడినా ఆ వివరాలివ్వాలని కోరారు. ఇందుకు సంబంధించిన నివేదిక రూపొందించాలని సూచించారు. కల్వర్టుల వద్ద చెత్త పేరుకుపోతోందని, ఈ చెత్తను తొలగించడంలో నిర్లక్ష్యమే వరద ముప్పునకు ప్రధాన కారణమని తెలిపారు. మలక్‌పేట వద్ద మ్యాన్‌హోళ్ల నుంచి వరద పోటెత్తడానికి ఇదే కారణమన్నారు. నాలాల్లో చెత్త, నిర్మాణ వ్యర్థాలు వేసిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది నగరానికి వరద ముప్పు లేకుండా అందరూ సమన్వయంతో కలిసి పని చేయాలని హైడ్రా కమిషనర్ సూచించారు.

విచారణ వేగవంతం



- ది పెంగ్విన్ సెక్యూరిటీస్ సంస్థ కేసు
- 13 అకౌంట్లు సీజ్
- పోలీసులు అదుపులో నిందితురాలు స్వాతి
- పరారీలో మరో నిందితుడు బాలాజి

జీడిమెట్ల: పెట్టుబడి పెడితే 20 నెలల్లో రెట్టింపు లాభాలు ఇస్తామని ఆశ చూపి పెట్టుబడిదారులను ముంచిన కేసులో జీడిమెట్ల పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. శుక్రవారం 13మంది బాధితుల నుండి పిర్యాదులు తీసుకున్న పోలీసులు నిందితులైన స్వాతి, బాలాజీలపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మరింత మంది బాధితులు ఉండవచ్చని పోలీసులు భావించినా శనివారం కొత్తగా భాదితులు ఎవరూ పోలీసులకు పిర్యాదు చేయలేదు. దర్యాప్తులో బాగంగా జీడిమెట్ల పోలీసులు ది పెంగ్విన్ సెక్యూరిటీస్ సంస్థకు చెందిన 13 బ్యాంకు అకౌంట్లను సీజ్ చేశారు. ఇప్పటికే పోలీసులు మెదక్ జిల్లా అల్లాదుర్గ్ ప్రాంతానికి చెందిన నిందితురాలు (సూరారంలో ఉండే) తాండ్లే చౌదరి స్వాతిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈకేసులో కీలక నిందితుడుగా ఉన్న గిరినగర్‌కు చెందిన బాలాజీ పరారీలో ఉండగా అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ది పెంగ్విన్ సెక్యూరిటీస్ సంస్థలో పెట్టుబడి పెట్టి మోసపోయిన బాధితులు ఉంటే జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ప్రభుత్వ తీరుపై ఎంఐఎం, బీజేపీ ఆగ్రహం

పాతబస్తీకి అన్యాయంచేస్తున్నారు ? : అక్బరుద్దీన్

- గుంతలు పూడ్చకుండా.. రంగులెందుకు? : ఈటల రాజేందర్
- నగర సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి పొన్నం
- రసాభాసగా జిల్లా సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, హాజరైన కలెక్టర్, ఎంపీ ఈటల తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన హైదరాబాద్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని శనివారం కలెక్టరేట్‌లో కాకుండా జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిపారు. ప్రజాప్రతినిధులు కురిపించిన ప్రశ్నల వర్షానికి మంత్రి, అధికారులు సమాధానాలు చెప్పలేక ఉక్కిరిబిక్కిరయ్యారు. ప్రభుత్వ తీరుపై ఎంఐఎంతో పాటు బీజేపీ సభ్యులు మండిపడ్డారు. అజెండాను పక్కనపెట్టి నాలాల విస్తరణ, పూడికతీత, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వైద్యం– ఆరోగ్యం సమస్యలపై మూకుమ్మడిగా ప్రజాప్రతినిధులు మంత్రిని నిలదీశారు. ప్రభుత్వం హైదరాబాద్‌పై ప్రత్యేక ఫోకస్ పెట్టిందని, ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి, సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి ప్రభాకర్ హామీ ఇచ్చారు. నియోజకవర్గానికి ప్రభుత్వం కేటాయించిన 3500 ఇందిరమ్మ ఇళ్లు సరిపోవని, వాటిని పెంచాలని పలువురు ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఇంటి స్థలం లేని వారికి ఏ విధంగా ఇందిరమ్మ ఇళ్ల సౌకర్యం కల్పిస్తారో తెలపాలని ప్రశ్నించారు.

నగర సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి పొన్నం

హైదరాబాద్ నగరవాసుల తాగునీటి సమస్య పరిష్కారం కోసం కృష్ణా, గోదావరి జలాల నుంచి 15 టీఎంసీల నీరందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. రేషన్ కార్డుల సర్వే చేపట్టామని, అర్హులైన అందరికీ త్వరలో రేషన్ కార్డులందజేస్తామన్నారు. నగరంలో 62,500 పైగా ఉన్న రెండు పడకల గదుల ఇండ్లను ప్రభుత్వంతో చర్చించి ఈనెల 15 వరకు పేదలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పనులెప్పుడు చేస్తారు?
–ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్

పాతబస్తీని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అశ్రద్ధ చూపుతూ అన్యాయం చేస్తున్నారని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ విమర్శించారు. ఇంకెంత కాలం గత పదేళ్ల ప్రభుత్వమని చెబుతారని, మీరొచ్చి 16 నెలలు గడిచినా పాతబస్తీకి చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. వర్షాకాలమొచ్చాక డీసిల్టింగ్ పనులకు ఇప్పుడు టెండర్లు పిలిస్తే, పనులెప్పుడు చేస్తారని ప్రశ్నించారు. ముందస్తు సమాచారం లేకుండా సమీక్ష సమావేశం ఎలా నిర్వహిస్తారని మంత్రిని ప్రశ్నించారు. బడా బిల్డర్లు బల్కాపూర్ నాలా దిశ మార్చినా వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. విద్యాసంస్థల్లో అగ్నిప్రమాద నివారణచర్యలు తీసుకోవడం లేరని,సైదాబాద్ స్టీల్‌బ్రిడ్జి పనులు ముందుకు సాగడం లేవన్నారు. వంద పడకల ఆస్పత్రి మాటలకే పరిమితమైందన్నారు. నగరంలో 8 లక్షల మందికి పైగా వీధివ్యాపారులున్నారని,ట్రాఫిక్ పోలీసుల వేధింపులతో వారి ఉపాధి కొల్లగొడతారా? అని ప్రశ్నించారు.

పైన పటారం.. లోన లొటారం
–ఎంపీ ఈటల రాజేందర్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాజకీయాలు తప్ప హైదరాబాద్ సమస్యలను సమీక్షించే తీరిక లేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సీజన్ వచ్చినా నాలాలు, డ్రైనేజీల పూడికతీత పనులు పూర్తి కాలేదని, జలమండలి పక్కన ఉన్న నాలా కూడా డంప్‌యార్డులాగా మారిందన్నారు. విశ్వ నగరమని చెబుతున్నప్పటికీ, కంపు నగరంగా మారుస్తున్నారన్నారు. వందల కోట్లతో రంగులు వేయడానికి కాకుండా,రోడ్లమీద గుంతలను పూడ్చాలని, జీహెచ్‌ఎంసీ తీరు చూస్తుంటే వేసుకునేందుకు దుస్తుల్లేనివానికి సెల్‌ఫోన్ ఇచ్చినట్లుందని ఎద్దేవా చేశారు. ప్రజాసమస్యలు ప్రస్తావించని సమావేశం ఫెయిల్ అయిందని రాజాసింగ్ విమర్శించారు. రహదారులు అధ్వాన్నంగా మారాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. ప్రజాప్రతినిధులు, కలెక్టరేట్, జీహెచ్‌ఎంసీ,వాటర్‌బోర్డు, అధికారులు పాల్గొన్నారు.

జూన్‌లో మూడు నెలల రేషన్ సరుకుల పంపిణీ

సాక్షి,సిటీ బ్యూరో : ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా ఆహార భద్రతా (రేషన్) కార్డుదారులందరికీ జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన నిత్యావసర సరుకుల కోటా ఒకే సారి జూన్ నెలలో పంపిణీ చేస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా పౌరసరఫరాల అధికారి రమేశ్ తెలిపారు. ఆహారభద్రత కార్డులో ఒక యూనిట్‌కు 6 కిలోల చొప్పున మూడు నెలలకుగాను 18 కిలోల సన్న బియ్యం, అంత్యోదయ కార్డుపై 35 కిలోలచొప్పున మూడు నెలలకుగాను 105 కిలోల సన్న బియ్యం, అన్నపూర్ణ కార్డు పై 10 కిలోల చొప్పున మూడు నెలలకుగాను 30 కిలోల సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వీటితో పాటు ప్రతి కార్డుదారునికి 5 కిలోలలు చొప్పున మూడు నెలలకుగాను 15 కిలోల గోధుమలు (కిలో రూ.7 చొప్పున), అదేవిధంగా నెలకు కిలో చక్కెర చొప్పున మూడు నెలలకుగాను 3 కిలోల చక్కెర (కిలో రూ.13.50 చొప్పున) అందజేస్తామన్నారు.

39 మంది పోలీసుల పదవీ విరమణ

లక్డీకాపూల్ : హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో శనివారం 39 మంది పోలీసులు పదవీ విరమణ చేశారు. ఆయా అధికారులను కమిషనర్ సీవీ ఆనంద్ సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. రిటైర్మెంట్ రోజునే అన్ని రకాల బెనిఫిట్స్ అందేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ (అడ్మిన్) పరిమళ హానా నూతన్, డీసీపీ ఎస్పీ చైతన్య కుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో..

నిమ్స్ లో నలుగురు ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. నిమ్స్ లెర్నింగ్ సెంటర్ లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ ప్రో. నగరి భీరప్ప వారిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

కత్తులతో దాడి.. యువకుడి మృతి

మాదాపూర్: మద్యం, డబ్బు కోసం గొడవపడడంతో ఓ యువకుడు మరణించిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్స్‌పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన మేరకు.. మణికొండ ప్రాంతానికి చెందిన జయంత్‌గౌడ్(18) తల్లి పుట్టినరోజు వేడుకల సందర్భంగా స్నేహితులకు పార్టీ ఇవ్వడానికి కొండాపూర్ ప్రాంతానికి వచ్చాడు. తన స్నేహితులతో కలసి మాదాపూర్ యశోద హస్పిటల్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో శుక్రవారం రాత్రి 10గంటల సమయంలో ఏడుగురు స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తున్నారు. అదే సమయంలో అక్కడికి ముగ్గురు గుర్తు తెలియని దుండగులు వచ్చి కత్తులతో బెదిరించి మద్యం, డబ్బు ఇవ్వాలని భయభ్రాంతులకు గురి చేయడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఆగ్రహించిన దుండగులు మద్యం సేవిస్తున్న జయంత్‌గౌడ్‌ను కత్తులతో పొడిచి పరారయ్యారు. అర్ధరాత్రి 1.30 గంటలకు సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొగా కొనఊపిరితో ఉన్న జయంత్‌గౌడ్‌ను యశోద హస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని నిందుతుల కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. జయంత్‌గౌడ్‌పై ఇదివరకే బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో హత్యకేసు నమోదు అయినట్టు తలిపారు.

ఇనుపచువ్వలు గుచ్చుకొని కార్మికుడి మృతి

మూసాపేట: సెల్లార్‌లో డ్రిల్లింగ్ వర్క్ చేస్తుండగా మట్టికుప్పలు కూలి మీదపడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. నల్గొండ జిల్లాకు చెందిన బొంత నరేష్ (35) నార్సింగ్ సమీపంలోని మంచిరేవుల వద్ద నివాసం ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ఓ కనస్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సెల్లార్ చుట్టూ మట్టి కూలకుండా డ్రిల్లింగ్ వేసి ఇనుపరాడ్లు బిగించే పనులు చేస్తున్నాడు. పక్క భవనానికి, తవ్వుతున్న సెల్లార్‌కు మధ్య దూరం లేకపోవడంతో మట్టి నరేష్‌పై పడింది. అప్పటికే డ్రిల్లింగ్ చేసిన ఇనుప చువ్వలు కడుపులో గుచ్చుకోవటంతో మృతి చెందాడు.

సమస్యలు తెలుసుకోవడానికి సీఎంకు తీరిక లేదు

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- బీజేపీ కార్పొరేటర్లతో కలిసి ధర్నా



జలమండలి ముందు కార్పొరేటర్లతో కలిసి ధర్నా చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ఖైరతాబాద్: రాజకీయ పరమైన సమావేశాలకు తప్ప ప్రజల సమస్యలపై సమావేశాలు నిర్వహించడానికి ముఖ్యమంత్రికి తీరిక లేదని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ విమర్శించారు. సంవత్సరం అయినా సమస్యలు పరిష్కారం చేసే దిక్కు లేదని, డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తాగునీటి సరఫరా అందించాలని, భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జీహెచ్‌ఎంసీ బీజేపీ కార్పొరేటర్లతో కలిసి ఈటల జలమండలి ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. సంవత్సరమున్నర కాలంగా కార్పొరేటర్లు ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా 5 పైసలు కూడా మంజూరు చేయలేదన్నారు. మంచినీటి సరఫరా కోసం కొత్త విస్తరణ పనులు లేవని, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఒక వైపు విశ్వనగరం అంటూ ఆ స్థాయిలో పన్నులు వసూలు చేస్తున్నారు కానీ సదుపాయాలు మాత్రం కల్పించడం లేదన్నారు. మురుగునీరు రోడ్లపై పారుతోందని.. ఇప్పుడే ఇలా ఉంటే భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. నీళ్లు నిలవకుండా ఏర్పాటు చేయాలని ఎండీకి సూచించినట్లు తెలిపారు. శివారు ప్రాంతాలకు మంచినీటిని వెంటనే అందించాలని కోరారు. ధర్నాలో కార్పొరేటర్లు నవజీవన్‌రెడ్డి, అరుణ సురేందర్ యాదవ్, పవన్, వంగ మాధుసూధన్ రెడ్డి, ప్రేమాశ్వర్ రెడ్డి, లచ్చి రెడ్డి, నర్సింహ గుప్త, శ్రవణ్, శ్రీవాణి, చేతన హరీష్, తార చంద్రరెడ్డి, శేషగిరి, మహేందర్ పాల్గొన్నారు.

చీర..కోటు..నైటీ

డ్రెస్సులు మార్చుతూ చోరీలు చేస్తున్న మహిళ

- దొంగతనానికి వెళ్లేటప్పుడు చీరలో..
- చోరీ చేసిన తరువాత జీన్స్‌ప్యాంటు,కోటు
- ఇంటికి చేరుకునే సమయంలో నైటీలో..
- ఎట్టకేలకు పట్టుబడ్డ నిందితురాలు



విజయ దొంగతనాల తీరును వివరిస్తున్న అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ శశాంక్‌రెడ్డి



కోటు,జీన్స్ ప్యాంటులో నిందితురాలు

సికింద్రాబాద్: దొంగతనం చేసే సమయంలో మూడు డ్రెస్సులు మార్చుతూ తప్పించుకు తిరుగుతున్న నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ జే.నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ కే.శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపిన మేరకు.. పార్సిగుట్టకు చెందిన దుర్గ ఇంట్లో ఈనెల 23న 6.7 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి, రూ.38 వేలు మాయమయ్యాయని బాధితురాలు వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

500 సీసీ కెమెరాల పరిశీలనతో....

వారాసిగూడ పోలీసులు దుర్గ ఇంటి సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. పార్శిగుట్ట నుంచి మచ్చబొల్లారం వరకు ఉన్న సుమారు 500 కెమెరాలను పరిశీలించారు. మొత్తం ఫుటేజీల్లో ఒక మహిళ ప్రయాణం కనిపించింది. అయితే సీసీ కెమెరాలు మారినకొద్దీ ఆమె ధరించిన దుస్తులు మారుతుండడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. మచ్చొల్లారం ప్రాంతంలో వరుస సీసీ కెమెరాలు పరిశీలించే సరికి ఒకే మహిళ మూడు రకాల దుస్తుల్లో కనిపించడంతో ఆమెను పట్టుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దొంగతనానికి పాల్పడింది మచ్చబొల్లారం ప్రాంతానికి చెందిన గడ్డమీది విజయ (45)గా గుర్తించారు.

విచారణలో మరో రెండు నేరాలు

సీసీ ఫుటేజీలోని మహిళ పోలికల ఆధారంగా విజయను పట్టుకున్న పోలీసులు విచారింగా ఇదే తరహాలో దుస్తులు మార్చుతూ లోగడ మరో రెండు నేరాలకు పాల్పడినట్టు అంగీకరించింది. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని నేరేడ్‌మెట్ పీఎస్, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అల్వాల్ పీఎస్ పరిధిలో తాళం వేసి ఉన్న ఇండ్లలో దొంగతనాలకు పాల్పడినట్టు పేర్కొంది. సీసీ కెమెరాల్లో పోలీసులు గుర్తించకుండా ఉండేందుకు తాను ఒక్కో దొంగతనం చేయడం కోసం చీర, జీన్స్, నైటీ ఇలా మూడు రకాల దుస్తులు ధరించినట్టు పేర్కొంది. నిందితురాలి నుంచి బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

కొండాపూర్‌లో రెచ్చిపోయిన కబ్జాదారులు

వై.స్వర్ణలత రెడ్డి స్థలంలో దుండగుల హల్‌చల్

- సెక్యూరిటీ సిబ్బందిపై రాళ్లు, పెట్రోల్ ప్యాకెట్లు, కర్రలతో దాడికి యత్నం
- భయభ్రాంతులకు గురి చేసిన నర్సింహా రెడ్డి, అనిల్‌రెడ్డిల కిరాయి ముఠా



కొండాపూర్ వై.స్వర్ణలత రెడ్డి స్థలంలోకి వచ్చిన దుండగులు



ఘటనా స్థలం వద్ద గచ్చిబౌలి పోలీసులు

గచ్చిబౌలి: కొండాపూర్‌లో కబ్జాదారులు రెచ్చిపోయారు. పెట్రోల్ ప్యాకెట్లు, రాళ్లు , కర్రలతో దాడికి యత్నిస్తూ భయభ్రాంతులకు గురి చేశారు. సైబరాబాద్ కమిషనరేట్‌కు కూతవేటు దూరంలో కబ్జాదారులు గలాట సృష్టించడం చర్చనీయాంశంగా మారింది. కొండాపూర్ సర్వే నెంబర్ 67/2లో రెండెకరాల 8 గుంటల స్థలం రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి సతీమణి వై.స్వర్ణలత రెడ్డి పేరిట ఉంది. ఆ స్థలం తమదే అంటూ జి.నర్సింహా రెడ్డి, అనిల్ రెడ్డి, షేక్ జమీల్‌లు పలు సార్లు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే శుక్రవారం సాయంత్రం సైట్‌లోకి 15 మంది దుండగులను పంపించారని స్వర్ణలతరెడ్డి మేనేజర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. తమను స్థలం ఖాళీ చేయాలంటూ బెదిరించారని డయల్ 100 కు కాల్ చేస్తే రాత్రి 11 గంటలకు గచ్చిబౌలి పెట్రోలింగ్ పోలీసులు వచ్చారని పేర్కొన్నారు. పోలీసులు వచ్చినా స్థలంలోనే రాత్రంతా తిష్ట వేశారని తెలిపారు. శనివారం మధ్యాహ్నం మరో 15 మంది స్థలంలోకి వచ్చి సెక్యూరిటీపై రాళ్లు, పెట్రోల్ ప్యాకెట్లు విసిరి కర్రలతో దాడికి యత్నించారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంలోని పెద్దలకు దగ్గరి వ్యక్తులమని చెప్పుకునే నర్సింహ్మా రెడ్డి, అనిల్ రెడ్డిలు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా దుండగులను సైట్‌లోకి పంపించారని వాపోయారు. డయల్ 100 కాల్ చేస్తే గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్, ఎస్‌ఐ అనిల్ వచ్చిన తరువాత స్థలం నుంచి బయటకు వెళ్లిపోయారన్నారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని ఇరు వర్గాలు వారు స్థలంలోకి వెళ్లవద్దని ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ సూచించారు. ఇది ఇలా ఉంటే నర్సింహా రెడ్డి, అనీల్ రెడ్డి, జమీల్ మనుషులు దాడులకు పాల్పడ్డారని చట్ట రీత్యా చర్య తీసుకోవాలని స్వర్ణలత రెడ్డి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పార్కు స్థలాన్ని కాపాడాలని జెడ్‌సీకి వినతి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని అపోలో హాస్పిటల్ వెనుక వైపు ఆస్పత్రి గోడను ఆనుకుని పార్కును కబ్జా చేయడమే కాకుండా అనుమతులకు మించి అక్రమ అంతస్తులు నిర్మిస్తున్నారంటూ స్థానిక నేత ధన్‌రాజ రాథోడ్ నేతృత్వంలో స్థానికులు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. స్థానిక ఇంటి యజమాని నితిన్‌కుమార్ అనే వ్యక్తి పార్కు స్థలాన్ని ఆక్రమించి అక్కడి చెట్లను తొలగిస్తూ జీ ప్లస్ 5 నిర్మాణం చేస్తున్నారని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే చర్యలు తీసుకుని పార్కు స్థలాన్ని కాపాడాలని, అలాగే అక్రమ అంతస్తుల నిర్మాణాన్ని ఆపాల్సిందిగా కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ జ్ఞానీజైల్‌సింగ్ నగర్‌లో రూ. 19.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ భూమిపూజ చేసి ప్రారంభించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఈ సందర్భంగా అధికారులను సూచించారు.

రిటైర్డ్ బెనిఫిట్స్‌ను తక్షణమే విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న జీహెచ్‌ఎంసీ రిటైర్డ్ ఉద్యోగులు

హిమాయత్‌నగర్: జీహెచ్‌ఎంసీలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ విరమణ చేసిన వారి ప్రయోజనాలను తక్షణమే విడుదల చేయాలని జీహెచ్‌ఎంసీ మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ డిమాండ్ చేశారు. శనివారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ అనుబంధ మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ నేతృత్వంలో ఉద్యోగ విరమణ చేసి ప్రయోజనాలు పొందని జీహెచ్‌ఎంసీ రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ప్లకార్డులు పట్టుకుని ధర్నా నిర్వహించి, జీహెచ్‌ఎంసీ అధికారులు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ... కార్పొరేషన్‌కు చాలా సంవత్సరాలుగా సేవలందిస్తున్నా ఉద్యోగుల పెన్షన్, ఇతర పదవీ విరమణ తర్వాత ప్రయోజనాలను సకాలంలో చెల్లించకపోవడం దారుణం అని వాపోయారు. అధికారుల జాప్యం వల్ల పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులపై ఆందోళన వ్యక్తం చేస్తూ, వీరిలో చాలా మంది తాము కష్టపడి సంపాదించిన ప్రయోజనాలను పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. జీహెచ్‌ఎంసీ ఉద్యోగులకు పదోన్నతులు, వైద్యపరమైన కారణాల వల్ల బదిలీ, సుదూర ప్రాంతాలకు బదిలీ, హెల్త్ కార్డ్స్, శానిటరీ జవాన్ల బదిలీ, శానిటరీ జవాన్లకు ఎఫ్.ఆర్.ఎస్ హాజరు వంటి ప్రధాన సమస్యలు తెలంగాణ ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని పరిష్కరించాలని డిమాండ్ చేసారు. అనంతరం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలసి వినతిపత్రం అందజేసి ఉద్యోగ విరమణ ప్రయోజనాలను తక్షణమే చెల్లించడం తోపాటు, ఉద్యోగులు ఎదుర్కుంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని ఆదిల్ షరీఫ్ విజ్ఞప్తి చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.వి.ఎస్.గాంధీ, అదనపు ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్, మహిళా కమిటీ చైర్ పర్సన్ ఎల్.మెర్సీ, జోనల్ అధ్యక్షులు వై.యాదగిరి, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

317 జీవో బాధితుల సచివాలయ ముట్టడి

ఖైరతాబాద్: స్థానికత ఆధారంగా సొంత జిల్లాలు, జోన్లకు బదిలీలు చేపట్టాలనే డిమాండ్‌తో శనివారం బాధితులు సచివాలయం ముట్టడి చేపట్టారు. 317 జీవో బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ పిలుపు మేరకు 317జీవో బాధితులు సచివాలయ ముట్టడి చేపట్టి తమకు న్యాయం చేయాలని, ముఖ్యమంత్రి వెంటనే స్పందించాలని నినాదాలు చేస్తూ సచివాలయం ముందు బైఠాయించారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చి మేనిఫెస్టోలో పెట్టిన డిమాండ్ నెరవేర్చకుండా గత ప్రభుత్వం లాగే ఈ ప్రజా ప్రభుత్వం కూడా అరెస్టులు చేయడాన్ని జేఏసీ నాయకులు ఖండించారు. సచివాలయం ముందు బైఠాయించిన వారిని పోలీసులు అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.





నైపుణ్యంతో మహిళా సాధికారత

- ఉచిత శిక్షణలో రాణిస్తున్న మహిళలు
- ఆసక్తికరంగా కళాకృతుల తయారీ
- త్వరలో ఆ వస్తువులతో ఎగ్జిబిషన్
- మహిళల ఉపాధికి స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు



శిక్షణ పొందుతున్న మహిళలు

బంజారాహిల్స్: స్వయం ఉపాధిలో మహిళలు రాణించేందుకు స్వచ్ఛంద సంస్థలు తమ తోడ్పాటును అందిస్తున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్ బస్తీలో ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఫ్యూర్ స్కిల్ డెవలప్‌మెంట్ అకాడమీ ద్వారా గడిచిన ఏడాదిగా 200 మందికి పైగా మహిళలు వివిధ వృత్తుల్లో శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందుతున్నారు. మహిళలకు, విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చే ఈ స్కిల్ డెవలప్‌మెంట్ అకాడమీలో వివిధ కోర్సులను నేర్పించడంతో పాటు వారికి సర్టిఫికెట్లను సైతం అందిస్తున్నారు. బస్తీలో ఉంటున్న మహిళలు, విద్యార్థులు ఈ అకాడమీలో చేరి ఉచితంగా కోర్సులను నేర్చుకొని వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. విద్యార్థులు సైతం క్యాండిల్ మేకింగ్, మగ్గం వర్క్స్ నేర్చుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారంటూ ఇక్కడ ట్రైనర్లు చెబుతున్నారు. కొన్ని కార్పొరేట్ కంపెనీల్లో వినియోగించే వస్తువులను త్వరలోనే ఇక్కడ శిక్షణ పొందిన వారితో తయారు చేయించి వారికి ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషిస్తున్నట్లు ఫ్యూర్ సంస్థ ఫౌండర్ శైలా తాళ్లూరి తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందే వారికి అవసరమయ్యే ప్రతి వస్తువునూ సంస్థనే అందిస్తున్నట్లు ఒక్క రూపాయి ఖర్చు కూడా లేకుండా అంతా ఉచితంగా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మహిళలు నైపుణ్యాన్ని కలిగి ఉంటే వారు ఎక్కడైనా బతికేందుకు అవకాశం ఉంటుందని మెరుగైన జీవనాన్ని వారు పొందేందుకు తాము బాసటగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఈ సంస్థకు పలు ఐటీ కంపెనీలు సైతం తమ వంతుగా కుట్టు మిషన్లు, కంప్యూటర్లను వితరణ చేస్తున్నారు.

ప్రత్యేక కోర్సులు.. ఉపాధి అవకాశాలు...

ఈ శిక్షణ కేంద్రంలో కంప్యూటర్ బేసిక్స్ కోర్సును 30 రోజుల పాటు నేర్పిస్తారు. మగ్గం వర్క్స్ కోర్సును 45 రోజుల పాటు, శారీ డ్రైక్లీనింగ్, రోలింగ్ కోర్సును 5 రోజుల పాటు, టైలరింగ్‌ను 90 రోజుల పాటు, క్యాండిల్ మేకింగ్‌లో అయిదు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్లను అందజేస్తున్నారు.

మగ్గం వర్క్ నేర్చుకుంటున్నా



వేసవి సెలవులు వృథా కాకుండా ఉండేందుకు ఈ శిక్షణ కేంద్రం గురించి తెలుసుకొని మగ్గం వర్క్స్ నేర్చుకుంటున్నా. ఇక్కడ శిక్షణ చాలా బాగుంది. మగ్గం వర్క్‌లో ఎన్నో మెళకువలు నేర్పిస్తున్నారు.
– రాజేశ్వరి, ఎన్బీటీ నగర్

మహిళల ఆసక్తి



ఇక్కడ అందించే కోర్సుల్లో శిక్షణ పొందేందుకు మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు. అన్ని కోర్సులను రూపాయి కూడా మహిళల దగ్గర తీసుకోకుండా ఉచితంగా నేర్పిస్తున్నాం. త్వరలోనే మరిన్ని కోర్సులను ఇక్కడ మహిళలకు, విద్యార్థులకు నేర్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. – కళ్యాణి, స్కిల్ కో ఆర్డినేటర్

త్వరలో ప్రదర్శన



ఫ్యూర్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలు జ్యూట్ బ్యాగులు, రకరకాల క్యాండిల్స్, వివిధ ఉత్పత్తులతో త్వరలోనే ఒక పెద్ద ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తాం. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు అవసరమయ్యే అన్ని రకాల కోర్సులను అందిస్తున్నాం. వారందరికి శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి మార్గాలను కూడా చూపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. – శైలా తళ్లూరి, ఫ్యూర్ సంస్థ వ్యవస్థాపకురాలు

అహల్యాబాయి సేవలు చిరస్మరణీయం



పారిశుధ్య కార్మికులకు చీరలను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

శ్రీనగర్‌కాలనీ: హిందూ ధార్మిక సంస్థల కార్యక్రమాల నిర్వహణ, సేవల్లో లోకమాత మహారాణి అహల్యాబాయి హోల్కర్ చిరస్మరణీయులు, ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మాల్వ సామ్రాజ్యపు మహారాణి అహల్యాబాయి హోల్కర్ త్రి శతాబ్ది జయంతి ఉత్సవాలను ఎర్రగడ్డలో బీజేపీ సెంట్రల్ జిల్లా మెడికల్‌సెల్ కన్వీనర్ డాక్టర్ ఎం.వి.గాయత్రీదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. త్రిశతాబ్ది జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం పారిశుద్ధ్య కార్మికులకు చీరలను మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, ఈశ్వరి ఫౌండేషన్ డైరెక్టర్ ఆదిత్య అందజేశారు. నేతలు కుంబాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, నాగేశ్వరరావు, గూడూరు శ్రీధర్‌రెడ్డి, ఈదులగంటి రాజేష్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

బంజారాహిల్స్: 'ఎలా నడవాలి సారూ..!' అనే శీర్షికన శనివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీసీ సమ్మయ్య స్పందించారు. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు మెయిన్ గేటు వద్ద ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వల్ల వైర్లు, కర్రలు, తాళ్లు అడ్డంగా ఉండడంతో పాదచారులు నడవడానికి సమస్యగా ఉందనే విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై స్పందించిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఫుట్‌పాత్‌లపై నిర్మించిన ఫ్లెక్సీలను పూర్తిగా తొలగించారు. పాదచారుల రాకపోకలకు అడ్డంకులు లేకుండా చేశారు.

ఐటీ రంగంలో ఐర్లాండ్‌లో మెరుగైన అవకాశాలు

టీయూఎస్ యూనివర్సిటీ ప్రతినిధులు



విద్యార్థులతో మాట్లాడుతున్న యూనివర్సిటీ ప్రతినిధులు

బంజారాహిల్స్: ఐర్లాండ్ దేశంలో ఉండే టీయూఎస్ యూనివర్సిటీలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. యాతపు కన్సల్టింగ్, ఐ20 ఫివర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో 200 మంది పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ యూనివర్సిటీ ప్రతినిధి ఇషిత మాట్లాడుతూ... యూరోపియన్ లోని ఐర్లాండ్ దేశం టెక్ హబ్ గా కొనసాగుతున్నదని, ఫార్మసూటికల్, బయో మెడికల్ డివైస్, టెక్నాలజీ ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఆ దేశంలో ఉండే ప్రముఖ యూనివర్సిటీలలో టీయూఎస్ యూనివర్సిటీ ఎంతో ప్రాధాన్యతతో కూడిన యూనివర్సిటీ అని విద్యార్థులకు తెలిపారు. అక్కడ విద్యాబోధన అనంతరం లభించే ఉపాధి అవకాశాలపై వివరించారు. అమెరికా, ఇంగ్లాండ్ దేశాలతో పోలిస్తే ఐర్లాండ్‌లో తక్కువ ఖర్చుతో నాణ్యమైన కోర్సులను నేర్చుకోవడానికి ఉన్న అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహాలను నివత్తి చేశారు. ఐ20 ఫివర్ ప్రతినిధి శ్రీనివాస్ రాజు, ఎస్తేర్, యూనివర్సిటీ ప్రతినిధులు ఇషిత, లీన్ పాల్గొన్నారు.

వేడుకగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



పూజలు చేస్తున్న కార్పొరేటర్ దంపతులు

వెంగళరావునగర్: వెంగళరావునగర్‌కాలనీలోని శ్రీరాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో సీతారామలక్ష్మణుల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టలో భాగంగా ఆలయంలో తెల్లవారుజాము నుంచి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ దేదీప్య విజయ్ మాట్లాడుతూ... భద్రాచలంలో ఉన్న స్వామివారి దంపతులను నిజంగా ఇక్కడ చూస్తున్నామని, ఆయన కరుణ, కటాక్షాలు ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగరావు మాట్లాడుతూ... భద్రాచలంలోని స్వామివారి విగ్రహాల సైజులతో పాటు అదేరీతిలో ప్రత్యేకంగా తయారు చేయించి ఇక్కడ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, నర్సింగరావు, ఆంజనేయులు యాదవ్, సత్యానారాయణ, పూజారి బాలు, శ్రీకాంత్, బాలు రజక, దేవేందర్‌సింగ్, వెంగళ రావునగర్ కాలనీ నేతలు, భక్తులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థి అదృశ్యం



మహ్మద్ మొయినుద్దీన్

బంజారాహిల్స్: డిగ్రీలో తక్కువ మార్కులు వచ్చాయనే మనస్తాపడంతో ఓ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జూబ్లీహిల్స్ గాయత్రీహిల్స్ రోడ్డునెంబర్–10సీలో ఎం.డి.ఇక్బాలుద్దీన్.. భార్య, ముగ్గురు కుమారులతో కలిసి ఉంటున్నాడు. పెద్ద కుమారుడు మహ్మద్ మొయినుద్దీన్(23) యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ సమీపంలోని పెయింట్ మేరీ కళాశాలలో చదివి ఇటీవల డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు కూడా రాశాడు. ఈ నెల 29న డిగ్రీ ఫలితాలు వెలువడ్డాయి. ఆ ఆవిషయం ఇంట్లో ఎవరికీ చెప్పలేదు. స్నేహితుడిని కలిసేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన మహ్మద్ మొయినుద్దీన్ ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే మార్కులు తక్కువగా వచ్చాయనే మనస్తాపంతో ఇంటి నుంచి వెళ్లిపోయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

ఆనందంగా ఉంది: సుధారెడ్డి



బంజారాహిల్స్: మిస్ వరల్డ్ 2025 పోటీలకు తనను మిస్ గ్లోబల్ అంబాసిడర్‌గా నియమించడం ఆనందంగా ఉందని ప్రముఖ వ్యాపార వేత్త సుధారెడ్డి అన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు తనను గ్లోబల్ అంబాసిడర్‌గా ప్రకటించిన నేపథ్యంలో ఆమె 'సాక్షి' తన ఆనందాన్ని పంచుకున్నారు. బ్యూటీ విత్ పర్పస్ దాతృత్వ సంస్థకు ప్రతినిధిగా వ్యవహరించడంతో పాటు తనకు గ్లోబల్ అంబాసిడర్‌గా గౌరవించడాన్ని బాధ్యతగా భావిస్తానని అన్నారు. గ్రాండ్ ఫినాలేలో అంతర్జాతీయ న్యాయ నిర్ణేతల కమిటీలో కూడా తనను సభ్యురాలిగా చేర్చడం గర్వంగా ఉందన్నారు. మహిళలు, పిల్లలు తమ పూర్తి సామర్థ్యాన్ని సాధించేందుకు ప్రేరణనివ్వాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. మిస్ వరల్డ్ సంస్థ చైర్‌పర్సన్, వ్యవస్థాపకురాలు జూలియో మర్లీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌కు చెక్ పెట్టండి



వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీకి వినతిపత్రమిస్తున్న కాలనీ సభ్యులు

బంజారాహిల్స్: ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు అక్రమ పార్కింగ్‌ను నిరోధించాలంటూ కమలాపురికాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కాలనీ మెయిన్ పార్కు ప్రవేశ ద్వారం వద్ద ఫుట్‌పాత్‌లపై నిర్మించిన షాపులు, అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలని కోరారు. కమలాపురికాలనీ ప్రధాన రహదారిలో రోడ్డును ఆక్రమించి వివిధ రకాల వ్యాపారాలు కొనసాగుతున్నాయని, వీటిని తొలగించాలన్నారు. అలాగే పలు వరుసల్లో వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేయడం కారణంగా రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. అక్రమ పార్కింగ్ కారణంగా న్యూసెన్స్‌తో పాటు అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని ఏసీపీ దృష్టికి తీసుకువచ్చారు. 80 ఫీట్ల రోడ్డును డీమార్కింగ్ చేసి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రీన్ బావర్చి హోటల్ పక్క రోడ్డులో సైతం అక్రమ పార్కింగ్‌తో పాటు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి 60 ఫీట్ల రోడ్డును క్లియర్ చేయాల్సిందిగా కోరారు. ఈ రోడ్డులో రాత్రయ్యిందంటే మహిళలు వెళ్లాలంటే భయపడే పరిస్థితులు ఉన్నాయన్నారు. సాగర్ సొసైటీ, కమలాపురికాలనీ జంక్షన్లలోని సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఏజీకే గోఖలే, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దొంగను పట్టించిన యువకుడికి డీసీపీ అభినందన



ఖలీం అలీని ప్రశంసిస్తున్న వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్

బంజారాహిల్స్: తన ఇంటికి దొంగతనానికి వచ్చిన నిందితుడిని డయల్ 100 చేసి క్షణాల్లో పోలీసులను పిలిపించి దొంగను పట్టుకోవడంలో చాకచాక్యాన్ని ప్రదర్శించిన యువకుడిని వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్ కుమార్ అభినందించారు. వివరాలివీ... బంజారాహిల్స్‌లో నివసించే షేక్ హమీద్ రెండు రోజుల క్రితం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–11లోని గురుబ్రహ్మనగర్‌లో ఓ యాక్టివా బైక్‌ను దొంగిలించాడు. దానిపై నందినగర్‌కు వచ్చి ఓ ల్యాప్‌ట్యాప్‌ను దొంగిలించాడు. అలాగే ఇంకొంత ముందుకువెళ్లి వెంకటేశ్వరనగర్‌లో ఓ ఇత్తడి బిందెను, బక్కెట్‌ను తొలగించి బైక్‌పై తీసుకుని గురుబ్రహ్మనగర్‌లోని తన ఇంటిపై పెట్టాడు. అదే బైక్‌పై దొంగతనానికి బయలుదేరి సమీపంలోని ఓ ఇంట్లో మళ్లీ దొంగతనానికి రాగా ఆ ఇంటి యజమాని ఖలీం అలీ (37) రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడమే కాకుండా డయల్ 100కు ఫోన్ చేశాడు. క్షణాల్లో పోలీసులు వచ్చి నిందితుడిని పట్టుకుని విచారించగా బైక్ దొంగిలించిన విషయంతో పాటు ఆ తర్వాత చేసిన చోరీల వివరాలను వెల్లడించారు. దొంగను పట్టుకోవడంలో నేర్పరితనం చూపిన ఖలీం అలీని వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో తన వంతు బాధ్యతను నిర్వర్తించినందుకు మిగతా వారికి స్ఫూర్తిగా నిలుస్తారన్నారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్ల అప్పగింత



ఏసీపీలో సెల్‌ఫోన్లు అందుకున్న బాధితులు

పంజగుట్ట: పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న వారికి 13 సెల్‌ఫోన్‌లు రికవరీ చేసి తిరిగి వారికి శనివారం అందించారు. పంజగుట్ట ఏసీపీ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ శోభన్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌లు 13 మందికి వారి సెల్‌ఫోన్‌లు తిరిగి అందించారు. సీఈఆర్‌ఐ పోర్టల్ టెక్నాలజీ ద్వారా పోయిన సెల్‌ఫోన్‌లు గుర్తించామని ఏసీపీ మురళీ కృష్ణ తెలిపారు. బాధితులు ఎవరైనా వారి సెల్‌ఫోన్ పోతే స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫోనే కదా అని ఫిర్యాదు చెయ్యకుండా ఉంటే దొరికిన వ్యక్తి అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తే ఇబ్బందులకు గురతారని పేర్కొన్నారు. పోలీసులు సకాలంలో స్పందించి తాము పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను తిరిగి తమకు అప్పగించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

'హిల్స్' రోడ్లపై గుంతలతో పరేషాన్



బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12 ప్రధాన రహదారిలో గుంతలమయమైన రోడ్డు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని రహదారులు గుంతలతో వాహనదారులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి. గడిచిన నాలుగు వారాల నుంచి ప్రధాన, అంతర్గత రహదారులతో పాటు బస్తీలు, కాలనీల్లో కూడా రోడ్ల తవ్వకాలతో వాహనదారులతో పాటు పాదచారులూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇష్టానుసారంగా రోడ్లు తవ్వుతుండడంతో ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు నిలిచిపోయి పాదచారులు, వాహనదారులకు తెలియకుండాపోతున్నది. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బైక్‌లు స్కిడ్ అవుతున్నాయి.

- అడుగడుగునా తవ్వకాలతో వాహనదారుల నడ్డి విరుగుతోంది. గోతులు ఎవరు తీస్తున్నారో, గుంతలు ఎందుకు తవ్వుతున్నారో జీహెచ్‌ఎంసీ ఇంజనీర్లు అక్కడ బ్యానర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సంబంధిత సంస్థలు తాము చేస్తున్న పని గురించి అక్కడ బ్యానర్లు ఏర్పాటుచేయాలి. ఎవరు పనులు చేస్తున్నారో కూడా తెలియని స్థితిలో రోడ్లకు అడ్డంగా, నిలువుగా ఈ తవ్వకాలు చోటుచేసుకుంటున్నాయి.
- జీహెచ్‌ఎంసీ ఇంజనీర్ల నిర్వాకంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత వారం రోజుల నుంచి బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు నిత్యం వస్తున్నారు. ఆయన రాకపోకలు సాగించే దారిలో కూడా ఈ గోతులు నరకాన్ని చూపిస్తుండగా జీహెచ్‌ఎంసీ పట్టించుకోవడం లేదు. జీహెచ్‌ఎంసీ పనితీరుపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.
- అసలు జీహెచ్‌ఎంసీ అనే ఒక శాఖ ఉందా? అని ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కవుతుండడంతో అడ్డదిడ్డంగా రోడ్ల తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- జీహెచ్‌ఎంసీ సర్కిల్ పరిధిలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో ఏళ్ల తరబడి అసిస్టెంట్ ఇంజనీర్లు ఇక్కడే పాతుకుపోయారు. ఎవరూ వీరిని కదపడం లేదు. వీరిపై చర్యలు తీసుకోవాలనుకుంటే, బదిలీ చేయాలనుకుంటే కొంతమంది పెద్దలు అడ్డువస్తుండడంతో జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో ఏఈలు, అరాచకాలు, అవినీతి, అక్రమాలకు అడ్డులేకుండా పోతోంది.
- ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు అందినకాడికి దండుకుంటున్నారు. అడుగడుగునా అవినీతి రాజ్యమేలుతోంది. ఏసీబీ ప్రధాన కార్యాలయం ఉన్న బంజారాహిల్స్ పరిధిలోనే జీహెచ్‌ఎంసీ పనితీరు అధ్వాన్నంగా ఉందని, ఇప్పటికైనా ఏసీబీ అధికారులు స్పందించి ఇక్కడి ఇంజనీర్లపై దృష్టిపెట్టాలని, నిఘా ఉంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే అభివృద్ధి అటకెక్కుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- పరిస్థితి బాగుండాలంటే, అభివృద్ధి జరగాలంటే, అడ్డదిడ్డంగా రోడ్లు కట్ చేయకుండా ఉండాలంటే జీహెచ్‌ఎంసీ ఇంజనీర్లను అదుపులో పెట్టాల్సిన అవసరం ఉందని, వీరి నిర్వాకం వల్లనే అడుగడుగునా రోడ్లు గుంతలు తేలుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంకోవైపు జీహెచ్‌ఎంసీలో ఉండే విజిలెన్స్ వింగ్ ఏమి చేస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. వీరు ఏనాడూ రోడ్డెక్కకుండా, తనిఖీలు చేయకుండా గాలికి వదిలేయడంతో రోడ్లన్నీ అధ్వానంగా మారుతున్నాయి.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

సాక్షి సిటీ బ్యూరో: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో ఈ నెల 3 నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. సదస్సులపై డీఆర్‌ఓలతో కలిసి అదనపు కలెక్టర్ అవగాహన కల్పించారు. రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి అవసరమైన సలహాలు, సూచనలను అందించారు. శనివారం కలెక్టరేట్ నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకరోజు ముందుగానే సదస్సుల గురించి ఆయా గ్రామాల ప్రజలకు తెలియజేయాలని, వారి అర్జీల తోపాటు సంబంధిత డాక్యుమెంట్ల కాపీలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించాలన్నారు. ఏ విధమైన అర్జీ అనే అంశాన్ని ఫారాల్లోని నిర్దేశిత కాలమ్‌లో నమోదు చేయాలన్నారు. సర్వే నంబర్లను, భూవిస్తీర్ణం, ఏ విధంగా సంక్రమించింది అనే భూ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణలో ఏవైన సందేహాలుంటే ఆర్డీఓలను సంప్రదించాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యాంప్రకాష్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

హీరా గ్రూప్ ఆస్తులు కొనొద్దు

పంజగుట్ట: అనేక మంది నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసగించిన నౌహీరా షేక్‌కు చెందిన 126 ఆస్తులను ఈడీ అటాచ్ చేసిందని, వాటిని ఇతరులకు విక్రయించేందుకు ఆమె యత్నిస్తోందని, వాటిని ఎవరూ కొనుగోలు చేయవద్దని ఆల్ ఇండియా హీరా గ్రూప్ ఇన్వెస్టర్స్ యాక్షన్ కమిటీ ప్రతినిధి ఫర్హాన్ రషీద్ అన్నారు. లక్షా 72 వేల మంది నుంచి 5,600 కోట్ల రూపాయల మేర వసూలు చేసిన నౌహీరాకు బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మందిని మోసం చేసిన నౌహీరాను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేయడం సంతోషకరమన్నారు. ఆమెపై ఇప్పటికే 37 వారెంట్లు, 17 చెక్‌బౌన్స్ కేసులు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో అంతుల్ మాలిక్, ఎం.డి.అక్తర్ పాల్గొన్నారు.

పాలస్తీనీయులకు సాయం అందించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

హిమాయత్‌నగర్: పాలస్తీనా ప్రజలకు ఆహారం, మెడిసిన్, దుస్తులు భారత్ అందించి ఆదుకోవాలని, భారత్‌తోపాటు అన్ని దేశాలు, యూఎన్‌వో స్పందించి అండగా నిలవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో పీపుల్స్ సాలిడారిటీ ఫర్ పాలస్తీనా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం, సీపీఐ మాజీ ఎంపీ అజీజ్ పాషా, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడారు. పాలస్తీనాలో శాంతి నెలకొల్పడానికి భారత్‌తోపాటు అన్ని దేశాలు, యూఎన్‌వో స్పందించాలని కోరారు. గాజాపై ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపిస్తూ అమాయక ప్రజల ప్రాణాలను పొట్టనబెట్టుకుందని, వెంటనే శాశ్వత కాల్పుల విరమణ ప్రకటించి పాలస్తీనీయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పాలస్తీనాను ఆక్రమించుకోవడానికి అమెరికా కుట్ర చేస్తోందని, ప్రజలు దీనిని తిప్పికొట్టాలన్నారు. తాము పాలస్తీనీయులకు పూర్తి సంఘీభావం తెలుపుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నేతలు ఉమర్ అహ్మద్ హఫీజ్, అబ్బాస్, సారా మాథ్యూస్ పాల్గొన్నారు.

నగరంలో నేడు

- ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ దక్కన్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు సూత్ర ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవులు సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఆలిండియా ఆర్ట్ కాంపిటీషన్ ఎగ్జిబిషన్ ప్రారంభం.
- నారాయణగూడలోని తాజ్‌మహల్ హోటల్‌లో ఉదయం 11.45 గంటలకు సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక, సారస్వత సంఘం ఆధ్వర్యంలో కాజులూరి ధర్మారావు దంపతుల స్వర్ణోత్సవ వివాహ వేడుక జరుగుతుంది. ఈ సందర్భంగా సాంస్కృతిక, సినీ ప్రముఖులకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.
- మిత్ర క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఎస్‌ఎం బాషా దర్శకత్వం వహించిన మట్టి మనిషి నాటక ప్రదర్శన శేరిలింగంపల్లి జోనల్ మున్సిపల్ ఆఫీస్‌లో సాయంత్రం 6.30గంటలకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

షెడ్డు కిందే బోధన..
రోడ్డుపైనే ప్రార్థన

సమస్యల వలయంలో బాచుపల్లి ప్రభుత్వ పాఠశాల

- రోడ్డు విస్తరణలో ఆటస్థలం, టాయిలెట్లు మాయం
- ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని టీచర్లు, స్థానికుల డిమాండ్
- ఏడేళ్లుగా విన్నవించుకుంటున్నా పట్టించుకోని అధికారులు



రోడ్డుపైనే ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

నిజాంపేట్: విద్యార్థుల సంఖ్య 800పైనే. వేధిస్తున్న తరగతి గదుల కొరత.. కానరాని ఆటస్థలం టాయిలెట్లు.. రేకుల షెడ్డు కిందే బోధన.. రోడ్డుపైనే ప్రార్థన.. ఇదీ బాచుపల్లి మండల కేంద్రంలోని రెండు ప్రభుత్వ పాఠశాలల దుస్థితి. మియాపూర్ నుంచి గండి మైసమ్మ వరకు రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ నిర్మాణంలో ఆ పాఠశాల స్థలం, ప్రైమరీ స్కూల్ టాయిలెట్స్ పూర్తిగా పోయాయి. దీంతో వరండాలు, రేకుల షెడ్డు కింద కొన్ని తరగతి గదులు నిర్వహిస్తున్నారు. అయితే ఆ పాఠశాలలకు పక్కనే ప్రభుత్వానికి చెందిన ఎకరం స్థలం ఉంది. ఈ భూమిని కేటాయిస్తే సరిపడా తరగతి గదులు నిర్మించుకోవచ్చని, ఆటస్థలం ఏర్పాటు చేసుకోవచ్చని భావించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు 2018 నుంచి అధికారులకు విన్నవిస్తున్నారు. అయితే స్థలం కేటాయింపుపై అధికారులు ఎటూ తేల్చడంలేదు. పాఠశాల పక్కన ఉన్న స్థలంలో ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంపులు నిర్మించుకోవడం కోసం గతంలో జలమండలికి అధికారులు కేటాయించారు. కానీ, ఇప్పటికీ అక్కడ కొత్తగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. అయితే బాచుపల్లి మండలంలో కావాల్సినంత ప్రభుత్వ భూమి ఉందని, మరోచోట జలమండలి స్థలం కేటాయించి, ఈ స్థలాన్ని పాఠశాలకు అప్పగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేసి 20 గుంటల స్థలం అందుబాటులో ఉందని నివేదించారు. అందులో అదనపు గదులు నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు.

రీ సర్వే కోసం జలమండలి లేఖ

పాఠశాల పక్కనున్న స్థలాన్ని రీ సర్వే చేయాలని జిల్లా కలెక్టర్‌కు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఇటీవల లేఖ రాయడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఈ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ వంటి సౌకర్యాలు ఉన్నా వాటికి అనుగుణంగా అదనపు గదులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సరిపడా స్థలం లేక ప్రతీ రోజు పాఠశాల ముందున్న రోడ్డుపైనే విద్యార్థులు ఉదయం ప్రార్థన నిర్వహిస్తున్నారు.

జలమండలికి వేరేచోట స్థలం కేటాయించండి..



జలమండలి మరోచోట స్థలం కేటాయించాలి. పక్కనే ఉన్న స్థలాన్ని ప్రభుత్వ పాఠశాలకు కేటాయిస్తే సీఎస్ఆర్ కింద వర్ల్యాస్ మల్టీనేషనల్ కంపెనీ 16 గదులు, మరుగుదొడ్లు, కంప్యూటర్ ల్యాబ్ నిర్మాణానికి రూ.5 కోట్లు ఇచ్చేందుకు సుముఖంగా ఉంది. ఎస్‌డీఎఫ్ నుంచి రూ. 20 లక్షలు, పీఎంశ్రీ లైబ్రరీ నుంచి రూ.19 లక్షలు, సైన్స్ ల్యాబ్ నుంచి రూ.14 లక్షలు నిధులు బాచుపల్లి పాఠశాల అభివృద్ధి కోసం సిద్ధంగా ఉన్నాయి.

– క్యాతం రాధ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్

వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

ఇందిరాపార్కు వద్ద తెలంగాణ, ఏపీ జేఏసీల భారీ నిరసన



ఇందిరాపార్కు వద్ద జరిగిన నిరసనలో అభివాదం చేస్తున్న మైనార్టీ నేతలు, వీహెచ్

కవాడిగూడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం 2025ను రద్దు చేయాలని, దీని వల్ల వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని పలువురు వక్తలు అన్నారు. ఈ మేరకు శనివారం ఇందిరాపార్కు వద్ద తెలంగాణ, ఏపీ జాయింట్ యాక్షన్ కమిటీలతోపాటు పలు ముస్లిం, ప్రజా సంఘాలు 'చలో ధర్నాచౌక్'పేరిట తెలంగాణ మార్చ్, భారీ బహిరంగ సభ నిర్వహించాయి. ఈ సభకు జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మహ్మద్ ముస్తాక్ మాలిక్, ఎంబీటీ అధ్యక్షుడు మాజిదుల్లాఖాన్ పరహత్, కాంగ్రెస్ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, అజీజ్ పాషా, కాంగ్రెస్ నేత ఓసామా మహ్మద్, ఎంపీజే నేత మహ్మద్ అజీజ్, బీఆర్ఎస్ నేత రహముల్లా నియాజీ, ఆమ్ ఆద్మీ పార్టీ నేత మాజిద్ ఖాన్, వివిధ పార్టీల నేతలు సోహెల్, షరీఫ్, షకీల్ మాట్లాడారు. వక్ఫ్ చట్టాన్ని సవరించి కార్పొరేట్ శక్తులకు లక్షలాది ఎకరాల భూములను కట్టబెట్టడానికి మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. వక్ఫ్ చట్ట సవరణ తరువాత కుట్రపూరితంగా ముస్లింయేతరులను కూడా వక్ఫ్‌బోర్డు సభ్యులుగా చేరుస్తున్నారని ఆరోపించారు. గతంలో వక్ఫ్ స్థలాలను ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు ఉండేవని, ఇప్పుడు వారికి చట్టబద్ధమైన హక్కులను కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును దేశ ప్రజలందరూ గమనిస్తున్నారని, ఐకమత్యంగా ఉన్న హిందూ, ముస్లింల మధ్య గొడవలు తీసుకువచ్చేందుకు చట్టాలు చేస్తున్నారని ఆరోపించారు.

గైనకాలజికల్ ఆంకాలజీపై లైవ్ ఆపరేటివ్ వర్క్‌షాప్



గైనకాలజికల్ ఆంకాలజీపై లైవ్ ఆపరేటివ్ వర్క్‌షాపులో సర్జికల్ ఆంకాలజిస్టులు

బంజారాహిల్స్: బసవతారకం ఇండో–అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రజితోత్సవాల్లో భాగంగా రెండు రోజులపాటు జరిగే గైనకాలజికల్ ఆంకాలజీపై లైవ్ ఆపరేటివ్ వర్క్‌షాపు శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి.ఎస్.రావు మాట్లాడుతూ వైద్యులు అనుభవాలను పంచుకోవడం ద్వారా రోగులకు మంచి చికిత్స అందించగలుగుతారని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా వైద్యులు కొత్త మెళవకులు తెలుసుకోవడమే కాకుండా ఆధునిక చికిత్సా పద్ధతులను అర్థం చేసుకోవడానికి, నేర్చుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. ముఖ్యంగా యువ వైద్యులు అనుభవం గడించిన వైద్యుల ద్వారా అవగాహన పెంచుకోవడానికి వీలవుతుందన్నారు. వర్క్‌షాపులో గైనకాలజికల్ ఆంకాలజీకి సంబంధించిన శస్త్రచికిత్సలను సర్జికల్ ఆంకాలజిస్ట్ ఆర్.రాజగోపాలన్ నేతృత్వంలో సర్జికల్ ఆంకాలజిస్టులు సుజిత్ పట్నాయక్, రాహుల్ సూరపనేని, సృజన్ సందేశ్ శుక్లా, జేబా ఉసేఫి బృందం చేస్తున్న శస్త్ర చికిత్సను నేరుగా ఆపరేషన్ థియేటర్ నుంచి ప్రత్యక్షంగా చూపించి వివరించింది. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ఫణి కోటేశ్వరరావు, అకడమిక్ అసోసియేట్ డైరెక్టర్ కల్పనా రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

తూంకుంటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



జేసీబీలతో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న హైడ్రా అధికారులు

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై శనివారం హైడ్రా కొరఢా ఝుళిపించింది. అక్రమ నిర్మాణాల కూల్చివేతలతోపాటు చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న హైడ్రా తూంకుంట మున్సిపాలిటీలో పరిధిలోని నార్త్ పార్క్ అవెన్యూ వెంచర్‌లో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది. ఫ్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన హైడ్రా 30 ఫీట్ల రోడ్డు, పార్క్ స్థలంలో అక్రమ నిర్మాణాలు, 4 ప్లాట్లలో అక్రమంగా ప్రహరీల నిర్మాణాలను జేసీబీల సాయంతో తొలగించింది. ఈ సందర్భంగా హైడ్రా ఇన్‌స్పెక్టర్ నరేశ్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులతో కలిసి తెల్లవారుజాము నుంచే పోలీస్ బందోబస్తు నిర్వహించింది. పార్కు స్థలం కబ్జా, అక్రమ నిర్మాణాలపై గతంలో నోటీసులు ఇచ్చినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

హెచ్‌సీయూ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

అన్ని రకాల పీజీ కోర్సుల దరఖాస్తు గడువు జూన్ 9

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 2025–26 విద్యాసంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అన్ని రకాల పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులకు జూన్ 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి. సీయూఈటీ(పీజీ)–2025 ప్రవేశ పరీక్షలో చాటిన ప్రతిభ ఆధారంగా అడ్మిషన్లను కల్పిస్తారు. ఎంపీఏ(డ్యాన్స్), ఎంపీఏ(మ్యూజిక్), ఎంఎఫ్ఏ/ఎంపీఏ పేయింటింగ్/ప్రింట్‌మేకింగ్/స్కల్పచర్/ ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్, ఎంబీఏ హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్/బిజినెస్ ఎనలైటిక్స్, ఎంపీఏ థియేటర్ ఆర్ట్స్ అండ్ ఎంఎస్సీ న్యూరల్ అండ్ కాగ్నిటివ్ సైన్స్ కోర్సుల దరఖాస్తు గడువు కూడా జూన్ 9 తేదీ. వీటికి సీయూఈటీ(పీజీ)–2025, ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్లు కల్పిస్తారు. ఎంటెక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ టెక్నాలజీ(ఐసీటీ) అండ్ ఎంటెక్ మైక్రోఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్(ఎంవీఎల్ఎస్ఐ) కోసం దరఖాస్తులను జూన్ 30వ తేదీ వరకు చేసుకోవచ్చని, వీటిలో అడ్మిషన్లను జీఏటీఈలో సాధించిన స్కోర్ ఆధారంగా కల్పిస్తామని అధికారులు తెలిపారు. ఎంటెక్ కంప్యూటర్ సైన్స్, ఎంటెక్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎంటెక్ బయోఇన్ఫర్మేటిక్స్ కోర్సులకు సీసీఎంటీ షెడ్యూల్ ప్రకారం కల్పిస్తారు. ఇందుకోసం సీసీఎంటీ–2025 కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్లు అందిస్తారు. ఇతర అన్ని వివరాలకు హెచ్‌సీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. ఈ అవకాశాన్ని అర్హతలు కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌సీయూ అధికారులు కోరారు.

మాన్‌సూన్ పోలీస్

– వర్షాకాలం నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ పోలీసులు వర్షాకాలంలో ప్రమాదాల నివారణకు సన్నద్ధమయ్యారు. కమిషనరేట్ పరిధిలోని రహదారులపై నీరు నిల్వకుండా, ప్రమాదాలు జరగకుండా సత్వర చర్యలు తీసుకునేందుకు ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావు భూపాల్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో వర్షాకాలంలో రవాణా సమస్యలు, ట్రాఫిక్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై హెచ్ఎండీఏ, ఇతర విభాగాల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించడంతో పాటు అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు, పాదచారుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఓఆర్ఆర్‌లో ప్రధాన ట్రాఫిక్ బాటిల్‌నెక్ ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రాంతాల పరిశీలనకు ఆదేశాలిచ్చారు. పాదచారులు, ద్విచక్ర వాహన డ్రైవర్ల రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక సర్వీస్ రోడ్లను, ప్రత్యేక పాదచారి మార్గాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఔటర్‌లో ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. ట్రాఫిక్ సమస్యకు కారణమయ్యే డ్రైనేజ్ పనులు, రోడ్డు మరమ్మతులను తక్షణమే పూర్తిచేయాలని ఆదేశించారు.

ప్రభుత్వం దృష్టికి ఉద్యమకారుల ఆకాంక్షలు



గన్‌పార్కు వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యమకారులు

నాంపల్లి: ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘాలు శనివారం గన్‌పార్కు వద్ద ఆందోళన చేశాయి. రాష్ట్రం కోసం అమరులైన కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఉద్యమంలో పాల్గొన్న కుటుంబాలకు 250 గజాల ఇళ్ల స్థలం, రూ.30 వేల గౌరవ వేతనం ఇస్తామన్న హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, త్వరలోనే సానుకూల ప్రకటన వెలువడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రపుల్ రాంరెడ్డి, తెలంగాణ ఆకాంక్షల వేదిక కన్వీనర్ కుమార స్వామి, రామగిరి ప్రకాష్, చంద్రన్న ప్రసాద్, అంజిరెడ్డి, పెద్ద యాదగిరి, నగేష్, ధనలక్ష్మి, అంజలి, సుజి స్వరూపరాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



అమీర్‌పేట ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ అనుదీప్

అమీర్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభం నాటికి చేపట్టవలసిన మరమ్మతు పనులను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే సదుపాయాలపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడిబాటలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన అందించాలని సూచించారు. పాఠశాలలో ఉన్న భవిత కేంద్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నందున పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించలేకపోతున్నారని మదర్స్ కమిటీ చైర్‌పర్సన్ కలెక్టర్ దృష్టికి తేగా ఈ రూట్‌లో బస్సు సదుపాయాన్ని పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ ఆశీర్వాదం, తహసీల్దార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ డాక్టర్ శాంత రాథోడ్, హెచ్‌ఎంలు సుధారాణి, అనిల, మదర్స్ కమిటీ చైర్మన్ రోజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ సప్లిమెంటరీకి పకడ్బందీ ఏర్పాట్లు

3 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు

లక్డీకాపూల్: ఈ నెల 3 నుండి 13వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటచారి అధికారులకు ఆదేశించారు. శనివారం హైదరాబాద్ కలెక్టరేట్‌లోని ఎస్ఎస్‌సీ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ పరీక్షలకు 32 సెంటర్లు ఏర్పాటు చేయగా.. 10,572 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. పరీక్షా కేంద్రాలపై నిఘా, రూట్ ఆఫీసర్ వాహనాలకు ఎస్కార్ట్ ఏర్పాటు చేయడంతోపాటు పరీక్షా కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ అమలు చేయాలని, సమీపంలోని జిరాక్స్ దుకాణాలను మూసి వేయించాలని పోలీసు శాఖకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సామగ్రి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉంచాలని, టీజీఎస్పీడీసీఎల్ నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, విద్యార్థుల రాకపోకల కోసం టీజీఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు డిప్యూటీ కమిషనర్లు (ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్) ఎన్.భాస్కర్, రాందాస్ తేజావత్, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ జహంగీర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగాన్ని పూర్తిగా నివారించాలి



పొగాకు వ్యతిరేక కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: పొగాకు వినియోగం ప్రత్యక్షంగా 23 రకాల కేన్సర్లకు, పరోక్షంగా 13 రకాల కేన్సర్లకు కారణం అవుతుందని నిమ్స్ ఆస్పత్రి నెఫ్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీభూషణ్ రాజు అన్నారు. డాక్టర్ ఓ.నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన పొగాకు వ్యతిరేక నెల ముగింపు కార్యక్రమం శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. డాక్టర్ శ్రీభూషణ్ రాజు మాట్లాడుతూ మనిషి అలవర్చుకున్న దురలవాట్లల్లో పొగాకు చాలా ప్రమాదకరమని, దీనిద్వారా రక్తనాళాలకు తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ దీపిక మాట్లాడుతూ హుక్కా రూపంలో పొగాకు తీసుకోవడం యువతకు ఫ్యాషన్ అయిపోయిందని విచారం వ్యక్తం చేశారు. టీఎస్ఆర్టీసీ ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ చిట్టిబాబు, సినీ సంగీత దర్శకుడు బల్లెపల్లి మోహన్, దైవజ్ఞశర్మ మాట్లాడుతూ డాక్టర్ ఓ.నాగేశ్వరరావు సొంతంగా డబ్బులు ఖర్చుపెట్టుకుని 45 ఏళ్లుగా పొగాకు వ్యతిరేక ఉద్యమం నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సుదీర్ఘకాలం గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో దంత వైద్యుడిగా పనిచేశానని, ఎంతోమంది పొగాకు వల్ల ప్రాణం మీదికి తెచ్చుకోవడం చూసి దీన్ని పూర్తిగా రూపుమాపాలని ఈ కార్యక్రమాన్ని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కుసుమ భోగరాజు, భీంరావు పాల్గొన్నారు.

వైద్యుల వేతన స్కేల్ మా పరిధిలో లేదు..

ఎన్ఎంసీ ఛైర్మన్ గంగాధర్



సాక్షి, సిటీబ్యూరో: వైద్యుల వేతన స్కేల్ అనేది రాష్ట్రాల పరిధిలో ఉంటుందని జాతీయ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) ఛైర్మన్ గంగాధర్ అన్నారు. ఉస్మానియా కళాశాలలో శనివారం ఉస్మానియా, గాంధీ మెడికల్ కళాశాలల అధ్యాపకులు, పీజీ విద్యార్థులతో ఇంటరాక్షన్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ కాన్ఫరెన్సుల ఖర్చులు అధికం కావడంతో అధ్యాపకులపై భారం పడుతోందని, క్రెడిట్ పాయింట్లలో సడలింపు ఇవ్వాలన్నారు. సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో ప్రభుత్వసేవల్లో ఉన్నవారికి కోటా కేటాయించాలని కోరారు. డెర్మటాలజీలో నకిలీ వైద్యు లను నియంత్రించాలన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ప్రొఫెసర్ విద్యార్థి సగటును 1:3కి పెంచాలని సూచించారు. కమ్యూనిటీ మెడిసిన్ శాఖ పేరును మార్చాలని వైద్యులు కోరారు. ఆయా అంశాలకు ఎన్ఎంసీ ఛైర్మన్ గంగాధర్ సానుకూలంగా స్పందించారు.

వర్క్ లోడ్ అధికంగా ఉంది...

పలువురు జూనియర్ వైద్యులు మాట్లాడుతూ పీజీ విద్యార్థులకు డ్యూటీ టైమింగ్స్, వర్క్ లోడ్ అధికంగా ఉందని వాపోయారు. మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కమిషన్ దృష్టికి తెచ్చారు. సెలవులు వాడుకునే వీలులేకుండా పోతోందన్నారు. ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల తీరుపైనా ఫిర్యాదు చేశారు. రికార్డుల్లో స్టైపండ్ ఇస్తున్నట్లు చూపిస్తున్నా వాస్తవం అందుకు భిన్నంగా ఉందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో సుమారు 50 శాతం ఫ్యాకల్టీ లేకపోవడం వల్ల బోధనాపరంగా ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. గంగాధర్ మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు వర్క్‌షాప్ నిర్వహించాలని, కౌన్సెలింగ్ సెషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో గాంధీ, ఉస్మానియా మెడికల్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఇందిరా, రాజారావు, నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.విజయ్ కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

'ఏరోనాటికల్' ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి




సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.డి. ప్రసాద్

పంజగుట్ట: హిందుస్తాన్ ఏరోనాటికల్స్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌లో అనర్హులైన సభ్యులను తొలగించి, అర్హులైన వారిని చేర్చి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని సొసైటీ కన్వీనర్ కె.కె.డి. ప్రసాద్ కోరారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సభ్యులతో కలిసి ఆయన మాట్లాడుతూ తమ సొసైటీ 1980లో నమోదైందని, 1982 వరకు సభ్యత్వాలు తీసుకున్నామని తెలిపారు. 2016లో ఎన్నికలు జరగగా 2020లో తమ కార్యవర్గాన్ని కొన్ని తప్పులు చూపిస్తూ కో ఆపరేటీవ్ ట్రిబ్యునల్ రద్దు చేసిందన్నారు. కో ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ విపరీతంగా జోక్యం చేసుకుని సొసైటీలో సభ్యులుగా ఉండి చనిపోయిన వారి కుటుంబ సభ్యులను తాము 56 మందికి లీగలేయిర్స్‌గా సొసైటీలో చేర్చాలని చెపితే వారిని చేర్చకుండా సొసైటీకి సంబంధం లేని వ్యక్తులను 26 మందిని చేరుస్తామని అంటున్నారని ఆగ్రహంవ్యక్తం చేశారు. అంతే కాకుండా వారిని 26 మందిని సొసైటీలో చేర్చి జూన్ 12వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తామని అంటున్నారని ఇది సరికాదన్నారు. సొసైటీకి సంబంధం లేని వారిని పక్కకు పెట్టి మరణించిన వారి కుటుంబ సభ్యులను 56 మందిని చేర్చి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రఘునందన్ పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

పనులెందుకు ప్రారంభించలేదు?

ఫాక్స్‌సాగర్ ప్రాంతంలో అధికారులను ప్రశ్నించిన బల్దియా కమిషనర్



అధికారులతో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్

జీడిమెట్ల: స్టీల్ బ్రిడ్జ్, సురక్ష ఆస్పత్రి–రాంరెడ్డి నగర్ వంద ఫీట్ల రోడ్డు పనులు ఎందుకు ప్రారంభించలేదని బల్దియా కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ప్రశ్నించారు. శనివారం ఫాక్స్‌సాగర్‌తో పాటు పైప్‌లైన్ రోడ్డులో ఆయన పర్యటించారు. ఈ రెండు పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. అనంతరం ఫాక్స్‌సాగర్ చెరువు కట్టపైకి ఎక్కారు. తూమును పరిశీలించారు. ఈ చెరువుకు ఫాక్స్‌సాగర్ అనే పేరెలా వచ్చింది.. దీనిని ఎప్పుడు నిర్మించారు.. దీని విస్తీర్ణం ఎంత అంటూ ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫాక్స్‌సాగర్ కబ్జాలను ఎందుకు ఆపలేకపోతున్నారంటూ ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా ఫాక్స్‌సాగర్ చెరువును కాపాడాలని ఆదేశించారు. ఈ విషయాలను కొంతమంది మీడియా ప్రతినిధులు ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా ఇరిగేషన్ అధికారులు వాగ్వాదానికి దిగారు. ఆయన వెంట కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నరసింహా, ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు ఉన్నారు.



విందు భోజనం తినే ముందు ఆకలిగా అనిపించడం సహజమే. కానీ సిటీలోని వేడుకల్లో పాల్గొనేవారికి విందు దాదాపు ముగింపునకు వచ్చేటప్పుడు కూడా కొత్త ఆకలి పుట్టుకొస్తుంది. కారణం ఖుర్బానీ కా మీఠా. ఈ డెజర్ట్‌ లేకుండా నగరంలో ఏ విందూ పూర్తి కాదు. తినకుండా ఏ జిహ్వా శాంతించదు. ఇంతగా సిటిజనుల అభి'రుచి'లో అల్లుకుపోయిన ఈ ఖుర్బానీ కా మీఠా కహాని దాని తియ్యదనమంత గొప్పది.

- సాక్షి, సిటీబ్యూరో

ఖుర్బానీ కా కహానీ..

నోరూరించే రుచి ఈ డెజర్ట్‌ సొంతం



- మొఘలుల కాలం నుంచే ప్రాచుర్యంలోకి
- నగరంలో పండుగలకు, పెళ్లిళ్లకు మస్ట్‌
- పురాతన చరిత్రకు తోడుగా అధునాతన రుచుల కలబోత
- ఆప్రికాట్‌ డిలైట్‌గా సరికొత్త అవతారం

కునాఫా చాక్లెట్‌లు, చీజ్‌కేక్‌లు, మాకరూన్లు వంటి కొత్త కొత్తవి సిటీ డెజర్ట్స్‌ మెనూలోకి రావడానికి చాలా కాలం ముందు నుంచే ఓ మిఠాయి రాజదర్పంతో కింగ్‌ ఆఫ్‌ డెజర్ట్స్‌గా నగరంలో వర్ధిల్లుతోంది. నిజాం వంశాల వంటగదుల్లో జన్మించిన ఈ మిఠాయి, హైదరాబాద్‌ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం దక్కించుకుంది. పెళ్లిళ్లు, పండుగలు, వేడుకల భోజనాలు ఈ డెజర్ట్‌తో ముగిస్తేనే.. అది సంపూర్ణ విందుగా పరిగణిస్తారు. రాత్రంతా నానబెట్టిన డ్రై ఆప్రికాట్లను చక్కెరతో మగ్గించి, బాదం లేదా ఆప్రికాట్‌ గింజలతో అలంకరించడంతో ఇది స్వీట్‌ రూపం దాల్చుతుంది. ఈ రుచికరమైన డెజర్ట్‌ను మలాయ్‌, వెనిల్లా ఐస్‌క్రీమ్‌ లేదా కస్టర్డ్‌తో కలిపి కాంబినేషన్‌గా అందిస్తున్నారు.



మొఘలుల కాలం నుంచే..

మొఘల్‌ సామ్రాజ్య స్థాపకుడైన బాబర్‌కు ఫెర్గానా లోయ (ఉజ్బెకిస్తాన్‌)లో పండే ఆప్రికాట్లు బాగా నచ్చేవట. భారతదేశపు వేడిలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నప్పుడు తన స్వదేశ పండ్లను బాగా మిస్‌ అయ్యేవాడట. ఆ తర్వాత భారత ఉపఖండంలోకి అలా వచ్చిన ఆప్రికాట్లు నాటి చక్రవర్తుల పుణ్యమాని మొఘల్‌ వంటల్లో కూడా ప్రాధాన్యం పొందాయి. నగరాన్ని పాలించిన ఆసఫ్‌ జాహీ రాజవంశం హయాంలో ఈ మిఠాయి హైదరాబాద్‌ క్యుజిన్‌లో ప్రాముఖ్యం పొందింది.



నగరం నలువైపులా..


హైదరాబాద్‌ వంటకాలకు పేరొందిన ప్రతి రెస్టారెంట్‌ ఖుర్బానీ కా మీఠాను ప్రత్యేకంగా అందిస్తుంది. బిర్యానీకి పేరొందిన ప్యారడైజ్‌ రెస్టారెంట్‌, షాదాబ్‌ హోటల్‌, బావర్చీ హోటల్‌, నవాబ్స్‌ రెస్టారెంట్‌, సర్వీ, నానీస్‌ ప్యూర్‌ వెజ్‌, కబూల్‌ దర్బార్‌ వంటివన్నీ ఈ డెజర్ట్‌ను సర్వ్‌ చేస్తున్నాయి. అలాగే మినర్వా కాఫీ షాప్స్‌, చట్నీస్‌లో క్లాసిక్‌ ఖుర్బానీ కా మీఠాను ఐస్‌క్రీమ్‌తో కలిపి అందిస్తారు. కరాచీ బేకరి, ఆల్మండ్‌ హౌజ్‌ వంటి కొన్ని మిఠాయి దుకాణాల్లో ప్యాకింగ్స్‌లో కూడా దొరుకుతుంది. దీని ధరలు రూ.70 నుంచి రూ.600 వరకూ ఉన్నాయి. సితార ఫుడ్స్‌ వంటివి కిలోల లెక్కన విక్రయిస్తున్నాయి.

చైనాలో పుట్టి.. చరిత్రకెక్కి..

ఖుర్బానీ కా మిఠా కేవలం ఒక మిఠాయి కాదు. తరాలుగా మనతో పాటు అల్లుకున్న చారిత్రక, సాంస్కృతిక సంపద. ఖుర్బానీ అంటే ఉర్దూలో ఆప్రికాట్‌. చైనాలో జన్మించిన ఈ పండు, క్రీ.పూ.4వ శతాబ్దంలోనే అలెగ్జాండర్‌ సైనికుల ద్వారా భారతదేశం మీదుగా యూరప్‌కు ప్రయాణించినట్టు చరిత్రకారులు చెబుతున్నారు.

ఆధునిక రూపం.. ఆప్రికాట్‌ డిలైట్‌..

ఈ మధ్య కాలంలో ఖుర్బానీ కా మిఠాకు సరికొత్త అవతారం దాల్చింది. అదే ఆప్రికాట్‌ డిలైట్‌. ఇందులో అసలు మిఠాయి రుచిని అలా ఉంచుతూనే కేక్‌, కస్టర్డ్‌, విప్డ్‌ క్రీమ్‌ వంటి కొత్త రుచులు జోడించి ట్రిఫిల్‌ లాగా తయారు చేస్తారు. ఈ కొత్త వెర్షన్‌ జూబ్లీహిల్స్‌లోని ది స్పైసీ వెన్యూ హోటల్‌కి చెందిన ఎల్‌.రవీందర్‌ కుమార్‌ రూపొందించారు. ఈ డెజర్ట్‌ సోషల్‌ మీడియా, ఫుడ్‌ బ్లాగర్ల ద్వారా మరింత ప్రజాదరణ పొందింది. పారంపర్యానికంటే భిన్నంగా ఉందని కొన్ని వర్గాలు విమర్శిస్తున్నా మరికొందరు దీనిని పాత మిఠాయికి కొత్త జీవం పోసే ప్రయత్నంగా స్వీకరిస్తున్నారు.



మొన్న 'గిబ్లీ' నేడు బేబీ పాడ్‌కాస్ట్‌..

- సోషల్‌ మీడియాలో బేబీ ఏఐ వీడియోలు
- పాడ్‌కాస్ట్‌తో సందడి చేస్తున్న నెటిజన్లు



శ్రీనగర్‌కాలనీ: సోషల్‌మీడియాలో యుగంలో ప్రతి ఒక్కటీ వింతే.. అన్నట్లు ఉంది. ఇందులో భాగంగా ప్రస్తుతం ఏఐ ఏఐ హవా నడుస్తోంది. రెండు నెలల క్రితం గిబ్లీ ఆర్ట్‌ ఫొటోలతో హోరెత్తిన సోషల్‌మీడియా.. తాజాగా బేబీ పాడ్‌కాస్ట్‌, బేబీ ఏఐ వీడియోలతో హల్‌చల్‌ చేస్తోంది. నెటిజన్లు బేబీ రూపంలో చేసిన వీడియోలు ప్రస్తుతం నెటిజన్లను ఆకర్షిస్తున్నాయి. అంతేకాదు ప్రతి ఒక్కరూ దీనిని ట్రెండ్‌గా ఫాలో అవుతున్నారు. సోషల్‌మీడియాలోని ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లతో పాటు అన్ని యాప్‌లలో బేబీ పాడ్‌కాస్ట్‌ వీడియోలే దర్శనమిస్తున్నాయి. సినిమాల్లోని వైరల్‌ సీన్లను బేబీ పాడ్‌ కాస్ట్‌ రూపంలోకి తీసుకొచ్చి సందడి చేస్తున్నారు. చాట్‌జీపీటీ ఏఐతో ఈ బేబీ పాడ్‌కాస్ట్‌ వీడియోలు చేస్తున్నారు. సినిమా, పొలిటికల్‌, నెటిజన్లు చేసిన వీడియోలు దీనికి కేంద్రబిందువుగా మారుతున్నాయి. గిబ్లీ ఆర్ట్‌ చేసిన రచ్చను మించి బేబీ పాడ్‌కాస్ట్‌ చేస్తుందని నెటిజన్ల అభిప్రాయం.

రమణీయం

లుద్మిల సాగర్‌ నృత్యం



గన్‌ఫౌండ్రీ : ప్రముఖ నాట్యాలయ సంస్థ నృత్య దీక్ష నాట్యాలయ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు ప్రియా వెంకటరామన్‌ శిష్యురాలు లుద్మిల సాగర్‌ పిల్ల భరతనాట్య ఆరంగేట్రం రవీంద్రభారతిలో శనివారం కన్నుల పండువగా సాగింది. వివిధ అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్‌ అలేఖ్య పుంజాల మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కళల పట్ల అభిరుచిని మరువకుండా పిల్లలకు నాట్యంలో శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. కళాకారిణి లుద్మిల సాగర్‌ పిల్లకు భవిష్యత్తులో మంచి గుర్తింపు రావాలని ఆకాంక్షించారు. విశ్రాంత ఐపీఎస్‌ అధికారి డాక్టర్‌ డీటీ.నాయక్‌, వెంకటేష్‌ కుప్పుస్వామి, మురళి పాల్గొన్నారు.



కొత్త అల్లుడికి కొసరి.. కొసరి..

నేడు బెంగాలీల జమై షష్టి మహోత్సవం	అత్తారింట్లో అల్లుళ్ల సందడి	బహుమతులు, ప్రత్యేక వంటకాలు	మరుసటి రోజు ఖర్చంతా అల్లుడిదే

చార్మినార్‌ : తెలుగు నాట సంక్రాంతి అల్లుళ్లకు ఎలాంటి ఆదరాభిమానాలు అందుతాయో పశ్చిమబెంగాల్‌కు చెందిన బెంగాలీలకు కూడా అల్లుళ్లను గౌరవించే ప్రత్యేక సంప్రదాయం ఉంది. వారి సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ప్రతి యేటా తిథి, నక్షత్రం ప్రకారం అల్లుళ్లను గౌరవంగా ఇంటికి ఆహ్వానించి సత్కరిస్తారు. జమై షష్టి అనే పండుగను ఘనంగా నిర్వహిస్తారు. అత్యంత భక్తిశ్రద్ధలతో దుర్గామాతను పూజించే బెంగాలీలు అమ్మవారికి అందించే సకల గౌరవ మర్యాదలు, సత్కారాలను అల్లుళ్లకు సమర్పిస్తారు. కొత్త బట్టలు పెట్టి ఇష్టమైన వంటకాలను వడ్డిస్తారు. జేష్ఠ మాసంలో జరిగే ఈ పండుగను జూన్‌ ఒకటో తేదీన జమై షష్టి మహోత్సవం పేరుతో నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే బెంగాలీలు పూర్తి చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో దశాబ్దాలుగా స్థిరపడిన బెంగాలీలు ఏడానికోసారి కన్నులు పండుగగా దీనిని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అల్లుడు అత్తారింటికి వచ్చిన రోజు జరిగే హంగు ఆర్భాటాలు, అందుకు అయ్యే ఖర్చులను అత్తగారి భరిస్తారు. ఇక మరుసటి రోజు అల్లుడి వంతు ఉంటుంది.



ఖర్చంతా అల్లుడిదే..

అత్తారింటికి చేరిన అల్లుడు మరుసటి రోజు జరిగే ఉత్సవానికి ఆయనే ప్రధాన బాధ్యుడిగా ఉంటారు. అంటే ఆ రోజు జరిగే ఖర్చంతా అల్లుడు భరించాల్సి ఉంటుంది. ఇంట్లోని వారందరికీ బహుమతులతో పాటు అత్తగారికి చీరను బహూకరిస్తారు. ఇతర కుటుంబ సభ్యులకు మర్యాదపూర్వకంగా గిఫ్ట్‌లు అందజేస్తారు. ఈ ఖర్చంతా అల్లుడు చూసుకుంటాడు.

జమై షష్టి.. బెంగాలీల ఆచారం..

జమై షష్టి..అనేది బెంగాలీ ప్రజల సంప్రదాయ, సాంస్కృతిక ఆచారం. ఈ ఆచారాన్ని జ్యైష్ఠ మాసం శుక్ల పక్ష ఆరవ తిథి నాడు నిర్వహిస్తారు. జమై అంటే అల్లుడు. షష్టి అంటే చంద్ర పక్షంలోని ఆరో రోజు. జమైషష్టి అనేది అల్లుళ్లను గౌరవించడానికి అంకితం చేసే పండుగ. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో అత్తగారు వారి శ్రేయస్సు కోసం దుర్గా దేవిని పూజిస్తారు.



అల్లుళ్ళకు రాజభోగం..

అమ్మవారి కరుణ కటాక్షం మా కుటుంబంతో పాటు అల్లుళ్లపై ఉండాలని కోరుతూ జమై షష్టి నిర్వహిస్తాం. ఒకరికొకరు కొత్త బట్టలతో, బహుమతులతో గౌరవించుకుంటాం. ఇది తరతరాలుగా వస్తున్న సంప్రదాయం.

- మౌసమీ- బెంగాలీ మహిళ

సుందరం.. సుమధురం..

- ఘనంగా ముగిసిన మిస్‌వరల్డ్‌ పోటీలు
- 108 దేశాల సుందరాంగుల భాగస్వామ్యం
- అలరించిన కంటెస్టెంట్ల క్యాట్‌ వాక్‌, నృత్యాలు
- వేదికపై టాలీవుడ్‌, బాలీవుడ్‌ తారల సందడి
- తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే కార్యక్రమాలు

ప్రపంచ వేదికపై హైదరాబాద్‌ నగర ప్రశస్తి మరోసారి అత్యంత వైభవంగా మారుమోగింది. నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పోటీలు శనివారం ఘనంగా ముగిశాయి. 108 దేశాలకు చెందిన సుందరాంగులు పాల్గొన్న ఈ అందాల పోటీల్లో మిస్‌ థాయిలాండ్‌ ప్రపంచ సుందరిగా నిలిచింది. నగరంలోని హైటెక్స్‌ ఎగ్జిబిషన్‌ సెంటర్‌ వేదికగా ఏర్పాటు చేసిన భారీ వేదికపై కళ్లు చెదిరే హంగులతో లైటింగ్‌తో ప్రతిష్టాత్మకంగా ఈ మిస్‌ వరల్డ్‌ గ్రాండ్‌ ఫినాలే నిర్వహించారు. ఈ వేదిక పై భారతీయ, తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా నిర్వహించిన నృత్య కార్యక్రమాలు విశేషంగా అలరించాయి.

- సాక్షి, సిటీబ్యూరో





మిస్‌ వరల్డ్‌ గ్రాండ్‌ ఫినాలే పోడియంపై తెలుగు సెలబ్రిటీలు సందడి చేశారు. మిస్‌ వరల్డ్‌ కంటెస్టెంట్లు క్యాట్‌ వాక్‌ చేసే పోడియం ప్యానెల్లో టాలీవుడ్‌ సూపర్‌ స్టార్‌ రానా దగ్గుబాటి, మరో సినీతార నమ్రత శిరోద్కర్‌ ఆశీనులయ్యారు. ఇదే వరుసలో ప్రముఖ ఫ్యాషన్‌ ఐకాన్‌, సామాజికవేత్త, మొట్టమొదటిసారిగా మిస్‌ వరల్డ్‌ బ్యూటీ విత్‌ పర్పస్‌ విభాగానికి గ్లోబల్‌ అంబాసిడర్‌గా ఎన్నికైన తెలుగు మహిళ సుధారెడ్డి ఉన్నారు.

మెగా హంగామా..

ఈ పోటీలను వీక్షించడానికి మెగాస్టార్‌ చిరంజీవి తన భార్యతో కలిసి వచ్చారు. ఈ మెగా వేదికపై ప్రముఖ సెలబ్రిటీ ఇషాన్‌ కట్టర్‌ చేసిన డ్యాన్స్‌ పెర్ఫార్మెన్స్‌ విశేషంగా అలరించింది. ఇందులో భాగంగా తను ఆస్కార్‌ విన్నింగ్‌ పాట నాటు నాటు సాంగ్‌కు అదిరిపోయే స్టెప్పులేస్తుంటే.. చిరంజీవి సంతోషంగా చప్పట్లు కొట్టారు. స్టేజ్‌ పైన వదల బొమ్మాళీ డైలాగ్‌ చెప్పి ప్రేక్షకులను ఉత్సాహపరిచిన సోనూసూద్‌ తెలుగు సినిమాలతో తనకున్న అనుబంధాన్ని మరోసారి గుర్తు చేశారు. తెలుగు సినిమా ఇండస్ట్రీకి కృతజ్ఞతలు తెలిపారు.



ఆతిథ్యం అద్భుతం..

ఈ పోటీల నేపథ్యంలో తెలంగాణ అందించిన ఆతిథ్యం అద్భుతమని టాప్‌ 4లో నిలిచిన పోలండ్‌ కాంటెస్టెంట్‌ కొనియాడారు. ఇక్కడి మర్యాదలు ఆత్మీయత తనను కట్టిపడేశాయని.. భాగ్యనగరాన్ని తన రెండో ఇంటిగా అనుభూతి చెందానని సంతోషం వ్యక్తం చేశారు.

ప్యానలిస్టుల్లో రానా, నమ్రత..



అంతే కాకుండా ఈ గ్రాండ్‌ ఫినాలేలో టాప్‌ 4 మార్టినిక్‌, ఇథియోఫియా, పోలెండ్‌, థాయిలాండ్‌ కాంటెస్టెంట్‌లను చివరి ప్రశ్నలు అడిగిన నలుగురు ప్యానలిస్టుల్లో రానా, నమ్రత ఇద్దరూ తెలుగు వారే కావడం గమనార్హం. మరో రెండు ప్రశ్నలు అడిగిన ఇద్దరిలో సోనూ సూద్‌ కూడా హైదరాబాద్‌కు సుపరిచితుడే.

సమ్మర్ స్పెషల్..

వేసవిలో వర్షాలు!

రాష్ట్రంలో మార్చి నుంచి మే వరకు విస్తారంగా వర్షాలు

సాధారణాన్ని మించి 203 శాతం అధికంగా వర్షపాతం నమోదు

మూడు నెలల్లో సాధారణ వర్షపాతం 55 మిల్లీమీటర్లు... కురిసింది 166.4 మిల్లీమీటర్లు

గతేడాదితో పోలిస్తే ఈసారి రెట్టింపు వానలు



సాక్షి, హైదరాబాద్: వేసవి సీజన్ కూల్‌గా గడిచిపోయింది. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదైనప్పటికీ వాతావరణంలో వేగంగా మార్పులు జరగడం... అకాల వర్షాలు... ముందస్తు రుతుపవనాలతో ప్రజలు వేసవి కాలాన్ని కూడా కూల్‌గా ఆస్వాదించారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు పరిసర జిల్లాల్లో ఈసారి ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువ రోజులు లేదు. మార్చి నెలలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలోనే నమోదు కాగా ఆ తర్వాత అడపాదడపా కురిసిన వర్షాలతో ఎక్కువ రోజులు వాతావరణం చల్లగానే ఉంది. మరోవైపు వేసవి సీజన్‌లో వర్షాలు విస్తరంగా కురిశాయి. సీజన్‌లో కురవాల్సిన సాధారణ వర్షాల కంటే 203 శాతం అధికంగా వర్షాలు కురవడం గమనార్హం. గతేడాది వేసవి సీజన్‌లో సాధారణం కంటే 160 శాతం అధిక వర్షాలు కురవగా ఈ సీజన్‌లో అంతకు రెట్టింపు వర్షాలు కురిశాయి.

సాధారణానికి మించి..

రాష్ట్రవ్యాప్తంగా వేసవి సీజన్‌లో నెలవారీగా కురవాల్సిన సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ మోతాదులోనే వర్షాలు నమోదయ్యాయి. సాధారణంగా మార్చి నెల నుంచి మే నెలాఖరు వరకు వేసవి సీజన్‌గా పరిగణిస్తారు. ఈ మూడు నెలల కాలంలో రాష్ట్రంలో సగటున 55.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంటుంది. అయితే గత నాలుగేళ్లుగా వర్షపాతం గణాంకాలు పరిశీలిస్తే సాధారణం, అంతకు మించి వర్షాలు నమోదవుతున్నాయి. 2022 వేసవి సీజన్‌లో సగటున 42.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా 2024 వేసవిలో 80.5 మిల్లీమీటర్లు వర్షం నమోదైంది. గతేడాది నైరుతి సీజన్‌లో మాత్రం వర్షపాతం గణాంకాలు ఆశాజనకంగా లేవు. సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ పలు మండలాల్లో వర్షాభావ పరిస్థితులు కనిపించాయి. ప్రస్తుత సీజన్‌లో వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈసారి వేసవి సీజన్‌లోనే రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో వాతావరణం చల్లబడింది.

మార్చిలో తక్కువగా.. మేలో అత్యధికంగా...

ఈ ఏడాది మార్చి నెలలో సాధారణం కంటే కాస్త తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ ఏప్రిల్ నెలలో మాత్రం సాధారణం కంటే 80 శాతం అధిక వర్షపాతం నమోదైంది. అదేవిధంగా మే నెలలో 376 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. మే నెలలో బంగాళాఖాతంలో అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో వర్షాలు భారీగా నమోదయ్యాయి. మరోవైపు ముందస్తుగా రుతుపవనాల రాకతోనూ రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో వర్షాలు మోస్తరు నుంచి భారీగా కురవడంతో వర్షపాతం గణాంకాలు అమాంతం పెరిగాయి.

వేసవి సీజన్‌లో రాష్ట్రంలో వర్షపాతం వివరాలు ఇలా...

	సాధారణం	2022	2023	2024	2025
మార్చి	8.2	1.6	42	6.1	6.6
ఏప్రిల్	12.6	5.1	53	9.8	26.6
మే	28.5	35.5	68	64.6	133.2
మొత్తం:	48.7	42.2	163.4	80.5	166.4

క్లుప్తంగా...

బీజేపీలో విలీనం అంటూ కొందరు కుట్రలు చేస్తున్నారు

ఎస్.మధుసూదనాచారి




సాక్షి, హైదరాబాద్: బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనం అంటూ కొందరు వ్యక్తులు, కొన్ని రాజకీయ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఎస్.మధుసూదనాచారి విమర్శించారు. బీఆర్ఎస్‌ను బలహీన పరిచేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. కాంగ్రెస్, టీడీపీకి దీటుగా టీఆర్ఎస్ ఆవిర్భావం జరిగిందని చెప్పారు. శనివారం తెలంగాణ భవన్‌లో మధుసూదనాచారి మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఏపీలో బలమైన నాయకులతో పోరాడి తెలంగాణను సాధించడంతో పాటు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కాంగ్రెస్, బీజేపీ తెలంగాణ ప్రయోజనాలను కాపాడలేవని ఆయన అన్నారు. కేసీఆర్ పాలనపై చర్చకు వస్తే కాంగ్రెస్, బీజేపీ రాజకీయ పునాదులు కదులుతాయని, సీఎంగా కేసీఆర్ లేనందుకు ప్రజలు బాధ పడుతున్నారని చెప్పారు. కేంద్రమంత్రుల భాష, వారి పాలన ప్రజలు అసహ్యించుకునే విధంగా ఉందన్నారు. జూన్ 2న తెలంగాణ భవన్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు జరుగుతాయని, కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారని మధుసూదనాచారి వెల్లడించారు.

నేడు ఎన్డీయే పాలనపై ప్రత్యేక కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: ఎన్డీయే పదకొండేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిపై ఆదివారం రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశంపై ప్రత్యేక వర్క్‌షాప్ కూడా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర పదాధికారులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, జిల్లా పార్టీ అధ్యక్షులు హాజరవుతారని వెల్లడించారు.

ధర్నా పేరుతో కవిత రెండో డ్రామా

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి విమర్శ



సాక్షి, హైదరాబాద్: ధర్నా పేరుతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత రెండో డ్రామా మొదలు పెట్టారని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎంత పెద్దవారైనా వ్యవస్థ విచారణకు పిలిచినప్పుడు వచ్చి వాదనలు వినిపించాలే కానీ న్యాయాధికారాలున్న వ్యవస్థను నిందిస్తూ ధర్నాలు చేయడం తప్పని ఆయన వ్యాఖ్యానించారు. ఎంతో న్యాయ అనుభవం ఉన్న జస్టిస్ పినాకీ చంద్ర ఘోష్ కమిషన్ చాలా మంది అధికారులను విచారించి అన్నీ గుర్తించిన తర్వాతే కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన సమయంలో కేసీఆర్ సీఎంగా పని చేశారు కనుకనే నోటీసులు వచ్చాయని, ఆ నోటీసులను తన రాజకీయ ఉనికి కోసం ఉపయోగించుకునేందుకు కవిత ప్రయత్నిస్తున్నారని అభిప్రాయపడ్డారు. నిజంగా ఎలాంటి తప్పు చేయకపోతే నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలన్నారు.

ఆదివాసీల ఆత్మగౌరవం కాంగ్రెస్‌తోనే సాధ్యం

రాజీవ్ యువ వికాసం పథకంలో గిరిజనులకు రూ.1,000 కోట్లు

- ఇందిరా సౌరగిరి వికాసానికి రూ.12,500 కోట్లు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



మీనాక్షి నటరాజన్, పొంగులేటితో మాట్లాడుతున్న భట్టి

పాల్వంచ రూరల్: ఆదివాసీల ఆత్మగౌరవం, సమసమాజ స్థాపన కాంగ్రెస్‌తోనే సాధ్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కిన్నెరసాని గిరిజన క్రీడా పాఠశాలలో మూడు రోజులపాటు సాగిన తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళన్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భట్టి మాట్లాడుతూ.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు అమలు చేస్తున్నది తమ ప్రభుత్వమేనని, సబ్‌ప్లాన్ కింద గిరిజనులకు రూ. 17,169 కోట్లు కేటాయించామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు ఈ నిధులు ఖర్చు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా గిరిజనుల స్వయం ఉపాధి కోసం రూ.1000 కోట్లు కేటాయించామని, దేశ చరిత్రలో ఇదో రికార్డు అని తెలిపారు. అడవి బిడ్డలు ఆత్మగౌరవంతో బతికేందుకు ఇందిరా సౌరగిరి వికాసం పథకం ద్వారా 6.70 లక్షల ఎకరాలకు బోరు, మోటార్ సౌకర్యం కల్పించేందుకు రూ.12,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా గురుకులాల ఏర్పాటుతో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని, విద్యార్థులకు డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్స్ చార్జీలు 20 శాతం పెంచామని భట్టి వెల్లడించారు.

ఇందిరాగాంధీ అంటేనే వైబ్రేషన్..

కాంగ్రెస్ పార్టీ ఆదివాసీలతో మిళితమై ఉందని, ఇందిరాగాంధీ పేరు చెబితే ప్రతీ గిరిజనుడికి వైబ్రేషన్ వస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందిరమ్మ హయాంలో పేదలకు 25 లక్షల ఎకరాల భూమి పంపిణీ చేశారని చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. జనరంజక పథకాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ వచ్చే ఎన్నికల్లోనూ 90 సీట్లతో అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్, ఎంపీలు పోరిక బలరాం నాయక్, రామసహాయం రఘురాంరెడ్డి, ఇల్లెందు, అశ్వారావుపేట, పినపాక, భద్రాచలం, వైరా, డోర్నకల్ ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, మాలోత్ రాందాస్‌నాయక్, రామచంద్రనాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలను సవాల్‌గా తీసుకున్నాం

- నవరత్నమాల హారతి ప్రధాన ఆకర్షణగా నిలిచింది
- ఆర్టీసీకి సుమారు రూ.10 కోట్ల ఆదాయం: మంత్రి శ్రీధర్‌బాబు



భూపాలపల్లి: రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని సరస్వతి పుష్కరాల నిర్వహణను ప్రభుత్వం ఒక సవాల్‌గా తీసుకుని విజయవంతంగా నిర్వహించిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 'పుష్కరాలు ఎ డే ఆఫ్ థాంక్స్'కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో తొలిసారిగా కాశీ పండితుల చేతుల మీదుగా కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద ప్రతీరోజు సాయంత్రం నిర్వహించిన సరస్వతి నవరత్నమాల హారతి పుష్కరాలకే ప్రధాన ఆకర్షణగా నిలిచిందన్నారు. పుష్కరాల్లో సుమారు 30 లక్షల మంది పుణ్య స్నానాలు ఆచరించారని, ఆర్టీసీకి సుమారు రూ.10 కోట్ల ఆదాయం వచ్చిందని వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ అవకాశాన్ని వినియోగించుకొని లక్షలాది మంది సోదరీమణులు పుష్కరాలకు వచ్చారన్నారు. 2027లో రానున్న గోదావరి పుష్కరాలను మరింత వైభవంగా నిర్వహించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ పుష్కరాల్లోని లోటుపాట్లను గుర్తించి, అవి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు,కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పాల్గొన్నారు.

ఇండియా ఫస్ట్.. తెలంగాణ ఫస్ట్ మా నినాదం

అధికారంలో లేకున్నా రాష్ట్రాభివృద్ధే అభిమతం

- వివిధ రంగాల్లో విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి
- వార్విక్ యూనివర్సిటీలో పీడీఎస్ఎల్ నాలెడ్జ్ సెంటర్ ప్రారంభోత్సవంలో కేటీఆర్



రైల్లో ప్రయాణిస్తున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధే తమ అభిమతమని.. ఇండియా ఫస్ట్.. తెలంగాణ ఫస్ట్ అన్నదే తమ నినాదమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు అన్నారు. తెలంగాణకు పెట్టుబడులు సాధించడం ద్వారా యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభించేందుకు సర్వశక్తులూ ఉపయోగిస్తామని చెప్పారు. ఇంగ్లండ్‌లోని వార్విక్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ప్రాగ్మాటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పీడీఎస్ఎల్) నాలెడ్జ్ సెంటర్‌ను కేటీఆర్ శనివారం ప్రారంభించారు. పీడీఎస్ఎల్ కార్యకలాపాలను భారత్‌కు విస్తరించాలన్నారు. ఇంగ్లండ్‌లో యూనివర్సిటీ, ఇండస్ట్రీల మధ్య పరస్పర సహకారం తనను ఆశ్చర్యపరిచిందన్నారు. మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ వంటి దిగ్గజ ఆటోమోటివ్ కంపెనీలకు పరిశోధన, అభివృద్ధి సేవలను అందించే పీడీఎస్ఎల్ నాలెడ్జ్ సెంటర్ తెలంగాణ టాలెంట్‌కు నిదర్శనమని కేటీఆర్ కొనియాడారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ వినూత్న విధానాలతోనే..

బీఆర్ఎస్ ప్రభుత్వ వినూత్న విధానాలతో పుణే, చెన్నై సరసన హైదరాబాద్ ఆటోమోటివ్ హబ్‌గా నిలిచిందని కేటీఆర్ చెప్పారు. తమ ప్రభుత్వ కాలంలోనే ఐటీ, లైఫ్ సైన్సెస్‌తోపాటు ఆటోమోటివ్ రంగంలోనూ తెలంగాణ సత్తా చాటిందన్నారు. ఈ రంగంలో కేవలం పరిశోధన, అభివృద్ధికే పరిమితం కాకుండా తయారీ రంగంలోనూ తెలంగాణను నంబర్ వన్‌గా నిలిపేందుకు తమ ప్రభుత్వం తెచ్చిన విధానాలు ఉపయోగపడతాయని కేటీఆర్ అన్నారు. భారత్‌లో ఫార్ములా ఈ–రేసింగ్ చాంపియన్‌షిప్‌ను నిర్వహించిన మొదటి రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్న కేటీఆర్... పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు రాష్ట్రంలో మొబిలిటీ వ్యాలీని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేసిందన్నారు.


ఐటీ ఎగుమతుల్లోనూ పురోగతి

తమ ప్రభుత్వ నిరంతర కృషితో అంతర్జాతీయ కంపెనీలకు కొత్త చిరునామాగా తెలంగాణ మారిందని కేటీఆర్ పేర్కొన్నారు. గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి కార్పొరేట్ దిగ్గజాలు తమ అతిపెద్ద కార్యాలయాలను హైదరాబాద్‌లో ప్రారంభించాయని గుర్తుచేశారు. తమ తొమ్మిదేళ్ల పాలనలో ఐటీ ఉద్యోగాలు, ఎగుమతులతోపాటు ఇతర రంగాల్లోనూ తెలంగాణ అద్భుతంగా పురోగతి సాధించిందని చెప్పారు. ఐటీ, అనుబంధ రంగాలతోపాటు ఆటోమొబైల్ వంటి ఇతర రంగాల్లోనూ భారత యువత ప్రతిభ, నిబద్ధతతో అద్భుతంగా రాణిస్తున్నారని కేటీఆర్ ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత, విద్యార్థులతోపాటు కంపెనీలు కూడా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్ఎల్ డైరెక్టర్ క్రాంతి పుప్పాల పాల్గొన్నారు.

నేర దర్యాప్తుపై ఇంత నిర్లక్ష్యమా?

లోపభూయిష్ట విచారణ క్రిమినల్ జస్టిస్ వ్యవస్థకు ప్రమాదం

- అసమగ్ర దర్యాప్తు పౌరుల ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే
- అత్యాచారం కేసులో కల్నల్ రిషిశర్మ జీవిత ఖైదు రద్దు
- నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: కేసుల దర్యాప్తులో రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ అనుసరిస్తున్న తీరు లోపభూయిష్టంగా ఉందని హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇది మొత్తం క్రిమినల్ జస్టిస్ వ్యవస్థ సమగ్రతను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. దర్యాప్తు బృందం న్యాయంగా విచారణ చేయకపోతే అది పౌరుల ప్రాథమిక హక్కుల ఉల్లంఘనగానే పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఏళ్లకేళ్లు విచారణతో న్యాయం అందించడంలో జాప్యం జరుగుతుందని చెప్పింది. ఇది న్యాయ వ్యవస్థపై పౌరుల విశ్వాసాన్ని ప్రభావితం చేస్తుందని పేర్కొంది. అత్యాచారం కేసులో హైదరాబాద్‌లోని శామీర్‌పేట్ డీఆర్‌డీవో ఏట కల్నల్ రిషిశర్మకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విధించిన జీవిత ఖైదును హైకోర్టు రద్దు చేసి, ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. తన తల్లికి సన్నిహితుడైన రిషిశర్మ తనపై అత్యాచారం చేయటంతో తాను గర్భం దాల్చానన్న బాధితురాలి ఫిర్యాదుతో 2017లో ఆయనపై కేసు నమోదైంది. విచారణ చేపట్టిన ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు 2024లో రిషిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. బాధితురాలు గర్భవతి అని తెలిసిన మూడు నెలల తర్వాత ఈ కేసు నమోదైంది. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ కల్నల్ శర్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పి.సామ్‌కోషి, జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టి, రిషిశర్మను నిర్దోషిగా ప్రకటించింది.

అభియోగాల నిరూపణలో ప్రాసిక్యూషన్ విఫలం

సందేహాలే తప్ప అభియోగాలను నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని హైకోర్టు తెలిపింది. కీలక సాక్షుల సాక్ష్యాలలో, బాధితురాలి తల్లి ప్రయాణ తేదీలు, గమ్య స్థానాలకు సంబంధించి స్పష్టమైన వైరుధ్యాలు ఉన్నాయని పేర్కొంది. 2017, ఏప్రిల్ 17న గర్భం విషయం తెలిస్తే, ఏప్రిల్ 25 వరకు ఫిర్యాదు చేయకపోవడానికి కారణాలు తెలుపలేదని ఆక్షేపించింది. కల్నల్ శర్మ 2005లోనే వేసెక్టమీ చేయించుకున్నారని సర్టిఫైడ్ సర్టిఫికెట్ నిరూపిస్తోందని, అలాంటప్పుడు అతడు మరోసారి తండ్రి ఎలా కాగలరని ప్రశ్నించింది. విచారణలో దర్యాప్తు అధికారుల భారీ వైఫల్యం కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేసింది. జవాబుదారీతనంతో పనిచేస్తే వ్యవస్థ రావాలని సూచించింది. పోలీసుల తీరు కారణంగా నిర్దోషిని శిక్షించి, దోషులను వదలివేయడం జరుగుతోందని అసహనం వ్యక్తంచేసింది. దర్యాప్తు నాణ్యత పర్యవేక్షణకు, పారదర్శకతను పెంపొందించడానికి స్వతంత్ర పర్యవేక్షణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. దీనిపై ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని సూచించింది. రిషిశర్మ విడుదల చేయాలని ఆదేశించింది.

కల్వకుంట్ల సినిమా 'చార్‌పత్తా'


ఆ సినిమాలో కేసీఆర్ జోకర్: బండి సంజయ్



కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్రంలో కల్వకుంట్ల ఆర్ట్ క్రియేషన్ ఆధ్వర్యంలో 'చార్‌పత్తా' సినిమా నడుస్తోందని, ఈ సినిమాకు డైరెక్షన్ కాంగ్రెస్ అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కవిత అరెస్ట్ కాకుండా ఉండేందుకు బీఆర్ఎస్ గతంలో బీజేపీతో పొత్తుకు ప్రయత్నించిందని, ఆ పార్టీని దరిదాపులకు కూడా రానీయలేదని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు దేశద్రోహమేనని మండిపడ్డారు. శనివారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కవిత, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావులతో చార్‌పత్తా సినిమా నడుస్తోందని, అందులో కేసీఆర్ జోకర్ అని విమర్శించారు. కవిత లేఖ, చిట్‌చాట్‌లతో రాష్ట్రానికి ఏం ప్రయోజనమని, ఆరు గ్యారంటీలపై డైవర్ట్ చేయడానికి కాంగ్రెస్ దర్శకత్వంలో ఈ సినిమా నడుస్తోందని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీజేపీకి టచ్‌లోకి వచ్చినప్పుడు కేసీఆర్ మీటింగ్‌పెట్టి మనమే బీజేపీలో కలుస్తామని చెప్పాడన్నారు. లిక్కర్ కేసులో కవిత అరెస్ట్ కాకుండా ఉండేందుకు బీజేపీతో కలిసేందుకు బీఆర్ఎస్ ప్రయత్నించిందని తెలిపారు. కుటుంబ పార్టీ బీఆర్ఎస్‌తో బీజేపీ కలిసే ప్రసక్తే లేదని, ఆ పార్టీని కలుపుకొని అవినీతి మరకను మేమెందుకు పూసుకొంటామని ప్రశ్నించారు. వేములవాడలో కోడెల మృత్యువాతపై ఈఓతో మాట్లాడతానని, కోడెలను రక్షించాల్సిన బాధ్యత దేవస్థానానిదే అన్నారు.

'కాళేశ్వరం'తో పండిన పంటలు కనిపించట్లేదా?

- ఒక్క ఎకరానికీ ప్రాజెక్టు నీరు పారలేదన్న మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఫైర్
- కొందరు మూర్ఖులు కళ్లుండీ చూడలేరని చురకలు.. ఆయనకు జ్ఞానం ఉందో లేదోనని ఎద్దేవా



సిద్దిపేట రూరల్: కాళేశ్వరం ప్రాజెక్టు ఫలాలు చూసి కాంగ్రెస్ నేతలు ఓర్వలేకపోతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. శనివారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఒక్క ఎకరానికి కూడా నీరు పారలేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉత్తమ్‌కు జ్ఞానం ఉందో లేదో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ తదితర రిజర్వాయర్ల కింద పండిన పంటలు ఉత్తమ్‌కు కనిపించడం లేదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాలంకాకపోయినా 'కాళేశ్వరం'తో చెరువులను నింపామని.. యాసంగి పంట తర్వాత కూడా చెరువులు నిండుగా కనపడుతుండటం కేసీఆర్ కృషి వల్లేనని చెప్పారు. 'కొందరు మూర్ఖులు హైదరాబాద్‌లో ఉండి కళ్లుండీ చూడలేరు. చెవులు ఉండి వినలేని వారు మాట్లాడుతున్నారు. కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేసే వాళ్లు అన్నం తింటున్నారో లేక పెంట తింటున్నారో అర్థం కావట్లేదు' అంటూ హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు లూనాలు, ఆటోలు, ఐస్‌బాక్సులను పంపిణీ చేశామని.. రూ. వెయ్యి కోట్లు ఖర్చుపెట్టి గంగపుత్రులను అభివృద్ధి బాటలోకి తీసుకొచ్చామని హరీశ్ తెలిపారు. వారికి కేసీఆర్ బతుకుదెరువు చూపగా కాంగ్రెస్ ప్రభుత్వం బతుకుదెరువు ఆగం చేసిందని దుయ్యబట్టారు. రేవంత్ సర్కారు రైతుబంధు ఎగ్గొట్టిందని.. రుణమాఫీ పథకం పావు వంతు మందికి కూడా వర్తించలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బూతులు తిట్టడం తప్ప ఒక్క మంచి పని అయినా చేశాడా? అని నిలదీశారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. కేసీఆర్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

కేసీఆర్‌కు నోటీసులు ఎందుకిచ్చారు?

కాళేశ్వరంతో తెలంగాణను సస్యశ్యామలం చేసినందుకా?

- పక్క రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సీఎం రేవంత్
- కేసీఆర్‌కు నోటీసులను నిరసిస్తూ జూన్ 4న మహాధర్నా
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటన



తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బంజారాహిల్స్: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు ఎందుకిచ్చారు? కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణను సస్యశ్యామలం చేసినందుకా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని బంజారాహిల్స్ రోడ్ నెం.14లో శనివారం ప్రారంభించిన అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'గోదావరిలో 200 టీఎంసీల నీటి హక్కు తెలంగాణకు ఉండాలని కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారని తెలిపారు. ఏటా 20 లక్షల ఎకరాలకు కాళేశ్వరం ద్వారా నీళ్లు అందించినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా? రైతు బీమా, రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టినందుకు నోటీసులు ఇచ్చారా ? తెలంగాణ ప్రజలకు మేలు చేసినందుకు నోటీసులు ఇచ్చారా? అది కాళేశ్వరం కమిషనా? కాంగ్రెస్ కమిషనా?'అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీచేయడాన్ని నిరసిస్తూ జూన్ 4న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేయనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ సోయితో కేసీఆర్ పరిపాలన చేశారని, సీఎం రేవంత్‌రెడ్డి కనీసం జై తెలంగాణ అనకపోవడం మన ఖర్మ అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి జై తెలంగాణ అనాలని, అమరులకు నివాళులర్పించాలని డిమాండ్ చేశారు. జై తెలంగాణ అననివారికి, అమరవీరులకు నివాళులర్పించని వారికి సీఎం కుర్చీలో కూర్చొనే అర్హత లేదని అన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం పేరు మార్చి అమరులు శ్రీకాంతాచారి, యాదిరెడ్డి, కాళోజీ, పీవీ నరసింహారావులలో ఎవరిదో ఒకరి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

బనకచర్లపై రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడరు?

ఏపీ సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టును నిర్మించి తెలంగాణ నీటిని తరలించుకుపోయే ప్రణాళిక వేస్తుంటే సీఎం రేవంత్ కనీసం స్పందించడం లేదని కవిత విమర్శించారు. జూన్ 2న సీఎం ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లును డీప్‌ఫ్రిడ్జ్‌లో పెట్టే ప్రయత్నం చేస్తే బీజేపీకి సెగ తాకే విధంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేవరకు పోరాటం చేస్తామన్నారు. జాగృతిలో ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ విభాగాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విభాగాన్ని ఏర్పాటుచేసి ఆ వర్గాల కోసం ఉద్యమిస్తామని వెల్లడించారు. కేసీఆర్‌కు ఒక కన్ను బీఆర్ఎస్ అయితే.. మరో కన్ను తెలంగాణ జాగృతి అని పేర్కొన్నారు.

జాగృతి కార్యాలయ కార్యదర్శిగా బాలాజీ రావు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జాగృతి కార్యాలయ కార్యదర్శిగా పొన్నమనేని బాలాజీ రావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కొదురుపాకకు చెందిన బాలాజీ రావు 2002 నుంచి దాదాపు 17 ఏళ్ల పాటు బీఆర్ఎస్ మండల అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2001 నుంచి 2005 వరకు గ్రామ సర్పంచ్‌గా, 2019 నుంచి 2024 వరకు సుల్తానాబాద్ ఎంపీపీగా పనిచేశారు. తనను కార్యాలయ కార్యదర్శిగా నియమించిన కవితకు బాలాజీ రావు కృతజ్ఞతలు తెలిపారు. జాగృతి పార్టీ కార్యాలయ కార్యకలాపాలపై 9849090215 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 1-6-2025

● ఇంటిప్స్

వర్షంలోనూ అద్దం క్లియర్‌గా..

వర్షాకాలంలో కారు అద్దాలు తడిసి ఎదురుగా వస్తోన్న వాహనాలు సరిగా కనపడవు. వైపర్స్ శక్తివంచన లేకుండా పని చేసినప్పటికీ, బట్టతో ఎంతగా తుడిచినప్పటికీ ఇంకా మసకమసకగానే కనిపి



స్తుంది. ఇలా కాకుండా అద్దం క్లియర్‌గా కనిపించాలంటే.. బంగాళ దుంపను రెండు చెక్కలు చేయాలి. ఒక చెక్కను తడిసిన అద్దంపై రుద్దాలి. అద్దం మీద ఉన్న తడిపోయి క్లియర్‌గా ఉంటుంది. మరోసారి వర్షం నీళ్లు పడినా సులభంగా జారిపోయి అద్దం స్పష్టంగా కనిపిస్తుంది.



న్యూస్‌మేకర్
భద్ర హరి

భద్ర హరి పాట శాలలో తొలకరి



జూన్ 2న కేరళలో బడులు తెరుచుకోనున్నాయి. ఒకటో క్లాసులో చేరే పిల్లల కోసం అన్ని స్కూళ్లలో 'ప్రవేశోత్సవం' చేయడం కేరళ విద్యాశాఖకు ఆనవాయితీ. అయితే ఈసారి ఆ ఉత్సవానికి పాట రాయించాలనుకున్నారు. ప్రకటన ఇస్తే ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న భద్ర హరి రాసింది. ఎంపికైన ఆ పాట అన్ని స్కూళ్లలో స్వాగత గీతం కానుంది.

కేరళ ప్రభుత్వం పాఠశాల విద్యకు ఎంత ప్రాధాన్యం ఇస్తుందో ఈ ఉదంతం చెబుతోంది. అక్కడ జూన్ 2 నుంచి స్కూళ్లు ప్రారంభం కానున్నాయి. ఆ వేళ విద్యార్థులను ఉత్సాహ పరిచేందుకు, కొత్త విద్యార్థులను స్కూల్లో చేరేలా ప్రోత్సహించేందుకు 'ప్రవేశోత్సవం' నిర్వహిస్తారు. ఇది ప్రతి ఏట కేరళ విద్యాశాఖ నిర్వహించే వేడుక. కాని ఈసారి స్వాగత గీతాన్ని తయారు చేసి పిల్లలకు వినిపించాలని సంకల్పించారు. గత సెప్టెంబర్‌లో పాటను ఆహ్వానిస్తూ పేపర్ ప్రకటన ఇచ్చారు. ఆ ప్రకటనను అదూర్‌లో జూనియర్ ఇంటర్ చదువుతున్న భద్రహరి చూడటంతో మన కథ మొదలవుతుంది.



కేరళ విద్యాశాఖ మంత్రి వి. శివన్‌కుట్టితో భద్ర హరి

రెండు రోజుల్లో పాట రాసింది

భద్రహరి ఐదో క్లాస్ నుంచి కవిత్వం రాస్తోంది. వాళ్ల నాన్న హరీంద్రనాథ్ అదూర్‌లో డిప్యూటీ తాసిల్దార్‌గా పని చేస్తున్నారు. అమ్మ సుమ టీచర్. పదో తరగతిలో ఉండగా 'ధనుర్మాస పౌర్ణమి' పేరుతో కవితా సంకలనాన్ని వెలువరించిన భద్రహరి కేరళ ప్రభుత్వం విద్యార్థులకు నిర్వహించే 'కళా ఉత్సవం'లో కవిత్వం రాసి బహుమతులు పొందింది. ప్రభుత్వ ప్రకటన చూశాక బడికి వచ్చే పిల్లల కోసం పాట రాయాలనుకుంది. 'మజా మేఘంగళ్'... పల్లవితో మొదలెట్టి రెండు రోజుల్లో పాట పూర్తి చేసింది.

'నేను పదేళ్ల క్రితం మొదటిసారి బడికి వెళ్లడం గుర్తుకొచ్చింది ఈ పాట రాసేప్పుడు. కేరళలో చినుకులు మొదలైన వేళ బడులు తెరుచుకుంటాయి. పిల్లలు రంగురంగుల రెయిన్ కోట్లలో బడికి వస్తారు. కొందరు గొడుగులు తెస్తారు. మొదటిసారి చేరే పిల్లలు తల్లిదండ్రుల చేయి పట్టుకుని మొదటి అడుగు వేస్తారు. అదంతా నా మొదటి చరణంలో రాశాను. రెండో చరణంలో కేరళలో జరుగుతున్న శాస్త్ర, సాంకేతిక పురోగతిని చెప్పాను. మూడో చరణంలో వ్యవసాయంలోను, సాంస్కృతికంగాను కేరళ ఘనతను చాటాను' అని తెలిపింది భద్రహరి.

ముఖ్యమంత్రితో కలిసి...

పాట రాశాక భద్రహరికి ఎటువంటి రెస్పాన్స్ రాలేదు. అయితే వారం రోజుల క్రితం ఆమెకు విద్యాశాఖ నుంచి ఫోన్ వచ్చింది 'మీ పాట స్వాగత గీతంగా ఎంపికైంది' అంటూ. 'ఆ రోజున నేను పొందిన ఆనందం అంతా ఇంతా కాదు' అంది భద్రహరి. 'నేను రాసిన పాటకు నేనే ట్యూన్ కట్టి మొదట మా అమ్మానాన్నలకు వినిపించాను. వారు చాలా బాగుందని అన్నారు. అయితే ప్రభుత్వ కోరిక మేరకు సంగీత దర్శకుడు అల్ఫాన్స్ జోసఫ్ ఆ పాటకు తన ట్యూన్ కట్టి పాడారు. పాట చాలా బాగా వచ్చి వైరల్ అయ్యింది. జూన్ రెండున ముఖ్యమంత్రి విజయన్ కలవూర్‌లో జరిగే ప్రవేశోత్సవంలో ఈ పాటను ఆవిష్కరిస్తారు. ఆ వేడుకకు ఆయనతో పాటు పాల్గొనమని నాకు ఆహ్వానం అందింది' అంది భద్రహరి.

ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో అందరూ ఎం.పి.సి, బై.పిసిల వైపే ఇంకా మొగ్గుతున్నా పదో క్లాస్‌లో టాప్ మార్కులతో పాసైన భద్రహరి ఇంటర్‌లో ఆర్ట్స్ తీసుకుంది. మలయాళ భాషలో పై చదువు చదివి లెక్చరర్ కావాలనుకుంటోంది. కవయిత్రిగా గుర్తింపు పొందాలనుకుంటోంది.

సమాజం కవిత్వానికి విలువ ఇవ్వకపోయినా పిల్లలకు తెలుసు కవిత్వం ఎంత గొప్పదో. దానిని ఎలా గౌరవించాలో. భద్రహరి వంటి విద్యార్థులే నిజమైన సాహిత్య, సాంస్కృతిక పరిరక్షకులు.

● బ్యూటిప్స్



● టేబుల్ స్పూన్ తేనె, టేబుల్ స్పూన్ రోజ్‌వాటర్‌ను తీసుకుని చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా వేసి పదినిమిషాల తరువాత కడిగేయాలి. రోజూ ఇలా చేయడం వల్ల చర్మానికి యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు అంది మొటిమలు తగ్గుముఖం పట్టడంతోపాటు, చర్మం మృదువుగా తయారయి నిగారింపు సంతరించుకుంటుంది.



● బాగా మగ్గిన అరటిపండు తొక్క తీసుకుని టేబుల్ స్పూన్ తేనె వేసి పేస్టులా రుబ్బుకోవాలి. ఈ పేస్టుని ముఖానికి పూతలా వేసుకుని పదిహేను నిమిషాల తరువాత కడిగేయాలి. ఈ ప్యాక్‌ను రెండురోజులకొకసారి వేసుకోవడం వల్ల చర్మానికి తేమ అంది, మెరుపులీనుతుంది.



● **ట్యాన్‌ను తరిమేస్తుంది..**

మూడుస్పూన్ల ముల్తాని మట్టిలో రెండు టీస్పూన్ల రోజ్‌వాటర్, మూడు టీస్పూన్ల పాలు పోసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కళ్లలోకి పోకుండా ముఖానికి పూతలా వేయాలి. అరగంట తరువాత నీటితో కడిగేయాలి. వారానికి రెండు మూడు సార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ట్యాన్ క్రమంగా పోతుంది. చర్మానికి విటమిన్ ఏ, తేమ అంది ఆరోగ్యంగా ఉంటుంది.



● స్ఫూర్తి

ధీర... మయూర

'ది సెకండ్ విండ్' చిత్రానికి వచ్చిన అంతర్జాతీయ గుర్తింపు, ప్రశంసల మాట ఎలా ఉన్నా... 'ఎవరీ మయూర శివల్కర్?' అనే ప్రశ్న ఒకటి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ముగ్గురు మహిళల నిజజీవిత సంఘటనల ఆధారంగా ఇందిర బైరికర్ 'ది సెకండ్ విండ్' చిత్రాన్ని రూపొందించారు. ఆ చిత్రంలో మయూర శివల్కర్ జీవితం కూడా ఉంది...



కర్నాటకలోని బెల్గావికి చెందిన మయూర శివల్కర్ మారథానర్, అథ్లెట్, బ్రెస్ట్ క్యాన్సర్ సర్వైవర్. 'ది సెకండ్ విండ్'లో మయూర శివల్కర్ పాత్ర భావోద్వేగాలకు పరిమితమైనదే కాదు ప్రభావం వంతమైనది.

ధైర్యమిచ్చేది... దారి చూపేది.

ముప్పైలలో తనకు బ్రెస్ట్ కాన్సర్ అని నిర్ధారణ అయినప్పుడు ఆమె కాసేపు విచారపడి ఉండొచ్చుగానీ కష్టాలు, ప్రతికూలతలకు తలవొగ్గకూడదని నిర్ణయించుకుంది. పోరాట బాటను ఎంచుకుంది. ఎన్నో మారథాన్‌లలో ఉత్సాహంగా పాల్గొంది. ఆమె పేరు ఆశావాదానికి అరుదైన ప్రతీకగా మారింది.

మయూర ఆశావాదమే, అరుదైన ధైర్యమే 'ది సెకండ్ విండ్' కథలోకి వచ్చింది.

కాస్త వెనక్కి వెళితే... మయూర రేసులలో పాల్గొన్నప్పుడల్లా... 'ఈ పరిస్థితుల్లో ఎందుకు?' అన్నవారు లేకపోలేదు.

ఆ సందేహానికి ఆమె చిరునవ్వే... సమాధానం.

36 నుంచి 37 డిగ్రీల టెంపరేచర్‌లోనూ రేస్‌ను పూర్తి చేసింది. తాను యావరేజ్ స్విమ్మర్ అయినా తొలి సీ-స్విమ్‌ను విజయవంతంగా పూర్తి చేసింది.

బైకింగ్‌లోనూ 'వావ్' అనేలా చేసింది.

'ఎప్పుడూ ఉత్సాహంగా కనిపిస్తావు! ఇది ఎలా సాధ్యం?' అని మయూరను అడిగేవారు.

ఉత్సాహం కొని తెచ్చుకునేది కాదు కదా!

అది ఆమె రక్తంలోనే ఉంది.

మయూర తల్లిదండ్రులు ఆమెకు తల్లిదండ్రులు మాత్రమే కాదు స్నేహితులు, మార్గదర్శకులు.

'నా తల్లిదండ్రులు ఒకమాట చెప్పే వారు... మొదటి నుంచి నీదైన ఒక మార్గాన్ని ఎంచుకున్నావు. ఆ మార్గం నుంచి బయటకు రావద్దు. మంచి రోజులను ఎంజాయ్ చేసినట్లే, చెడు అనుకునే రోజులను ఎంజాయ్ చెయ్. ఫుల్‌స్టాప్ కంటే కామా బెటర్' అని గతాన్ని గుర్తు చేసుకుంది మయూర శివల్కర్.

● ట్రెండ్

పాలీవర్కింగ్ కిక్



ముంబైకి చెందిన సారా ఒక టెక్ కంపెనీలో టాలెంటెడ్ మార్కెటింగ్ ప్రొఫెషనల్. యోగా ఇన్‌స్ట్రక్టర్, ఫ్రీలాన్స్ కాపీరైటర్‌గా కూడా పనిచేస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తన ప్రైమరీ జాబ్ చేసే సారా సాయంత్రం తరువాత లోకల్ స్టూడియోలో యోగా పాఠాలు చెబుతుంది. వీకెండ్స్‌లో ఫ్రీలాన్స్ రైటింగ్ ప్రాజెక్ట్‌లు చేస్తుంటుంది.

పాలీవర్కింగ్ వల్ల ఆర్థికస్థిరత్వంతో పాటు తన పాషన్‌ను కూడా కొనసాగించే వీలు కలుగుతోంది.

ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు చేయడం...పాలీవర్కింగ్. కోవిడ్ మహమ్మారి తరువాత ఈ ధోరణి బాగా పెరిగింది. అస్థిరమైన ఉద్యోగాల కారణంగా యువ ఉద్యోగులు మునుపెన్నడూ లేనంతగా కష్టపడుతున్నారు.

'వోల్ ల్యాబ్స్' సర్వే ప్రకారం 46 శాతం మంది ఉద్యోగులు సెకండరీ జాబ్ చేస్తున్నారు.

అమెరికన్ ఉద్యోగుల్లో అత్యధికంగా ఉన్న మిలీనియల్స్‌లో 52 శాతం మంది ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు చేస్తున్నారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. వీరిలో 24 శాతం మంది మూడు ఉద్యోగాలు చేస్తున్నారు. 33 శాతం మంది నాలుగు లేదా అంతకంటే ఎక్కువ పనులు చేస్తున్నారు.


ఇక జెన్ జెడ్‌లో సగం మంది ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు చేస్తున్నారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, ఫ్లెక్సిబుల్ వర్క్ పాలసీలు 'పాలీవర్కింగ్' ట్రెండ్‌కు కారణం.

'ఆదాయం పెంచుకోవడం మాత్రమే కాదు, అనేక రకాల నైపుణ్యాలను సొంతం చేసుకోవడానికి ఈ ట్రెండ్ ఉపకరిస్తుంది' అంటుంది సారా.

హెల్త్

కీలు మారాక ఫీల్ ఎలా వుంది?



చాలా ఏళ్ల కిందట ఇటీవల మోకాలి దగ్గర ఉన్న కీళ్లు అరిగితే... తీవ్రమైన మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు. పాత నొప్పులంటూ చెబుతూ జీవితాంతం బాధపడేవారు. కదలడానికి కూడా కష్టపడుతూ, నడవడానికి నానా యాతన పడుతూ జీవితాన్ని వెళ్లబుచ్చేవారు. కానీ గత కొన్ని దశాబ్దాలుగా మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చాలా వేగంగా ప్రాచుర్యం పొందడంతో ఈ శస్త్రచికిత్సలు చేయించుకునేవారు ఎక్కువగా ఉంటున్నారు. నిజానికి మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స ఒక ఎత్తైతే... ఆ తర్వాత పాటించాల్సిన జాగ్రత్తలూ, సూచనలూ మరో ఎత్తు. వీటిని ఎంత సమర్థంగా అమలు చేస్తే... నడక అంత వేగంగానూ అంత మెరుగ్గానూ జరుగుతుంది. మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలూ, పాటించాల్సిన సూచనలపై అవగాహన కోసం ఈ కథనం.

మోకాలి కీళ్ల మార్పిడి చికిత్సలో భాగంగా డాక్టర్లు సాధారణంగా బాధితులకు రెండు రకాల శస్త్రచికిత్సలు చేస్తుంటారు. మొదటిది పూర్తి మోకాలి మార్పిడి శస్త్రచికిత్స (కంప్లీట్ నీ- రీప్లేస్‌మెంట్ సర్జరీ), రెండోది... పాక్షిక మోకాలి కీలు మార్పిడి శస్త్రచికిత్స (పార్షియల్ నీ - రీప్లేస్‌మెంట్ సర్జరీ). వీటిల్లో పాక్షిక మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలో కోలుకోవడం అన్నది చాలా త్వరితంగా... అంటే రెండు నుంచి నాలుగు వారాల్లో జరుగుతుంది. అదే పూర్తి మోకాలి కీలు మార్పిడి శస్త్రచికిత్స తర్వాత కోలుకోడానికి నాలుగు నుంచి ఆరు వారాల వ్యవధి అవసరం. బాధితుల అవసరాన్ని బట్టి ఈ రెండింటిలో ఒకదాన్ని డాక్టర్లు సూచిస్తారు. ఈ రెండింటి ప్రభావాలూ, మన్నిక ఒకేలా ఉంటాయి.

శస్త్రచికిత్స తర్వాత అదేరోజున నడక...

సాధారణంగా మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స ఏదైనప్పటికీ బాధితులను శస్త్రచికిత్స అయిన వెంటనే అదే రోజున నడిపిస్తారు. అటు తర్వాత వారికి కూర్చుండే చేసే స్టాటిక్ వ్యాయామాలూ, కదలికలతో చేయాల్సిన డైనమిక్ వ్యాయామాలతో పాటు వాకర్ సహాయంతో నడిపించేవీ (వాకింగ్), మోకాళ్ల కదలికలతో చేసేవీ (నీ ఎక్సర్‌సైజెస్) లాంటివి చేయిస్తుంటారు. అయితే శస్త్రచికిత్స తర్వాత ఉండే నొప్పి 24 నుంచి 48 గంటల్లో తగ్గుతుంది కాబట్టి... కొన్ని వ్యాయామాలను ఆ తర్వాతే చేయిస్తారు. అలాగే మోకాలి దగ్గర శస్త్రచికిత్స కోసం పెట్టిన గాటు నాలుగు నుంచి ఆరు వారాల్లో నయమవుతుంది. ఇక గాయమంతా మారిపోయి... ఓ వ్యక్తి మునపటిలా సౌకర్యవంతంగా ఫీల్ అవ్వడానికి కనీసం ఏడాది వరకు పట్టవచ్చు. అలాగే శస్త్రచికిత్స చేసిన చోట వాపు పూర్తిగా తగ్గి మోకాలు మామూలుగా కనిపించడానికి మూడు నుంచి ఆర్నెల్ల సమయం పట్టవచ్చు.

పోలికలు వద్దు...

పైన పేర్కొన్న కాల వ్యవధులను చాలామంది వ్యక్తులను పరిశీలించి... ఓ సగటు సమయాన్ని పేర్కొనడం కోసం చెప్పేవి మాత్రమే. వారి వారి శరీర తత్త్వాన్ని బట్టీ, అలాగే రోగనిరోధక వ్యవస్థ తాలూకు చురుకుదనం, వారి సాధారణం ఆరోగ్యం, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలూ వీటన్నింటి ఆధారంగా కోలుకునే సమయం ఒకరి నుంచి మరొకరికి మారవచ్చు. శస్త్రచికిత్స తర్వాత నొప్పి వస్తుండే వ్యవధి కూడా ఒకరి నుంచి మరొకరికి వేరుగా ఉండవచ్చు. అందుకే మోకాలి కీలు మార్పిడి జరిగిన ఇతర వ్యక్తులతో పోల్చుకోవడం సరి కాదు. దీనివల్ల మానసిక ఆందోళన పెరగడం, దాంతో వ్యాధి నిరోధక వ్యవస్థ మందగించడం వల్ల గాయం తగ్గడానికి పట్టే సమయం పెరగవచ్చు. అందుకే మరొకరితో పోల్చుకోవడం ఎట్టిపరిస్థితుల్లోనూ వద్దు.

● **శస్త్రచికిత్సకు ముందున్న స్టిఫ్‌నెస్ :** శస్త్రచికిత్సకు ముందు మోకాలి దగ్గర కదలికలు చాలా పరిమితంగా మాత్రమే ఉన్నవారికి ఆ తర్వాత కదలికలు పెరుగుతాయి. అయితే మునుపు అంతగా స్టిఫ్‌గా లేనివారితో పోలిస్తే ఇలా స్టిఫ్‌గా ఉన్నవారిలో కదలికలు అంతగా పెరగకపోవచ్చు.



● **నొప్పి తీవ్రత ఎక్కువ తక్కువలు :** నొప్పి తక్కువగా ఉన్నవారు ఫిజియో వ్యాయామాలను సమర్థంగా చేయగలుగుతారు అందుకే వారిలో మెరుగుదల గణనీయంగా ఉండవచ్చు. నొప్పి విపరీతంగా ఉన్నవారిలోనూ, వ్యాయామాల సమయంలో నొప్పిని అంతగా భరించలేనివారిలో వ్యాయామాలు అంత ఎక్కువగా లేకపోవడం వల్ల పూర్తిస్థాయి నార్మల్ కదలికలు రాకుండా కేవలం పరిమితంగా మాత్రమే మెరుగుదల కనిపించవచ్చు. ఇలా నొప్పి ఎక్కువగా ఉండేవారు దాన్ని భరించాల్సిన అవసరం లేదు. డాక్టర్‌ను సంప్రదించి నొప్పి వాళ్ల ఆధ్వర్యంలో నివారణ మందులు వాడుతూ వ్యాయామాలు చేస్తూ తాము కోరుకున్న స్థాయి మెరుగుదలను పొందవచ్చు.

మెరుగుదల ఆధారపడే అంశాలివే...

శస్త్రచికిత్స తర్వాత కాలి కదలికలు మామూలుగా మారడం లేదా మోకాలి దగ్గర నార్మల్‌గా ఉండటం అన్నవి కొన్ని అంశాల మీద ఆధారపడి ఉంటుంది. వాటిలో ప్రధానమైనవి...

● **శస్త్రచికిత్సలో ఏ టెక్నిక్ వాడారనే అంశం :** శస్త్రచికిత్సలో ఏ తరహా టెక్నిక్ వాడారనే అంశంతో పాటు శస్త్రచికిత్స సమయంలోనే లోపల ఉన్న అవరోధాలనూ, వైకల్యాలను, ఇతరత్రా సమస్యలను ఏ మేరకు రిపేర్ చేశారనే అంశాలపై కూడా శస్త్రచికిత్స తర్వాతి మెరుగుదల ఆధారపడి ఉంటుంది.



డా॥ ప్రవీణ్ మేరెడ్డి,
సీనియర్ కన్సల్టెంట్
ఆర్థోపెడిక్ సర్జన్.

● **కృత్రిమ మోకాలు తాలూకు డిజైన్ :** కృత్రిమంగా లోపల అమర్చే భాగాన్ని 'ప్రోస్థెసిస్' అంటారు. ఈ ప్రోస్థెటిక్ డిజైన్‌ను బట్టి కూడా మెరుగుదల ఉంటుంది. ఇప్పుడు కొత్తగా అందుబాటులోకి వస్తున్న డిజైన్‌లు మోకాలి కీళ్ల దగ్గర కదలికలు ఫుల్ రేంజ్‌లో చాలా ఎక్కువగా (గరిష్ఠంగా) ఉండేలా డిజైన్ చేసినవి అందుబాటులోకి వస్తున్నాయి.



ఈ జాగ్రత్తలు తప్పనిసరి...

● శస్త్రచికిత్స సమయంలో పెట్టే గాటు వద్ద కొందరికి స్పర్శ తెలియకపోవడం (నంబ్‌నెస్) లాంటి లక్షణాలు కనిపిస్తే మరికొందరిలో అక్కడ ముట్టుకోనివ్వకపోవడం (హైపర్‌సెన్సిటివిటీ) లాంటి లక్షణం కనిపించవచ్చు. అందుకే బాధితులలో కనిపించే లక్షణం ఏదైనా దాని గురించి ఆందోళన వద్దు. దాని గురించి ఇతర బాధితుల లేదా శస్త్రచికిత్స జరిగినవారితో మీ భావాలు పంచుకోకుండా కేవలం మీ డాక్టర్‌తో మాట్లాడటమే మంచిది.

● శస్త్రచికిత్స గాయం దగ్గర ఇలా స్పర్శ తెలికుండా ఉన్న కొందరిలో గాటు పెట్టిన భాగం పొడిగా ఉండటంతో పాటు అక్కడ దురద వస్తుండటం జరగవచ్చు. ఇలాంటప్పుడు అక్కడ పైపూతగా రాసే మాయిష్చరైజర్ (టాపికల్ మాయిష్చరైజర్) రాయడం మంచిది.

మోకాలి కీలు మార్పిడి శస్త్రచికిత్స తర్వాత... చేయాల్సినవీ... చేయకూడనివి...

మోకాలి కీలు మార్పిడి శస్త్రచికిత్స తర్వాత గాయం నయం కావడం గానీ లేదా మెరుగుదల గానీ, కృత్రిమ కీలు చాలా రోజులు మన్నికతో ఉండటానికి గానీ పాటించాల్సిన సూచనలలో ప్రధానమైవి...

చేయాల్సినవి...

● బరువు అదుపులో ఉంచుకోవడం (స్థూలకాయం వల్ల కృత్రిమ కీలుపై బరువు పడటం వల్ల మన్నిక తగ్గే అవకాశమున్నందున బరువును అదుపులో ఉంచుకోవడం అవసరం).

● కృత్రిమ కీలు వద్ద తగినంత కదలికలూ, కీలుకు అవసరమైన బలం సమకూరడంతో పాటు అది చాలాకాలం మన్నికతో ఉండటం కోసం క్వాడ్రసెప్, హ్యామ్‌స్ట్రింగ్ కండరాలకు బలం చేకూరే వ్యాయామాలు చేయడం.

● క్రమం తప్పకుండా ఈత (స్విమ్మింగ్), సైక్లింగ్, నడక (వాకింగ్) వ్యాయామాలు.

ఇక్కడ పేర్కొన్న వ్యాయామాల్లో బాధితులకు అనువుగా ఉన్నవాటిని రోజుకు 30 నుంచి 45 నిమిషాల పాటు వారంలో కనీసం ఆరు రోజుల పాటు చేస్తుండాలి.

చేయకూడనివి...


● పరుగు (రన్నింగ్), ఆటలాడటం వంటి వ్యాయామాలు వద్దు. దీనివల్ల అమర్చిన కృత్రిమ కీలుపై భారం ఎక్కువగా పడి అక్కడ గాయం రేగవచ్చు.

● మోకాళ్లు పూర్తిగా ముడుచుకునేలా గుంజీళ్లు తీయడం వంటి వ్యాయామాలూ, అలాగే గొంతుక్కూర్చోవడం, బాసిపట్లు వేసి కూర్చోవడం వద్దు.

● కృత్రిమ కీలు (ప్రోస్థెసిస్)లోని పాలీ ఇథిలీన్ / ప్లాస్టిక్ స్పేసర్ భాగం కొంత సున్నితమైనది. కాబట్టి నడక, కఠిన వ్యాయామాలు, రఫ్‌గా ఉపయోగించడం వంటి సందర్భాల్లో కొంత విచక్షణ పాటించి జాగ్రత్తగా చూసుకోవడం మేలు.


● నరాలకు సంబంధించిన సమస్యలుగానీ లేదా నడకలో నొప్పిగాని ఉంటే వాకర్ లేదా వాకింగ్ స్టిక్ వంటి ఉపకరణాల సహాయం తీసుకోవడం మంచిది.

శస్త్రచికిత్స సమయంలో పెట్టే గాటు వద్ద కొందరికి స్పర్శ తెలియకపోవడం (నంబ్‌నెస్) లాంటి లక్షణాలు కనిపిస్తే మరికొందరిలో అక్కడ ముట్టుకోనివ్వకపోవడం (హైపర్‌సెన్సిటివిటీ) లాంటి లక్షణం కనిపించవచ్చు. అందుకే బాధితులలో కనిపించే లక్షణం ఏదైనా దాని గురించి ఆందోళన వద్దు. శస్త్రచికిత్స గాయం దగ్గర ఇలా స్పర్శ తెలికుండా ఉన్న కొందరిలో గాటు పెట్టిన భాగం పొడిగా ఉండటంతో పాటు అక్కడ దురద వస్తుండటం జరగవచ్చు. ఇలాంటప్పుడు అక్కడ పైపూతగా రాసే మాయిష్చరైజర్ (టాపికల్ మాయిష్చరైజర్) రాయడం మంచిది.



చివరగా... కృత్రిమ కీలు కొత్తగా శరీరంలోకి వచ్చి చేరిన భాగమైనందువల్ల మిగతా అవయవాల లాగే దాని గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని జాగ్రత్తగా ఉండాలి. ఈలోపు జ్వరం, గాయం దగ్గర తీవ్రమైన నొప్పి రావడం లేదా ఎర్రగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తుంటే తక్షణం డాక్టర్‌ను సంప్రదించాలి. అలాగే చెవి, గొంతు, మూత్రసంబంధ ఇన్ఫెక్షన్లు కనిపించినా వెంటనే డాక్టర్‌ను కలవాలి. అంతే తప్ప సొంత చికిత్స రూపంలో యాంటీబయాటిక్స్ వాడటం సరికాదు.

పైన పేర్కొన్న సూచనలతో కృత్రిమ కీలును దాదాపు 15 నుంచి 20 ఏళ్ల మన్నేలా జాగ్రత్త పడవచ్చు.



సెమీస్‌లో సాత్విక్–చిరాగ్ జోడీ ఓటమి

సింగపూర్: భారత స్టార్ బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సెమీ ఫైనల్లో పరాజయం పాలైంది. వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీ పురుషుల డబుల్స్ సెమీస్‌లో శనివారం సాత్విక్–చిరాగ్ జంట 21–19, 10–21, 18–21తో ఆరోన్ చియా–సోహ్ యిక్ (మలేసియా) ద్వయం చేతిలో ఓడింది. 64 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్ గెలిచిన భారత జోడీ... ఆ తర్వాత రెండో గేమ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో చక్కటి ప్రదర్శన కనబర్చినప్పటికీ... కీలక సమయాల్లో పాయింట్లు కోల్పోయి పరాజయం వైపు నిలిచింది. ఈ ఏడాది సాత్విక్–చిరాగ్ జోడీకి ఇది మూడో సెమీఫైనల్ ఓటమి. అంతకుముందు ఇండియా ఓపెన్, మలేసియా ఓపెన్‌లోనూ ఈ జంట సెమీస్‌లోనే పరాజయం పాలైంది. పారిస్ ఒలింపిక్స్‌లో మలేసియా ప్లేయర్ల చేతిలోనే ఓడి ఇంటి బాటపట్టిన భారత షట్లర్లు ఈ సారి కూడా వారిపై విజయం సాధించలేకపోయారు.

ఫైనల్ చేరేదెవరో!

నేడు ఐపీఎల్ క్వాలిఫయర్–2 | **పంజాబ్ కింగ్స్‌తో ముంబై ఇండియన్స్ ఢీ**

అహ్మదాబాద్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్ 18వ సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఇప్పటికే ఫైనల్ చేరగా... రెండో ఫైనలిస్ట్‌ను తేల్చే సమరానికి సమయం ఆసన్నమైంది. ఆదివారం క్వాలిఫయర్–2లో ముంబై ఇండియన్స్‌తో పంజాబ్ కింగ్స్ తలపడనుంది. క్వాలిఫయర్–1లో బెంగళూరు చేతిలో ఘోర పరాజయం ఎదుర్కొన్న పంజాబ్... ఈ పోరులో సత్తా చాటి ఫైనల్లో మరోసారి బెంగళూరును ఎదుర్కోవాలని భావిస్తోంది. మరో వైపు పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచి... ఎలిమినేటర్‌లో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తుచేసిన ముంబై ఇదే జోరులో పంజాబ్‌పై గెలిచి ఫైనల్ చేరాలని పట్టుదలగా ఉంది. క్వాలిఫయర్–1లో టాపార్డర్ విఫలమవడంతో పంజాబ్ 101 పరుగులకే పరిమితమై ఘోర ఓటమి మూటగట్టుకోగా... ఎలిమినేటర్‌లో గుజరాత్ బౌలింగ్‌ను ఓ ఆటాడుకుంటూ ముంబై భారీ స్కోరు చేసింది. ఈ సీజన్‌లో ఇరు జట్ల మధ్య జరిగిన పోరులో పంజాబ్ విజయం సాధించింది. ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ సమష్టి ప్రదర్శన ముందు... ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేకపోయిన పంజాబ్ కింగ్స్ ఏమాత్రం నిలుస్తుందో చూడాలి!

టాపార్డర్ రాణిస్తేనే...

ఈ సీజన్‌లో ఆడిన 15 మ్యాచ్‌ల్లో ఏడింట రెండొందల పైచిలుకు స్కోర్లు చేసిన పంజాబ్ జట్టు... టాపార్డర్ ప్రదర్శనపై అతిగా ఆధారపడుతోంది. అన్‌క్యాప్‌డ్ ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రియాన్ష్ ఆర్య నిలకడకు ఇన్‌గ్లిస్, శ్రేయస్ మెరుపులు తోడవడంతో పంజాబ్ వరస విజయాలు సాధించగలిగింది. అయితే సొంత గడ్డపై జరిగిన క్వాలిఫయర్–1లో మాత్రం ఈ నలుగురు మూకుమ్మడిగా విఫలమవడంతో... జట్టు మూల్యం చెల్లించుకోక తప్పలేదు. ఐపీఎల్లో మూడు వేర్వేరు జట్లను 'ప్లే ఆఫ్స్'కు చేర్చిన శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీకి... రికీ పాంటింగ్ వ్యూహాలు తోడవడంతో ఈ సీజన్‌లో పంజాబ్ పట్టికలో అగ్ర స్థానం దక్కించుకోగలిగింది. దీంతోనే క్వాలిఫయర్–1లో ఓడినా... ఫైనల్ చేరేందుకు మరో అవకాశం దక్కింది. ఈ సీజన్‌లో ప్రభ్‌సిమ్రన్ 517 పరుగులతో పంజాబ్ తరఫున అత్యధిక పరుగులు సాధించగా... శ్రేయస్ 516, ప్రియాన్ష్ 431 పరుగులు చేశారు. ఈ ముగ్గురితో పాటు ఇన్‌గ్లిస్, నేహల్, శశాంక్, స్టొయినిస్ సత్తాచాటాలని జట్టు యాజమాన్యం ఆశిస్తోంది. గాయం కారణంగా గత మూడు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగని స్పిన్నర్ యుజ్వేంద్ర చహల్ ఈ మ్యాచ్ ఆడటం ఖాయమే. బౌలింగ్‌లో అర్ష్‌దీప్ సింగ్, అజ్మతుల్లా, జెమీసన్, హర్‌ప్రీత్ బ్రార్ కీలకం కానున్నారు. గత మ్యాచ్ తప్పిదాలను సరిదిద్దుకోకపోతే... 11 ఏళ్ల తర్వాత 'ప్లే ఆఫ్స్'కు చేరిన పంజాబ్ ఇక్కడితోనే ప్రయాణాన్ని ముగించాల్సి ఉంటుంది.



శ్రేయస్ అయ్యర్, హార్దిక్

బుమ్రానే ప్రధాన తేడా!

ఐపీఎల్ నాకౌట్స్‌లో అపార అనుభవం ఉన్న ముంబై ఇండియన్స్ జట్టు మరోసారి కలిసికట్టుగా కదంతొక్కి ఆరో టైటిల్ వేటకు చేరాలని చూస్తోంది. పలువురు ఆటగాళ్ల సేవలు కోల్పోయినా... వారి స్థానాలను భర్తీచేసే ఆటగాళ్లు ఉండటం ముంబైకి కలిసి రానుంది. లీగ్ దశ ముగిసిన తర్వాత రికెల్టన్, విల్ జాక్స్ జట్టును వీడినా... గత మ్యాచ్‌లో తొలిసారి ముంబై జట్టుకు ప్రాతినిధ్యం వహించిన జానీ బెయిర్‌స్టో తన ఆగమనాన్ని ఘనంగా చాటాడు. హైదరాబాద్ ఆటగాడు తిలక్ వర్మ కూడా టచ్‌లోకి రావడం ముంబై బ్యాటింగ్ బలాన్ని మరింత పెంచింది. రోహిత్, బెయిర్‌స్టో జట్టుకు శుభారంభం అందిస్తుంటే... సూర్యకుమార్ యాదవ్ ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలుస్తున్నాడు. ఈ సీజన్‌లో 673 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో ఉన్నాడు. ఆలస్యంగా వేగం పుంజుకున్న రోహిత్ 410 పరుగులు చేయగా... హార్దిక్ పాండ్యా, నమన్ ధీర్ ఫినిషర్ల పాత్ర పోషిస్తున్నారు. గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు కూడా దీపక్ చహర్ అందుబాటులో ఉండటం కష్టమే కాగా... గత మ్యాచ్ చివర్లో కండరాలు పట్టేసిన గ్లీసన్ బరిలోకి దిగుతాడా లేదా చూడాలి. ఇరు జట్ల మధ్య ప్రధాన తేడా బుమ్రా కానున్నాడు. ఆశలే లేని స్థితిలో సైతం తన అద్భుత బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలుపుతిప్పగల సామర్థ్యం ఉన్న బుమ్రాను... పంజాబ్ బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరం.

తుది జట్లు (అంచనా)

పంజాబ్ కింగ్స్: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ ఆర్య, జోస్ ఇన్‌గ్లిస్, నేహల్, శశాంక్, స్టొయినిస్, అజ్మతుల్లా, హర్‌ప్రీత్ బ్రార్, జెమీసన్, చాహల్, అర్ష్‌దీప్.
ముంబై ఇండియన్స్: హార్దిక్ (కెప్టెన్), రోహిత్ శర్మ, బెయిర్‌స్టో, సూర్యకుమార్, తిలక్ వర్మ, నమన్, సాంట్నర్, రాజ్ బావా, గ్లీసన్, బుమ్రా, బౌల్ట్, అశ్వని కుమార్.

పిచ్, వాతావరణం

ఈ సీజన్‌లో అహ్మదాబాద్‌లో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో ఆరింట మొదట బ్యాటింగ్ చేసిన జట్లు విజయం సాధించాయి. ఈ నేపథ్యంలో టాస్ కీలక పాత్ర పోషించవచ్చు. మ్యాచ్‌కు వర్షం ముప్పులేదు.

ఐపీఎల్‌లో నేడు క్వాలిఫయర్–2
పంజాబ్ X ముంబై
వేదిక: అహ్మదాబాద్
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో

ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను 24 పతకాలతో ముగించిన భారత్
ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ ఫలితాలు సహా
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

కరుణ్ నాయర్ డబుల్ సెంచరీ

- భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్ 557
- ఇంగ్లండ్ లయన్స్ 237/2
- మొదటి అనధికారిక టెస్టు



కాంటర్‌బరీ: కరుణ్ నాయర్ (281 బంతుల్లో 204; 26 ఫోర్లు, 1 సిక్స్) డబుల్ సెంచరీతో చెలరేగడంతో ఇంగ్లండ్ లయన్స్‌తో జరుగుతున్న మొదటి అనధికారిక టెస్టులో భారత్ 'ఎ' జట్టు భారీ స్కోరు చేసింది. దేశవాళీల్లో నిలకడైన ప్రదర్శన కనబర్చి ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికైన కరుణ్ నాయర్ చక్కటి ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 409/3తో శనివారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'ఎ' చివరకు 125.1 ఓవర్లలో 557 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురేల్ (120 బంతుల్లో 94; 11 ఫోర్లు, 1 సిక్స్) తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో అదరగొట్టిన ఆంధ్రప్రదేశ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (7) విఫలమయ్యాడు. శార్దుల్ ఠాకూర్ (27), హర్ష్ దూబే (32), అన్షుల్ కంబోజ్ (23) తలా కొన్ని పరుగులు చేశారు. ఇంగ్లండ్ లయన్స్ బౌలర్లలో జోష్ హాల్, జమాన్ అక్తర్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ లయన్స్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 52 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. టామ్ హైన్స్ (147 బంతుల్లో 103 నాటౌట్; 11 ఫోర్లు) అజేయ సెంచరీతో ఆకట్టుకోగా... మ్యాక్స్ హోల్డెన్ (61 బంతుల్లో 64 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. ఎమిలియో (46) ఫర్వాలేదనిపించాడు. బ్యాటింగ్‌లో సత్తాచాటిన భారత 'ఎ' ఆటగాళ్లు... బౌలింగ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోవడంతో ఇంగ్లండ్ లయన్స్ ప్లేయర్లు స్వేచ్ఛగా పరుగులు రాబట్టారు. అన్షుల్ కంబోజ్, హర్ష్ దూబే చెరో వికెట్ పడగొట్టగా... ముకేశ్ కుమార్, హర్షిత్ రాణా భారీగా పరుగులు ఇచ్చుకున్నారు. బ్యాటింగ్‌లో ఆకట్టుకోలేకపోయిన నితీశ్ రెడ్డి బౌలింగ్‌లో 3 ఓవర్లే వేసి 27 పరుగులు సమర్పించుకున్నాడు. నాలుగు రోజుల ఈ పోరులో... చేతిలో 8 వికెట్లు ఉన్న ఇంగ్లండ్ లయన్స్ జట్టు భారత్ 'ఎ' స్కోరుకు ఇంకా 320 పరుగులు వెనుకబడి ఉంది. టామ్ హైన్స్, హోల్డన్ క్రీజులో ఉన్నారు. మూడో రోజు భారత బౌలర్లు ఎలాంటి ప్రభావం కనబరుస్తారో చూడాలి.

యూఈఎఫ్‌ఏ అధ్యక్షుడితో జై షా భేటీ



మ్యూనిచ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్ జై షా యూరోప్ పర్యటనలో ఉన్నారు. క్రికెట్‌కు మరింత ప్రచారం కల్పించేందుకు సాగుతున్న ఈ టూర్‌లో భాగంగా జై షా... జర్మనీలోని మ్యూనిచ్‌లో యూనియన్ ఆఫ్ యూరోపియన్ ఫుట్‌బాల్ అసోసియేషన్స్ (యూఈఎఫ్‌ఏ) అధ్యక్షుడు అలెక్‌సాండర్ సిఫెరిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం ఇంటర్ మిలాన్, పీఎస్‌జీ జట్ల మధ్య యూఏఎఫ్‌ఏ చాంపియన్స్ లీగ్ ఫైనల్ పోరు జరగనున్న నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. 'చాంపియన్స్ లీగ్ ఫైనల్‌కు ముందు క్రికెట్ క్రీడకు ప్రతినిధిగా యూఈఎఫ్‌ఏ అధ్యక్షుడు సిఫెరిన్‌ను కలిసే అవకాశం దక్కింది. క్రికెట్‌ను మరిన్ని దేశాలకు చేరువ చేసేందుకు ఐసీసీ చేస్తున్న ప్రయత్నంలో భాగంగా ఇతర క్రీడలకు చెందిన ప్రముఖులతో కలిసి చర్చించటం ఎప్పుడైనా సంతృప్తినిస్తుంది' అని జై షా ట్వీట్ చేశారు. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చిన నేపథ్యంలో ఇటీవలే అంతర్జాతీయ ఒలింపిక్ మండలి (ఐఓసీ) మాజీ అధ్యక్షుడు థామస్ బాచ్‌కు కూడా జై షా కలిశారు.

సాక్షి సినిమా

హరిహర వీరమల్లుని ఆపడం కోసమే బంద్ అనడం దుర్మార్గం

- పర్సంటేజీ అంశాన్ని పక్కదారి పట్టించి 'హరిహర వీరమల్లు'ని ఫోకస్ చేయడం దారుణం
- సింగిల్ థియేటర్లు, చిన్న నిర్మాతలను బతికించాలి

– దర్శక-నిర్మాత-నటుడు ఆర్. నారాయణమూర్తి



"హరిహర వీరమల్లు' సినిమాని ఆపడం కోసమే జూన్ 1 నుంచి పర్సంటేజీలు ఇవ్వకపోతే థియేటర్లు బంద్ ప్రకటిస్తున్నారనే మాట రావడం దుర్మార్గం. అది అబద్ధం. 'బంద్ విషయంలో కుట్ర ఉంది. ఆ కుట్రదారులెవరో తెలుసుకోవాలి?' అని పవన్ కల్యాణ్‌గారి ఆఫీసు నుంచి లేఖ రావడం, ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్‌గారు మాట్లాడటం కరెక్ట్ కాదు" అని ప్రముఖ నటుడు-దర్శక-నిర్మాత ఆర్. నారాయణమూర్తి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో పంచుకున్న విశేషాలు ఈ విధంగా...

- ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న నంది అవార్డులను తెలంగాణలో 'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్' పేరిట రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం ప్రకటించడం ఆనందంగా ఉంది. ఇండస్ట్రీ ఉనికిని గుర్తించి, గౌరవించినందుకు సీఎంకి, ఆయన టీమ్‌కి థ్యాంక్స్. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నటువంటి నంది అవార్డులను ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రకటించాలని సీఎం చంద్రబాబు నాయుడుగారికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఇక ఇండస్ట్రీలోని 80 శాతం మంది పర్సంటేజీ కావాలనే విషయంపై ప్రొడ్యూసర్ కౌన్సిల్, ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ చర్చలు జరుపుతున్న దశలో ఎప్పుడు చర్చలు సఫలమవుతాయా? అని ఎదురు చూసే నాలాంటి నిర్మాతలకి ఈ మధ్య ఒక విషయం వల్ల తీరని విఘాతం కలిగింది.
- సినిమా పరిశ్రమకు చెందిన ప్రొడ్యూసర్ కౌన్సిల్, ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ థియేటర్ల బంద్ ప్రకటిస్తున్నట్లు ఎప్పుడూ చెప్పలేదు. ప్రజాస్వామ్యంలో బంద్ అనేది బ్రహ్మాస్త్రం. ఇండస్ట్రీలో బంద్ ప్రకటించాలంటే విధి విధానాల ప్రకారం మూడు వారాల ముందు ప్రకటించాలి, ఏ విషయంపై అన్నది నిర్మాతలకు తెలియజేయాలి. అలా చెప్పడం రిలీజ్ డేట్ ప్రకటించుకున్న నిర్మాతలను ఇబ్బంది పెట్టకుండా ఉండేందుకే. ఒకవేళ జూన్ 1న బంద్ ప్రకటిస్తే రెండు వారాల ముందు కూడా కాదు కదా? మరి... ఈ నిబంధన ఏ రకంగా 'హరిహర వీరమల్లు'కి వర్తిస్తుంది? అది కరెక్ట్ కాదు. పవన్ కల్యాణ్ మీద ఎవరండీ కుట్ర పన్నుతారు?
- తెలుగు పరిశ్రమలోని ఎన్టీఆర్‌గారు నటుడిగా, సీఎంగా భారతదేశంలో మన తెలుగు ఖ్యాతిని చాటి చెప్పారు. అందుకు మనమందరం గర్విస్తాం. ఆయన తర్వాత పవన్ కల్యాణ్‌గారు 'జనసేన' పార్టీ పెట్టి ఉప ముఖ్యమంత్రి అయ్యారంటే తెలుగు పరిశ్రమ గర్విస్తోంది. ఏ రకంగానూ పవన్‌గారికి మేము దూరం కాము. కానీ, ఆయన ఆఫీసు నుంచి ఆ లేఖ రావడం కరెక్ట్ కాదు. ప్రపంచ యుద్ధాలను కూడా చర్చల ద్వారా ఆపొచ్చని మహాత్మా గాంధీగారు అన్నారు. ఒక డిప్యూటీ సీఎంగా మీరు అక్కడి సీఎం చంద్రబాబుగారితో మాట్లాడి... 'హరిహర వీరమల్లు' విషయం ఎత్తకుండా... ఇండస్ట్రీ కష్టాల్లో ఉన్నప్పుడు 'రండి.. చర్చిద్దాం.. మాట్లాడుకుందాం' అని ఒక పెద్దన్న పాత్ర పోషించి ఉంటే ఒక ఇండస్ట్రీ బిడ్డగా మిమ్మల్ని ఎంత గౌరవించేవాళ్లం... ఆ పని మీరు చేయండి పవన్ కల్యాణ్ గారు. ఎందుకంటే పర్సంటేజీ విధానం వల్ల ఇండస్ట్రీకి మేలు జరుగుతుంది. ఈ విధానం లేకపోవడం వల్ల సగటు నిర్మాతలు నాశనం అయిపోతున్నారు.
- గత 25 ఏళ్లుగా పర్సంటేజీ విధానాన్ని కోరుతున్న వ్యక్తుల్లో నేనూ ఒక్కణ్ణి. ఈ విషయంపై గత ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షులైన సి. కల్యాణ్, కిరణ్ వంటివార్లకు విజ్ఞప్తి చేసినా అమలు కాకపోవడంతో ఫిల్మ్ ఛాంబర్ ముందు టెంటు వేసి ఆందోళనలు చేశాం. సమస్య పరిష్కారం కాలేదు. నేను స్వయంగా వెళ్లి రామానాయుడుగారికి విజ్ఞప్తి చేస్తే... 'పర్సంటేజీ విధానం కావాలి. లీజ్, రెంట్ విధానం ఉండకూడదు. సురేష్‌బాబుతో మాట్లాడతాను' అన్నారాయన. కానీ, కాలేదు. ఆ తర్వాత అల్లు అరవింద్, సునీల్ నారంగ్, 'దిల్' రాజువంటివార్లను కలిశాం... వారు కూడా ఓకే అన్నారు కానీ పర్సంటేజీ విధానం అమలు కాలేదు. ఆ సమయంలో ఇండస్ట్రీ పెద్ద అయిన దాసరి నారాయణరావుగారితో కేఎస్ రామారావు, తమ్మారెడ్డి భరద్వాజ, నేను, సి. కల్యాణ్, తెలంగాణ డిస్ట్రిబ్యూటర్ అయిన వీఎస్ఆర్ నాగేశ్వర రావుగారు కూర్చొని చర్చించాం. పర్సంటేజీ విధానానికి దాసరిగారు ఓకే అని ముందుకు తీసుకెళ్లారు. కానీ, అమలు కాలేదు. ఆ తర్వాత ఇండస్ట్రీ పెద్ద చిరంజీవిగారి వద్దకు వెళ్లి ఇదే సమస్యని విన్నవించాం. ఆయన కూడా కృషి చేసినా అమలు కాలేదు.
- కార్పొరేట్ సంస్థలు, మల్టీప్లెక్స్‌లలో 50:50 విధానం కొనసాగుతోంది. మరి... సింగిల్ థియేటర్స్‌కి ఏమైంది? సినిమా అంటేనే తల్లి, తండ్రి, నిర్మాత. చూసే ప్రేక్షకులు దేవుళ్లు. ఇద్దరి మధ్య థియేటర్ అన్నది ఓ దేవాలయం. ఆ దేవాలయాలు బాగుండాలి. ఇవాళ థియేటర్లు మూత పడుతున్నాయంటే ఇలాంటి విధానం వల్లే. చిన్న నిర్మాతలను, సింగిల్ థియేటర్లను బతికించుకోవాలి. పర్సంటేజీ విధానం ఉంటేనే ఇద్దరూ బాగుంటారు. ఈ విధానం ఉండాలని, దాన్ని అమలు చేయాలని, ఎలా చేస్తే బాగుంటుందన్న దానిపై చర్చించాలని పవన్‌గారికి విజ్ఞప్తి చేస్తున్నా. ఈ విధానాన్ని అమలు చేసి సగటు నిర్మాతను బతికించాలని ప్రొడ్యూసర్ కౌన్సిల్, ఫిల్మ్ చాంబర్‌లకు విజ్ఞప్తి చేస్తున్నాను.
- ప్రభుత్వం టిక్కెట్ ధరలు నిర్ణయించాలి? ఆ ధరల్ని అందరూ గౌరవించి, అమలు చేయాలి. భారీ ఖర్చుతో సినిమాలు తీయడం సబబే, కానీ ఆ ఖర్చును ప్రేక్షకులపై రుద్దడం సరికాదు. టిక్కెట్ ధరల పెంపునకు ప్రభుత్వాలు అనుమతి ఇవ్వడం వల్ల ప్రేక్షకులు తీవ్రంగా నష్టపోతున్నారు. మల్టీప్లెక్స్‌లలో వెయ్యి లేదా పదిహేను వందలు ఉంటేగానీ సినిమా చూడలేకపోతున్నారు. పేదవాళ్లకు వినోదం భారం చేయడం ఏ న్యాయం?
- హాలీవుడ్‌లో ఎన్నో వందల కోట్లతో సినిమాలు తీస్తున్నారు. మన దగ్గర 'షోలే', 'మొఘల్ ఏ ఆజాం' లాంటి సినిమాలు వచ్చాయి. వాటికోసం ధరలు పెంచలేదు. తెలుగులో 'లవకుశ' సినిమాని ఐదేళ్లు తీశారు... ఆ సినిమాకు టిక్కెట్ ధరలు పెంచమని దర్శక-నిర్మాతలు అడగలేదు. కానీ ఎంతో లాభాలు వచ్చాయి. సినిమా బాగుంటే జనాలు వస్తారు... లాభాలు వస్తాయి. టిక్కెట్ ధరలు పెంచడం వల్ల అభిమానులే వాళ్ల హీరోల సినిమాలు చూడటం లేదు. భారీ చిత్రాలు తీసే నిర్మాతలు, ప్రభుత్వం టిక్కెట్ ధరల పెంపు వల్ల ఒక బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నాయి. అది కరెక్ట్ కాదు. టిక్కెట్ ధరలు పెంచొద్దు. పర్సంటేజీ విధానం అమలు చేయాలి... ఇండస్ట్రీకి మేలు చేయాలి.

ఆ సినిమాతో లింకు పెట్టడం సరికాదు

పర్సంటేజీ అనేది పెద్ద సమస్య.. ఈ సమస్య 25 ఏళ్లుగా కొనసాగుతోంది. ఈ సమస్య ఓ కొలిక్కి వచ్చిన దశలో 'హరిహర వీరమల్లు'కు లింకు పెట్టడం సరికాదు. ఈ విషయాన్ని తెరపైకి తెచ్చి, పర్సంటేజీ అంశాన్ని పక్కదారి పట్టించి, 'హరిహర వీరమల్లు'ని ఫోకస్ చేయడం ఎంత దారుణం? చంద్రబాబు, పవన్ కల్యాణ్, కందుల దుర్గేశ్‌గార్లకు విజ్ఞప్తి చేస్తున్నా. సినీ పెద్దలు చంద్రబాబుగారిని కలవాలి కదా? అని పవన్ కల్యాణ్ అన్నారు... కలుస్తాం. కానీ పూర్వకాలంలో రాజులు ప్రజల వద్దకు వెళ్లి రచ్చబండలు పెట్టి, సమస్యలను విని, అక్కడికక్కడే పరిష్కరించేవారు. మీరు కూడా ఇండస్ట్రీని పిలిచి, సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసి ఉంటే మేం సంతోషపడేవాళ్లం. మేం మీ బిడ్డలం. మీరు రాష్ట్రానికి తండ్రిలాంటి వాళ్లు. మీకు ఓటు వేసి, గెలిపించినవాళ్లం మేము. మాకు మీరు, మీకు మేము గౌరవం ఇవ్వాలి.

ఈయనతో సినిమా తీయాలని ఫీలింగ్...

– దర్శకుడు శేఖర్ కమ్ముల



చిరంజీవి, శేఖర్ కమ్ముల

''టీనేజ్‌లో ఒకసారి చిరంజీవి గారిని దగ్గరగా చూశాను. 'ఈయనతో సినిమా తీయాలి' అనే ఫీలింగ్ కలిగింది'' అంటూ దర్శకుడు శేఖర్ కమ్ముల సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'డాలర్ డ్రీమ్స్' (2000) చిత్రంతో దర్శకుడిగా మొదలైన ఆయన ప్రయాణం పాతికేళ్లకు చేరుకుంది. ఈ సందర్భాన్ని చిరంజీవి సమక్షంలో జరుపుకోవాలనుకుని ఆయన్ను కలిశారు శేఖర్ కమ్ముల. ఈ నేపథ్యంలో '25 ఇయర్స్ ఆఫ్ శేఖర్ కమ్ముల' సెలబ్రేటింగ్ ది సోల్ ఆఫ్ స్టోరీ టెల్లింగ్ పోస్టర్'ని చిరంజీవి ఆవిష్కరించి, అభినందించారు. ఆ ఫొటోలను షేర్ చేసి, ''కొన్ని తరాలకు స్ఫూర్తినిచ్చిన వ్యక్తి చిరంజీవిగారు. 'కలలను సాకారం చేసుకోవడానికి కృషి చేస్తే.. సక్సెస్ మనల్ని ఫాలో అయి తీరుతుంది' అన్న నమ్మకం ఇచ్చింది చిరంజీవిగారే. అందుకే నా 25 ఏళ్ల ప్రయాణం తాలూకు సెలబ్రేషన్‌ని ఆయన సమక్షంలో చేసుకోవాలనిపించింది. ఇప్పుడు ఈ క్షణాల్లో మాత్రమే కాదు... నా టీనేజ్ నుంచి మీరు (చిరంజీవి) నా ముందు ఇలానే ఉన్నారు'' అని రాసుకొచ్చారు శేఖర్ కమ్ముల. ఇక 'డాలర్ డ్రీమ్స్' తర్వాత 'ఆనంద్, గోదావరి, హ్యాపీడేస్, లీడర్, ఫిదా, లవ్‌స్టోరీ' వంటి చిత్రాలతో తనలో సెన్సిబుల్ డైరెక్టర్ ఉన్నాడని నిరూపించుకున్నారు శేఖర్ కమ్ముల. ప్రస్తుతం నాగార్జున-ధనుష్ లీడ్ రోల్స్‌లో ఆయన దర్శకత్వం వహించిన 'కుబేర' చిత్రం జూన్ 20న విడుదల కానుంది.



నార్నే నితిన్, సంపద

సక్సెస్ అంటే...

నార్నే నితిన్ హీరోగా సతీష్ వేగేశ్న తెరకెక్కించిన చిత్రం 'శ్రీ శ్రీ శ్రీ రాజావారు'. ఈ సినిమాలో సంపద హీరోయిన్. చింతపల్లి రామారావు, ఎం. సుబ్బారెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సతీష్ వేగేశ్న మాట్లాడుతూ– ''మనల్ని మనం జయించుకోవడమే సక్సెస్ అంటే అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను రూపొందించాం. ఈ సినిమా ప్రేక్షకులను నిరాశపర్చదు'' అన్నారు. ''గ్రామీణ నేపథ్యంలో సాగే వైవిధ్యమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. ఎన్టీఆర్‌గారు ఎంతో మెచ్చి, ఈ కథను ఎంపిక చేశారు'' అన్నారు చింతపల్లి రామారావు.

నాన్నగారి నుంచి నాకు వచ్చిన ఆస్తి అవి

– మంచు మనోజ్



విజయ్ కనకమేడల, రోహిత్, మనోజ్, అదితీ శంకర్, సాయి శ్రీనివాస్, రాధామోహన్

''తొమ్మిదేళ్ల తర్వాత 'భైరవం'తో ప్రేక్షకుల ముందుకు వచ్చాను. నన్ను ఎంతో గొప్పగా ఆదరించినందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు. మీ అందరి సపోర్టు ఇలానే ఉండాలని కోరుకుంటున్నాను. నన్ను మళ్లీ ఆశీర్వదించిన సినీ కళామతల్లికి నమస్కరిస్తున్నాను. ఈ చిత్రంలో నా వాయిస్, డిక్షన్ మా నాన్నగారిలా (మోహన్‌బాబు) అనిపించిందంటున్నారు. ఇది కావాలని ట్రై చేయలేదు. అది డీఎన్‌ఏ. అవి ఆయన దగ్గర నుంచి నాకు వచ్చిన ఆస్తి'' అని మంచు మనోజ్ తెలిపారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా, అదితీ శంకర్, ఆనంది, దివ్య పిళ్లై హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వంలో జయంతిలాల్ గడా సమర్పణలో కేకే రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం మే 30న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం 'బ్లాక్ బస్టర్ బీభత్సం' పేరుతో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో విజయ్ కనకమేడల మాట్లాడుతూ– ''ముగ్గురు హీరోలని హ్యాండిల్ చేయడం చాలా ఈజీ. కానీ, కథలో మూడు క్యారెక్టర్స్‌ని బ్యాలెన్స్ చేయడం కష్టం. ముగ్గురు హీరోలకి ఇది మంచి కమ్ బ్యాక్ అని ఆడియన్స్ చెప్తుంటే హ్యాపీగా అనిపించింది'' అన్నారు. సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో నా నటనకి అద్భుతమైన స్పందన వచ్చింది. ఇది నా కెరీర్‌లో మోస్ట్ మెమొరబుల్ మూవీ'' అని చెప్పారు. ''ఇంత మాస్ క్యారెక్టర్ నేనెప్పుడూ చేయలేదు'' అని పేర్కొన్నారు నారా రోహిత్. ''ముగ్గురు హీరోలతో సినిమా చేసి, హిట్ సాధించాను. ఇక రీ రిలీజ్ సినిమాలను శుక్రవారం కాకుండా సోమవారం చేసుకుంటే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. దీనిపై చర్చలు జరగాలి'' అని కేకే రాధామోహన్ చెప్పారు.

సాక్షి పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



రిటైర్డ్ విడోయర్‌కు 50 సం॥ పై బడిన చదువుకున్న బాదరబందీలేని ఉన్నత కుటుంబమునకు చెందిన జీవిత భాగస్వామి కావలెను. నో బ్రోకర్ డైరెక్ట్. 9440327374 [H-783540]

ముదిరాజ్/B.Tech / C.Govt. JTO/ BSNL/ 78,000pm / 5'10" ఎత్తు / 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8106274466 [HA-16024]

ఒంటరి/CNB/మంచి అందము గుణము గల వరుడికి వధువులు కావలెను. ఇల్లరికం OK. *43Yrs/5'6"/వ్యాపారం/ 40,000/-pm *50/5'10"/సంతోషం గల ఓపెన్ మైండ్ వారు కావలెను. వాట్సాప్. 8333894916, 6303293337 [HA-16024]

క్రిస్టియన్ మాల: M.Tech / C.Govt. Asst. డివిజినల్ ఆఫీసర్ / రైల్వేస్ /1 Lakh PM/ 6' ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 9908222406 [HA-16018]

మోచి కులం: 36 సం॥లు గల వరుడికి తగిన అందమైన వధువు కావలెను. ఫోన్: 9866202205 [HA-16023]

SC మాల: కట్నప్రసక్తి లేదు/B.Tech/ C.Govt. ట్యాక్స్ ఆఫీసర్/ఇన్‌కమ్ ట్యాక్స్ Dept/ 80,000/- pm/ 5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ఫోన్: 8341650195 [HA-16023]

యాదవ: కట్నప్రసక్తి లేదు / M.Tech/ C. Govt. ఇంజినీర్/రైల్వే / 90,000/- pm/ 5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ఫోన్: 7075953400 [HA-16023]

హిందూ కుల, కట్న ప్రసక్తి లేని 34 / 5'7" / 9L PA SWE/ బిజినెస్ Hyd లో సొంత ఇల్లు వున్న అందమైన వరునికి, 1వ, 2 వ సంప్రదాయ పేద కుటుంబం వధువు కావలెను. 83329 96699 [B-755611]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/35y/1L PM/Hyd లో సొంత ఇల్లు విల్లాలో 5 ఎ. వ్యవసాయ భూమి గల వెల్ సెటిల్డ్ హైదరాబాద్ వరుడికి ఓల్డ్ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/విడో OK. కుల ప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-782731]

SC-Mala/Hindu / 2nd Marriage/ PG/ 5'10"/40/SWE/1,60,000/- PM Wants. Good Hindu Bride only. Ph: 8187861989 No Brokers [HA-821063]

★★

అన్ని కులాల అన్ని వయస్సుల వారికి విడోస్, సెపరేట్స్, డైవర్సీ, 1st/2nd సంబంధములు చూడబడును. స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్, ఫాస్ట్ సెటిల్‌మెంట్. సంప్ర : కానే మ్యాట్రిమోనీ. 6281147818 [HA-16029]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel- kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Best Business/Very Potential Boy/Very Handsome/ B.Tech/ MS/ 1993/5'10"/160Cr/8L/M Rents/ * Cont: K.C. Reddy -Hyd. Ph: 9347807015

Reddy/Business/B.Tech/Very Handsome Boy/1990/5'10"/25Cr/40 Laks/ Month Income. * Cont: K.C. Reddy- Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech / MS /Job-Hyd- V.Handsome Boy/100Cr/60Lakhs/Per Yr Salary/ *1997/5'9"/ * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/Business / V.Handsome Boy/ 1997 /5'11"/ B.Tech / * Cont: K.C. Reddy- Mar-Bureau-Pvt. Ltd- -Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/Business / Hyd /V.Handsome Boy/B.Sc/MBA/1995 / 5'9" / 250Cr / 10L/ M. Rents/ * Cont: K.C. Reddy- Mar-Bureau- Hyd. Ph: 9849321309

Reddy/B.Tech / Handsome Boy / 50 L/PA/Salary/1990/30Cr - Needs any grad beautiful * Cont: K.C. Reddy- Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/MBA/(USA)/ 1993/ 5'11"/V.Handsome Boy/400K/100Cr- * Cont: K.C. Reddy-Mar-Bur-Pvt. Ltd- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS / MD/DM/USA-Doctor-V. Handsome Boy/1989/ 5'9"/ 400K/30Cr- * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/USA - Citizen/Handsome Boy / 1986/5'7"/180K/5Cr (Property) Needs-Any Grad-Beautiful-India or USA- * Cont: 9849321309

Reddy/Divorcee/B.Tech/Job /Hyd /1986/ 5'11"/70L/yr/15Cr-Needs any grad-beautiful-. * Cont: K.C. Reddy -Hyd. Ph: 9347807015

వరుడు కావలెను

Reddy/MBBS/PG-Doctor/ *India/ *1998/ 5'5"/50Cr *1996/5'7"/ 15Cr *2000 / 5'6"/ 100Cr *93/5'2"/20Cr *95/ 5'5"/50Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/MBBS/ MD / 1998/5'7"/70Cr *94/ 5'3"/10Cr *90/5'10"/15Cr *97/5'6"/ 500Cr *95/5'3"/50Cr *93/5'3"/50Cr *90/5'6"/100Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/MBBS / PG- Doctor / India * 1995/ 5'7"/20Cr *94/5'4"/50Cr *94/5'10"/50Cr *96/5'5"/50Cr *90/5'5"/50Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/BDS/MDS/Doctors/India * 1995 /5'5"/5Cr *98/5'5"/20Cr *95/5'8"/ 20Cr *99/5'2"/20Cr * Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309/9347807015

Reddy/MBBS/Needs any grad well settled in Business *1996/5'5"/50Cr *93/5'7"/2Cr *96/5'8"/40Cr *97/ 5'6"/ 500Cr. * Cont: 9849321309

Reddy/MBBS / MD / USA - Doctors *1996/ 5'2"/*95/5'7"/*96/5'2"/20Cr * 97/5'5" *95/5'2" *85/5'4"/50Cr *87/5'4" *90/5'6" *91/5'1" * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Divorcee/MBBS/PG-doc *India *1994/5'5"/50Cr *86/5'6"/50Cr *93/5'8"/ 40Cr *93/5'3"/9Cr * Cont: K.C. Reddy- Hyd-Ph: 9347807015 / 9849321309

Reddy/B.Tech / Most Beautiful - Hyd *1995/5'5"/ 100Cr *99/ 5'7"/ 100Cr *94/ 5'5"/ 15Cr *95/5'5"/70Cr *97/5'5"/25Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1 / USA *94/5'8"/8Cr *94/5'4"/20Cr *97/5'4"/100Cr *89/5'6"/30Cr *98/5'4"/10Cr *99/5'6"/100Cr *97/5'5"/10Cr * Cont: K.C. Reddy - Hyd-Ph: 9347807015

Reddy/B.Tech/Divorcee/India *93/ 5'4"/ 10Cr *91/5'4"/10Cr *85/5'5"/400Cr *93/ 5'6"/ 50Cr *95/5'5"/8Cr *93/5'3"/30Cr * Cont: K.C. Reddy -Hyd-Ph: 9849321309 [D-572]

Reddy/41 Yrs/5'.10"/ B.Sc (Comp.) / Fair / Own Business / 8 Lakhs Income /2 Crore Property/ అందమైన వరుడికి వధువు కావలెను. 9848230725. [T-2289]

వరుడు కావలెను



కుల పట్టింపు లేదు/45y/Govt టీచర్/1 లక్ష PM/ విడో/ఒక్క బాబు Hydలో వెల్ సెటిల్డ్ సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకు లేట్ & 1వ, 2వ వరుడు కావలెను. (పిల్లలున్నా & ఇల్లరికం OK) 7286031653 [H-783540]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D. V. Koti Reddy, 690, Road No:3, Banjara Hills (TV-9, Opp: Colony) (Near The Leela Hotel) Hyderabad. (Tuesday & Wednesday Holiday) Timings : 10 AM - 5 PM. www.avinashreddy.com +91 9848011818 / +91 9393311818

వధువు కావలెను

రెడ్డి BE, ME, MS, 28, 5' 10", Developer, 240 K, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (IIT), MS, 29, 6', AI, 140 K, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 11", SWE, 160 K, 15 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Residency Doctor, 25, 5' 3", Rich Family, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 28, 5' 8", SWE, 120 K, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 27, 5' 6", Software Engineer, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 33, 5' 10", Analyst, H1, Rich Family, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 6', Engineer, 300 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 31, 6', Engineer, 120 K, Rich Family, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 30, 5' 6", PG Doctor, 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 6", SWE, 200 K, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 30, 5' 2", USA, Rich, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 2", SWE, 140 K, 4 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 33, 5' 4", SWE, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. LETTER

రెడ్డి/విడో/కుల, అస్తి ప్రసక్తి లేదు/డిగ్రీ, Age: 31/సొంత బిజినెస్ గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికము అయినా OK) 1st/2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. Ph: 9121516873 [HA-16024]

రెడ్డి/2nd మ్యారేజ్ (కుల-ఆస్తి) ప్రసక్తి లేదు. 31Y, Q:B.Com/Business & Property/ అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం) OK. అన్ని వయస్సుల వారికి 1st, 2వ సంబంధాలు కలవు. Ph: 9704782370 [HA-16024]

కమ్మ/50y / విడో/ Railway Job/ Gold Jewellery Shop/16 Lakhs Income / కోట్ల ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. 9347216440 [H-783540]

రాజులు/50y/విడో/MRO/Own Super Market/102 Acres Land/30 Lac Income/ కోట్ల ప్రాపర్టీ గల వధువుకు FC/BC వరుడు కావలెను. 7993818296 [H-783540]

నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో (Since 25 Years)

నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో గత 25 సంవత్సరాలుగా అన్ని ప్రాంతాలవారికి కేవలం రెడ్డి సంబంధాలు మాత్రమే చూస్తూ 4 బ్రాంచీలు కలిగి ఉన్నటువంటి ఏకైక అగ్రగామి సంస్థ మీ నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో Timings 10.30 AM to 6.30 PM

వధువు కావలెను

రెడ్డి/Elite:-1997 / 5'11"/ MSUS/ H1 B / Rental Income/6L PM/USA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Ph : 8885559579 / 9848221166

రెడ్డి/Elite:- 1995/6'2"/MS/Business Hyderabad/ Rental Income/ 60 L. PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Ph : 9505551788 / 9848221166

రెడ్డి/Elite:- 1997/6'1"/BE / MS / USA/ Business Hyderabad/ Rental Income/ 40 L Per Month. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Ph : 7893333726 / 9848221166

రెడ్డి/1997/5'9"/ B.Tech/Sr.Graphic Designer/8L PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Ph : 8885559579 / 9848221166

రెడ్డి/1993/5'11"/B.TechMS / Sr. Mechanical Engineer/140K PA/ H1B/I-140 Aproved సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Ph: 9505551788 / 9848221166

రెడ్డి/1999/5'9"/B.Tech/MS /Software Engineer-II/ Amzon 250K PA సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Ph : 7893333726 / 9848221166

రెడ్డి/1995/5'11"/B.Tech/M.Tech/ 23L PA Salary &Family Income 40 L PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Ph : 8885559579 / 9848221166

రెడ్డి/1992/6'/B.Tech + MS US/H1B I-140 Senior Design Engineer. 315 K PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Ph : 9505551788 / 9848221166

రెడ్డి/1994 / 5'8"/ B.Tech/ MS/ Sr.Project Manager. Salary& Family Business Income/ 80L PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph: 7893333726 / 9848221166

రెడ్డి/1993/5'10"/B.Tech/ MS Canada /150K PA/Canada PR Holder. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Ph : 8885559579 / 9848221166

వరుడు కావలెను

రెడ్డి / Elite:- 1996/5'3"/BBA Gold Medal/MS/ Senior Data Scientist 160K Full time Job/ US Citizen. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1995 / 5'4"/MBA IIM / Product Manager / 42 Lakhs PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1998/5'4" / MBBS / Clinical Dermatology. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి/1995/5'5"/B.Tech/MBA/ Curriculum Designer. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph: 8885559579 / 9848221166

రెడ్డి/1994/5'7"/MBBS/MS Gynocologist Fair & Very Rich. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph: 9505551788 / 9848221166

రెడ్డి / 1996/5'5"/B.Tech/ MS/ USA/ Data Engineer/120K PA/H1B. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph: 7893333726 / 9848221166

రెడ్డి / 1998 / 5'4"/B.Tech/Sales force Developer 12 Lakhs PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph: 8885559579 / 9848221166

రెడ్డి/2000 / 5'5"/B.Tech/Support Analyst Oracle 6 Lakhs PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph: 9505551788 / 9848221166

రెడ్డి/ 1999/5'4"/B.Tech/MS/100K Full Time Job. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి/ 1992 / 5'2"/ B.Tech / Saftware Engineer/16 Lakhs PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph: 8885559579 / 9848221166 LETTER

రెడ్డి/ విడో / 5'5" / Govt. టీచర్/ ట్యూషన్స్ / సొంత ఇల్లు/ఆస్తి కుల పట్టింపులేని వధువుకి వరుడు కావలెను. ఫోన్ : 6281849287 [H-783540]

రెడ్డి/విడో/కుల, ఆస్తి, ప్రసక్తి లేదు/ Age: 35/Qly: Degree. Pvt Job గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK). అన్ని కులాల వారికి వివాహాలు చూడబడును. Ph: 8121347478 [HA-16024]

కుల పట్టింపు లేదు,రెడ్డి 26y B.Tech 5'3" పెద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. 9885492498 [HA-16024]

SC మాల 25/5'4"/B.Tech (IIT) Gold Medalist/SWE/IBM 70,000/-PM Well Settled గల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9346675639 [HA-16024]

కుల పట్టింపు లేదు/విడో/50y Guntur/ లెక్చరర్/Own House (Rents)/Well Settled పిల్లలు పుట్టే అవకాశం లేని ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [HA-16024]

2వ పెళ్లి: కులప్రసక్తి లేదు/ M.Sc / Govt. Jr. Asst/MRO ఆఫీస్/ 50,000/- PM/ 5'4" ఎత్తు/35 సం॥ల పిల్లలు లేని వధువుకి వరుడు కావలెను. Ph: 9618007652 [HA-16018]

కుమ్మరి: B.Tech./C Govt. Asst. మేనేజర్/ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా/9 Lakhs. PA/5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-16018]

SC హిందుమాల: B.Tech./ MBA/ C Govt. ఆఫీసర్/ IOCL/ 15 Lakhs.PA/ 5'4" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-16018]

క్రిస్టియన్ మాదిగ: B.Tech./C Govt. కస్టమ్స్ ఆఫీసర్/ ఎయిర్‌లైన్స్/80,000/- PM/5'5" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-16018]

SC మాల క్రిస్టియన్: B.Tech EEE/GOVT డిప్యూటీ మేనేజర్/SBI/85000/- PM/ 5'4" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9676995093 [HA-16023]

రజక: B.Tech.Govt / బ్యాంక్ Asst. మేనేజర్/SBI/80,000/- PM/5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400 [HA-16023]

క్రిస్టియన్ మాల 25 సంవత్సరాలు, 5'3", 76,000/- P.M. కెనరా బ్యాంకు నందు అసిస్టెంట్ మేనేజర్ వధువునకు కెనరా బ్యాంకులో పనిచేయుచున్న SC (or) BC-C వరుడు కావలెను. సంప్రదించండి ✆ 9494 601 906 [SCA25004342]

Bride/ Kapu Balija/B.Tech, MBA, Most Beautiful/ 1997/5'7"/ 30Cr./Needs Same Caste or Reddy's Cont: 9515790337 Sunder. [HA-16024]

★

Aryavysya/ 34yrs / Fair, good looking/ 5'5"/5 Cr Prop., 20 LPA/ with 7yrs boy/for 2nd marriage. Seeks 35-38yrs well employed Vysya/Brahmin groom preferably at Bangalore, 1st/2nd marriage with or W/o Kids. 9980563027 Brokers Excuse [HA-15165]

వేదికలు



15 రో॥ అన్ని కులాల వారికి తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి మ్యారేజ్ లైన్స్. Wanted Branch Runners. ✆ 94418 29644, 9849058673, 94407 85888, 9493661288 (W) [B-623]

Decent well Settled, Cast nobar, highly qualified kamma, reddy, velama & kapu matches available, Cont: RKR 9100324999, GKC: 91779 50666 [HA-16024]

★

Free Register. పద్మశాలీ వధూ– వరుల స్వయంవరం (online) 29 June/ 2025న bhavanimatrimony, Hyd. వాట్సాప్ No. 9704656103, 9533608887 [HA-1512]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-1495]

క్లుప్తంగా...

వ్యవసాయ శాఖలో రైతు సంక్షేమ విభాగం

రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యవసాయ శాఖకు.. రైతు సంక్షేమ విభాగాన్ని జోడించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధి అనే అంశంపై శనివారం డాక్టర్ చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ)లో ప్రభుత్వ జూనియర్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు జరిగాయి. కార్యక్రమంలో చిన్నారెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో కూడా ఏఐ సాంకేతికత వస్తోందని, దీనివల్ల పంటలకు సోకే వ్యాధులు కచ్చితంగా తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ హెడ్ కెప్టెన్ పాండురంగారెడ్డి, ఫ్యాకల్టీ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీపీవోలుగా మరో అవకాశం ఇవ్వండి

సాక్షి, హైదరాబాద్: గ్రామ పాలనాధికారుల (జీపీవో) నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రాతపరీక్షకు అనేక కారణాలతో హాజరు కాలేకపోయిన, ఆసక్తి ఉన్న పూర్వ వీఆర్వోలు, వీఆర్‌ఏలకు మరోసారి అవకాశం కల్పించాలని రెవెన్యూ ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. ఈ మేరకు మరోమారు జీపీవోల అర్హత పరీక్ష నిర్వహించాలంటూ డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం సీసీఎల్‌ఏ నవీన్‌మిత్తల్, కార్యదర్శి మకరంద్‌లను కలిసి విజ్ఞప్తి చేసింది.

టీచర్ల సర్దుబాటును విరమించుకోవాలి

డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను వెంటనే విరమించుకోవాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సోమయ్య, టి.లింగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్తగా ఉపాధ్యాయులను నియమించకుండా సర్దుబాటు మంత్రం జపించడం సరికాదన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం.. విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:30 అనేది.. కేవలం ఉన్నత పాఠశాలలకే పరిమితం చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలకు ఈ నియమం వర్తింపజేస్తే పూర్తిగా నిర్వీర్యం అవుతుందన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు దిగుమతి సుంకం దెబ్బ

క్రూడ్ ఎడిబుల్ ఆయిల్స్‌పై సుంకాన్ని 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించిన కేంద్రం

- విదేశాల నుంచి భారీగా దిగుమతి కానున్న ఎడిబుల్ ఆయిల్స్
- ఆందోళనలో ఆయిల్‌పామ్ రైతులు



సాక్షి, హైదరాబాద్: ఆయిల్‌పామ్ సాగుకు అడ్డంకులు ఎదురయ్యే పరిస్థితి దాపురించింది. కొన్నేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రత్యేక దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. అయితే కేంద్ర ప్రభుత్వం క్రూడ్ ఎడిబుల్ ఆయిల్స్ (వంట నూనెల ముడి పదార్థాల)పై దిగుమతి సుంకాన్ని 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ సుంకం తగ్గింపు నిర్ణయం శనివారం నుంచే అమలులోకి వస్తుందని స్పష్టం చేసింది. ఇప్పటి వరకు క్రూడ్‌పామ్ ఆయిల్ (సీపీఓ), క్రూడ్ సోయా ఆయిల్, క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్స్‌పై 20 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీ విధించగా... ఇప్పుడు దాన్ని 10 శాతానికి కుదించింది. దీని వల్ల మొత్తం దిగుమతి సుంకం 27.5 శాతం నుంచి 16.5 శాతానికి తగ్గనుంది. గతేడాది సెప్టెంబర్‌లో కేంద్రం ఉమ్మడి విధానంలో మార్పులు చేస్తూ క్రూడ్, రిఫైన్డ్ వెజిటబుల్ ఆయిల్స్‌పై 20 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీ విధించింది. అప్పటి వరకు 5.5 శాతంగా ఉన్న దిగుమతి సుంకం ఒక్కసారిగా పెరిగింది. ఇక రిఫైన్డ్ ఆయిల్స్‌పై అప్పట్లో 35.75 శాతం దిగుమతి సుంకాన్ని విధించారు. తాజా తగ్గింపుతో దేశీయంగా వంట నూనెల ధరలు తగ్గుతాయని భావిస్తున్నా, రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు అధిక నష్టం కలిగే అవకాశముంది.

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగుకు సర్కారు ప్రోత్సాహం

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు నాలుగైదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. సీపీవోపై 5.5 శాతం ఉన్న దిగుమతి సుంకాన్ని గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం 20 శాతానికి పెంచిన నేపథ్యంలో ఆయిల్‌పామ్ ఫల గుత్తులు (ఎఫ్‌ఎఫ్‌బీ- ఫ్రెష్ ఫ్రూట్ బంచెస్)కు ధర ఒక్కసారిగా పెరిగింది. ప్రస్తుతం టన్ను ఎఫ్‌ఎఫ్‌బీ ధర రూ.20,058గా ఉంది. వంట నూనెల వినియోగం దేశంలో గణనీయంగా పెరిగిన నేపథ్యంలో పామాయిల్ ధర కూడా లీటర్ ప్యాకెట్ రూ.120కి పైగా చేరింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచడంతోపాటు రైతులకు అధికాదాయం తెచ్చే పంటలను తీసుకురావాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020–21 నుంచి ఆయిల్‌పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సబ్సిడీలు ఇస్తూ సాగును ప్రోత్సహిస్తోంది. దీంతో వేల ఎకరాల్లో ఉన్న సాగు ప్రస్తుతం 1.44 లక్షల ఎకరాలకు చేరింది. దీనిని ఈ వానాకాలం సీజన్‌లో 2 లక్షల ఎకరాలకు పెంచాలని ప్రభుత్వం విస్తృత ప్రచారం సాగిస్తోంది. ఈ పరిస్థితుల్లో కేంద్రం క్రూడ్ ఎడిబుల్ ఆయిల్స్‌పై దిగుమతి సుంకం తగ్గించడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

పామాయిల్ గెలల ధరలు తగ్గుతాయా?

క్రూడ్‌పామ్ ఆయిల్ (సీపీఓ)పై దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఇండోనేషియా, మలేషియాల నుంచి పెద్ద ఎత్తున సీపీఓ రానుంది. మన దేశ అవసరాలకు ఈ రెండు దేశాల నుంచే 90 శాతం వరకు క్రూడ్ పామాయిల్ దిగుమతి అవుతుంది. ఏపీ, ఒడిశా, తమిళనాడు, తెలంగాణలోఅతి తక్కువ మొత్తంలో ఆయిల్‌పామ్ తోటలు సాగవుతుండగా, వచ్చే నూనె చాలా తక్కువ. సుంకం తగ్గిన నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు కూడా తగ్గుతాయి. దీంతో పామాయిల్ పండ్ల గుత్తుల ధర ప్రస్తుతం టన్నుకు రూ. 20వేలు ఉండగా, అది వెంటనే 10 శాతం వరకు తగ్గే అవకాశం ఉన్నట్టు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా పామాయిల్, సోయాబీన్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ రిటైల్ ధరలు తగ్గే అవకాశం ఉంది.

భాషా బోధనను యథావిధిగా కొనసాగించాలి

- డిగ్రీ భాషా బోధన పరిరక్షణ కమిటీ మీడియా సమావేశం
- పాల్గొన్న ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ కోదండరాం, డాక్టర్ నందిని సిధారెడ్డి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్. చిత్రంలో సిధారెడ్డి తదితరులు


సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కళాశాలల్లో భాషా బోధనను పూర్తి స్థాయిలో కొనసాగించాలని, 150 క్రెడిట్ల నుంచి 120కి తగ్గించడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిగ్రీ భాషా బోధన పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. ఇలా తగ్గించడం వలన మూడువేల మంది బోధనా సిబ్బందిపై వేటుపడే అవకాశం ఉందని కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. భాషా బోధన విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరింది. భాషా బోధనను సాంకేతిక అంశాలతో ముడిపెట్టి యాంత్రిక దృష్టితో చూడకూడదని, భాషా బోధన లేకుండా విద్యారంగంలో ఏ ప్రయోజనమూ ఉండదని తేల్చి చెప్పింది. శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో డిగ్రీ భాషా బోధన పరిరక్షణ కమిటీ నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ కోదండరాం, డాక్టర్ నందిని సిధారెడ్డి, ప్రొఫెసర్లు మాయాదేవి, పాలమూరు అధ్యయన వేదిక బాధ్యులు రాఘవాచారి, నీరజ, నిర్వహణ కమిటీ సభ్యులు సతీశ్ బైరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ, భాష వారధి అని, దాన్ని కాపాడుకోవాలని అన్నారు. భాషను విస్తృత పర్చాలనే ఉద్దేశంతోనే తెలుగు అకాడమీ ఏర్పడిందన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు. కోదండరాం మాట్లాడుతూ డిగ్రీ కళాశాలల్లో క్రెడిట్లు తగ్గించడం సమంజసం కాదన్నారు. దీనిపై ఉన్నత విద్యామండలి చైర్మన్ జోక్యం చేసుకోవాలన్నారు. నందిని సిధారెడ్డి మాట్లాడుతూ విద్యావిధానంలో ప్రమాణాలు మార్చడం సరికాదని హితవుపలికారు. యూజీసీ నిబంధనలను ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి తుంగలో తొక్కుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్‌ఎల్‌ఎం కింద కేంద్రానికి 76 ప్రాజెక్టులు సిఫారసు

సాక్షి, హైదరాబాద్: జాతీయ పశు సంవర్ధక మిషన్ – ఔత్సాహిక అభివృద్ధి కార్యక్రమం (ఎన్‌ఎల్‌ఎం-ఈడీపీ) కింద పశు సంవర్ధక శాఖకు వచ్చిన 90 దరఖాస్తులను పరిశీలించి 76 ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర స్థాయిలో మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసింది. శనివారం పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ హైదరాబాద్‌లోని పశుసంవర్ధక శాఖ ప్రధాన కార్యాలయం నుంచి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లా పశు వైద్యాధికారులతో ఎన్‌ఎల్‌ఎం పథకం రాష్ట్ర స్థాయి కార్యనిర్వాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన దరఖాస్తులు, ఆమోదించిన వాటి వివరాలు వెల్లడించారు. కేంద్రం నుంచి అనుమతి లభించిన తరువాత మాత్రమే ప్రాజెక్టులను ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. అలాంటి ప్రాజెక్టులకే సబ్సిడీ లభిస్తుందనే విషయాన్ని లబ్ధిదారులకు వివరించాలని సబ్యసాచి ఘోష్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ పశుసంవర్ధక శాఖ సంచాలకుడు డా. బి. గోపి, తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి డా.మల్లీశ్వరి, గొర్రెలు, మేకల పెంపకందారుల సమాఖ్య ఎండీ డా.బి. సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌర సమాజాన్ని మరో పోరాటం దిశగా నడపాలి

- టీజేఎఫ్ రజతోత్సవ సభలో వక్తలు
- పాల్గొన్న కోదండరాం, అల్లం నారాయణ, ఘంటా చక్రపాణి, దాసోజు శ్రవణ్




మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం
వేదికపై ఘంటా చక్రపాణి, అల్లం నారాయణ


ఖైరతాబాద్ (హైదరాబాద్): తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎఫ్) 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం జలవిహార్‌లో తెలంగాణ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు అల్లం నారాయణ అధ్యక్షతన రజతోత్సవ సభ నిర్వహించారు. సభలో వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున జర్నలిస్టులు, ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాలు అందకుండా పోతున్నాయని, పౌర సమాజాన్ని మరో పోరాట దిశగా ముందుకు నడిపించేందుకు జర్నలిస్టు ఫోరం ఒక ఎజెండాను తయారుచేసి ఆ దిశగా ముందుకు సాగాలని వక్తలు సూచించారు. అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి మాట్లాడు తూ.. ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యమం ఉధృతమైన సమయంలో విద్యార్థుల్లో జర్నలిస్టు ఫోరం ధైర్యాన్ని నింపిందన్నారు. ఒక లక్ష్యం కోసం జర్నలిస్టులు 25 సంవత్సరాలు అద్భుతమైన పాత్ర పోషించారని ప్రశంసించారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం పాత్ర కీలకమని, ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతులను చేయడంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని చెప్పారు. అల్లం నారాయణ మాట్లాడుతూ 1969లో జర్నలిస్టులు ఎలా పనిచేశారో దాని వారసత్వంగా తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఏర్పడిందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్టుల మీద దాడి జరిగిన ప్పుడు వారి వెనుక తెలంగాణ జర్నలిస్టుల ఫోరం నిలబడిందన్నారు. తెలంగాణను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ఏం చేయాలో ఒక ఎజెండా తయారుచేయాలని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ సూచించారు. ఈ సందర్భంగా 2013లో మరణించిన జర్నలిస్టు రాములు సతీమణికి ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో వేదకుమార్, విఠల్, రమేశ్ హజారీ, శైలేష్‌రెడ్డి, దేవీప్రసాద్, కార్టూనిస్టు నర్సింహం, శ్రీధర్, పిట్టల శ్రీశైలం, ఉద్యమ సంఘాల నాయకులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

విద్యార్థులను అవమానిస్తారా?

బీఆర్‌ఎస్ నేత ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులే మరుగుదొడ్లను కడగాలని ఆదేశాలు ఇచ్చిన ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులు తమ మరుగుదొడ్లను శుభ్రపరిస్తే తప్పేంటని ఐఏఎస్ అధికారి ప్రశ్నిస్తున్నారని.. వారి పిల్లలు కూడా బడిలో కడుగుతున్నారా? అని ప్రశ్నించారు. అందరికంటే పెద్ద మాదిగ, పెద్ద మాల తానేనని రేవంత్ రెడ్డి అంటారని, పేద పిల్లలు మరుగుదొడ్లను కడుక్కోవాలని ఐఏఎస్ అధికారితో ఎట్లా చెప్పిస్తారని నిలదీశారు. ఎస్సీ గురుకులాల విద్యార్థులు తమ మరుగుదొడ్లను శుభ్రపరచుకోవాలని సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి సూచించడం దారుణమని నేతకాని మహార్ సంక్షేమ సంఘం పేర్కొంది. చదువుకునే పిల్లలను అవమానపరిచేలా మాట్లాడటాన్ని ఆ సంఘం అధ్యక్షుడు దుర్గం రాజేష్ తీవ్రంగా ఖండించారు.



సమ్మర్ క్యాంప్స్‌లోనూ ఏఐ

చెస్, డ్యాన్స్, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, డ్రాయింగ్, పెయింటింగ్.. ఇవీ సమ్మర్ క్యాంప్స్ అనగానే మనకు గుర్తొచ్చేవి. అవి కూడా వేసవి సెలవుల్లోనే నేర్చుకునేవారు. కానీ, ఇప్పుడు సమ్మర్ క్యాంప్స్ అర్థమే మారిపోయింది. ఇప్పుడు ఏడాది పొడవునా ఈ క్యాంప్స్ కొనసాగుతున్నాయి. తల్లిదండ్రుల నుంచి వస్తున్న డిమాండ్ నేపథ్యంలో పాఠశాలలు, కో-కరిక్యులర్ యాక్టివిటీస్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థలు.. ఏడాదంతా పిల్లలను వివిధ అంశాల్లో సానబెడుతున్నాయి. మరో ఆసక్తికర అంశం ఏంటంటే.. సమ్మర్ క్యాంప్స్‌లో ప్రాధాన్యతగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) నిలిచి ఔరా అనిపిస్తోంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

కోవిడ్ సమయంలో.. ముఖ్యంగా లాక్‌డౌన్‌లో విద్యార్థులు ఇంటిపట్టునే ఉన్నారు. ఆ సమయంలో పాఠశాలలూ ఆన్‌లైన్‌లోనే తరగతులు నిర్వహించాయి. దీంతో పిల్లలు మొబైల్ ఫోన్స్, ట్యాబ్స్, కంప్యూటర్లకు అలవాటుపడ్డారు. నాటి నుంచి పిల్లలకు చదువుతోపాటు.. కంప్యూటర్ పరిజ్ఞానమూ పెరిగింది. ఆన్‌లైన్ వేదికగా పిల్లలు పలు బోధనాంశాలను నేర్చుకుంటున్నారు. చాలామంది పిల్లలకు ఫిజికల్ యాక్టివిటీస్‌కు బదులు ఆన్‌లైన్ గేమ్స్ అలవాటయ్యాయి. అలా పిల్లల కార్యకలాపాలన్నీ ఫిజికల్ టు డిజిటల్ అయిపోయాయి. మరోపక్క తల్లిదండ్రులు కూడా సాంకేతికంగా తమ పిల్లల భవిష్యత్తుకు తగ్గ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ఉబలాటపడుతున్నారు. ఈ పరిణామాల కారణంగానే.. సమ్మర్ క్యాంప్స్ కూడా చాలావరకు మారిపోయాయి.

అందుకే పంపుతున్నారు



సమ్మర్ క్యాంప్స్‌కు వస్తున్న పిల్లల్లో.. ఎక్కువమంది చిన్నారుల తల్లిదండ్రులు ఉద్యోగాలు చేసేవారే. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ పిల్లలను ఇంట్లో ఉంచలేక, క్యాంప్‌లకు పంపించి ఏదో ఒక యాక్టివిటీలో బిజీగా ఉంచుతున్నారు. ఇంట్లో అల్లరి భరించలేక లేదా మొబైల్ ఫోన్లకు అలవాటు పడ్డారన్న కారణంతో మరికొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను సమ్మర్ క్యాంప్‌లో చేర్పిస్తున్నారు. చాలాకొద్ది మంది మాత్రమే తమ పిల్లలు కెరీర్‌లో క్రీడలను భాగం చేసుకోవాలని భావించి క్యాంప్‌లకు పంపుతున్నారని నిర్వాహకులు చెబుతున్నారు.

కొత్త అంశాలు

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సమ్మర్ క్యాంప్స్ ఇప్పుడు టెక్నాలజీ, అడ్వెంచర్, లైఫ్ స్కిల్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఏఐ, కోడింగ్, ఆస్ట్రానమీ, స్పేస్ టెక్నాలజీ వంటి సాంకేతిక అంశాలు వచ్చి చేరాయి. అడ్వెంచర్‌లో హార్స్ రైడింగ్, ట్రెక్కింగ్, పారాగ్లైడింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. లైఫ్ స్కిల్స్‌లో వంటలు, వ్యవసాయం, పశుసంపద గురించి తరగతులు మొదలయ్యాయి. ఆర్చరీ, చెస్‌లతోపాటు ఫొటోగ్రఫీ, సాల్సా, బెల్లీ వంటి డ్యాన్సులు.. మ్యూజిక్ కూడా సమ్మర్ క్యాంప్స్‌లో నేర్పిస్తున్నారు. స్విమ్మింగ్, స్కేటింగ్ వంటి వాటిలోనూ కొన్నిచోట్ల శిక్షణ ఇస్తున్నారు.

ఏఐ, ఎంఎల్, కోడింగ్..

పాఠ్యాంశాలతోపాటు కో-కరిక్యులర్ యాక్టివిటీస్‌లో ఇప్పుడు ఏఐ, మెషీన్ లెర్నింగ్, కోడింగ్ ప్రధాన ప్రాధాన్యతలుగా ఉన్నాయి. ఈ తరగతులు సమ్మర్ క్యాంప్స్‌నకే పరిమితం కాకుండా ఏడాదంతా ఒక సబ్జెక్ట్‌గా జరుగుతున్నాయి. ప్రముఖ కార్పొరేట్ పాఠశాలల్లో చదివే ఎంతోమంది విద్యార్థులు వీటిని ఎంచుకుంటున్నట్టు చెబుతున్నారు. దాంతో పాఠశాలలు కూడా ఈ సబ్జెక్టులను చెప్పిస్తున్నాయి. ఆసక్తికర అంశం ఏంటంటే.. వారంలో ఒక రోజు.. అది కూడా 1–2 గంటలు క్లాస్ చెప్పే ఏఐ నిపుణుడికి పాఠశాలలు నెలకు రూ.70,000 వరకు చెల్లిస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సబ్జెక్టులకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే విద్యార్థులు చాట్ జీపీటీ సాయం తీసుకుంటున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లల్లో కొందరు వెబ్‌సైట్ డిజైనింగ్ కూడా చేస్తున్నారు.



సమ్మర్ క్యాంప్స్‌లో పిల్లలు ఎంచుకుంటున్న టాప్-5 అంశాలు	
2020కి ముందు	ప్రస్తుతం
1. చెస్	1. ఏఐ
2. డ్యాన్స్ (సంగీత్ కోసం)	2. డ్యాన్స్ (సాల్సా, బెల్లీ, ట్యాప్, పోయెట్రీ ఇన్ మోషన్)
3. కమ్యూనికేషన్‌స్కిల్స్	3. మెషీన్ లెర్నింగ్
4. ఆర్ట్	4. కోడింగ్
5. మ్యూజిక్	5. అడ్వెంచర్

ఏడాదంతా నిర్వహిస్తున్నాం



మేం కో-కరిక్యులర్ యాక్టివిటీస్ నిర్వహిస్తుంటాం. 2020తో పోలిస్తే ఇప్పుడు సమ్మర్ క్యాంప్స్ అర్థమే మారిపోయింది. ఒకప్పుడు వేసవి సెలవులకే పరిమితమైన క్యాంప్స్.. ఇప్పుడు ఏడాదంతా కొనసాగుతున్నాయి. ఇందు కోసం అదనపు మొత్తం చెల్లించడానికి తల్లిదండ్రులూ సిద్ధపడుతున్నారు. ఆ అంశాలు ప్రత్యేకంగా చెప్పించేందుకు పాఠశాలలూ ముందుకొస్తున్నాయి. స్పోర్ట్స్, టెక్నాలజీ.. ఇలా ఏ అంశంలోనైనా క్యాంప్స్ ద్వారా నైపుణ్యం పెంచుకుంటున్నారు. ఈ నైపుణ్యానికి ఏడాదంతా మెరుగులు దిద్ది కెరీర్‌కు బాటలు వేసుకుంటున్నారు. అయితే, 2020కి ముందు కాలంతో పోలిస్తే సమ్మర్ క్యాంప్స్‌నకు వస్తున్న విద్యార్థుల సంఖ్య తగ్గింది.

– పడాల కార్తీక్ రెడ్డి, కో-ఫౌండర్, లెర్న్ ఓరామా టెక్నాలజీస్

నైపుణ్యం గుర్తించేది అక్కడే..



సమ్మర్ క్యాంప్స్‌లో భాగంగా.. క్రీడల్లో బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, స్కేటింగ్, కరాటే నేర్చుకోవడానికి పిల్లలు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. రెజ్లింగ్, జిమ్నాస్టిక్స్, బాస్కెట్ బాల్ శిక్షణకూ ఆడపిల్లలు ముందుకు వస్తున్నారు. సమ్మర్ క్యాంప్స్ అంటే ఆటవిడుపే కాదు.. నైపుణ్యం గుర్తించేదీ అక్కడే. ఈ సీజన్‌లో మా స్టేడియానికి 400 మంది విద్యార్థులు వచ్చారు. 30 మంది వరకు మెరికల్లాంటి పిల్లలు తదుపరి శిక్షణకు వెళ్లనున్నారు.

– జి.అలెగ్జాండర్ ఫ్రాన్సిస్, అడ్మినిస్ట్రేటర్, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం, యూసుఫ్‌గూడ

క్లుప్తంగా...

అదిగో పెద్దపులి..



పర్యాటకులకు కనిపించిన పెద్దపులి

మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో సఫారీ టూర్‌కు వస్తున్న పర్యాటకులకు తరచూ పెద్దపులులు కనువిందు చేస్తున్నాయి. ఫర్హాబాద్ నుంచి శనివారం వ్యూ పాయింట్‌కు సఫారీ వాహనంలో వెళ్తున్న పర్యాటకులకు అడవిలో చెట్ల మధ్య నుంచి వెళ్తున్న పెద్దపులి కనిపించింది. వారు పులిని సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. పెద్దపులి కనిపించినట్లు సంబంధిత సఫారీ డ్రైవర్ కూడా ధ్రువీకరించారు.

మంత్రివర్గ ఉపసంఘానికి త్రిసభ్య కమిటీ నివేదిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటైన త్రిసభ్య కమిటీ రూపొందించిన నివేదిక శనివారం మంత్రివర్గ ఉప సంఘానికి అందింది. ఉద్యోగ సంఘాల జేఏసీలతో పాటు విడివిడిగా ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులతో భేటీలు, వినతుల స్వీకరణ, సలహాలు, సూచనలపై ప్రతిపాదనలను స్వీకరించిన త్రిసభ్య కమిటీ చైర్మన్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్.. పూర్తిస్థాయిలో వాటి పరిశీలన తర్వాత ప్రాధాన్యత అంశాలతో కూడిన నివేదికను తయారు చేశారు. ప్రజాభవన్‌లో శనివారం మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన సమావేశంలో.. త్రిసభ్య కమిటీ ప్రతినిధులు ఈ నివేదికను సమర్పించారు. మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు పాల్గొన్నారు. త్రిసభ్య కమిటీ సమర్పించిన నివేదికను మంత్రివర్గ ఉపసంఘం పూర్తిగా అధ్యయనం చేయనుంది. ఆ తర్వాత ఉద్యోగ సంఘాల జేఏసీలు, ఉద్యోగ సంఘాలతో సమావేశం కావాలని నిర్ణయించింది.

'సింగరేణి' మిగులు విద్యుత్ విక్రయం



జైపూర్: మంచిర్యాల జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు (ఎస్టీపీపీ) మిగులు విద్యుత్‌ను బహిరంగ మార్కెట్‌లో విక్రయించనుంది. ప్లాంటులోని రెండు యూనిట్ల (1200 మెగావాట్ల) ద్వారా నిరంతరం విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. రాష్ట్రానికి సరఫరా చేయగా మిగులు విద్యుత్‌ను జూన్ ఒకటి నుంచి ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ అనే జాతీయ సంస్థకు విక్రయించడానికి సంస్థ ఆమోదం తెలిపింది. ఈ మేరకు శనివారం ఎస్టీపీపీలో సింగరేణి విద్యుత్ విక్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంస్థ చైర్మన్ ఎన్.బలరాం, డైరెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సంస్థ చైర్మన్ బలరాం, డైరెక్టర్ సత్యనారాయణరావు ప్రత్యేక చొరవతో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు అభివృద్ధి బాటలో నడుస్తోందని ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు తెలిపారు. బహిరంగ మార్కెట్లో విద్యుత్ అమ్మకానికి సహకరించిన తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్ సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. విక్రయం ద్వారా సింగరేణి సంస్థకు ఆదాయం పెరుగుతుందని చెప్పారు.





వేదికపై ఫొటోకు ఫోజిస్తున్న 2024 మిస్‌వరల్డ్ పిష్కోవా, 2025 మిస్ వరల్డ్ చువాంగ్‌శ్రీ, తొలి రన్నరప్ హాసెట్, రెండో రన్నరప్ మజా క్లాజ్డా, మూడో రన్నరప్ ఆరేలీ జోచిమ్, ఇతర విభాగాల విజేతలు...

మిస్ వరల్డ్ చువాంగ్‌శ్రీ

▶ మొదటి పేజీ తరువాయి

హాసెట్ డెరెజె అడ్మాస్సు. రెండో రన్నరప్‌గా పోలాండ్‌కు చెందిన మజా క్లాజ్డా, మూడో రన్నరప్‌గా మార్టినిక్‌కు చెందిన ఆరేలీ జోచిమ్ నిలిచింది. భారత సుందరి నందినీ గుప్తా టాప్-8 జాబితాలో చోటుదక్కించుకోలేకపోయింది. థాయ్ భామకు మిస్ వరల్డ్ కిరీటం లభించడం ఇదే తొలిసారి.

అందరూ వచ్చి..: మిస్ వరల్డ్ 72వ ఎడిషన్ గ్రాండ్ ఫినాలే అట్టహాసంగా జరిగింది. సాయంత్రం ఐదున్నరకే కార్యక్రమాలు మొదలయ్యాయి. తొలుత తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ వెంటనే 108 మంది భామలను రెడ్ కార్పెట్ మీదుగా వేదికపైకి సగౌరవంగా ఆహ్వానించారు. అనంతరం వ్యాఖ్యాత సచిన్ కుంభర్ అమెరికా-కరేబియన్, ఆసియా-ఓసియానియా, ఆఫ్రికా, యూరప్.. ఇలా నాలుగు భాగాలుగా విభజించి దేశాలవారీగా పోటీదారులను పరిచయం చేశారు. ఆ తర్వాత గ్రాండ్ ఫినాలేలో పోటీపడే టాప్-40 మందితో కూడిన బృందాన్ని పరిచయం చేశారు. ఒక్కో ఖండం నుంచి 10 మంది చొప్పున ఇందులో చేర్చారు. గత మూడు వారాలుగా జరిగిన ఐదు చాలెంజ్‌ల విజేతలైన 16 మందితోపాటు న్యాయ నిర్ణేతలు ఇచ్చిన మార్కుల ఆధారంగా మిగతా 24 మందిని వేదికపైకి ఆహ్వానించి మొత్తం 40 మందితో కూడిన బృందాన్ని సిద్ధం చేశారు. దీంతో పోటీ నుంచి వైదొలిగిన మిగతా వారు వేదికకు ఇరువైపులా ఏర్పాటు చేసిన స్థానాల్లో ఆసీనులయ్యారు. పోటీదారులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న ప్రొఫైల్.. వారి చాతుర్యం.. మాటతీరు ఆధారంగా కేటాయించిన మార్కుల ఆధారంగా ఒక్కో ఖండం నుంచి ఐదుగురు చొప్పున ఉండే టాప్-20 మందితో కూడిన జాబితాను ప్రకటించారు. ఆ రౌండ్‌లో వైదొలిగిన వారు వెళ్లి వారి స్థానాల్లో కూర్చోగా తదుపరి రౌండ్‌లో ఒక్కో ఖండం నుంచి ఇద్దరు చొప్పున టాప్-8 మందిని (ఆఫ్రికా: నమీబియా, ఇథియోపియా, యూరప్: పోలాండ్, ఉక్రెయిన్, ఆసియా-ఓషియానియా: ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్, అమెరికా-కరేబియన్: బ్రెజిల్, మార్టినికా) షార్ట్ లిస్ట్ చేశారు. భారత సుందరి నందినీ గుప్తా ఈ దశలోకి చేరుకోలేక నిష్క్రమించింది.

మీరే ఎందుకు ప్రపంచ సుందరి కావాలనుకుంటున్నారు?

టాప్-8 మంది సుందరీమణుల్లోంచి టాప్-4 భామలను ఎంపిక చేసేందుకు న్యాయ నిర్ణేతలు అడిగిన ప్రశ్నలు కీలక భూమిక పోషించాయి. గతంలో వారు పొందిన మార్కులు.. ఈ ప్రశ్నలకు వారు ఇచ్చిన సమాధానాల ఆధారంగా అప్పటికప్పుడు ఇచ్చిన మార్కులు కలిపి విజేతను ఎంపిక చేశారు. తొలుత 8 మందిని ప్రజెంటర్ సచిన్ కుంభర్ అడిగిన 'మీరే ప్రపంచ సుందరి ఎందుకు కావాలనుకుంటున్నారు?' అనే ప్రశ్నకు వారు ఇచ్చిన సమాధానం ఆధారంగా తుది పోరుకు థాయ్‌లాండ్, ఇథియోపియా, పోలాండ్, మార్టినిక్ సుందరీమణులను ఎంపిక చేశారు.

ఉత్కంఠభరితంగా తుది పోరు...

నలుగురు మాత్రమే వేదికపై ఉండి తుది పోరుకు సిద్ధమైన తరుణంలో ఆ ప్రాంగణమంతా ఉద్విగ్నత నెలకొంది. న్యాయ నిర్ణేతలైన మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈవో జూలియా మోర్లే, నటులు సోనూసూద్, రానా దగ్గుబాటి, నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని ఒక్కొక్కరికీ సంధించిన ప్రశ్నలకు పోటీదారులు ఇచ్చిన సమాధానాలు వారి స్థానాలను నిర్ణయించాయి. సోనూసూద్ అడిగిన ప్రశ్నకు అద్భుతంగా సమాధానమిచ్చిన థాయ్‌లాండ్ సుందరి ఒపల్ సుచాత చువాంగ్‌శ్రీ మిస్ వరల్డ్–2025గా ఎంపికైంది.

సోనూసూద్‌కు మానవతావాది పురస్కారం

కోవిడ్ సమయంలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న నిరుపేద కార్మికులు సొంతూళ్లకు వెళ్లేందుకు ఉచిత రవాణా వసతి కల్పించిన సినీనటుడు సోనూసూద్‌కు మిస్ వరల్డ్ మానవతావాది' పురస్కారాన్ని మిస్‌వరల్డ్ సంస్థ ప్రకటించింది. ఆయనకు రానా దగ్గుబాటి బంగారు గ్లోబ్‌ను అందించారు.

మరిన్ని ఫొటోలు, వార్తలు | సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో

మిస్ వరల్డ్ ప్రయాణం ఏం నేర్పింది?

సాక్షి, హైదరాబాద్: మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలేకు న్యాయనిర్ణేతలుగా మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ, వ్యాపారవేత్త సుధారెడ్డి, నటుడు, సామాజిక సేవకుడు సోనూసూద్, నటుడు రానా దగ్గుబాటి, ప్రపంచ మాజీ సుందరి మనుషి చిల్లర్, మాజీ నటి నమ్రతా శిరోద్కర్, డోనా వాల్ష్, జయేశ్ రంజన్ వ్యవహరించారు. చివర్లో నలుగురు కిరీటం కోసం పోటీ పడినప్పుడు న్యాయనిర్ణేతలు అడిగిన ప్రశ్నలు, వారిచ్చిన సమాధానాలు ఇవీ..

సుచాతాను ప్రశ్న అడిగిన సోనూసూద్

'మిస్ వరల్డ్ ప్రయాణం మీ వ్యక్తిగత బాధ్యతలపై వ్యవహరించే విషయంలో ఏం నేర్పింది?' అని సోనూసూద్ అడిగిన ప్రశ్నకు.. 'మనం చేసే పనుల్లో నిజాయితీ ఉంటే అదే మనల్ని గొప్పగా చూపుతుంది. మనల్ని ఇష్టపడేవారు గౌరవంతో

చువాంగ్‌శ్రీని సోనూసూద్ అడిగిన ప్రశ్న ఇదే..

చూసేలా మనం తయారవ్వాలన్నది నేర్చుకున్నాను. మనం ఎంత దూరం ప్రయాణించినా, మన పనులే మన గురించి మాట్లాడాలి. దీన్ని నేను నేర్చుకున్నాను, ఆచరిస్తున్నాను' అని సుచాతా పేర్కొన్నారు. నేతలు నిజాయితీగా తమ నాయకత్వాన్ని నిలబెట్టుకోవాలంటే ఏం చేయాలని మానుషి చిల్లర్ అడగ్గా మార్టినిక్ సుందరి ఓరెలీ జో అఖిమ్.. 'నాయకుల దగ్గర సరైన సమాచారం ఉండాలి. తప్పుడు సమాచారం ఉంటే ఎన్నో అనర్థాలకు కారణమవుతుంది. తమ దృష్టికి వచ్చిన విషయం సరైనదో కాదో నిర్ధారించుకోవడానికి ముందుగా దాన్ని అర్థం చేసుకోవాలి.. ధ్రువీకరించుకోవాలి. ఆ తర్వాతే సరైన విధంగా ప్రతిస్పందించాలి' అని చెప్పారు. అందాల పోటీలపై ఉన్న అభిప్రాయాన్ని ఎలా మార్చాలని రానా దగ్గుబాటి అడగ్గా .. 'మిస్ వరల్డ్ అనేది కేవలం అందానికి సంబంధించినది మాత్రమే కాదు. ఈ స్థాయికి చేరిన తొలి ఇథియోపియన్ నేనే. ఇది ఒక లక్ష్యాన్ని చేరుకోవాడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమం. ఇది ప్రపంచవ్యాప్తంగా తల్లులు, వారి పిల్లల జీవితాలలోనూ ముఖ్యమైనదే' అని ఇథియోపియా భామ హాసెట్ డెరెజె అడ్మాసు బదులిచ్చింది. తెలంగాణలో మీ అనుభవం.. మీకు జీవితంలో నేర్పిన పాఠం ఏమిటని నమ్రతా శిరోద్కర్ ప్రశ్నించగా మిస్ పోలాండ్ సుందరి మాయ క్లైజ్డా.. 'నేను పొందిన గొప్ప విజయాల్లో ఒకటి చిన్నచూపును అధిగమించడం. తెలంగాణ ఆతిథ్యం నాకు మా ఇంటి అనుభూతిని గుర్తు చేసింది. ఇది నా రెండో కుటుంబంలా అనిపించింది. ఒకరితో ఒకరు ఎంత బాగుంటారో మెడికల్ టూరిజం పర్యటనలో భాగంగా ఆసుపత్రిని సందర్శించినప్పుడు గుర్తించాను. అది నా జీవితంలో మరిచిపోలేను' అని బదులిచ్చారు.

ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా

అట్టహాసంగా మిస్ వరల్డ్ అందాల పోటీలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ప్రపంచస్థాయి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించగల సత్తా ఉందని తెలంగాణ రాష్ట్రం ప్రపంచానికి ఘనంగా చాటిచెప్పింది. 72వ మిస్ వరల్డ్ అందాల పోటీల నిర్వహణ అవకాశాన్ని అనూహ్యంగా దక్కించుకోవడమే కాకుండా అట్టహాసంగా నిర్వహించి యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. మే 2 నుంచి నిర్వాహకులు, పోటీదారులు నగరానికి చేరుకోవడం మొదలు శనివారం హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలే వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా లోపాలు లేకుండా మిస్ వరల్డ్ సంస్థతో కలిసి పోటీలను సంయుక్తంగా నిర్వహించింది. పోటీల నిర్వహణలో ఆద్యంతం తెలంగాణ సాంస్కృతిక కళా వైభవం ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేసింది. పోటీల నిర్వహణకు రూ. 60 కోట్ల వరకు ఖర్చవగా ప్రపంచ సుందరీమణులు



చువాంగ్‌శ్రీకి మిస్‌వరల్డ్ కిరీటధారణ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభినందన

పర్యటించిన ప్రాంతాలతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల సుందరీకరణకు మరో రూ. 200 కోట్ల వరకు ఖర్చు చేసింది.

పర్యాటకానికి ఊతం..

జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతంతో మిస్ వరల్డ్–2025 పోటీలు మే 10న గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఒక్కో స్థానిక సంప్రదాయ కళారూపాన్ని ప్రదర్శిస్తూ ఒక్కో ఖండానికి చెందిన పోటీదారులను పరిచయం చేయడం వీక్షకులను ఆకట్టుకుంది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు, జీవన విధానాన్ని తెలియజెప్పేందుకు పోటీదారులతో ఏర్పాటు చేసిన ప్రముఖ పర్యాటక ప్రాంతాల సందర్శన ప్రపంచ దేశాల సుందరీమణులకు ఎంతగానో నచ్చింది. పోటీల ఇతివృత్త నినాదమైన 'తెలంగాణ జరూర్ ఆనా' ప్రపంచవ్యాప్తంగా మార్మోగింది. ఇవన్నీ తెలంగాణ పర్యాటకానికి ఊతమిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

ముసిరిన వివాదం..

మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ మే 16న అందాల పోటీ నుంచి తప్పుకోవడం వివాదానికి దారితీసింది. మిస్ వరల్డ్ నిర్వాహకులపై ఆమె తీవ్ర ఆరోపణలు గుప్పించడం సంచలనం రేపింది. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన తెలంగాణ ప్రభుత్వం.. ముగ్గురు సీనియర్ మహిళా ఐపీఎస్‌లతో విచారణకు ఆదేశించింది. అయితే మిల్లా మాగీ నిరాధార ఆరోపణలు చేసిందని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సీఈవో జూలియా మోర్లీ స్పష్టం చేశారు. పోటీల నిర్వహణలో తెలంగాణ ప్రభుత్వం గొప్పగా సహకరించిందని.. తదుపరి పోటీలను కూడా అవకాశం లభిస్తే హైదరాబాద్‌లోనే నిర్వహించాలని ఉందని ఆమె పేర్కొనడం రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది.



కుటుంబ సభ్యులతో తన ఆనందాన్ని పంచుకుంటూ...

16 ఏళ్లకే రొమ్ము కేన్సర్ బారిన పడ్డా..

- సకాలంలో గుర్తించడంతో ముప్పు నుంచి బయటపడ్డా
- ముందుగా గుర్తిస్తే వ్యాధి నివారణ సాధ్యమేనని ప్రచారం చేస్తున్నా
- హైదరాబాద్ ఆతిథ్యాన్ని మరువలేను: మిస్ వరల్డ్ చువాంగ్‌శ్రీ

సాక్షి, హైదరాబాద్: 'నేను పుట్టింది థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో. అక్కడే ప్రాథమిక విద్య పూర్తయింది. బ్యాంకాక్‌లో ఉన్నత విద్యను అభ్యసించాను. అక్కడే నా ఫ్యాషన్ ప్రయాణం మొదలైంది. 16 ఏళ్లకే రొమ్ము కేన్సర్‌కు గురయ్యాను. ముందుగా గుర్తించి చికిత్స తీసుకోవడంతో వ్యాధి నుంచి తప్పించుకున్నాను. కానీ ఆ సమయంలో నా శారీరక, మానసిక అవస్థ వర్ణనాతీతం. మహిళలను వేధించే ఈ సమస్యను దూరం చేయాలంటే ప్రజల్లో అవగాహన చాలా అవసరమని గుర్తించాను. వ్యాధిని ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యమన్న విషయం ప్రతి మహిళకు చేరేలా ప్రచారం చేస్తున్నాను. ఇది సత్ఫలితాన్నిస్తోంది. నాకు మా అమ్మే స్ఫూర్తి. హైదరాబాద్ ఆతిథ్యాన్ని జీవితాంతం మరవలేను. ఇప్పుడు నా జీవితంలో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఏర్పడింది. మిస్ వరల్డ్ విజేతగా నా బాధ్యత మరింత పెరిగింది' అని మిస్ వరల్డ్ ఒపాల్ సుచాత చువాంగ్‌శ్రీ పేర్కొంది.



అక్కినేని అఖిల్–జైనబ్ రవ్జీ ఏడడుగులు వేసే సమయం ఆసన్నమైంది. ఈ వివాహానికి సంబంధించిన ఏర్పాట్లలో అక్కినేని కుటుంబం బిజీగా ఉంది. నాగార్జున–అమల పెళ్లి పిలుపుల పనుల్లో ఉన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఈ దంపతులు, పెండ్లి కుమార్తె తల్లిదండ్రులు కలిసి వివాహానికి హాజరు కావల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు. గత ఏడాది నవంబరులో అఖిల్–జైనబ్‌ల నిశ్చితార్థం జరిగింది. వీరి వివాహం జూన్ 6న హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో జరగనున్నట్లు తెలిసింది.

మావోయిస్టు అగ్రనేత దుబాసి శంకర్‌కు తీవ్ర అనారోగ్యం

- రెండేళ్లుగా భువనేశ్వర్ సెంట్రల్ జైలులో...



శంకర్

దుబ్బాక: మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర మిలిటరీ కమిషన్ సభ్యుడు దుబాసి శంకర్ అలియాస్ రమేశ్, మహేందర్, అరుణ్ (65) భువనేశ్వర్‌లోని సెంట్రల్ జైలులో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. 2021లో ఎడమకాలికి గాయమై చికిత్స పొందుతున్న శంకర్‌ను ఒడిశా పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి ఆయన భువనేశ్వర్ సెంట్రల్ జైలులోనే ఉంటున్నారు. కొద్దిరోజుల క్రితం కాలుకు తీవ్రమైన ఇన్ఫెక్షన్ కావడంతో శంకర్ నడవలేని స్థితిలో ఉన్నట్టు తెలిసింది. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చెట్లనర్సంపల్లికి చెందిన దుబాసి శంకర్ 1987లో అప్పటి పీపుల్స్‌వార్ గ్రూపులో చేరి... ఇండస్ట్రియల్ దళసభ్యుడిగా పనిచేశారు. అప్పటి నుంచి 34 ఏళ్లపాటు అజ్ఞాతంలోనే ఉంటూ మావోయిస్టు పార్టీలో అగ్రనేతగా ఎదిగాడు. ఆంధ్ర –ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కీలక సభ్యుడిగా, యాక్షన్ టీం మెంబర్‌గా, కేంద్ర మిలిటరీ కమిషన్ సభ్యుడిగా ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు కేడర్‌కు మిలటరీ శిక్షణ ఇస్తూ వివిధ హోదాల్లో కొనసాగారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో శంకర్‌పై 40కి పైగా కేసులు ఉన్నాయి. 2016లో ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాలో 31 మంది గ్రేహౌండ్స్ పోలీసులను హతమార్చిన ఘటనలో శంకర్ పాల్గొన్నాడు. శంకర్ భార్య భారతక్క కూడా మావోయిస్టు పార్టీలో పనిచేశారు. ఆరేళ్ల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆమె మృతి చెందారు. భారతక్క మృతదేహాన్ని చెట్లనర్సంపల్లికి తీసుకొచ్చి అంత్యక్రియలు చేశారు. ఆమె స్మారకార్థం గ్రామంలో స్థూపం నిర్మించారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు.

8 మంది మావోయిస్టుల లొంగుబాటు

ములుగు: నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన 8 మంది సభ్యులు ములుగు పోలీసుల ఎదుట లొంగిపోయారు. శనివారం జిల్లాకేంద్రంలో ఎస్పీ శబరీశ్ వారి వివరాలను మీడియాకు వెల్లడించారు. లొంగిపోయిన వారిలో పీఎల్–1 కమాండర్ దొర్పెట్టి మిర్గ అలియాస్ లింగ, ఏఎంసీ సభ్యురాలు మడవి టిడో, ఏసీఎం మిడియం బీమా, పార్టీ సభ్యులు ఉయిక అనిత, మడకం కమలేశ్, సోయం బీమే, సీఎన్ఎం సభ్యుడు మడవి మడక, వికాస్ కమిటీ పూజారి కాంకేర్ సభ్యుడు మడవి ఇడుము ఉన్నారు. వారికి రూ.25 వేల చొప్పున తక్షణ సహాయంగా అందించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
ఆదివారం । 1-6-2025


వేదికపై మిస్ వరల్డ్ పోటీదారులు


ఆసియా–ఓషియానియా విభాగం టాప్–5కి ఎంపికైన వారిలో మిస్ ఇండియా నందినీగుప్తా


ఉత్తర–దక్షిణ అమెరికాల విభాగంలో టాప్–5 పోటీదారులు


పోటీలను తిలకిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, సినీ నటుడు చిరంజీవి


ఫినాలేకు హాజరైన డిప్యూటీ సీఎం భట్టి దంపతులు, మంత్రులు పొన్నం, జూపల్లి


ఆఫ్రికా ఖండం నుంచి టాప్–5కి వచ్చింది వీరే...


యూరప్ ఖండం నుంచి టాప్–5కి వచ్చిన అందాల భామలు

అన్నింటా బయోమెట్రిక్

వేలి ముద్రతోనే రేషన్ బియ్యం, ఆసరా పింఛన్

- ఉద్యోగుల హాజరుకు బయోమెట్రిక్
- ఉపాధి కూలీల హాజరుకు ఫొటో క్యాప్చర్
- పంటల నమోదుకు డిజిటల్ మ్యాపింగ్
- మధ్యాహ్న భోజనానికి ఐరిస్


రేషన్ సరుకులు తీసుకునేందుకు బయోమెట్రిక్ నమోదు


ఉపాధి హామీ కూలీల హాజరుకు ఫొటో క్యాప్చరింగ్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ప్రభుత్వ పథకాల అమల్లో అక్రమాలను నిరోధించేందుకు బయోమెట్రిక్, ఫొటో క్యాప్చర్, డిజిటల్ మ్యాపింగ్, జియో ట్యాగింగ్, ఐరిస్.. ఇలా రకరకాలుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ఉపాధి హామీ కూలి పని నుంచి మొదలుపెడితే ఉద్యోగుల హాజరు, రేషన్ సరుకులు, ఆసరా పింఛన్ల పంపిణీ, పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనం, తల్లులకు అందించే పౌష్టికాహారం వరకు అన్నింటికీ సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నారు. కొన్ని ప్రభుత్వ శాఖల్లో ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఆన్‌లైన్‌లోనే చేసేస్తున్నారు. ప్రతిదానికి వేలిముద్ర కీలకంగా మారింది. కొన్ని సందర్భాల్లో వృద్ధులు, కూలి పనులు చేసేవారి వేలిపై ఉన్న గీతలు చెదిరిపోయి వేలి ముద్ర అంగీకరించని పరిస్థితులు కూడా ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో సంబంధిత ఉద్యోగి బాధ్యత వహించి సదరు లబ్ధిదారుని తరఫున వేలి ముద్ర వేసి పంపిణీ చేయాల్సి ఉంటుంది.

రేషన్ సరుకుల పంపిణీలో..

దారిద్ర్యరేఖకు దిగువనున్న పేద కుటుంబాలకు అందించే రేషన్ సరుకుల పంపిణీకి.. కుటుంబంలో ఎవరో ఒకరు వేలి ముద్ర వేస్తేనే సరుకులు ఇచ్చే పరిస్థితి ఉంది. రేషన్ కార్డులో నమోదైన కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు దుకాణానికి వెళ్లాల్సిందే. వాళ్లు ముద్ర వేస్తేనే రేషన్ ఇస్తారు. లేదంటే సరుకులు ఇవ్వరు. ఆసరా పింఛన్ల విషయంలోనూ బయోమెట్రిక్కే ఆధారం. పింఛనర్లు సంబంధిత పోస్టాఫీసుకు వెళ్లి వేలిముద్ర వేస్తేనే డబ్బులు చేతికి అందజేస్తారు లబ్ధిదారులకు మాత్రమే అందించేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది.

ఉపాధి కూలీలకూ..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ద్వారా పనులకు వెళ్లే కూలీల హాజరు నమోదుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. గతంలో సాధారణంగా హాజరు రాసుకునేవారు.

ప్రస్తుతం అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో కూలీల హాజరును సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్.. పనిచేసే చోటుకెళ్లి కూలీల ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కూలీ ఫొటో క్యాప్చర్ కానిపక్షంలో హాజరు నమోదు కాదు. తప్పనిసరిగా హాజరు పడాలంటే ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సిందే.

మధ్యాహ్న భోజనానికి..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పథకం అమల్లో భాగంగా వారి హాజరు నమోదుకు ఐరిస్ టెక్నాలజీ వినియోగిస్తున్నారు. సంబంధిత తరగతి ఉపాధ్యాయుడు పిల్లల హాజరును ఐరిస్ ద్వారా నమోదు చేసుకోవలసి ఉంటుంది. ఉపాధ్యాయుల హాజరు విషయంలోనూ బయోమెట్రిక్ విధానం అమల్లోకి తీసుకువచ్చినప్పటికీ.. చాలాచోట్ల బయోమెట్రిక్ మెషీన్లను మూలన పడేశారు. దీంతో ఉపాధ్యాయుల హాజరుకు టెక్నాలజీ వినియోగించడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారానికి సంబంధించి ఫొటో క్యాప్చర్ తప్పనిసరి చేశారు.

పంటల నమోదుకు..

వానాకాలం, యాసంగి సీజన్లలో సాగయ్యే పంటల వివరాలను నమోదు కూడా డిజిటల్ మ్యాపింగ్ ద్వారా చేపడుతున్నారు. పంటల సాగుకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందించే రైతుభరోసాతో పాటు ఇతర ప్రయోజనాలు పొందాలంటే పంట ఎన్ని ఎకరాల్లో సాగైంది అన్నది డిజిటల్ మ్యాపింగ్ ద్వారా నమోదు చేయాల్సి ఉంటుంది. వ్యవసాయ విస్తీర్ణాధికారులు డిజిటల్ మ్యాపింగ్ చేస్తారు. పంటలకు అవసరమైన రసాయన ఎరువుల సరఫరాకు కూడా ఈ లెక్కలే ఉపయోగపడతాయి.



ఉద్యోగుల హాజరుకూ..

రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్లలో ఉద్యోగుల హాజరుకు బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో పకడ్బందీగా అమలవుతోంది. విధులకు హాజరయ్యే సమయంలో, విధులు ముగించుకుని వెళ్లే సమయంలోనూ బయోమెట్రిక్ వేయాల్సిందే. తద్వారా ఉద్యోగులు సమయ పాలన పాటించగలుగుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అధ్యాపకుల హాజరును ఫేస్ రికగ్నయిజ్ చేయాల్సి ఉంటుంది. ఉదయం, సాయంత్రం తప్పనిసరి హాజరు వేసుకోవాలి.

ఇందిరమ్మ ఇళ్లకు జియో ట్యాగింగ్

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం అమల్లో భాగంగా ప్రభుత్వం జియో ట్యాగింగ్ విధానాన్ని అమలు చేస్తోంది. ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టినప్పటి నుంచి ఏయే స్థాయిలో నిర్మాణం కొనసాగుతోందో.. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదవుతుంది. పాత ఇళ్లకు బిల్లులు తీసుకుని అక్రమాలకు పాల్పడకుండా ప్రభుత్వం జియో ట్యాగింగ్ విధానాన్ని అమలు చేస్తోంది.

పేద విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలి

డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్: అక్షయ విద్య ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వినియోగించుకుని, బస్తీలో ఉన్న పేద విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని, చక్కటి లక్ష్యాలను ఏర్పరచుకొని నిరంతరం కృషి చేయాలని డీజీపీ డాక్టర్ జితేందర్ ఆకాంక్షించారు. అక్షయ విద్య ఫౌండేషన్ బస్తీ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద విద్యార్థులకు విలువైన సేవ చేస్తోందని ప్రశంసించారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలలో బస్తీలలో ఉన్న పేద విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికైన సందర్భంగా వారి అభినందన కార్యక్రమం డీజీపీ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో డీజీపీ మాట్లాడుతూ.. ఈ రకమైన సేవా కార్యక్రమాలకు పోలీస్ శాఖ సహకరిస్తుందని, ఐజీపీ ఎం.రమేశ్ ఈ సంస్థతో ఇప్పటికే అనుబంధంగా ఉన్నారని గుర్తు చేశారు. ఐజీపీ రమేశ్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎస్.జనార్దన్, టి.వరప్రసాద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీల రిటైర్‌మెంట్ ప్యాకేజీ పెంపు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, హెల్పర్ల ఉద్యోగ విరమణ ప్యాకేజీ ఉత్తర్వులను శనివారం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఉద్యోగ విరమణ చేసే అంగన్‌వాడీ టీచర్‌కు రూ.2 లక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష చొప్పున అందించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. గత జీవోలో టీచర్‌కు రూ.లక్ష, హెల్పర్‌కు రూ.50 వేల చొప్పున పరిహారం అందించనున్నట్లు ప్రకటించగా.. టీచర్లు, హెల్పర్ల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. దీంతో పునరాలోచన చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం వీరి ఉద్యోగ విరమణ వయసును 65 ఏళ్లకు పరిమితం చేసినా.. 60 ఏళ్లు పూర్తయిన తర్వాత వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నా ఆర్థిక సాయంలో ఏమాత్రం కోత పెట్టకుండా అందించనున్నట్లు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ తాజా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

అప్పుడు సీఎం.. ఇప్పుడు ఆయన భార్య

సాక్షి, హైదరాబాద్: మే 10వ తేదీన గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన ప్రారంభ వేడుకకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. 'మిస్ వరల్డ్ 72 ఎడిషన్ పోటీలు ప్రారంభం' అని ప్రకటించారు. అంతకుమించి ఏమీ మాట్లాడే వీలు చిక్కలేదు. గ్రాండ్ ఫినాలే సందర్భంగా ఆయన విజేత పేరు ప్రకటించే సమయంలో వేదికపైకి వచ్చారు. కార్యక్రమం ముగిసిన తర్వాత 'మిస్ వరల్డ్ 72 ఎడిషన్ పోటీలు ముగిశాయి' అని సీఎం కాకుండా ఆయన భార్య గీతారెడ్డితో ప్రకటింపజేశారు. ఈసారి సీఎం అక్షరం కూడా మాట్లాడే అవసరం రాలేదు.

థాయ్‌లాండ్

అభిమానుల సందడి

థాయ్‌లాండ్ నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు హైటెక్స్‌కు చేరుకున్నారు. భారత సుందరి నందినీ గుప్తా ప్రస్తావన వచ్చినప్పుడు ఆ ప్రాంగణం కేరింతలతో మారుమోగిన తరహాలో థాయ్‌లాండ్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా కేరితలతో ఆ దేశస్తులు హడావుడి చేశారు. బ్యానర్లు చేత పట్టుకొని ప్రదర్శించారు. ఇంత హడావుడి చేస్తున్నారంటే ఈసారి థాయ్‌లాండ్ సుందరే విజేతగా నిలవబోతోందంటూ ఆ ప్రాంగణంలో ముందుగానే చర్చ మొదలైంది. అనుకున్నట్టే ఫలితం రావటం విశేషం. దీంతో కిరీటం ఎవరికివ్వాలో మిస్ వరల్డ్ సంస్థ ముందే తేల్చిందంటూ గుసగుసలు వినిపించటం విశేషం.


గ్రాండ్ ఫినాలేకు వస్తున్న సీఎం సతీమణి

- కళ్లు మిరిమిట్లు గొలిపేలా వేదిక లైటింగ్ షోతో వెలిగిపోయింది. దానికి తగ్గట్టు భారీ సౌండ్ సిస్టం ఉర్రూతలూగేలా చేసింది. బాలీవుడ్ నటి జాక్విలిన్ ఫెర్నాండెజ్ బృందం, ఇషాన్ కట్టర్ బృందం హిట్ సాంగ్స్‌కు డ్యాన్స్ చేసినప్పుడు ఆ ప్రాంగణం కేరింతలతో మార్మోగింది. ముఖ్యంగా ఇషాన్ కట్టర్ నాటునాటు తెలుగు పాటకు స్టెప్పులేసినప్పుడు చప్పట్లు హోరెత్తాయి. నటుడు చిరంజీవి దంపతులు, మంత్రులు భట్టి విక్రమార్క, జూపల్లి తదితరులు హాజరయ్యారు.
- హరివిల్లు ఆవిష్కృతమైందన్న రీతిలో రంగురంగుల తెలంగాణ చేనేత సంప్రదాయ వస్త్రాలతో సుందరీమణులు ర్యాంప్ వాక్ చేశారు. ఆ వస్త్రాలను డిజైన్ చేసిన ప్రముఖ డిజైనర్ అర్చన కొచ్చార్ కూడా వారి వెనుక ర్యాంపు మీదుగా వచ్చి సంతోషాన్ని ప్రకటించారు.

పేదలకు న్యాయం చేస్తే మంచిపేరు

మాజీ ఎంపీ వీహెచ్



సాక్షి, హైదరాబాద్: పేదలకు న్యాయం చేస్తే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని మాజీ ఎంపీ వీహెచ్ వి.హనుమంతరావు అభిప్రాయపడ్డారు. ఆయన శనివారం గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. దొరల చేతుల్లోకి వెళ్లిన అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించడం సంతోషకరమన్నారు. పేదల భూములను లాక్కున్న బకాసురుల భరతం పట్టాల్సిందేనన్నారు. ఇదే తరహాలో అన్యాక్రాంతమైన కీసర దాయరలోని 94 ఎకరాల అసైన్డ్ భూమిని కూడా ప్రభుత్వం తీసుకుని పేదలకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. అయిదేళ్లుగా ఈ భూమిని పేదలకు అప్పగించాలని పేదల పక్షాన పోరాడుతున్నానని గుర్తు చేశారు. దొంగ సంతకాలతో ఆ భూమిని ఎలా తీసుకున్నారో సాక్ష్యాలను కూడా రెవెన్యూ అధి కారులకు అందజేశానని వివరించారు. భూభారతిలో సమస్యలన్నీ పరిష్కార మవుతాయని ప్రజలు ఆశిస్తున్నా రని వీహెచ్ చెప్పారు.

గాలి జనార్దన్‌రెడ్డి పిటిషన్‌ను కొట్టివేయండి

హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన సీబీఐ

సాక్షి, హైదరాబాద్: ఓబుళాపురం మైనింగ్ కేసు (ఓఎంసీ)లో ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి దోషిగా తేలిన తర్వాత ఆయనకు జైల్లో ఏమీ ప్రత్యేకతలు ఉండవని, ఆయన పిటిషన్‌ను కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) కౌంటర్ దాఖలు చేసింది. ట్రయల్ కోర్టు విధించిన శిక్ష అమలును నిలిపివేయాల్సిన అవసరం లేదని చెప్పింది. శిక్షను నిలిపివేయకపోతే తాను ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గానికి ఎలాంటి నష్టం వస్తుందో గాలి జనార్దన్‌రెడ్డి స్పష్టంగా వివరించలేదని చెప్పింది. ఓఎంసీ కేసులో దోషులుగా తేలడంతో గాలి జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీడీ రాజగోపాల్, అలీఖాన్‌లకు నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు మే 6న ఏడేళ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేస్తూ నిందితులు హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. సీబీఐ కోర్టు తీర్పు చట్టవిరుద్ధమని, దానిని కొట్టివేయాలని కోరారు. అలాగే తమకు బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై మేనెల 21న విచారణ చేపట్టిన హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సీబీఐ తాజాగా కౌంటర్ దాఖలు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి సహా ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేయాలని పేర్కొంది. ఎమ్మెల్యేగా కొనసాగడం ప్రాథమిక హక్కు కాదని.. గాలి పిటిషన్‌కు విచారణార్హత లేదని చెప్పింది. ఈ పిటిషన్‌పై బుధవారం మరోసారి విచారణ జరిగే అవకాశం ఉంది.

ఎస్సీ గురుకుల అవకతవకలపై విజిలెన్స్ విచారణ

సొసైటీ కార్యదర్శి వర్షిణి

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ గురుకుల సొసైటీలో జరిగిన అవకతవకలపై విజిలెన్స్ విచారణ కోరనున్నట్లు సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి స్పష్టం చేశారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గత కార్యదర్శి ప్రభుత్వ అనుమతులు లేకుండా అడ్డగోలుగా నిధులు ఖర్చు చేశారని తెలిపారు. ఒక్కొక్క ఉద్యోగిని రూ.1.5 లక్షల జీతానికి తీసుకున్నారని, ఏం చేయాలో వారికే తెలియదని వ్యాఖ్యానించారు. ఇష్టానుసారంగా నచ్చిన వారిని నియమించుకున్నారని చెప్పారు. వారిని తొలగిస్తే.. నెలకు ప్రభుత్వానికి రూ.9 కోట్లు మిగులుతాయని వివరించారు. గురుకులాలలో పిల్లలకు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్నామని, అన్ని గురుకులాలలో పారిశుధ్య కార్మికులు ఉన్నారన్నారు. అందరూ సమానమనే భావన పెరగాలనే ఉద్దేశంతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. తన మాటలను వక్రీకరించి ప్రచారం చేశారని, గురుకుల పిల్లలను సొంత బిడ్డల్లా చూస్తానన్నారు.

సంద్రంలో సీతాకోకచిలుకలు





ఆశలు రేకెత్తించే వర్షం.. మేఘాలతో నిండిన విశాఖ తీరం.. ఈసారి పర్యాటకులను అద్భుతమైన దృశ్యంతో ఆకట్టుకుంది. సంద్రంలో అలలు తాకుతుంటే, సంప్రదాయ పడవలు ఒకదాని వెనుక ఒకటి కదులుతూ, వర్ణరంజితమైన సీతాకోకచిలుకల సమూహాన్ని తలపించాయి. ఆకాశంలో మేఘాలు, నీటిలో పడవలు సృష్టించిన ఈ కమనీయ దృశ్యం కోస్టల్ బ్యాటరీ వద్ద పర్యాటకులను మంత్రముగ్ధులను చేసింది, వారి మనసులను ఆనందంతో నింపింది.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్ విశాఖపట్నం

బంతి విలాపం



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చాలా వరకు రైతులు పూలసాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా బంతి పూల సాగుకు అవసరమైన పద్ధతులు పాటించి అధిక దిగుబడుల సాధిస్తున్నారు. కానీ ధరలు లేక దిగాలు చెందుతున్నారు. కుప్పం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బంతి పూలు సాగు చేసిన రైతులు పంట కోతకు ఉపక్రమించారు. బంతి పూలు అధికంగా దిగుబడి ఉన్నప్పటికీ మార్కెట్‌కు చేరుకునే సరికి మద్దతు ధర లభించకపోవడం శోచనీయం.

– సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి

క్లుప్తంగా...

పూర్తిస్థాయి డీజీపీగా గుప్తా బాధ్యతల స్వీకరణ



సాక్షి, అమరావతి: పూర్తిస్థాయి డీజీపీగా హరీష్ కుమార్ గుప్తా శనివారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ దళాధిపతిగా ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన హరీష్ కుమార్ గుప్తా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్ పోస్టులో కొనసాగుతూ ఇన్‌చార్జ్ డీజీపీగా 4 నెలలుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనను పూర్తిస్థాయి డీజీపీగా నియమించడంతో పదవీ విరమణ తేదీతో సంబంధం లేకుండా శనివారం నుంచి రెండేళ్లపాటు ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు.

విపత్తు నిర్వహణ డైరెక్టర్ కూర్మనాథ్ బదిలీ

సాక్షి, అమరావతి: విపత్తు నిర్వహణ, ఎక్స్–అఫీషియో డిప్యూటీ కార్యదర్శి ఆర్.కూర్మనాథ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖార్ జైన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. కూర్మనాథ్‌కు పోస్టింగ్ ఇవ్వకుండా సాధారణ పరిపాలన శాఖకు రిపోర్ట్ చేయాల్సిందిగా సూచించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

సామాజిక పింఛన్లతో భరోసా

తెనాలిఅర్బన్ : ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సామాజిక పింఛన్లు పేదలకు భరోసా కల్పిస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలోని యడ్ల లింగయ్య కాలనీలో శనివారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 12 నుంచి కొత్త పెన్షన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు.

భూపతిరాజు స్థాయి మరిచి మాట్లాడుతున్నారు

ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మండిపాటు

మహారాణిపేట(విశాఖ): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరడంలో ఎలాంటి తప్పు లేదని, దీనిపై కొంత మంది నోటికి వచ్చినట్లు మాట్లాడడం తగదని వీఆర్వోల సంఘం ప్రతినిధులు హితవు పలికారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజనీకుమార్, కోశాధికారి బొమ్మిరెడ్డిపల్లి శ్రీనివాస్, వెంకట అప్పారావు శనివారం విశాఖలో మాట్లాడారు. వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజుతో పాటు మరికొందరు బొప్పరాజు వెంకటేశ్వర్లుపై స్థాయి మరిచి చౌకబారు వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఉద్యోగుల ప్రయోజనాల కోసం బొప్పరాజు పోరాడుతుంటే, వాటిని భూపతిరాజు వక్రీకరించడం సరికాదన్నారు.

• ఉజ్వలశక్తి

ఉత్పత్తి.. ఆదాయం రికార్డ్



పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం

సీలేరు జలవిద్యుత్ కేంద్రాల్లో గణనీయంగా ఉత్పాదన

- పొల్లూరు కేంద్రంలో లక్ష్యానికి మించి..
- జెన్‌కోకు, రాష్ట్రానికి భారీ ఆదాయం
- ఇంజినీర్లు, కార్మికుల సమష్టి కృషితో మంచి ఫలితాలు

మోతుగూడెం: సీలేరు జలవిద్యుత్ కేంద్రాల్లో మూడేళ్ల నుంచి రికార్డుస్థాయిలో జలవిద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. పొల్లూరు, మాచ్‌ఖండ్, అప్పర్ సీలేరు, డొంకరాయి జలవిద్యుత్ కేంద్రాలు లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి సాధిస్తూ జెన్‌కోకు, రాష్ట్రానికి భారీ ఆదాయం సమకూరుస్తున్నాయి. ఈ ప్రాజెక్టులు నిర్మించి సుమారు 50 ఏళ్లు దాటుతున్నా.. ఆధునీకీకరణకు పూర్తిస్థాయిలో నోచుకోకపోయినా.. ఇంజినీర్లు, కార్మికుల సమష్టి కృషితో ఉత్పత్తిలో రికార్డులు సాధిస్తున్నాయి.

మూడేళ్లుగా ఆశాజనకంగా వర్షాలు..


మూడేళ్లుగా వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో రిజర్వాయర్లు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోవడంతో ఏడాది పొడవునా జలవిద్యుదుత్పత్తి జరుగుతోంది. మూడేళ్లుగా రబీ సీజన్‌కు సుమారు 250 టీఎంసీలు వరకు నీరు అందించాయి. దేశంలో ఏడాది పొడవునా జలవిద్యుదుత్పత్తి చేసే కేంద్రాలుగా ఇవి రికార్డులు నెలకొల్పాయి. సుమారు 975 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఈ నాలుగు కేంద్రాల నుంచే జరుగుతుండడం విశేషం.

జలవిద్యుత్ ఉత్పత్తితో ఆదా

ఏపీ జెన్‌కో సంస్థకు థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఉన్నా.. యూనిట్ ఉత్పత్తికి రూ.7 వరకు ఖర్చవుతుంది. జలవిద్యుత్ కేంద్రాల్లో అది రూ.3 మాత్రమే. ప్రస్తుతం జోలాపుట్, బలిమెల, గుంటవాడ, డొంకరాయి రిజర్వాయర్లలో సుమారు 35 టీఎంసీల వరకు నీరు ఉన్నట్లు జెన్‌కో అధికారులు చెబుతున్నారు. ఈ వేసవిలోనూ రిజర్వాయర్‌లో నీటి మట్టాలు ఆశాజనకంగా ఉండడంతో పూర్తిస్థాయిలో జలవిద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నట్లు పేర్కొంటున్నారు. ఒక్క మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో మాత్రమే మూడేళ్లుగా లక్ష్యాలకు అతి చేరువగా విద్యుదుత్పత్తి జరిగింది.



లక్ష్యానికి మించి ఉత్పత్తి చేస్తున్న పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం



విద్యుదుత్పత్తి ఇలా..

కేంద్రం	లక్ష్యం	ఉత్పత్తి (మిలియన్ యూనిట్లు)
2023-24లో...		
మాచ్‌ఖండ్	626	535.576
అప్పర్ సీలేరు	470	480
పొల్లూరు	1084	1090
డొంకరాయి	99	105.732
2024-25లో...		
మాచ్‌ఖండ్	630	554.698
అప్పర్ సీలేరు	477	495.7
పొల్లూరు	1095	1120.63
డొంకరాయి	95	105.224

డొంకరాయి జలాశయం డ్యామ్

లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి



లోయర్ సీలేరు జలవిద్యుత్ కేంద్రాల్లో రెండేళ్ల నుంచి లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఏపీ జెన్ కో యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యాలను ఇంజినీర్లు, కార్మికుల కృషి వల్లే అందుకోగలుగుతున్నాం. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి జరుగుతోంది. యూనిట్లలో ఉన్న సాంకేతిక లోపాలను ఎప్పటికప్పుడు సరి చేస్తూ విద్యుదుత్పత్తి ఆగకుండా చేస్తున్నాం.

–స్వామినాయుడు, సీఈ , ఏపీ జెన్‌కో

గోదావరి డెల్టాకు 280 టీఎంసీలు



నాలుగు కేంద్రాల్లో విద్యుదుత్పత్తితో పాటు గత మూడేళ్లలో ఉభయగోదావరి జిల్లాలకు రబీ సీజనకు సుమారుగా 280 టీఎంసీల నీరుని విడుదల చేశాం. ఈ వేసవి కాలంలోనూ రిజర్వాయరుల్లో నీటి మట్టం ఉండటంతో పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి సాధించాం. ఈ నాలుగు రిజర్వాయర్లులో 35 టీఎంసీ నీటినిల్వ ఆంధ్రా వాటాగా ఉంది.

– బాలకృష్ణ, ఈఈ, ఏపీ జెన్‌కో మోతుగూడెం

కొంపముంచుతున్న కొత్త స్నేహాలు





- ఇన్‌స్టాలో చూపులు.. వాట్సాప్‌లో చాటింగ్
- యువతను ముంచుతున్న సోషల్ మీడియా
- సమస్యలతో పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతున్న మైనర్లు

☛ పుట్టపర్తికి చెందిన 17 ఏళ్ల యువతికి గోరంట్ల మండలానికి చెందిన 18 ఏళ్ల యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయయ్యాడు. ఇద్దరూ చాటింగ్ చేసుకుంటూ వాట్సాప్ కాల్స్ వరకు వచ్చారు. ఆ తర్వాత వీడియో కాల్స్.. ఫొటోల మార్పిడి తదితర వ్యవహారాలన్నీ సాగాయి. పెళ్లి చేసుకుందామనేలోపు ఇద్దరి మధ్య తగాదాలు వచ్చాయి. పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ మెట్లెక్కారు. తనకు ఆ అమ్మాయిపై ఇష్టం పోయిందని యువకుడు అడ్డం తిరిగాడు.. మైనర్లు కావడంతో పోలీసులు ఇద్దరికీ సర్దిజెప్పి పంపించారు.

☛ హిందూపురానికి చెందిన 18 ఏళ్ల యువతికి పెనుకొండకు చెందిన 27 ఏళ్ల పురుషుడు ఫేస్‌బుక్ ద్వారా పరిచయమయ్యాడు. తర్వాత ఇద్దరూ ఆర్నెల్ల పాటు చాటింగ్ చేసుకుంటూ ఫోన్ నంబర్లు, అడ్రస్ మార్చుకున్నారు. గంటల తరబడి వాట్సాప్ చాటింగ్ కొనసాగింది. అయితే ఆ తర్వాత ఆ వ్యక్తికి అప్పటికే వివాహమైందన్న విషయం కనుక్కొన్న యువతి నానా రభస చేసింది. తనను మోసం చేశాడంటూ పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు అమ్మాయి తల్లిదండ్రులను పిలిచి గుట్టుగా వ్యవహారాన్ని చక్కబెట్టి పంపారు.

అవగాహన కల్పిస్తున్నాం

మొబైల్ ఫోన్ అతిగా వినియోగించే యువత వాట్సాప్, ఇన్‌స్టాగాం తదితర సోషల్ మీడియా సైట్లులోనే ఎక్కువ సమయం గడుపుతోంది. ఆయా మాధ్యమాల్లో కొత్తవ్యక్తుల పరిచయాలు వారి జీవితాలనే మార్చేస్తున్నాయి. అందువల్ల ఇంట్లో పిల్లలు ఏం చేస్తున్నారనే విషయంపై తల్లిదండ్రులు తప్పనిసరిగా కనిపెడుతూ ఉండాలి. స్మార్ట్ ఫోన్ వినియోగంలో లాభాలతో పాటు అనేక అనర్థాలూ ఉన్నాయి. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై నిత్యం అవగాహన కల్పిస్తున్నాం.

– మహేష్, జిల్లా బాలల సంరక్షణ అధికారి, పుట్టపర్తి

సాక్షి, పుట్టపర్తి: ప్రస్తుతం యువత బయట కంటే సోషల్ మీడియాలోనే ఎక్కువగా అందుబాటులో ఉంటోంది. పలకరింపులు..పరామర్శలన్నీ వాట్సాప్, ఇన్ స్టా గ్రామ్ వేదికగానే సాగుతున్నాయి. ఇదే క్రమంలో సామాజిక మాధ్యమాల ద్వారానే కొత్త కొత్త స్నేహాలు పుట్టుకువస్తున్నాయి. హాలో అంటే చాలు పాలోమంటూ ఫ్రెండ్ రిక్వెస్టులు వచ్చి వాలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు తెలిసీ తెలియని వయసులో ఒకరికొకరు ఆకర్షితులై.. తర్వాత లేని పోని సమస్యల్లో ఇరుక్కుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా ఒకరికొకరు దగ్గరై.. ప్రేమ వ్యవహారాల్లో మునిగి తేలుతున్నారు. చాలామంది మైనర్లు సోషల్ మీడియా వేదికగా చిన్న వయసులోనే ప్రేమ, పెళ్లి వ్యవహారాల వరకూ వెళ్తున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలోని ఏదో ఒక పోలీస్ స్టేషన్‌లో వెలుగు చూస్తూనే ఉన్నాయి.

ఎక్కువ మంది మైనర్లే..

తెలిసీ తెలియని వయసులో నిత్యం సోషల్ మీడియాలో ఉంటూ కొత్త పరిచయాలతో స్టేషన్ మెట్లు ఎక్కుతున్న మైనర్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. బాల్య వివాహాలు, ప్రేమ పెళ్లిళ్లు, ఆన్‌లైన్ ప్రేమ తగాదాలు.. ఇలా వివిధ రకాల ఫిర్యాదులు నిత్యం పోలీసు స్టేషన్‌కు వస్తున్నాయి. అయితే ఎక్కువ మంది మైనర్లే ఉండటంతో వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పోలీసులు సామాజిక బాధ్యతగా తల్లిదండ్రులను పిలిపించి.. సర్దిజెప్పుతుండగా... సమస్య బయటికి రాకుండా సద్దుమణుగుతోంది. ఇక ఆన్‌లైన్ ద్వారా పరిచయాలతో పెద్దలను ఎదురించి పెళ్లి చేసుకున్న జంటలు కూడా నెలల వ్యవధిలోనే విడాకుల వరకూ వచ్చేస్తున్నాయి.

నిబంధనలు బేఖాతరు..

సోషల్ మీడియా పరిచయాలతో దగ్గరవుతున్నవారు...కొన్నిరోజులకే న్యాయం చేయాలంటూ పోలీసు స్టేషన్‌కు వస్తున్నారు. చాలా సందర్భాల్లో అమ్మాయి మైనర్ కావడం... అప్పటికే పరిస్థితి చేయి దాటిన నేపథ్యంలో పెద్దలే గుట్టు చప్పుడు కాకుండా వివాహాలు జరిపిస్తున్నారు. బాల్య వివాహం తప్పని తెలిసినా చాలా మంది ఎదురుచెప్పలేకపోతున్నారు. అధికారులకు తెలిసినా అమ్మాయి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అవగాహన కల్పించడానికే పరిమితం అవుతున్నారు. నూతన జంటలను విడదీయలేక.. మానవీయ కోణంలో ఆలోచించి వదిలేస్తున్నారు.

ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షునిగా విద్యాసాగర్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆలపర్తి విద్యాసాగర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడు కేవీ శివారెడ్డి ఉద్యోగ విరమణ చేయడంతో ఆ పదవికి కో ఆప్షన్ పద్ధతిలో ఎన్నిక జరిగింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బందరు రోడ్డులోని శేష సాయి కల్యాణ మండపంలో ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశం విద్యాసాగర్‌ను రాష్ట్ర అధ్యక్షునిగా ఆమోదిస్తూ తీర్మానం చేసింది. అనంతరం ఎన్జీఓ కార్యాలయం నుంచి కల్యాణ మండపానికి విద్యాసాగర్ భారీ ర్యాలీతో చేరుకుని నూతన అధ్యక్షునిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ ఈ పదవిని బాధ్యతగా భావిస్తున్నానన్నారు. పూర్వ అధ్యక్షుడు కేవీ శివారెడ్డి మాట్లాడుతూ ఏపీ ఎన్జీఓ సంఘానికి విద్యాసాగర్ వంటి నాయకుల అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జమైకా హ్యాపిల్!

యానాం: కరేబియన్ దీవులలో వెస్టిండీస్ సమీపంలోని జమైకా ద్వీప దేశంలో జమైకా ఆపిల్‌గా పిలిచే చెట్టు యానాం పట్టణంలో ఓ గృహంలోని పెరట్లో వందలాది కాయలతో విరగకాస్తుండటంతో పలువురిని ఆకర్షిస్తోంది. దీంతో పలువురు 20 అడుగుల ఎత్తులో ఉన్న ఆ చెట్టును చూస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక బాలయోగి కాలనీలో కేతా ఫణి, జగదాంబకు చెందిన గృహంలో 15 ఏళ్ల క్రితం నాటిన జమైకా ఆపిల్ చెట్టు ఉంది. దీనికితోడు ఆ మొక్క పూలనుంచి ఎర్రని పుప్పొడులు కిందికి పడటంతో చెట్టుకింద ఎర్రని తివాచీగా పరచినట్టు ఉంది చూపరులను ఆకర్షిస్తోంది. చూసేందుకు వాటర్‌యాపిల్‌లా ఉన్నప్పటికి రుచి కమ్మగా ఉంటుంది. జమైకా ఆపిల్ వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని స్థానిక వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. కాల్షియం, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలతో సమృద్ధిగా ఉన్న జమైకా ఆపిల్ బలమైన ఎముకలు, దంతాలను నిర్మించడంలో సహాయపడుతుందని తెలిపారు.



జమైకన్ ఆపిల్ కాయలు

ఎరువుల సరఫరాలో సొసైటీలకే అధిక ప్రాధాన్యత

- 'సాక్షి' కథనంపై స్పందన
- వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

సాక్షి, అమరావతి: రైతు సేవా కేంద్రాల్లో ఎరువులను నిల్వ చేసే సదుపాయం లేకపోవడంవల్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్)కు ప్రాధాన్యతనిస్తున్నామని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఆర్ఎస్‌కేల్లో నిల్వ చేసిన ఎరువులు గడ్డకట్టడం, మెత్తబడటం వంటి ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకొని సీజన్‌కు ముందుగా ఎరువులను నిల్వ చేయడం లేదన్నారు. స్థానికంగా అవసరాల మేరకు ఎరువులు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఎరువులా..ఇస్తామన్నామా? అనే శీర్షికన సాక్షిలో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు లేని ప్రాంతాల్లో స్థానికంగా ఉండే నిల్వ సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఆర్ఎస్‌కేలకు కేటాయింపులు జరుపుతున్నామని చెప్పారు. మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా చేసే ఎరువుల్లో మూడొంతులు సొసైటీల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. మార్క్‌ఫెడ్‌కు బఫర్ స్టాక్ స్కీమ్ కింద ఈ ఏడాది 10 లక్షల టన్నుల ఎరువులు నిల్వ చేయాలని లక్ష్యంగా నిర్దేశించామని, ఇందుకోసం ఈ ఏడాది రూ.40 కోట్లు బడ్జెట్‌లో కేటాయించగా, తొలి త్రైమాసికానికి సంబంధించి రూ.10 కోట్లు విడుదలకు చర్యలు తీసుకున్నామన్నారు. గతేడాది సొసైటీలతో పాటు ఆర్ఎస్‌కేలకు 6.99 లక్షల టన్నులు సరఫరా చేసామని చెప్పారు. రాష్ట్రంలో ఎరువుల కొరత లేదన్నారు. ఖరీఫ్ సీజన్‌కు 10.61 లక్షల టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటికే 1.71 లక్షల టన్నుల ఎరువులను జిల్లాలకు సరఫరా చేసామని, మరో 8.9 లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

రూ.344.39 కోట్ల విలువైన పనులకు షార్ట్ టెండర్లు

జల వనరుల శాఖలో 7,174 పనులు

సాక్షి, అమరావతి: భారీ, మధ్య, చిన్నతరహా నీటి పారుదల వనరులకు సంబంధించి 7,174 పనులను రూ.344.39 కోట్ల వ్యయంతో 7 రోజుల షార్ట్ టెండర్ ద్వారా చేపట్టేందుకు జల వనరుల శాఖ పరిపాలన ఆమోదం ఇస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సాగునీటి సంఘాలు లేనిచోట రూ.10 లక్షల కంటే ఎక్కువ విలువగల పనులను షార్ట్ టెండర్ల ద్వారా చేపట్టనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ పనులు చేపట్టే ఆయకట్టు పరిధిలోని రైతుల నుంచి నీటిపన్ను బకాయిలను వడ్డీ లేకుండా ఒకేసారి వసూలు చేయాలనే షరతు విధించారు.

యూనిట్ పేరు	పనుల సంఖ్య	వ్యయం (రూ.లక్షల్లో)
చీఫ్ ఇంజినీర్, అనంతపురం	234	2,111.81
చీఫ్ ఇంజినీర్, ఎన్టీఆర్ టీజీపీ, తిరుపతి	303	2,127.90
చీఫ్ ఇంజినీర్, కర్నూలు	474	3,731.59
చీఫ్ ఇంజినీర్, కడప	80	705.27
చీఫ్ ఇంజినీర్, ఒంగోలు	71	508.06
చీఫ్ ఇంజినీర్, ఎన్ఎస్‌పీ, గుంటూరు	801	3,744.87
చీఫ్ ఇంజినీర్, ఉత్తరాంధ్ర, విశాఖపట్నం	536	2,389.62
చీఫ్ ఇంజినీర్, ధవళేశ్వరం	80	465.26
చీఫ్ ఇంజినీర్, జీడీపీ, ధవళేశ్వరం	1,752	8,106.69
చీఫ్ ఇంజినీర్, విజయవాడ	1,412	5,026.87
చీఫ్ ఇంజినీర్, మైనర్, మీడియం ఇరిగేషన్, విజయవాడ	1,431	5,521.15

మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను కోర్టులో హాజరుపర్చిన పోలీసులు

మంగళగిరి: బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను తుళ్లూరు పోలీసులు శనివారం కోర్టులో హాజరుపరచారు. ఇసుకపల్లి రాజుపై దాడి కేసులో మూడు రోజుల కస్టడీ ముగియడంతో సురేశ్‌ను శనివారం మంగళగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో సురేశ్‌ను గుంటూరు జైలుకు తరలించారు. సురేశ్ తరఫు న్యాయవాది తానికొండ చిరంజీవి మాట్లాడుతూ నందిగం సురేశ్‌ను కస్టడీకి తీసుకున్న పోలీసులు ఆయనపట్ల అమానుషంగా ప్రవర్తించారన్నారు. కనీసం మనిషికి ఇవ్వాల్సిన గౌరవం కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవాదితో కూడా మాట్లాడకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా వ్యవహరించిన పోలీసులపై కోర్టులో ఛాలెంజ్ చేసినట్లు తెలిపారు.




బాలీవుడ్‌లో
హారర్ సినిమాల హవా కనిపిస్తోంది. గత ఏడాది విడుదలైన హిందీ హారర్ చిత్రాలు ‘స్త్రీ 2, భూల్ భూలెయ్యా 3, సైతాన్, ముంజ్య’ వంటివి **సూపర్‌హిట్స్‌గా నిలిచాయి.** ఓ విధంగా 2024లో బాలీవుడ్ బాక్సాఫీస్‌కు హారర్ చిత్రాలే వెన్నుదన్నుగా నిలిచాయి. ఇలా హారర్ చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ ఉందని గమనించిన బాలీవుడ్ స్టార్స్ వరుసగా ఆ తరహా చిత్రాలకు సైన్ చేస్తున్నారు. ఆ హారర్ సినిమాల వివరాలపై ఓ లుక్ వేద్దాం...



బాలీవుడ్‌లో భయం భయం

● హారర్ సినిమాలకు మొగ్గు చూపుతున్న బాలీవుడ్ స్టార్స్



భూత్ బంగ్లాలో అక్షయ్ కుమార్

హీరో అక్షయ్ కుమార్, దర్శకుడు ప్రియదర్శన్‌లది హిట్ కాంబినేషన్. వీరి కాంబినేషన్‌లో ‘హేరా ఫెరి, గరమ్ మసాలా, భూల్ భూలెయ్యా’ వంటి సక్సెస్‌ఫుల్ సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. కానీ 2010లో వచ్చిన ‘ఖట్టా మీఠా’ తర్వాత అక్షయ్ కుమార్, ప్రియదర్శన్ కాంబినేషన్‌లో మరో సినిమా అనౌన్స్‌మెంట్ రావడానికి 14 సంవత్సరాలు పట్టింది. గత ఏడాది అక్షయ్ కుమార్ 57వ బర్త్ డే సందర్భంగా ‘భూత్ బంగ్లా’ అనే హారర్ కామెడీ సినిమా అనౌన్స్‌మెంట్ వచ్చింది. ఈ సినిమాకు ప్రియదర్శన్ దర్శకుడు. హారర్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రూపొందుతోంది. ఈ మూవీలో వామికా గబ్బి, టబు, పరేష్ రావల్, జిస్సూ సేన్ గుప్తా ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. తొలుత ఈ హారర్ కామెడీ సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల వచ్చే ఏడాది ఏప్రిల్‌కు రిలీజ్‌ను వాయిదా వేశారు. మరి.. హీరో అక్షయ్ కుమార్–దర్శకుడు ప్రియదర్శన్ కాంబినేషన్ మరో సారి హిట్ అవుతుందా? వెయిట్ అండ్ సీ.

పోలీస్ స్టేషన్‌లో భూతం

హారర్, గ్యాంగ్‌స్టర్, రొమాంటిక్... ఇలా డిఫరెంట్ జానర్స్‌లో సినిమాలు చేశారు దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ. అయితే హారర్ కామెడీ జానర్‌లో మాత్రం ఆయన సినిమా చేయలేదు. ఈ జానర్‌లోనూ తన సత్తా నిరూపించుకోవాలని ‘పోలీస్‌స్టేషన్ మే భూత్’ అనే సినిమాను ప్రకటించారు రామ్‌గోపాల్ వర్మ. ‘యూ కాంట్ కిల్ ది డెడ్’ అనేది ఈ సినిమా క్యాప్షన్. ఈ చిత్రంలో మనోజ్ భాజ్‌పేయి లీడ్ రోల్ చేస్తారు. ‘మనకు భయం వేస్తే పోలీస్‌స్టేషన్‌కు వెళ్తాం. అదే పోలీసులకే భయం వేస్తే వాళ్లు ఎక్కడికి వెళ్తారు?’ అన్నదే ఈ సినిమా కాన్సెప్ట్. ‘‘ఓ పోలీస్‌స్టేషన్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరుగుతుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించిన గ్యాంగ్‌స్టర్స్ దెయ్యాలుగా మారి, పోలీసులను ఇబ్బందిపెడితే ఎలా ఉంటుంది? అన్న పాయింట్ ఆఫ్ వ్యూలో ‘పోలీస్ స్టేషన్ మే భూత్’ సినిమా కాన్సెప్ట్ ఉంటుంది. హారర్ కామెడీ జానర్‌లోనే ఈ సినిమా ఉంటుంది’’ అని ఓ సందర్భంలో పేర్కొన్నారు రామ్ గోపాల్ వర్మ. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ సినిమాను ప్రకటించారు. త్వరలో షూటింగ్ ఆరంభించాలనుకుంటున్నారు. ‘సత్య’ (1998), ‘కౌన్’ (1999), ‘శూల్’ (1999) వంటి చిత్రాల తర్వాత దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ, హీరో మనోజ్ భాజ్‌పేయి పాతిక సంవత్సరాల తర్వాత మళ్లీ ‘పోలీస్‌స్టేషన్ మే భూత్’ సినిమా కోసం కలిసి పని చేస్తుండటం విశేషం.

ప్రేతాత్మతో పోరాటం



భూత, ప్రేతాత్మల నుంచి తన కుమార్తెను కాపాడుకోవడం కోసం ఓ తల్లి చేసే అసాధారణ పోరాటం నేపథ్యంలో సాగే హిందీ చిత్రం ‘మా’ (తెలుగులో అమ్మ అని అర్థం). కాజోల్ టైటిల్ రోల్ చేసిన ఈ సినిమాలో రోనిత్ డాలీ, ఇంద్రనీల్ శుభ్రా, జితిన్ జ్యోతీ గులాటి లీడ్ రోల్స్‌లో నటించారు. ఈ సీరియస్ హారర్ సినిమాకు విశాల్ రేవంతి ఫ్యూరియా దర్శకత్వం వహించారు. అజయ్ వీణా దేవగన్, జ్యోతి శాంతా సుబ్బరాయన్‌లు నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. క్షుద్ర శక్తులు ఓ చిన్నారిని బలి కోరడం, తన కుమార్తె కోసం తల్లి ఓ క్షుద్ర శక్తులతో వీరోచితమైన పోరాటం చేయడం వంటి సీన్స్ ఈ చిత్రం ట్రైలర్‌లో కనిపిస్తున్నాయి.

హాంటెడ్ హౌస్

మహేశ్ భట్ దర్శకత్వంలో వచ్చిన సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీ ‘1920’ (2008) సూపర్ హిట్‌గా నిలిచింది. ఆ తర్వాత ‘1920’ హారర్ సిరీస్‌లో వచ్చిన మరికొన్ని హారర్ సినిమాలతో అసోసియేట్ అయ్యారు విక్రమ్ భట్. తాజాగా ఆయన డైరెక్షన్‌లోనే ‘హాంటెడ్ హౌస్ 3డీ: ఘోస్ట్స్ ఆఫ్ ది పాస్ట్’ అనే సినిమా రానుంది. ఆనంద్ పండిట్, రాకేశ్ జునేజా, శ్వేతాంబరి భట్ ఈ సినిమాను నిర్మిస్తారు. ఈ సినిమాలో మహాక్షయ్ చక్రవర్తి, టియో బాజ్‌పాయ్, అంచిత్ కౌర్, ఆరిఫ్ జకారియా ప్రధాన పాత్రల్లో నటించనున్నారు. ఈ సినిమాను ప్రకటించినప్పుడు ఈ ఏడాది సెప్టెంబరులో రిలీజ్ చేస్తామన్నట్లుగా మేకర్స్ తెలిపారు. ఇండియన్ స్టీరియోస్కోపిక్ 3డీ హారర్ ఫిల్మ్‌గా ‘హాంటెడ్ హౌస్ 3డీ: ఘోస్ట్స్ ఆఫ్ ది పాస్ట్’ మూవీ రానుంది.

సైతాన్ తిరిగి వస్తాడు

గత ఏడాది మార్చిలో థియేటర్స్‌లోకి వచ్చిన ‘సైతాన్’ ప్రేక్షకులను బాగా భయపెట్టాడు. అజయ్ దేవగన్, ఆర్. మాధవన్, జ్యోతిక, జానకి బోడివాలా, అంగద్ రాజ్ లీడ్ రోల్స్‌లో నటించిన సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ మూవీ ‘సైతాన్’. వికాస్ బాల్ ఈ సినిమాకు దర్శకుడు. గత ఏడాది మార్చిలో థియేటర్స్‌లో విడుదలైన ఈ చిత్రం ఆడియన్స్‌ను భయపెట్టి, సూపర్ హిట్ అయింది. ఆ సమయంలోనే ‘సైతాన్’ సినిమాకు సీక్వెల్‌ను ప్రకటించారు అజయ్ దేవగన్. అయితే ప్రస్తుతం అజయ్ దేవగన్ కొన్ని సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ సినిమాల తర్వాత అజయ్ దేవగన్ ‘సైతాన్ 2’ సినిమాను సెట్స్‌కు తీసుకు వెళ్తారని ఊహించవచ్చు.

ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్


ఫారెస్ట్‌లో భయం అంటున్నారు హీరోయిన్ తమన్నా. సిద్దార్థ్ మల్హోత్రా, తమన్నా హీరో హీరోయిన్లుగా హిందీలో ‘వ్వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్’ అనే సినిమా రానుంది. హారర్ ఎలిమెంట్స్‌తో పాటు మైథలాజికల్ అంశాలు కూడా మిళితమై ఉన్న ఈ సినిమాకు అరుణభ్ కుమార్– దీపక్ మిశ్రా ద్వయం దర్శకత్వం వహిస్తున్నారు. బాలాజీ మోషన్ పిక్చర్స్, ది వైరల్ ఫీవర్ మోషన్ పిక్చర్స్ సంస్థలు ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇటీవల ‘వ్వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్’ సినిమా నుంచి తమన్నా పాత్ర తాలూకు ప్రీ టీజర్‌లాంటి ఓ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. రాత్రివేళ తమన్నా అడవిలోకి వెళ్లడం, అక్కడ ఓ దీపం వెలిగించడం వంటి విజువల్స్ ఉన్నాయి. ఇక ఈ సినిమాను 2026లో రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు.

ప్రేతాత్మగా రష్మిక?

హారర్ ప్రపంచంలోకి అడుగు పెట్టారు హీరోయిన్ రష్మికా మందన్నా. ఆయుష్మాన్ ఖురానా, రష్మికా మందన్నా లీడ్ రోల్స్‌లో నటిస్తున్న హిందీ చిత్రం ‘థామా’. ఆదిత్య సర్పోత్దార్ ఈ సినిమాకు దర్శకుడు. మడాక్ హారర్ కామెడీ యూనివర్స్ నుంచి రాబోతున్న మరో హారర్ చిత్రం ఇది. ఈ సినిమాలో రష్మికా మందన్నా డ్యూయల్ రోల్ చేస్తున్నారని, ఒక పాత్రలో ఆమె ప్రేతాత్మగా కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను ప్రధానంగా నార్త్ ఇండియా లొకేషన్స్‌లో చిత్రీకరించారు. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయిందట. ఈ సినిమాలో నవాజుద్దీన్ సిద్ధిఖీ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ‘థామా’ సినిమాను ఈ ఏడాది దీపావళి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ గతంలో ప్రకటించారు.

మరికొన్ని హారర్ చిత్రాలు...

మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగానే ‘శక్తి శాలిని’, ‘బేడియా 2’, ‘చాముండ’, ‘స్త్రీ 3’, ‘మహా ముంజ్య’, ‘పెహ్లా మహాయుథ్, దూస్‌రా మహాయుధ్’ వంటి సినిమాలను ఆల్రెడీ ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లోని ‘థామా’ సినిమా ఈ ఏడాది దీపావళికి, ఈ ఏడాది డిసెంబరు 31న ‘శక్తి శాలిని’, వచ్చే ఏడాది ఆగస్టు 14న ‘బేడియా 2’, డిసెంబరు 4న ‘చాముండ’ 2027లో ‘స్త్రీ 3’, ‘మహా ముంజ్య’ చిత్రాలు, 2028లో ‘పెహ్లా మహాయుధ్, దూస్‌రా మహాయుధ్’ సినిమాలు రిలీజ్ కానున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ ప్రకటించారు. ఇక వరుణ్ ధావన్ హీరోగా ‘బేడియా’ ఫ్రాంచైజీ, శ్రద్ధాకపూర్–రాజ్ కుమార్ రావు లీడ్ రోల్స్‌లో ‘స్త్రీ’ ఫ్రాంచైజీ వెండితెరపైకి వస్తున్న సంగతి తెలిసిందే. ‘ముంజ్య’ సినిమాలో అభయ్ వర్మ, శర్వారీ లీడ్ రోల్స్ చేశారు. ఆదిత్య సర్పోత్దార్ డైరెక్షన్‌లోని ‘ముంజ్య’ సినిమా 2024లో విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ తరుణంలో ఈ సినిమా సీక్వెల్ ‘మహా ముంజ్య’లో వీరే నటిస్తారా? లేక కొత్త నటీనటులు కనిపిస్తారా? అని తెలియాల్సి ఉంది. ఇంకా ‘శక్తి శాలిని, చాముండ’ వంటి సినిమాల్లో మెయిన్ లీడ్ రోల్స్‌కు హీరోయిన్స్ కియారా అద్వానీ, ఆలియా భట్ వంటి వాళ్ల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.




– ముసిమి శివాంజనేయులు



● విజయేంద్ర ప్రసాద్, పూరి జగన్నాథ్

కథా చర్చల్లో..?

‘‘కొన్ని క్షణాలు మీ హృదయంలో శాశ్వతంగా నిలిచిపోతాయి. లెజెండరీ విజయేంద్ర ప్రసాద్‌గారితో సమయం గడపడం అలాంటిదే. ఆయన జ్ఞానం, వినయం, ఆలోచనల్లోని స్పష్టత నిజంగా స్ఫూర్తిదాయకం’’ అంటూ పూరి కనెక్ట్స్ ‘ఎక్స్’ ఖాతాలో విజయేంద్ర ప్రసాద్, పూరి జగన్నాథ్ కలిసి ఉన్న ఫొటోలను షేర్ చేశారు ఈ సంస్థ ప్రతినిధులు. దాంతో రచయిత విజయేంద్ర ప్రసాద్–దర్శకుడు పూరి జగన్నాథ్ ఎందుకు కలిశారు? అనేది హాట్ టాపిక్‌గా మారింది. విజయ్ సేతుపతి హీరోగా తాను తెరకెక్కించనున్న సినిమా కథా చర్చల కోసమే విజయేంద్ర ప్రసాద్‌ని పూరి కలిశారనే ఊహాగానాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమాకు చెందిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. పూరి కనెక్ట్స్ పతాకంపై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. జూన్ చివర్లో చిత్రీకరణను ప్రారంభించేందుకు హైదరాబాద్, చెన్నై లొకేషన్స్‌ను రెక్కీ చేస్తున్నారు. మరి.. వార్తల్లో ఉన్నట్లు ఈ సినిమా స్క్రిప్ట్ పనుల్లో భాగంగానే విజయేంద్ర ప్రసాద్‌ను పూరి జగన్నాథ్ కలిసి ఉంటారా? అనే విషయం తెలియాల్సి ఉంది.



● ప్రవీణ్

బ్యాచిలర్ కష్టాలు

నటుడిగా, హాస్యనటుడిగా ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న ప్రవీణ్ హీరోగా నటించిన మొదటి చిత్రం ‘బకాసుర రెస్టారెంట్’. ఎస్‌జే శివ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటించారు. ఎస్‌జే మూవీస్‌పై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. వికాస బడిస సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ‘నా అంగీ జాతీయం... నీ లుంగీ జాతీయం...’ అంటూ సాగే లిరికల్ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్‌జే శివ మాట్లాడుతూ– ‘‘హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రంలో ఎన్నో థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. బ్యాచిలర్ కష్టాలు, బ్యాచిలర్ లైఫ్‌లో ఉండే ఆనందాలను తెలియజేస్తూ విష్ణువర్ధన్ రాసిన ‘నా అంగీ జాతీయం..’ పాటని అనురాగ్ కులకర్ణి పాడారు’’ అని చిత్రయూనిట్ పేర్కొంది.

బిజినెస్ రీల్

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ 'పే' డే సేల్



న్యూఢిల్లీ: విమానయాన సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ తాజాగా 'పే' డే సేల్ ఆఫర్‌ను ప్రకటించింది. దీని కింద చార్జీలపై 25 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తున్నట్లు వెల్లడించింది. జూన్ 7 నుంచి సెప్టెంబర్ 20 వరకు దేశీ రూట్లలో చేసే ప్రయాణాలకు సంబంధించి దీని కింద జూన్ 3 వరకు బుక్ చేసుకోవచ్చు. అక్టోబర్ 25 వరకు చేసే అంతర్జాతీయ రూట్లలో ప్రయాణాలకు కూడా బుక్ చేసుకోవచ్చు. ఇక ఎక్స్‌ప్రెస్ లైట్ బుకింగ్స్‌పై కన్వీనియెన్స్ ఫీజు నుంచి మినహాయింపునిస్తున్నట్లు సంస్థ తెలిపింది.

ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియాతో 7.5 లక్షల మందికి ప్రయోజనం



న్యూఢిల్లీ: అయోడిన్ లోపం, ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లపై నిర్వహించిన ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాంతో దాదాపు 7.5 లక్షల మందికి అవగాహన కల్పించినట్లు డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ వెల్లడించింది. గతేడాది అక్టోబర్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో 30 జిల్లాలవ్యాప్తంగా దీన్ని నిర్వహించినట్లు సంస్థ వివరించింది. 1,100 వీధినాటకాలు, 244 పోషణ మేళాలు, 67 స్కూళ్లలో ప్రత్యేక సెషన్లు మొదలైనవి ఈ కార్యక్రమంలో భాగమయ్యాయని పేర్కొంది. 5,462 మంది ఫ్రంట్‌లైన్ వర్కర్లకు శిక్షణనిచ్చినట్లు కంపెనీ న్యూట్రిషన్ సైన్సెస్ లీడ్ అగాథా బెట్సీ తెలిపారు.

సలాసర్ టెక్నో లాభంలో 30% వృద్ధి



ముంబై: అధిక ఆదాయాల కారణంగా సలాసర్ టెక్నో ఇంజనీరింగ్ గత ఆర్థిక సంవత్సరం (2024–25) మార్చి త్రైమాసికంలో రూ.19.31 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు 2023–24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఆర్జించిన రూ.15.21 కోట్లతో పోలిస్తే ఇది 30% అధికం. ఇదే మార్చి క్వార్టర్‌లో కంపెనీ మొత్తం ఆదాయం 32% వృద్ధి చెంది రూ.358.42 నుంచి రూ.472.68 కోట్లకు చేరింది. సలాసర్ టెక్నో స్టీల్ నిర్మాణ, తయారీ, ఇంజనీరింగ్, మౌలిక సేవలను టెలికం, ఇంధన, రైల్వే రంగాలకు అందిస్తుంది.

పొదుపు ఖాతాల్లో మినిమం బ్యాలెన్స్ నిబంధన ఎత్తివేత: కెనరా బ్యాంక్



బెంగళూరు: సేవింగ్స్ అకౌంట్ ఖాతాదారులకు ప్రభుత్వ రంగ దిగ్గజం కెనరా బ్యాంక్ శుభవార్త చెప్పింది. జూన్ 1 నుంచి అన్ని రకాల సేవింగ్స్ అకౌంట్లకు కనీస నెలవారీ బ్యాలెన్స్ (ఏఎంబీ) నిబంధనను పూర్తిగా ఎత్తివేసినట్లు వెల్లడించింది. సేవింగ్స్ అకౌంట్లు, శాలరీ అకౌంట్లు, ఎన్‌ఆర్‌ఐ ఎస్‌బీ అకౌంట్లకు ఇది వర్తిస్తుంది. దీనితో ఇక ఏ పొదుపు ఖాతా కస్టమరుపైనా కనీస బ్యాలెన్స్ పాటించనందుకు ఎలాంటి రుసుములు లేదా పెనాల్టీల భారం ఉండదని బ్యాంకు తెలిపింది. వేతన జీవులు, సీనియర్ సిటిజెన్లు, విద్యార్థులు, ఎన్నారైలకు కూడా దీనితో ప్రయోజనం లభిస్తుందని బ్యాంకు ఎండీ కె. సత్యనారాయణ రాజు వివరించారు. ప్రస్తుతం అకౌంటు రకాన్ని బట్టి నెలవారీగా కనీస బ్యాలెన్స్ పాటించాల్సి ఉంటోంది. పాటించకపోతే పెనాల్టీ చార్జీలు కట్టాల్సి ఉంటోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-6-2025	
విశాఖ	535-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

డేటా సెంటర్ల బూమ్..

ఆరేళ్లలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు



- మూడు రెట్లు పెరగనున్న సామర్థ్యాలు
- రియల్ ఎస్టేట్‌కి కూడా దన్ను

న్యూఢిల్లీ: దేశీ డేటా సెంటర్ (డీసీ) పరిశ్రమ భారీగా విస్తరిస్తోంది. వచ్చే అయిదారేళ్లలో కొత్తగా 20–25 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులను ఆకర్షించనుంది. దీనితో సెంటర్ల ఏర్పాటు కోసం వినియోగించే రియల్ ఎస్టేట్ కూడా మూడు రెట్లు పెరగనుంది. ప్రస్తుతం 15.9 మిలియన్ చ.అ.లుగా ఉన్న స్పేస్ 2030 నాటికి 55 మిలియన్ చ.అ.లకు చేరనుంది. రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సంస్థ కొలియర్స్ ఇండియా ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ, ఐవోటీ వినియోగం పెరుగుతుండటం, వివిధ రంగాల వ్యాప్తంగా డిజిటలీకరణ వేగవంతం అవుతుండటం తదితర అంశాల దన్నుతో డేటా సెంటర్ల మొత్తం సామర్థ్యాలు మూడు రెట్లు పెరిగి 2030 నాటికి 4.5 గిగావాట్లకు చేరనున్నాయి. 2018లో 307మెగావాట్లుగా ఉన్న డీసీల సామర్థ్యం ఈ ఏడాది ఏప్రిల్ నాటికి, అంటే కేవలం ఏడేళ్ల వ్యవధిలో సుమారు నాలుగు రెట్లు పెరిగి 1.26 గిగావాట్లకు చేరింది.

పరివర్తన దశలో పరిశ్రమ..

ప్రస్తుతం పరిశ్రమ పరివర్తన దశలో ఉందని నిపుణులు తెలిపారు. మెట్రో నగరాల్లోనే కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు కూడా విస్తరిస్తోందని వివరించారు. డీసీల విషయంలో ముంబై, చెన్నైల ఆధిపత్యం ఉంటోంది. మొత్తం సామర్థ్యాల్లో మూడింట రెండొంతుల వాటా వీటిదే ఉంటోంది. అత్యధికంగా 41 శాతం వాటాతో ముంబై అగ్రస్థానంలో, 23 శాతంతో చెన్నై రెండో స్థానంలో, 14 శాతం వాటాతో ఢిల్లీ ఎన్‌సీఆర్ మూడో స్థానంలో ఉన్నాయి. ఈ మూడు మార్కెట్లు కలిసి గత 6–7 ఏళ్లలో డేటా సెంటర్ రియల్ ఎస్టేట్ మూడు రెట్లు పెరిగేందుకు దోహదపడ్డాయి. ''తక్కువ లేటెన్సీ, రియల్ టైమ్ అనాలిసిస్, మెరుగైన యాప్‌ల పనితీరు, వివిధ పరిస్థితులకు అనుగుణంగా వ్యాపారాలు తమను తాము మల్చుకోవాల్సి వస్తుండటం తదితర అవసరాలరీత్యా డేటా సెంటర్లు భారీగా విస్తరిస్తున్నాయి'' అని కొలియర్స్ ఇండియా వెల్లడించింది. 2030 నాటికి డీసీల కెపాసిటీ 4.5 గిగావాట్లకు ఎగియడానికి కూడా ఇదే దోహదపడుతుందని పేర్కొంది. పునరుత్పాదక విద్యుత్, 3 గిగావాట్ల విద్యుత్ మిగులులాంటివి చౌకగా హోస్టింగ్ సేవలు అందించడంలో భారత్‌కు సానుకూలాంశాలని క్యాపిటలాండ్ ఇన్వెస్ట్‌మెంట్ వర్గాలు తెలిపాయి. అతి కొద్ది దేశాలకు మాత్రమే ఈ ప్రయోజనం ఉంటుందని వివరించాయి. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబైలో తలో డేటా సెంటర్ ఏర్పాటు కోసం క్యాపిటలాండ్ మొత్తం మీద 1.15 బిలియన్ సింగపూర్ డాలర్లను ఇన్వెస్ట్ చేస్తోంది.

హైదరాబాద్, ముంబై సారథ్యం..

2020 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ మధ్యకాలంలో భారత్‌లో కొత్తగా 859 మెగావాట్ల డీసీ సామర్థ్యాలు జతయ్యాయి. ఇందులో ముంబై వాటా 44 శాతంగా, చెన్నై, ఢిల్లీ ఎన్‌సీఆర్ వాటా సంయుక్తంగా 42 శాతంగా ఉంది. 2023 నుంచి అయిదేళ్ల వ్యవధిలో కొత్తగా 3 – 3.7 గిగావాట్ల కొత్త సామర్థ్యాలు జత కానున్నాయి. చెరి 1–1.2 గిగావాట్ల సామర్థ్యాలతో హైదరాబాద్, ముంబై ఇందుకు సారథ్యం వహించనున్నాయి. హైదరాబాద్ వర్ధమాన హైపర్‌స్కేల్ హబ్‌గా ఎదుగుతోంది. పుణె 300–450 మెగావాట్లు, చెన్నై 400–450 మెగావాట్ల కొత్తగా సామర్థ్యాలను జతపర్చుకోనున్నాయి.

2020 నుంచి పెట్టుబడుల ప్రవాహం..

భారత డిజిటల్ మౌలిక సదుపాయాలపై ఇన్వెస్టర్లకు పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనంగా భారీగా పెట్టుబడులు తరలి వస్తున్నాయి. 2020 నుంచి 14.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా 2030 నాటికి మరో 20–25 బిలియన్ డాలర్లు రావచ్చనే అంచనాలు నెలకొన్నాయి. తక్కువ లేటెన్సీ, అత్యుత్తమ పనితీరు కోసం ఓటీటీ ప్లాట్‌ఫాంలు, కంటెంట్ డెలివరీ నెట్‌వర్క్ (సీడీఎన్) సేవల సంస్థల నుంచి డిమాండ్ నెలకొన్నట్లు నెక్ట్సా బై ఎయిర్‌టెల్ సీఈవో ఆశీశ్ ఆరోరా తెలిపారు. ఈ సంస్థ 65 పైగా నగరాల్లో 120 ఎడ్జ్ డేటా సెంటర్లు, 14 హైపర్‌స్కేల్ డేటా సెంటర్లను నిర్వహిస్తోంది. తాము ప్రాంతీయంగా చిన్న పట్టణాల్లోకి కూడా విస్తరించడంపై దృష్టి పెడుతున్నామని ఆరోరా వివరించారు. విజయవాడ, అగర్తలా, పాట్నా, గువాహటి, సంబల్‌పూర్, గంగాగంజ్‌లాంటి కీలక నగరాల్లో తమ ఎడ్జ్ సెంటర్లను విస్తరించినట్లు వివరించారు.

వీటితో మెట్రోల వెలుపల తృతీయ శ్రేణి నగరాల్లోని యూజర్లకు కూడా డిజిటల్ మౌలిక సదుపాయాలు మరింతగా అందుబాటులోకి వస్తున్నాయని, లైవ్.. హై–డెఫినిషన్ స్ట్రీమింగ్‌కి సంబంధించి లేటెన్సీ.. బ్యాండ్‌విడ్త్ వ్యయాలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. డీసీల విభాగంలో కొత్త పరిణామాలు చూస్తే అదానీకనెక్స్ సంస్థ చెన్నైలో 100 మెగావాట్ల క్యాంపస్‌ను, నోయిడాలో 50 మెగావాట్ల సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. మరిన్ని ద్వితీయ శ్రేణి పట్టణాల్లోనూ ఏర్పాటు చేసే ప్రణాళికల్లో ఉంది. ఇప్పటికే గ్రేటర్ నోయిడాలో ఉన్న యోటా డీ1తో పాటు హైపర్‌స్కేల్ క్యాంపస్‌ల విస్తరణపై యోటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ. 39,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. క్యాపిటల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ తమ నవీ ముంబై సెంటర్‌పై రూ. 1,940 కోట్ల పెట్టుబడులు ప్రకటించింది. ఎస్‌టీటీ జీడీసీ ఇండియా, ఎన్‌టీటీ గ్లోబల్ తదితర సంస్థలు హైదరాబాద్, చెన్నై, పుణె, బెంగళూరు నగరాల్లో కొత్త హైపర్‌స్కేల్ సెంటర్స్‌తో కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి.

విద్యుత్‌కు బలమైన డిమాండ్

- వచ్చే ఐదేళ్లలో ఏటా 6.5 శాతం వృద్ధి
- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా



న్యూఢిల్లీ: విద్యుత్ డిమాండ్ ఏటా 6–6.5 శాతం చొప్పున (కాంపౌండెడ్‌గా) వచ్చే ఐదేళ్ల పాటు పెరుగుతుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం విస్తరణతోపాటు గ్రీన్ హైడ్రోజన్‌కు ఇస్తున్న ప్రాధాన్యం, డేటా సెంటర్ల విస్తరణ విద్యుత్ అవసరాలను అధికం చేస్తుందని పేర్కొంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో విద్యుదుత్పత్తి సామర్థ్యం ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిలో 44 గిగావాట్లుగా ఉంటుందని అంచనా వేసింది. 2024–25లో ఆల్‌టైమ్ గరిష్ట ఉత్పత్తి 34 గిగావాట్లుగా ఉంది. వచ్చే ఐదేళ్లలో అదనంగా ఏర్పడే డిమాండ్‌లో ఈ మూడు రంగాల నుంచే 20–25 శాతం వాటా ఉంటుందని ఇక్రా కార్పొరేట్ రేటింగ్స్ వైస్ ప్రెసిడెంట్ విక్రమ్ వి తెలిపారు. రూఫ్‌టాప్ సోలార్ వినియోగం పెరుగుతుండడం, ఆఫ్ గ్రిడ్ ప్రాజెక్టుల నేపథ్యంలో గ్రిడ్ సామర్థ్య డిమాండ్ కొంత వరకు తగ్గొచ్చన్నారు. రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టలేషన్లను ప్రోత్సహిస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రస్తావించారు. 2026 మార్చి నాటికి స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం 520 గిగావాట్లకు చేరుకుంటుందని ఇక్రా రేటింగ్స్ తన నివేదికలో పేర్కొంది. 2025–2026లో థర్మల్ విభాగం నుంచి 9–10 గిగావాట్ల కొత్త సామర్థ్యం అందుబాటులోకి రానుండగా.. మిగిలినదంతా పునరుత్పాదక విద్యుత్ వనరుల రూపంలో ఉంటుందని తెలిపింది. రానున్న సంవత్సరాల్లో కొత్త సామర్థ్యంలో పునరుత్పాదక విద్యుత్ (ఆర్ఈ) కీలక పాత్ర పోషించనుందని పేర్కొంది. థర్మల్ విద్యుత్ విభాగం పట్ల స్థిరమైన అవుట్‌లుక్‌తో ఉన్నట్టు ఇక్రా తెలిపింది.

ద్వితీయార్ధంలో నెమ్మదించనున్న హైరింగ్

- వృద్ధి 2.8 శాతానికి పరిమితం
- టీమ్‌లీజ్ సర్వీసెస్ నివేదిక



న్యూఢిల్లీ: ఆర్థికంగా సంక్లిష్ట పరిస్థితులు నెలకొని, ఖర్చుల విషయంలో కంపెనీలు ఆచి తూచి వ్యవహరిస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో నియామకాలు నెమ్మదించనున్నాయి. రిక్రూట్‌మెంట్ కార్యకలాపాల వృద్ధి (ఎన్ఈసీ) 2.8 శాతానికి పరిమితం కానుంది. గత ఆర్థిక సంవత్సరం అక్టోబర్–మార్చి త్రైమాసికంలో ఇది 7.1 శాతంగా నమోదైంది. నియామకాల తీరుతెన్నులపై టీమ్‌లీజ్ సర్వీసెస్ రూపొందించిన సర్వే నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 47 శాతం సంస్థలు సిబ్బందిని పెంచుకుంటామని, 28 శాతం సంస్థలు స్థిరంగా కొనసాగిస్తామని, 25 శాతం కంపెనీలు ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా 20 నగరాల నుంచి 23 పరిశ్రమలకు చెందిన 1,263 సంస్థలు ఈ సర్వేలో పాల్గొన్నాయి. నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు

- డిమాండ్‌ను బట్టి ఉద్యోగులను తీసుకునే ఫ్లెక్సి స్టాఫింగ్ విధానానికి 69 శాతం సంస్థలు మొగ్గు చూపాయి. దీర్ఘకాలిక వ్యయాల భారం లేకుండా, సత్వరం కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ విధానంలో వీలుంటోంది.
- హైరింగ్ వ్యూహాల్లో గిగ్ ఎకానమీకి (స్వల్పకాలిక కాంట్రాక్టులు, ఫ్రీలాన్స్ వర్కింగ్) ప్రాధాన్యం లభిస్తోంది. 64 శాతం కంపెనీలు గిగ్ విధానాల ద్వారా సేల్స్, కస్టమర్ సర్వీస్ కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి.
- ద్రవ్యోల్బణం, ఎగుమతులు మందగించడం, జీడీపీ నెమ్మదించడం తదితర అంశాల కారణంగా వ్యయాల విషయంలో ఆచి తూచి వ్యవహరిస్తున్నట్లు 58 శాతం కంపెనీలు తెలిపాయి. దీంతో ఉద్యోగుల సంఖ్యను ఏదో పేరుకి మాత్రమే పెంచుకోవడం కాకుండా, నిర్దిష్ట నైపుణ్యాలున్న వారినే తీసుకోవడంపై సంస్థలు దృష్టి పెడుతున్నాయి.
- 76 శాతం కంపెనీలు డిజిటల్ లిటరసీకి, 68 శాతం కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ మేనేజ్‌మెంట్‌కి, 63 శాతం సంస్థలు కమ్యూనికేషన్‌లాంటి కీలక నైపుణ్యాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపాయి.
- ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పర్యావరణ అనుకూల మొబిలిటీ సొల్యూషన్స్‌కి డిమాండ్ పెరుగుతుండటంతో ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ వాహనాలు, అనుబంధ మౌలిక సదుపాయాల రంగాలు, ఈ–కామర్స్, టెక్ స్టార్టప్‌లు వృద్ధి చెందనున్నాయి.

బీమాలో ఏఐకి విశ్వసనీయత సవాళ్లు

కేపీఎంజీ నివేదిక



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వివిధ రంగాల్లో కృత్రిమ మేధను (ఏఐ) ఉపయోగించడం గణనీయంగా పెరుగుతున్నప్పటికీ బీమా పరిశ్రమలో మాత్రం పూర్తి స్థాయిలో వినియోగించడంపై సమస్యలు ఎదురవుతున్నాయి. విశ్వసనీయత, డేటా నిర్వహణ దీనికి ప్రధాన సవాళ్లుగా ఉంటున్నాయి. కేపీఎంజీ ఇంటర్నేషనల్ రూపొందించిన 'స్మార్ట్ ఇన్సూరెన్స్' పరిశోధన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం, ఏఐని పూర్తిగా విశ్వసించడంపై సందేహాలు నెలకొన్నట్లు సర్వేలో పాల్గొన్న కంపెనీల్లో 46 శాతం సంస్థలు తెలిపాయి. కేవలం 25 శాతం సంస్థలు మాత్రమే దీన్ని పూర్తిగా విశ్వసిస్తున్నాయి. ఇక ఏఐ వినియోగాన్ని పెంచుకోవడంలో డేటా నిర్వహణ మరో కీలక సవాలుగా ఉంటోందని 72 శాతం ఇన్సూరెన్స్ సంస్థలు వెల్లడించాయి. మరోవైపు, ఏఐపై తొందరపడి ఇప్పుడే ఇన్వెస్ట్ చేస్తే సమీప భవిష్యత్తులో ఆ పెట్టుబడులు వృథా అవుతాయేమో అనే సందేహాలు ఉన్నట్లు మూడొంతుల మంది ఇన్సూరెన్స్ ఎగ్జిక్యూటివ్‌లు తెలిపారు. ఓవైపు కార్పొరేట్లు పర్యావరణహితమైన విధానాలతో కార్యకలాపాలు నిర్వహించుకోవడంపై దృష్టి పెడుతుండగా మరోవైపు ఏఐ కోసం భారీ ఎత్తున విద్యుత్ కూడా ఉపయోగించాల్సి వస్తుండటం సైతం కృత్రిమ మేధ విస్తృతికి ప్రతిబంధకంగా ఉంటోంది. తమ సస్టైనబిలిటీ లక్ష్యాలు, ఏఐ విద్యుత్ వినియోగానికి మధ్య సమతౌల్యం పాటించేందుకు మల్లగుల్లాలు పడుతున్నట్లు 72 శాతం మంది ఎగ్జిక్యూటివ్స్ తెలిపారు. కస్టమర్లకు మెరుగైన అనుభూతిని అందించేందుకు ఏఐ ఉపయోగపడుతోందని, తమ ప్రోడక్టులు, సర్వీసులకు కృత్రిమ మేధ కీలకంగా ఉంటోందని 57 శాతం మంది పేర్కొన్నారు.

ఏం చేయాలంటే..

ఈ నేపథ్యంలో ఏఐని తమ ప్రస్తుత వ్యవస్థలకు అనుసంధానించడంతో పాటు కొత్త ఆవిష్కరణలు, పరిస్థితులకు తగ్గట్లుగా తమను తాము మల్చుకోగలిగే సంస్కృతిని పెంపొందించుకోవడంపై బీమా సంస్థలు దృష్టి పెట్టాల్సి ఉంటుందని కేపీఎంజీ ఇంటర్నేషనల్ గ్లోబల్ హెడ్ (ఇన్సూరెన్స్) ఫ్రాంక్ ఫాఫెన్‌జెల్లర్ తెలిపారు. ప్రస్తుతం బీమా పరిశ్రమ ఇన్సూర్‌టెక్, కృత్రిమ మేధ, డిజిటైజేషన్ మొదలైన వాటన్నింటినీ సమన్వయపర్చుకుంటూ ముందుకెళ్లే క్రమంలో ఉందని కేపీఎంజీ భారత విభాగం హెడ్ (ఇన్సూరెన్స్) కైలాస్ మిట్టల్ తెలిపారు. దీర్ఘకాలిక లక్ష్యాలకు తగ్గట్లుగా ఏఐని వినియోగించుకోవడంపై కంపెనీలు వ్యూహాత్మకమైన మార్గదర్శ ప్రణాళికను రూపొందించుకోవాల్సి ఉంటుందని నివేదిక పేర్కొంది. అకౌంటింగ్ ప్రమాణాలను నిర్వర్తించేందుకు, రిస్కులను ఎదుర్కొనేందుకు, గోప్యతపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ బీమా సంస్థలు పటిష్టమైన ఏఐ వ్యవస్థలను రూపొందించుకోవాలని పేర్కొంది. అలాగే, ముప్పులను నివారించేందుకు, అవాంఛనీయ ధోరణులను గుర్తించే క్రమంలో ఏఐ మోడల్స్‌ను నిరంతరం ఆడిట్ చేసేందుకు అధునాతన భద్రతా చర్యలు, సాధనాలను ఉపయోగించాలని సూచించింది.

డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై సమస్యాత్మక ప్రకటనలు

- బెట్టింగ్, రియల్ ఎస్టేట్ కంపెనీల ఉల్లంఘనలు
- ప్రకటనల ప్రమాణాల మండలి ఆక్షేపణ



ముంబై: సమస్యాత్మక ప్రకటనలకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ప్రధాన మాధ్యమంగా మారాయని భారతీయ ప్రకటనల ప్రమాణాల మండలి (ఏఎస్‌సీఐ) తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో (2024–25) మొత్తం 9,599 ప్రకటనల ఫిర్యాదులు ఏఎస్‌సీఐ దృష్టికి రాగా.. ఇందులో 7,199 ప్రకటనల ఉల్లంఘనలను గుర్తించింది. వీటిల్లో 95 శాతం ప్రకటనలు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై ప్రసారమైనవేనని ఏఎస్‌సీఐ ప్రకటించింది. వీటిల్లోనూ మూడింట రెండొంతులు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై ప్రాయోజిత ప్రకటనలు కాగా, 32 శాతం ప్రకటనలు కంపెనీల సొంత వెబ్‌సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లలో వచ్చినవిగా తెలిపింది. అత్యధికంగా 79 శాతం సమస్యాత్మక ప్రకటనలకు మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ మాతృ సంస్థ) కేంద్రంగా ఉన్నట్లు పేర్కొంది. ఇక గత ఆర్థిక సంవత్సరంలో సమస్యాత్మక ప్రకటనల్లో 43.52 శాతం ఆఫ్‌షోర్ బెట్టింగ్‌కు సంబంధించి ఉంటే, 25 శాతం రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించినవిగా ఏఎస్‌సీఐ తెలిపింది. 3,347 ప్రకటనలు చట్ట నిబంధనలను ఉల్లఘించేవిగా ఉండడంతో వాటిపై చర్యలకు ప్రభుత్వానికి నివేదించినట్టు వెల్లడించింది. డిజిటల్ మీడియా పెద్ద సవాళ్లను తీసుకొస్తోందని.. భాగస్వాములు అందరూ వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం కలసికట్టుగా చర్యలు తీసుకోవాల్సి ఉందని ఏఎస్‌సీఐ అభిప్రాయపడింది. టీవీ, పత్రికల్లో ఇచ్చే ప్రకటనలు ఒకే తీరులో ఉంటే.. ఆల్గోరిథమ్ ఆధారితంగా నడిచే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై మాత్రం విభిన్న యూజర్లకు విభిన్న ప్రకటనలు ప్రదర్శితం అవుతున్నాయని.. వీటిని పర్యవేక్షించడం క్లిష్టంగా మారినట్టు తెలిపింది. డిజిటల్ వేదికలపై సమస్యాత్మక ప్రకటనలను గుర్తించేందుకు వీలుగా.. ఫ్రెంచ్ సంస్థతో ఏఎస్‌సీఐ జట్టు కట్టడంతోపాటు.. టెక్నాలజీపై పెట్టుబడులను పెంచడం గమనార్హం.

ఐపీవోల బాటలో బీఎఫ్ఎస్ఐ సంస్థలు

- సెబీకి ప్రాస్పెక్టస్‌ల దాఖలు
- జాబితాలో డజను పైగా కంపెనీలు
- రూ. 50,000 కోట్లకు పైగా సమీకరించే అవకాశం



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగం) కంపెనీలు భారీ స్థాయిలో పబ్లిక్ ఇష్యూకి రాబోతున్నాయి. ఇందుకు సంబంధించి పలు కంపెనీలు ఇప్పటికే మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌లు దాఖలు చేశాయి. కొత్తగా షేర్లను జారీ చేయడం లేక ఆఫర్ ఫర్ సేల్ రూపంలో లేదా రెండింటి మేళవింపుతో ఈ ఇష్యూలు ఉండబోతున్నాయి. మార్కెట్ వర్గాల అంచనాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇష్యూల ద్వారా బీఎఫ్ఎస్ఐ కంపెనీల నిధుల సమీకరణ రూ. 50,000 కోట్ల మార్కును దాటేసే అవకాశం ఉంది. ఇది గత ఆర్థిక సంవత్సరంలో సమీకరించిన దానికి మూడు రెట్లు అధికం. 2025 ఆర్థిక సంవత్సరంలో బీఎఫ్ఎస్ఐ రంగానికి చెందిన ఎనిమిది కంపెనీలు ఐపీవోల ద్వారా సుమారు రూ. 16,275 కోట్లు సమీకరించాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో 10 సంస్థలు రూ. 9,655 కోట్ల మొత్తాన్ని పబ్లిక్ ఇష్యూల ద్వారా సమకూర్చుకున్నాయి.

హెచ్‌డీబీ ఫైనాన్షియల్ రూ. 12,500 కోట్లు...

పబ్లిక్ ఇష్యూలకు వస్తున్న వాటిలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ (రూ. 12,500 కోట్లు), క్రెడిలా ఫైనాన్షియల్ సర్వీసెస్ (5,000 కోట్లు), అవాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (రూ. 3,500 కోట్లు), హీరో ఫిన్‌కార్ప్ (రూ. 3,668 కోట్లు), వెరిటాస్ ఫైనాన్స్ (రూ. 2,800 కోట్లు), ఎస్‌కే ఫైనాన్స్ (రూ. 2,200 కోట్లు) మొదలైన సంస్థలు ఉన్నాయి. టాటా క్యాపిటల్ నిర్దిష్టంగా ఎంత సమీకరించేదీ ఇంకా వెల్లడి కానప్పటికీ అన్‌లిస్టెడ్ షేర్ల ట్రేడింగ్ తీరుతెన్నులను బట్టి చూస్తే 2 బిలియన్ డాలర్ల స్థాయిలో ఇష్యూ ఉండొచ్చని భావిస్తున్నారు. కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్, కెనరా రోబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ మొదలైనవి కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

వ్యాపార అవసరాలరీత్యా..

నియంత్రణ సంస్థపరమైన నిబంధనలు, మార్కెట్.. వ్యాపార అవసరాల రీత్యా పలు బీఎఫ్ఎస్ఐ కంపెనీలు ఐపీవో బాట పడుతున్నాయి. దాదాపు డజను పైగా సంస్థలు పబ్లిక్ ఇష్యూకి సిద్ధమవుతున్నాయి.

కొంతకాలం పాటు మందగించిన ఈక్విటీ మార్కెట్లు, మళ్లీ కనిష్ట స్థాయుల నుంచి 15–20 శాతం పుంజుకున్నాయని ఆనంద్ రాఠీ షేర్స్ అండ్ స్టాక్ బ్రోకర్స్ హెడ్ (ఫండమెంటల్ రీసెర్చ్ – ఇన్వెస్ట్‌మెంట్ సర్వీసెస్) నరేంద్ర సోలంకి తెలిపారు. దీంతో ఐపీవో ద్వారా నిధుల సమీకరణకు బీఎఫ్ఎస్ఐ సంస్థలు ధీమాగా ముందుకొస్తున్నాయని వివరించారు. ఇక లిక్విడిటీ కొరతను అధిగమించేందుకు ఆయా కంపెనీల మాతృసంస్థలు .. ముఖ్యంగా బ్యాంకులకు, ఈ ఐపీవోలు కొంత ఉపయోగకరంగా ఉండగలవని తెలిపారు. క్యాపిటల్ అడిక్వసీ నిష్పత్తి నిబంధనలను పాటించడానికి, కార్యకలాపాల విస్తరణకు, రుణభారాలను తగ్గించుకునేందుకు ఐపీవోలు వ్యూహాత్మక మార్గంగా ఉంటాయని ప్రమోటర్లు భావిస్తున్నట్లు వివరించారు. చాలా కంపెనీలు వ్యాపార వృద్ధికి అవసరమైన మూలధనాన్ని సమకూర్చుకునేందుకు, నియంత్రణ సంస్థపరమైన నిబంధనలు పాటించేందుకు, నిధుల సమీకరణకు ఉపయోగపడే వనరులను పెంచుకునేందుకు చాలా మటుకు నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు, బీమా సంస్థలు, ఫిన్‌టెక్ సంస్థలు ప్రైమరీ మార్కెట్ల బాట పడుతున్నాయి.

బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ), రిజర్వ్ బ్యాంక్ నిబంధనల కారణంగా పారదర్శకత, గవర్నెన్స్‌పరమైన ప్రమాణాలను మెరుగుపర్చుకునేందుకు ఐపీవోలకు వస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, ఇన్వెస్టర్లు ఆచితూచి కంపెనీలను ఎంచుకుంటున్న నేపథ్యంలో ఈ ఐపీవోల్లో ఎన్ని భారీ స్థాయిలో విజయవంతమవుతాయో చూడాల్సి ఉంటుందని పేర్కొన్నాయి.

ప్రీమియం మోడల్‌లో క్విక్ హీల్ యాంటీఫ్రాడ్ యాప్



పుణె: సీమాంతర సైబర్ ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో క్విక్ హీల్ టెక్నాలజీస్ తాజాగా మోసాల నివారణ సొల్యూషన్ యాంటీ ఫ్రాడ్‌డాట్‌ఏఐ ప్రీమియం వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. ఫోన్‌లో కనిపించే హానికరమైన యాప్‌లతో పాటు కనిపించకుండా దాక్కునే యాప్‌లను కూడా గుర్తించడం దీని ప్రత్యేకత. ఫిషింగ్, స్పైవేర్, ఆర్థిక మోసాలపరమైన దాడుల కోసం ఉపయోగించే ఈ హిడెన్ యాప్‌లు యూజరుకు తెలియకుండా పని చేస్తాయి. ఇలాంటి యాప్‌ల గురించి యాంటీఫ్రాడ్‌డాట్‌ఏఐ యూజర్లను అలర్టు చేసి, తగు చర్యలు తీసుకునేందుకు సహాయపడుతుంది. స్కామ్ ప్రొటెక్షన్, రిస్క్ ప్రొఫైల్ అసెస్‌మెంట్, కాల్ ఫార్వార్డింగ్.. బ్యాంకింగ్ ఫ్రాడ్ అలర్ట్, ఫ్రాడ్ ప్రొటెక్ట్ బడ్డీ మొదలైన ఫీచర్లు ఇందులో ఉంటాయి. దీన్ని ప్రాథమికంగా ఉచితంగా ఉపయోగించుకోవచ్చని, మరింత భద్రత కోరుకునే వారు సబ్‌స్క్రిప్షన్ ద్వారా ప్రీమియం వెర్షన్ తీసుకోవచ్చని సంస్థ సీఈవో విశాల్ సాల్వి తెలిపారు.

ముగిసిన ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

24 పతకాలతో భారత్‌కు రెండో స్థానం

సచిన్, పారుల్‌లకు రజతాలు

- 4x100 మీ. రిలేలో మరో రజతం
- చివరి రోజు ఆరు పతకాలు
- 200మీ. స్ప్రింట్‌లో జ్యోతికి నిరాశ

గుమి (దక్షిణ కొరియా): ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆఖరి రోజు కూడా భారత్ పతకాల వేట కొనసాగింది. శనివారం జరిగిన చివరి రోజు పోటీల్లో అథ్లెట్లు మరో అర డజను (6) పతకాలు సాధించారు. జావెలిన్ త్రోయర్ సచిన్ యాదవ్, మహిళల 5000 మీ. పరుగులో పారుల్ చౌదరి రజతం గెలుపొందగా. మరో రజత పతకం మహిళల 4x100 మీ. రిలేలో లభించింది. పురుషుల 200 మీ. స్ప్రింట్‌లో అనిమేశ్ కుజూర్, మహిళల 800 మీ. పరుగులో పూజ సింగ్, మహిళల 400 మీ. హర్డిల్స్‌లో విత్య రామ్‌రాజ్ కాంస్య పతకాలు


సచిన్

సాధించారు. ఈ పోటీల్లో రెండో పతకం గెలవాలని గంపెడాశలు పెట్టుకున్న ఆంధ్రప్రదేశ్ మేటి రన్నర్ జ్యోతి యర్రాజీకి 200 మీటర్ల పరుగులో నిరాశ ఎదురైంది. 100 మీ. హర్డిల్స్‌లో పసిడి పతకాన్ని నిలబెట్టుకున్న ఆమె... స్ప్రింట్‌లో మాత్రం 23.47 సెకన్ల టైమింగ్‌తో ఐదో స్థానానికి పరిమితమైంది.

భారత్‌కు రెండో స్థానం

ఓవరాల్‌గా భారత్ 24 పతకాలతో పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. గత బ్యాంకాక్ (2023లో 27 పతకాలు) ఈవెంట్‌తో పోల్చితే 3 పతకాలు తగ్గినా... బంగారంలో భారత్ మెరుగైంది. నాటి క్రీడల్లో 6 స్వర్ణాలు సాధిస్తే... తాజా ఈవెంట్‌లో 8 పసిడి పతకాలు సహా 10 రజతాలు, 6 కాంస్య పతకాలను భారత బృందం గెలిచింది. చైనా 32 పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది. బీజింగ్ బృందం 19 స్వర్ణాలు, 9 రజతాలు, 4 కాంస్య పతకాలు సాధించింది. 28 పతకాలు గెలుచుకున్న జపాన్ మూడో స్థానంలో ఉంది. జపనీస్ అథ్లెట్లు రజతాలు (11), కాంస్యాలు (12) ఎక్కువగా సాధించినప్పటికీ స్వర్ణాల్లో (5) వెనుకబడటంతో మూడో స్థానం దక్కింది. ఈ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత్ 2017లో 29 పతకాలతో అగ్ర స్థానంలో నిలిచిన ఘనతను సొంతం చేసుకుంది. సొంతగడ్డ (భువనేశ్వర్)పై జరిగిన ఆ ఈవెంట్‌లో 10 స్వర్ణాలు, 6 రజతాలు, 13 కాంస్య పతకాలను భారత్ చేజిక్కించుకుంది.




పారుల్

పారుల్‌కు రెండో రజతం

ఈ పోటీల్లో ఇదివరకే మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో రజత పతకం సాధించిన పారుల్ చౌదరి డబుల్ ధమాకా సాధించింది. తాజాగా ఆమె మహిళల 5000 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానంతో పోడియంలో నిలిచింది. సుదీర్ఘ పరుగు పోటీని ఆమె 15 నిమిషాల 15.33 సెకన్లలో ముగించి రెండో రజత పతకాన్ని చేజిక్కించుకుంది. పురుషుల జావెలిన్ త్రోలో రైజింగ్ స్టార్ సచిన్ యాదవ్ ఈటెను 85.16 మీటర్ల దూరంలో విసిరి రజతం అందుకున్నాడు. ఈ క్రమంలో తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన (84.39 మీ.)ను అధిగమించాడు. సచిన్ సహచరుడు... ఫైనల్ బరిలో నిలిచిన యశ్‌వీర్ సింగ్ కూడా అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన (82. 57 మీటర్లు) నమోదు చేసినప్పటికీ ఐదో స్థానంలో నిలిచాడు. మహిళల 4x100 మీటర్ల రిలే ఈవెంట్‌లో తెలంగాణ అథ్లెట్ నిత్య గంధె, అభినయ, స్నేహ, శ్రావణి నందతో కూడిన భారత బృందం సీజన్ బెస్ట్ ప్రదర్శన 43.86 సెకన్లతో రెండో స్థానంతో రజత పతకాన్ని గెలుచుకుంది.

విత్య, పూజలకు కాంస్యాలు

ఆసియా క్రీడల కాంస్య పతక విజేత విత్య రామ్‌రాజ్ కాంస్య పతకం గెలిచింది. మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో తమిళనాడుకు చెందిన 26 ఏళ్ల అథ్లెట్ పోటీని 56.46 సెకన్లలో పూర్తిచేసి మూడో స్థానంతో 'పోడియం'లో నిలిచింది. శనివారం ఈ ఫైనల్స్ బరిలో నిలిచిన మరో భారత అథ్లెట్ అను రాఘవన్‌కు ఏడో స్థానం దక్కింది. ఆమె పోటీని 57.46 సెకన్లలో పూర్తి చేసింది. మహిళల ఈవెంట్‌లో మరో కాంస్యాన్ని పూజ సింగ్ సాధించింది. మహిళల 800 మీటర్ల పరుగులో పోటీపడిన ఆమె రేసును 2 నిమిషాల 01.89 సెకన్లలో పూర్తిచేసి మూడో స్థానంలో నిలిచింది.


విత్య


పూజ

స్ప్రింట్‌లో దశాబ్దం తర్వాత...

కొరియన్ గడ్డపై స్ప్రింట్‌లో పతకానికి పదేళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. పురుషుల 200 మీటర్ల పరుగులో అనిమేశ్ కుజూర్ కాంస్య పతకం సాధించాడు. శనివారం జరిగిన పోటీలో 21 ఏళ్ల ఒడిశా స్ప్రింటర్ పరుగును 20.32 సెకన్లలో పూర్తిచేసి జాతీయ రికార్డు నెలకొల్పాడు. కానీ వెంట్రుక వాసిలో 00.01 సెకన్ తేడాతో రజతం గెలిచే అవకాశాన్ని కోల్పోయాడు. అయితే అతని వ్యక్తిగత అత్యుత్తమ వేగాన్ని (20.40 సెకన్లు) మెరుగుపర్చుకున్నాడు. ఈ ఏడాది సీనియర్ అథ్లెటిక్స్‌లో ఆ టైమింగ్‌ను నమోదు చేశాడు. అబ్దుల్ అజీజ్ (సౌదీ అరేబియా; 20.31 సె.) రజతం నెగ్గారు. సరిగ్గా పదేళ్ల క్రితం (2015లో) 200 మీ. పరుగులో ధరమ్‌వీర్ సింగ్ కాంస్యంతో స్ప్రింట్‌లో భారత్ తొలి పతకం అందించాడు. ఆ తర్వాత నాలుగుసార్లు 2017, 2019, 2021, 2023 ఆసియా ఈవెంట్ జరిగినా... ఎవరూ స్ప్రింట్‌లో పతకం నెగ్గలేకపోయారు.


అనిమేశ్


మొహమ్మద్ రెజా

పది మందికి రూ. 1 కోటికి పైగా...

- ప్రొ కబడ్డీ లీగ్ వేలంలో తొలిసారి
- మొహమ్మద్ రెజాకు రూ. 2.23 కోట్లు
- నేడూ సాగనున్న వేలం

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ సీజన్–12 కోసం జరిగిన వేలంలో ఆటగాళ్ల పంట పండింది. లీగ్ వేలం చరిత్రలో ఒకే సీజన్‌లో తొలిసారి 10 మందికి పైగా ఆటగాళ్లు రూ. 1 కోటికి మించి విలువ పలకడం విశేషం. గత సీజన్‌లో 'అత్యంత విలువైన ఆటగాడి' అవార్డు పొందిన ఇరాన్ ప్లేయర్ మొహమ్మద్ రెజా షాద్లుయికి రికార్డు స్థాయిలో రూ. 2.23 కోట్లు దక్కడం విశేషం. ఈ భారీ మొత్తానికి గుజరాత్ జెయింట్స్ రెజాను సొంతం చేసుకుంది. వరుసగా మూడు సీజన్లోనూ రూ. 2 కోట్లకు మించిన ధర పలికిన ఆటగాడిగా రెజా నిలవడం అతని స్థాయిని చూపిస్తోంది. భారత ఆటగాళ్లలో దేవాంక్ దలాల్ టాపర్‌గా నిలిచాడు. అతడిని వేలంలో బెంగాల్ వారియర్స్ రూ. 2.20 కోట్లకు గెలుచుకుంది. గత సీజన్‌లో దేవాంక్ బెస్ట్ రైడర్‌గా నిలిచి పట్నా పైరేట్స్ ఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు. తెలుగు టైటాన్స్ జట్టు వేలంలో భరత్ (రూ.81.50 లక్షలు), విజయ్ మలిక్ (రూ.51.50 లక్షలు), శుభమ్ షిండే (రూ. 80 లక్షలు)లను ఎంచుకుంది.


దేవాంక్

తొలి రోజు వేలంలో టాప్-10

ప్లేయర్	విలువ	జట్టు
1. మొహమ్మద్ రెజా	రూ.2.23 కోట్లు	గుజరాత్ జెయింట్స్
2. దేవాంక్ దలాల్	రూ. 2.20 కోట్లు	బెంగాల్ వారియర్స్
3. అషు మలిక్	రూ. 1.90 కోట్లు	దబంగ్ ఢిల్లీ
4. అంకిత్ జగ్లాన్	రూ. 1.57 కోట్లు	పట్నా పైరేట్స్
5. అర్జున్ దేశ్వాల్	రూ. 1.40 కోట్లు	తమిళ్ తలైవాస్
6. నవీన్ కుమార్	రూ. 1.20 కోట్లు	హర్యానా స్టీలర్స్
7. యోగేశ్	రూ. 1.12 కోట్లు	బెంగళూరు బుల్స్
8. గుమన్ సింగ్	రూ. 1.07 కోట్లు	యూపీ యోధాస్
9. సచిన్ తన్వర్	రూ. 1.05 కోట్లు	పుణేరీ పల్టన్
10. నితిన్ కుమార్	రూ. 1 కోటి	జైపూర్ పింక్ పాంథర్స్

ప్రిక్వార్టర్స్‌లో సినెర్, జ్వెరెవ్

- మహిళల్లో పెగూలా, అంద్రీవా కూడా
- సత్తాచాటుకున్న బోపన్న జోడీ
- ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో స్టార్లు, సీడెడ్ ఆటగాళ్ల జోరు కొనసాగుతోంది. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్, మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్, డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్‌కరాజ్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ కోకో గాఫ్, మూడో సీడ్ పెగూలా, ఆరో సీడ్ అంద్రీవా ప్రిక్వార్టర్స్ చేరారు. అయితే భారత డబుల్స్ ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. వెటరన్ ప్లేయర్ రోహన్ బోపన్న తన చెక్ రిపబ్లిక్ భాగస్వామితో ముందంజ వేయగా... శ్రీరామ్ బాలాజీకి రెండో రౌండ్లోనే చుక్కెదురైంది.

సులువుగా సినెర్...

టాప్‌సీడ్ ఇటలీ స్టార్ యానిక్ సినెర్ క్లేకోర్ట్ టైటిల్ దిశగా మరో అడుగు ముందుకు వేశాడు. శనివారం జరిగిన మూడో రౌండ్లో మూడు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్, నిరుటి ఫ్రెంచ్ ఓపెన్ సెమీ ఫైనలిస్ట్ సినెర్ 6–0, 6–1, 6–2తో చెక్ రిపబ్లిక్ ఆటగాడు జిరి లెహెకాపై అలవోక విజయం సాధించాడు. గంటన్నర పాటు జరిగిన ఈ సమరంలో 3 ఏస్‌లు సంధించిన టాప్‌సీడ్ ఆటగాడు, 27 విన్నర్లు కొట్టాడు. లెహెక మూడు ఏస్‌లు సంధించినప్పటికీ 14 విన్నర్లే కొట్టగలిగాడు. గత ఫ్రెంచ్ ఓపెన్, తాజా ఆస్ట్రేలియన్ ఓపెన్ రన్నరప్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6–2, 7–6 (7/4), 6–1తో ఇటలీకి చెందిన ఫ్లావికొ కొబొలిపై గెలుపొందగా... స్పెయిన్ సంచలనం, రెండో సీడ్ అల్‌కరాజ్ 6–1, 6–3, 4–6, 6–4తో డమిర్ డిజుమ్‌హుర్ (బోస్నియా)పై విజయం సాధించాడు.

పెగూలా జోరు


సినెర్

మహిళల సింగిల్స్‌లో జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో జెస్సికా పెగూలా (అమెరికా) 3–6, 6–4, 6–2తో మార్కెటా వొండ్రుసొవా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందగా... రెండో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6–1, 7–6 (7/3)తో బొజ్కొవా (చెక్ రిపబ్లిక్)తో విజయం సాధించింది. ఆరో సీడ్ అంద్రీవా (రష్యా) 6–3, 6–1తో యూలియా పుతిత్సెవా (కజకిస్తాన్)పై సులువుగా గెలిచి ప్రిక్వార్టర్స్ చేరారు. అమెరికన్ ప్రత్యర్థుల మధ్య జరిగిన మరో పోరులో ఏడో సీడ్ మాడిసన్ కీస్ 4–6, 6–3, 7–5తో 31వ సీడ్ కెనిన్‌పై నెగ్గింది.

డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో బోపన్న

భారత అగ్రశ్రేణి డబుల్స్ ఆటగాడు రోహన్ బోపన్న పురుషుల డబుల్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. శనివారం జరిగిన రెండో రౌండ్లో బోపన్న–పావ్లాసెక్ (చెక్ రిపబ్లిక్) జోడీ 6–7 (2/7), 7–6 (7/5), 6–2తో ఫ్రాన్స్‌కు చెందిన 13వ సీడ్ సాడియో డొంబియా– ఫెబియెన్ రిబొల్ జంటపై చెమటోడ్చి నెగ్గింది. ఇరు జోడీలు హోరాహోరీగా తలపడటంతో తొలి రెండు సెట్లు టైబ్రేక్‌కు దారితీసాయి. తొలిసెట్ కోల్పోయినప్పటికీ ఎలాంటి నిరుత్సాహానికి గురవని భారత్–చెక్ జోడీ రెండో సెట్‌లో పుంజుకొంది. టైబ్రేక్‌తో రెండో సెట్‌ను తర్వాత మూడో సెట్‌తో మ్యాచ్‌లో గెలుపొందింది. మరో డబుల్స్ ద్వయం శ్రీరామ్ బాలాజీకి రెండో రౌండ్లో చుక్కెదురైంది. బాలాజీ–రెయెస్ వారెలా (మెక్సికో) 3–6, 4–6తో ఇటలీకి చెందిన సిమోన్ బొలెలి– అంద్రియా వవసొరి జంట చేతిలో ఓటమి పాలైంది.


గాఫ్

పియాస్ట్రికి పోల్

బార్సిలోనా: ఫార్ములా వన్ సీజన్ పదో రేసు స్పానిష్ గ్రాండ్ ప్రిలో మెక్‌లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి పోల్ పొజిషన్ సాధించాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో పియాస్ట్రి 1 నిమిషం 11.546 సెకన్లలో ల్యాప్‌ను పూర్తిచేసి అగ్రస్థానంలో నిలిచాడు. ఆదివారం జరగనున్న ప్రధాన రేసును అతడు తొలి స్థానం నుంచి ప్రారంభించనున్నాడు. మెక్‌లారెన్ జట్టుకే చెందిన నోరిస్ (1 నిమిషం 11.755 సెకర్లు), డిఫెండింగ్ వరల్డ్ చాంపియన్, రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (1 నిమిషం 11.848 సెకన్లు) వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచారు. మెర్సిడెస్ డ్రైవర్ రసెల్ (1 నిమిషం 11.848 సెకన్లు) నాలుగో స్థానం దక్కించుకోగా... ఏడుసార్లు ప్రపంచ చాంపియన్, ఫెరారీ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ (1 నిమిషం 12.045 సెకన్లు) ఐదో 'ప్లేస్'లో నిలిచాడు. ఆస్ట్రేలియాకు చెందిన పియాస్ట్రికి ఈ సీజన్‌లో ఇది నాలుగో పోల్ కావడం విశేషం. ఈ సీజన్‌లో మెక్‌లారెన్ డ్రైవర్ల జోరు సాగుతుండగా... తొమ్మిది రేసులు ముగిసే సరికి డ్రైవర్స్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో పియాస్ట్రి 161 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. లాండోనోరిస్ 158 పాయింట్లతో రెండో ప్లేస్‌లో కొనసాగుతుండగా... నాలుగు సార్లు ప్రపంచ చాంపియన్ వెర్‌స్టాపెన్ (136 పాయింట్లు) మూడో స్థానంలో ఉన్నాడు. హామిల్టన్ 63 పాయింట్లతో ఆరో 'ప్లేస్'లో కొనసాగుతున్నాడు.



టీమిండియా మేనేజర్‌గా యుధ్‌వీర్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్ పర్యటనలో భారత క్రికెట్ జట్టు మేనేజర్‌గా యుధ్‌వీర్ సింగ్ ఎంపికయ్యాడు. ఈ నెల 20 నుంచి టీమిండియా ఇంగ్లండ్‌తో 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుంది. ఈ టూర్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) యుధ్‌వీర్‌ను మేనేజర్‌గా ఎంపిక చేసింది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ క్రికెట్ సంఘం (యూపీసీఏ) కార్యదర్శిగా పనిచేస్తున్న యుధ్‌వీర్... గతంలో యూపీసీఏ అధ్యక్షుడిగానూ వ్యవహరించారు. క్రికెట్ వ్యవహారాల్లో అతడికి విశేష అనుభవం ఉందని ఓ బీసీసీఐ అధికారి తెలిపారు. ఈ సిరీస్ కోసం సెలెక్షన్ కమిటీ ఇప్పటికే జట్టును ప్రకటించగా... యువ ఓపెనర్ శుబ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసింది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి టెస్టు ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో గిల్ సారథ్యంలోని యువ జట్టు ఈ సిరీస్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025–27 సీజన్‌ను భారత జట్టు ఇదే సిరీస్‌తో ప్రారంభించనుంది.



శనివారం కెనడాలోని మనిటోబా ప్రావిన్స్‌లో షెరిడాన్ ప్రాంతాన్ని కమ్మేసిన కార్చిచ్చు. దీని ధాటికి ఇప్పటికే వేలాది ఎకరాలు కాలి బూడిదైనట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.



జర్మనీ పశ్చిమ ప్రాంతంలోని నెదర్లాండ్స్ సరిహద్దుల్లో ఉన్న కొర్షెన్‌బ్రోయిచ్‌లో నివాస భవనంపై కుప్పకూలిన చిన్న విమానం. ఈ దుర్ఘటనలో ఇద్దరు చనిపోయారు. వారిలో ఒకరు పైలట్‌గా భావిస్తున్నారు.

బాలిక పొట్టలో 2 మీటర్ల వెంట్రుకల పోగు

ప్రపంచంలోనే రికార్డు.. తొలగించిన జైపూర్ వైద్యులు

జైపూర్: రాజస్తాన్‌లోని జైపూర్‌కు చెందిన వైద్యులు ఓ బాలిక పొట్టలోని 210 సెంటీమీటర్ల పొడవైన వెంట్రుకల పోగు(ట్రైకోబెజొయర్)ను శస్త్రచికిత్సతో విజయవంతంగా తొలగించారు. ప్రపంచంలోనే ఇది అతి పెద్ద వెంట్రుకల పోగుగా రికార్డుకెక్కింది. ఇప్పటి వరకు ఉన్న వెంట్రుకల పోగు రికార్డు 180 సెంటీమీటర్లు కావడం విశేషం. యూపీలోని ఆగ్రాకు చెందిన పదో తరగతి చదువుకునే 14 ఏళ్ల బాలిక నెల రోజులుగా వాంతులు, కడుపునొప్పితో తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. పరీక్షలు చేపట్టిన వైద్యులు..పొట్ట కుడివైపున, బొడ్డు వరకు గట్టి పదార్థం విస్తరించి ఉన్నట్లు గుర్తించారు. కాంట్రాక్ట్ ఎన్‌హాన్స్‌డ్ సీటీ స్కాన్ తీయగా పొట్టంతా ఉబ్బిపోయి అసాధారణ పదార్థం నిండి ఉన్నట్లు తేలింది. వైద్యుల బృందం వెంటనే ఆపరేషన్ ప్రక్రియను చేపట్టింది. గాస్ట్రోటోమీ శస్త్రచికిత్సతో బయటపడిన భారీ వెంట్రుకల ఉండ పొట్టతోపాటు చిన్న పేగు భాగం వరకు విస్తరించి ఉండటాన్ని చూసి వైద్యులు విస్తుపోయారు. ఇదంతా ఏకభాగంగా ఉండటంతో బయటకు తీయడం సవాల్‌గా మారింది. ముక్కలుగా చేయాలంటే పేగు భాగానికి సైతం పలు కోతలు పెట్టాల్సి ఉంటుంది. అయినప్పటికీ వైద్యులు ఎంతో సంక్లిష్టమైన ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.

ఎందుకిలా ఉంది..?: బాధిత బాలికకు ఆరో తరగతి నుంచే మట్టి, కర్ర ముక్కలు, దారం, చాక్‌పీస్ వంటివి తినే అలవాటుంది. తోటి పిల్లలు తింటుంటే చూసి తనూ అలవాటు చేసుకుంది. ఈ అలవాటును వైద్యులు 'పికా'అనే మానసిక ఆరోగ్య సమస్యగా పేర్కొంటున్నారు. ఆహారేతర పదార్థాలను బలవంతంగా మింగడమే దీని ముఖ్య లక్షణం. బాధిత బాలిక పొట్ట నుంచి తొలగించిన ట్రైకోబెజొయర్ ప్రపంచంలోనే ఇప్పటి వరకు తీసిన అత్యంత పొడవైందిగా రికార్డు నెలకొల్పిందని వైద్యులు తెలిపారు. పొట్ట భాగం నుంచి చిన్న ప్రేవు వరకు విస్తరించిన ఈ పోగును సురక్షితంగా తొలగించడం వైద్యచరిత్రలో ఒక మైలురాయని శస్త్ర చికిత్స బృందానికి సారథ్యం వహించిన డాక్టర్ జీవన్ కంకారియా చెప్పారు.



వెంట్రుకల పోగు. ఆపరేషన్ చేసిన వైద్య బృందం

భారత్‌కు సానుకూలంగా కొలంబియా: థరూర్

బొగొటా: పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా భారత్ చేపట్టిన వైమానిక దాడులతో పాకిస్తాన్‌లో చనిపోయిన వారికి నివాళులర్పిస్తూ విడుదల చేసిన వివాదాస్పద ప్రకటనను కొలంబియా ఉపసంహరించుకుందని శశి థరూర్ చెప్పారు. సీమాంతర ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ ప్రేరేపిస్తున్న వైనాన్ని ఆ దేశ విదేశాంగ శాఖ ఉపమంత్రి రొసా యెలండా విల్లావిసెన్సియోకు తాము వివరించి చెప్పామని వెల్లడించారు. రెండు దేశాల మధ్య విభేదాలను ఆమె సరిగ్గా అర్థం చేసుకున్నారని, నివాళి ప్రకటనను వెనక్కి తీసుకునేందుకు అంగీకరించారని తెలిపారు. తనను తాను రక్షించుకునే హక్కుందన్న భారత్ వాదనను సమర్థించారన్నారు. దక్షిణ అమెరికా దేశం కొలంబియాకు వెళ్లిన అఖిల పక్ష బృందానికి థరూర్ సారథ్యం వహిస్తున్నారు. రెండు రోజులుగా ఈ బృందం కొలంబియాలోని పలువురు రాజకీయ ప్రతినిధులతో సమావేశాలు జరుపుతోంది. తాజా, పరిణామంపై భారత ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

చైనాతో తక్షణ ప్రమాదం వాస్తవం

ఇండో-పసిఫిక్ దేశాలు అప్రమత్తంగా ఉండాలి

అమెరికా రక్షణ మంత్రి హెగ్సెత్ హెచ్చరిక

సింగపూర్: డ్రాగన్ దేశం చైనా నుంచి ఇండో-పసిఫిక్ దేశాలకు తక్షణ ముప్పు పొంచి ఉందని, ఇది నిజమని అమెరికా విదేశాంగ మంత్రి పీటర్ హెగ్సెత్ హెచ్చరించారు. చైనా నుంచి ఎదురయ్యే సైనిక, ఆర్థికపరమైన ఒత్తిడుల నేపథ్యంలో ఈ ప్రాంతంలోని మిత్ర దేశాలను ఒంటరిగా వదిలేయబోమని హామీ ఇచ్చారు. అదే సమయంలో, ఆయా దేశాలు రక్షణపరంగా మరింత బలోపేతం కావాలని సూచించారు. జీడీపీలో 5 శాతం మేర రక్షణ రంగానికి కేటాయించాలని సూచించారు. యూరప్ దేశాలు సైతం ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చైనా నుంచి వేగంగా పెరుగుతున్న ముప్పును, ముఖ్యంగా తైవాన్ విషయంలో దుందుడుకు చర్యలకు ముకుతాడు వేసేందుకు అమెరికా రక్షణ చర్యలను ముమ్మరం చేస్తుందని ప్రకటించారు. తైవాన్‌ను ఆక్రమించుకునేందుకు చైనా ఆర్మీ రిహార్సల్స్ చేస్తోందని హెగ్సెత్ వ్యాఖ్యానించారు. ఇదే లక్ష్యంతో సైన్యానికి రోజువారీ శిక్షణ అందిస్తోందన్నారు. 2027 నాటికి తైవాన్‌ను విలీనం



పీటర్ హెగ్సెత్

చేసుకోవాలనే లక్ష్యాన్ని సాధించే సత్తా తమకుందని చైనా ఇప్పటికే చేసిన ప్రకటనపై ఆయనీ వ్యాఖ్యలు చేశారు. సింగపూర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ భద్రతా సదస్సు 'షంగ్రీ లా డైలాగ్'లో హెగ్సెత్ శనివారం కీలకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సెక్యూరిటీ స్టడీస్ ఏర్పాటు చేసింది. చైనా విస్తారమైన దక్షిణ చైనా సముద్రంలో కృత్రిమ ద్వీపాలను ఏర్పాటు చేసి మిలటరీ ఔట్ పోస్టులను నెలకొల్పుతోంది. అత్యంత అధునాతన హైపర్‌సోనిక్ క్షిపణులను తయారు చేయడంతోపాటు అంతరిక్షంలోనూ పైచేయి సాధించేందుకు వేగంగా పావులు కదుపుతోంది. ఈ బెడదను దృష్టిలో ఉంచుకునే అమెరికా 'గోల్డెన్ డోమ్'క్షిపణి రక్షణ వ్యవస్థ ఏర్పాటుకు సిద్ధమైంది. పనామా కాలువ సహా లాటిన్ అమెరికా ప్రాంతంలోనూ పలుకుబడిని పెంచుకునేందుకు చైనా ప్రయత్నిస్తోందని హెగ్సెత్ ఆరోపించారు. ఈ ప్రాంతంలోని కొన్ని దేశాలు అమెరికా సైనిక మద్దతును పొందుతూనే చైనాతో ఆర్థికంగా సంబంధాలు నెరుపుతుండటం ప్రమాదకరమైన వ్యవహారమని హెగ్సెత్ పేర్కొన్నారు. యూరప్ దేశాలు తమ సొంత భద్రతను చూసుకోవాలని, ఇండో-పసిఫిక్ బాధ్యతను అమెరికాకు వదిలేయాలన్నారు. అనంతరం మాట్లాడిన ఈయూ ఉపాధ్యక్షురాలు కాజా కల్లాస్ హెగ్సెత్ వ్యాఖ్యలను ఖండించారు. 'ఉత్తరకొరియా బలగాలు రష్యా తరఫున ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నాయి. అదే సమయంలో, రష్యాకు చైనా మద్దతుగా నిలుస్తోంది. యూరప్, ఆసియాల భద్రత ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి'అని పేర్కొన్నారు.

హాజరు కాని చైనా రక్షణ మంత్రి

ఏటా జరిగే ఈ సదస్సుకు చైనా తన రక్షణ మంత్రిని పంపిస్తుంటుంది. అమెరికాతో నడుస్తున్న టారిఫ్ విభేదాల నేపథ్యంలో ఈసారి దిగువ స్థాయి అధికారులతో కూడిన బృందాన్ని పంపించింది. హెగ్సెత్ వ్యాఖ్యలను ఈ బృందంలోని చైనా నేషనల్ డిఫెన్స్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ హు గంగ్‌ఫెంగ్ తీవ్రంగా ఖండించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఉద్రిక్తతలను రెచ్చగొట్టేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయన్నారు.

పార్లమెంట్‌ను పేల్చేస్తానంటూ బెదిరించిన మాజీ ఎమ్మెల్యేకు ఆరు నెలల జైలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ భవనాన్ని పేల్చేస్తానంటూ 2022 సెప్టెంబర్‌లో బెదిరించిన మధ్యప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే కిశోర్ సమ్రితేకి ఢిల్లీ కోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. బాలాఘాట్ జిల్లా లాంజి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అయిన సమ్రితే 2022 సెప్టెంబర్ 16న పార్లమెంట్ హౌస్‌కు స్పీడ్ పోస్ట్‌లో ఒక పార్శిల్ పంపించాడు. అందులో, అనుమానాస్పద పేలుడు పదార్థం, జాతీయ జెండా, రాజ్యాంగ ప్రతి ఉన్నాయి. ప్రభుత్వ విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడంతోపాటు, తన డిమాండ్లను నెరవేర్చకుంటే 2022 సెప్టెంబర్ 30న పార్లమెంట్ భవనాన్ని పేల్చేస్తానంటూ సమ్రితే సంతకంతో కూడిన బెదిరింపు లేఖ ఉంది. అందులో వివిధ అంశాలకు సంబంధించిన 70 డిమాండ్లున్నాయి. దర్యాప్తు చేపట్టిన పోలీసులు వెంటనే కిశోర్ సమ్రితేను అరెస్ట్ చేశారు. అయితే, ఇతడు బెదిరింపు వల్ల ఎలాంటి పేలుడు జరగలేదు, ఎటువంటి నష్టం సంభవించలేదంటూ కోర్టు అదే ఏడాది డిసెంబర్‌లో అతడికి బెయిలిచ్చింది. ఈ కేసుపై విచారణ చేపట్టిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వికాస్ ధుల్ శనివారం సమ్రితేకి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అదేవిధంగా, అతడు పంపిన పార్శిల్‌లోని పదార్థం పేలుడు పదార్థాల చట్టం పరిధిలోకి రాదని పేర్కొంటూ, అందుకు సంబంధించిన ఆరోపణను తోసిపుచ్చారు. 2022 సెప్టెంబర్ 19వ తేదీన సరిగ్గా ఇలాంటి డిమాండ్లతో కూడిన బెదిరింపు లేఖను సమ్రితే సుప్రీం కోర్టుకు సైతం పంపించినట్లు ఈ కేసు దర్యాప్తులో వెల్లడి కావడంతో పోలీసులు దీనిపైనా కేసు నమోదు చేశారు.

గాజాలో ఆహారం లూటీ

టెల్ అవీవ్: ఇజ్రాయెల్ వరుస వైమానిక దాడులతో గాజా స్ట్రిప్‌లో పాలస్తీనా పౌరులు హాహాకారాలు చేస్తున్నారు. కడుపు నింపుకోవడమే వారి కర్తవ్యంగా మారిపోయింది. ఎక్కడ ఆహారం కనిపించినా బలవంతంగా సొంతం చేసుకుంటున్నారు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో మానవతా సాయంతో గాజాలోకి వచ్చిన 77 వాహనాలను ప్రజలు లూటీ చేశారు. ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార కార్యక్రమం(డబ్ల్యూఎఫ్‌పీ) శనివారం ఈ విషయం వెల్లడించింది. గోధుమ పిండితోపాటు ఇతర ఆహార పదార్థాలు, ఔషధాలతో వచ్చిన వాహనాలను వేలాది మంది జనం మధ్యలోనే అడ్డగించారు. అవి గమ్యస్థానం చేసుకోకుండా రోడ్డుపై భారీగా గుమికూడారు. వాహనాల్లోని పిండి, ఆహార పదార్థాలను దొరికినంత తీసుకెళ్లారు. గత మూడు నెలలుగా గాజాలోకి మానవతా సాయం రాకుండా ఇజ్రాయెల్ ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. ప్రపంచ దేశాల ఒత్తిడితో ఇటీవలే ఆంక్షలను కొంత సడలించింది. అయితే, ప్రజలకు సరిపోయేటంత ఆహారం అందే పరిస్థితి లేకుండాపోయిందని స్వచ్ఛంద సంస్థలు చెబుతున్నాయి. తగినంత ఆహారం అందకపోతే మరణాల సంఖ్య భారీగా పెరిగే ప్రమాద ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో మృతి చెందిన వారి సంఖ్య దాదాపు 60,000కు చేరుకుంది. వీరిలో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులే ఉన్నారు. గత 24 గంటల్లో ఇజ్రాయెల్ దాడుల్లో కనీసం 60 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఇదిలా ఉండగా, తాత్కాలిక కాల్పుల విరమణ పాటించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించగా, హమాస్ సానుకూలంగా స్పందించింది. హమాస్ ఆధీనంలో ఇప్పటికీ 58 మంది ఇజ్రాయెల్ బందీలు ఉన్న సంగతి తెలిసిందే.

లాలు ప్రసాద్‌కు హైకోర్టులో చుక్కెదురు

పట్నా: 'ల్యాండ్ ఫర్ జాబ్స్'కుంభకోణం సీబీఐ కేసుపై దిగువ కోర్టులో విచారణను నిలిపివేసేలా ఆదేశించాలంటూ ఆర్‌జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. ఈ కేసులో వాదనలు వినేందుకు ప్రత్యేక కోర్టు జడ్జి సిద్ధమైన నేపథ్యంలో విచారణపై స్టే మాత్రం ఇవ్వగలమంది. ట్రయల్ కోర్టులో తన వాదనను వినిపించే అవకాశం పిటిషనర్‌కు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా సీబీఐ దర్యాప్తు చేపట్టినందుకు, ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ లాలు తరఫున సీనియర్ లాయర్ కపిల్ సిబల్ అంతకుముందు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టేందుకు మే 9వ తేదీన రాష్ట్రపతి ముర్ము సీబీఐకి అనుమతి మంజూరు చేశారు.

జాగ్రత్త.. 25 కోట్ల తేనెటీగలు తప్పించుకున్నాయి

వాషింగ్టన్‌లో బోల్తా పడిన తేనెతుట్టెల వాహనం

వాషింగ్టన్: మల్లాది 'నత్తలొస్తున్నాయ్ జాగ్రత్త' నవల గుర్తుందా? కెన్యా నుంచి వచ్చిన భయంకరమైన రాక్షస నత్తలు ఓ రైలు ప్రమాదంలో తప్పించుకుని ఆంధ్ర రాష్ట్రంపై పడతాయి. చూస్తుండగానే అసంఖ్యాకంగా పెరిగిపోయి అల్లకల్లోలం చేసిపారేస్తాయి. అదీ, ఇదీ అని తేడా లేకుండా దొరికిన దాన్నల్లా తినేస్తూ భయోత్పాతం సృష్టిస్తాయి. అమెరికాలో వాషింగ్టన్ రాష్ట్రంలో కూడా అలాంటి సంఘటనే ఒకటి జరిగింది. ఒకటీ రెండూ కాదు, ఏకంగా 25 కోట్ల తేనెటీగలు తప్పించుకున్నాయి! 31,751 కిలోల తేనెతుట్టెలతో వెళ్తున్న వాహనం లిండెన్ సమీపంలో కెనడా సరిహద్దు ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున ఓ మూలమలుపు వద్ద వేగాన్ని డ్రైవర్ నియంత్రించలేకపోవడంతో బోల్తా పడింది. తేనెతుట్టెలన్నీ చెల్లాచెదురుగా పడిపోవడంతో తేనెటీగలు బయటికొచ్చి జారుకున్నాయి. విషయం తెలియగానే పోలీసులు తేనెటీగల నిపుణులతో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అంతా కలిసి తేనెతుట్టెలను ఒక్కచోటికి చేర్చారు. తప్పించుకున్న తేనెటీగల కోసం ఎదురుచూస్తూ గడుపుతున్నారు. అవి తప్పకుండా తుట్టెల వద్దకు తిరిగొస్తాయని నిపుణులు చెప్పారు. ''తేనెటీగలు రాణి ఈగను విడిచి ఉండలేవు. దాన్ని తీసుకొని రెండు మూడు రోజుల్లో వచ్చేస్తాయి'' అని వివరించారు. కనుక రెండు మూడు రోజులపాటు పరిసర ప్రాంతాలకు రావొద్దని స్థానికులకు పోలీసులు సూచించారు. అమెరికాలో లక్షలాది తేనెటీగలను తరచుగా ఇలా ఒకచోటి నుంచి మరోచోటికి తరలిస్తుంటారు. వ్యవసాయంలో తేనెటీగలది కీలక పాత్ర. పరాగ సంపర్కానికి, పంటలు పండడానికి దోహదపడతాయి. ప్రపంచవ్యాప్తంగా తేనెటీగల సంఖ్య భారీగా తగ్గిపోతుండటంతో మే 20ని 'ప్రపంచ తేనెటీగల దినం'గా జరుపుకోవాలని ఐరాస 2018లో పిలుపునిచ్చింది.




తేనెతుట్టెలను తీసుకెళ్తూ బోల్తా పడ్డ వాహనం

కొండచరియలు విరిగిపడి 10 మంది మృతి

అరుణాచల్, మిజోరం, ఉత్తరాఖండ్‌లలో భారీ వర్షాలు

ఇటానగర్/ఐజ్వాల్/రుద్రప్రయాగ్: అరుణాచల్ ప్రదేశ్, మిజోరం, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను ఎడతెగని వానలు అతలాకుతలం చేస్తున్నాయి. వర్షాలు, కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో కనీసం పది మంది చనిపోయారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కమెంగ్ జిల్లాలో 13వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి కొండ చరియలు వాహనంపై పడటంతో అందులో ఉన్న రెండు కుటుంబాలకు చెందిన ఏడుగురు మృత్యువాతపడ్డారు. మృతుల్లో వాహనం యజమాని, ఇద్దరు మహిళలు, నలుగురు చిన్నారులున్నారు. రాష్ట్రంలోని అప్పర్ శుబన్‌శ్రీ జిల్లాలో కొండచరియలు విరిగి పడి ఇద్దరు కార్మికులు చనిపోయారు. ఆకస్మిక వరదల్లో దపారిజో జలాశయం ధ్వంసమైంది. పలు చోట్ల రోడ్లు తెగిపోయాయి. నివాస ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అదేవిధంగా, మిజోరంలో భారీ వర్షాలతో సెర్చ్‌హిప్ జిల్లాలో శనివారం కొండచరియలు విరిగి ఇంటిపై పడటంతో ఒకరు చనిపోయారు. మరో ఘటన..ఉత్తరాఖండ్‌లోని రుద్ర ప్రయాగ్ జిల్లాలో కేదార్‌నాథ్ జాతీయ రహదారిపై వస్తున్న వాహనంపై కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో ఒకరు చనిపోగా ఐదుగురు గాయాలపాలయ్యారు.









గుజరాత్ మొదలుకుని జమ్మూ కశ్మీర్ దాకా సరిహద్దు రాష్ట్రాల్లో శనివారం పౌర సన్నద్ధత మాక్ డ్రిల్స్ జరిగాయి. సైనిక, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల సిబ్బంది పలు అంశాలపై పౌరులకు అవగాహన కల్పించారు.

రక్షణ వ్యవస్థలను పరీక్షిస్తున్న ఆర్మీ

న్యూఢిల్లీ: పలు అత్యంత ఆధునిక రక్షణ వ్యవస్థలను భారత సైన్యం దాదాపు యుద్ధ పరిస్థితుల్లో పరీక్షిస్తోంది. ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిమ్యులేషన్స్ పనితీరును కూలంకషంగా పరిశీలిస్తోంది. ఈ పరీక్షలు సైన్యం సాంకేతిక సమర్థతను, కార్యాచరణ సన్నద్ధతను మరింత పెంచుతాయని ఆర్మీ అధికారులు శనివారం తెలిపారు. ఈ వ్యవస్థల్లో అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్(యూఏఎస్), యూఏవీ లాంచ్డ్ ప్రెసిషన్ గైడెడ్ మ్యునిషన్(యూఎల్‌పీజీఎం), రన్‌వే ఇండిపెండెంట్(ఆర్‌డబ్ల్యూఐ), రిమోట్‌లీ పైలటెడ్ ఏరియల్ సిస్టమ్స్(ఆర్‌పీఏఎస్), కౌంటర్ యూఏఎస్ సొల్యూషన్స్ ఉన్నాయని రక్షణ శాఖ వివరించింది. పొఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్, బబినా ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్, జోషిమఠ్‌లలో ఈ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపింది. ఆగ్రా, గోపాల్‌పూర్‌లలోనూ చేపడతామంది.

మస్క్ కుడి కన్ను కమిలింది ఎందుకో!

వాషింగ్టన్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ(డోజ్) చీఫ్ పదవి నుంచి తప్పుకున్న తన మిత్రుడు ఎలాన్ మస్క్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘనంగా వీడ్కోలు పలికారు. వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీసులో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మస్క్ కుడి కన్ను కమిలిపోయినట్లుగా కనిపించింది. నల్లగా మారిపోయింది. ఎవరైనా దాడి చేశారా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. ఇదే విషయాన్ని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. మస్క్ సరదాగా సమాధానమిచ్చారు. తన ఐదేళ్ల కుమారుడితో ఆడుకుంటూ ఉండగా కన్ను కమిలిపోయినట్లు చెప్పారు. తన ముఖంపై పంచ్ విసరాలని చెప్పగా, అలాగే చేశాడని అన్నారు. ఆ సమయంలో పెద్దగా నొప్పి తెలియలేదు గానీ, ఆ తర్వాత కంటి భాగం నల్లగా మారిందని తెలిపారు.

హసీనా పదవీచ్యుతికి మేమే కారణం: జేయూడీ

లాహోర్: బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా గతేడాది జరిగిన ప్రజా ఉద్యమం నడిపింది తామేనని నిషేధిత జమాత్ ఉద్-దవా(జేయూడీ) నేతలు ప్రకటించుకున్నారు. ఈ గ్రూపు సారథి ముంబై ఉగ్రదాడుల సూత్రధారి హాఫీజ్ సయీద్ కావడం గమనార్హం. ఐరాస ఉగ్రవాదులుగా ప్రకటించిన సఫీయుల్లా కసూరి, ముజమ్మిల్ హష్మి ఇటీవల జరిగిన ఓ సభలో భారత్‌పై చేసిన విద్వేష ప్రసంగాల్లో ఈ విషయం వెల్లడించారు. '1971లో పాకిస్తాన్ విడిపోయిన సమయంలో నా వయస్సు నాలుగేళ్లు. అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ ద్విజాతి సిద్ధాంతాన్ని బంగాళాఖాతంలో కలిపేసినట్లుగా ప్రకటించారు. మొన్న మే 10వ తేదీన అందుకు ప్రతీకారం తీర్చుకున్నాం'అని కసూరి వ్యాఖ్యానించాడు.

ఫ్రాన్స్‌లో ఇక 'పొగ తాగరాదు'

బహిరంగ ధూమపానంపై నిషేధం

పారిస్: ఫ్రాన్స్. పొగ తాగడాన్ని తిరుగులేని ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా మార్చిన దేశం. అలాంటి దేశం ఇప్పుడు బహిరంగ ధూమపానంపై కఠిన నిషేధం విధించింది! ఈ నిర్ణయం జూలై 1 నుంచి అమల్లోకి వస్తుందని ఆరోగ్య మంత్రి కేథరిన్ వాట్రిన్ ప్రకటించారు. ''పిల్లలు గుమిగూడే అవకాశమున్న ఏ ప్రాంతంలోనూ ఇకపై పొగ తాగడానికి వీల్లేదు. బీచులు, పార్కులు, ఆటస్థలాలు, క్రీడా వేదికలు, స్కూళ్ల ప్రవేశ ద్వారాలు, బస్టాపులు... ఇలాంటి అన్నిచోట్లా నిషేధం వర్తిస్తుంది'' అని వివరించారు. దీన్ని ఉల్లంఘిస్తే రూ.13 వేల (135 యూరో) దాకా జరిమానా కట్టాల్సి ఉంటుంది. ధూమపానానికి పర్యాయపదంగా నిలిచిన ఫ్రాన్స్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అనూహ్యమే. అయితే అందుకు కారణాల్లేకపోలేదు. 2015 నుంచి విడుదలైన 90 శాతానికి పైగా ఫ్రెంచి సినిమాల్లో స్మోకింగ్ సీన్లున్నాయట. దీని ప్రభావం ప్రజలపై తీవ్రంగా ఉంటున్నట్టు ప్రభుత్వం తేల్చింది. ఎంతగా అంటే, ఫ్రాన్స్‌లో ఏటా కనీసం 75 వేల మంది పొగాకు సంబంధిత వ్యాధులతో కన్నుమూస్తున్నారట. ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్ల ఇటీవల ఈ దురలవాటు బాగా తగ్గుతూ వస్తోంది. ఇప్పుడు అక్కడి వయోజనుల్లో పొగతాగే వారి సంఖ్య దేశ చరిత్రలోనే తొలిసారిగా నాలుగో వంతు కంటే తక్కువకు పడిపోయింది. బ్రిటన్, స్పెయిన్, స్వీడన్ వంటి పలు యూరప్ దేశాలు ఇప్పటికే బహిరంగ ధూమపానాన్ని నిషేధించాయి.


కాల్పుల విరమణకు మేము సిద్ధం: ఇజ్రాయెల్

టెల్ అవీవ్: హమాస్‌తో కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నామని ఇజ్రాయెల్ ప్రకటించింది. తాత్కాలిక కాల్పులు విరమణ పాటించాలంటూ అమెరికా ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను తాము అంగీకరిస్తున్నట్లు ఇజ్రాయెల్ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. 60 రోజులపాటు కాల్పులు ఆపాలని, శాశ్వత కాల్పుల విరమణ కోసం మొదటి రోజే చర్చలు ప్రారంభించాలని అమెరికా ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. అలాగే తొలి రోజే సగం మంది బందీలను హమాస్ విడుదల చేయాలని, సగం మంది ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేయాలని సూచించింది. హమాస్‌తో కాల్పుల విరమణకు తాము సానుకూలంగా ఉన్నామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు సైతం చెప్పారు. ఇజ్రాయెల్ బందీల కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడారు.

నైజీరియాలో వరదలు..151కి చేరిన మృతులు

అబుజా: ఆఫ్రికా దేశం నైజీరియాలోని నైగర్ రాష్ట్రంలో సంభవించిన వరదల్లో మృతుల సంఖ్య 151కి చేరుకుంది. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని, మరణాలు పెరగొచ్చని అధికారులు శనివారం వెల్లడించారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో జలాశయం తెగి వరద పోటెత్తి సమీపంలోని మొక్వా పట్టణాన్ని ముంచెత్తింది. మొక్వా పట్టణంలో అతిపెద్ద మార్కెట్ ఉంది. ఇది రవాణా హబ్ కూడా. వరదలతో భారీగా నష్టం వాటిల్లిందని అధికారులు వెల్లడించారు.

'టైగర్ మ్యాన్' వాల్మీకి థాపర్ కన్నుమూత



న్యూఢిల్లీ: ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు, టైగర్ మ్యాన్‌గా పేరున్న వాల్మీకి థాపర్(73) కన్నుమూశారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన శనివారం ఢిల్లీలోని కౌటిల్య మార్గ్‌లోని సొంతింట్లో తుదిశ్వాస విడిచారు. వన్యప్రాణుల సంరక్షణ, ప్రత్యేకించి పులులను కాపాడేందుకు నాలుగు దశాబ్దాలపాటు తీవ్రంగా శ్రమించారు. అటవీ సంరక్షణలో ప్రజలను మమేకం చేసే లక్ష్యంతో 1988లో ఏర్పాటైన ప్రభుత్వేతర సంస్థ రణథంబోర్ ఫౌండేషన్‌కు థాపర్ సహ వ్యవస్థాపకుడు. సహజంగా సంచరించే ప్రాంతాల్లో పులులను అక్రమంగా వేటాడటంపై ఆయన ఉద్యమించారు. మానవ జోక్యాన్ని అడ్డుకునేలా ప్రత్యేక టైగర్ జోన్ల ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. ప్రధానమంత్రి సారథ్యంలోని నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్ వంటి రమారమి 150 ప్రభుత్వ కమిటీల్లో సభ్యుడిగా సేవలందించారు. వన్యప్రాణుల గురించి టైగర్ ఫైర్, లివింగ్ విత్ టైగర్స్ వంటి 30కి పైగా పుస్తకాలను రాశారు. భారతీయ వన్యప్రాణులపై పలు డాక్యుమెంటరీలను రూపొందించారు. 2024లో జీవావరణ పరిరక్షకురాలు నేహా సిన్హా తీసిన 'మై టైగర్ ఫ్యామిలీ'అనే డాక్యుమెంటరీలో థాపర్ కూడా ఉన్నారు. కాగా, థాపర్ తండ్రి రమేశ్ థాపర్ ప్రముఖ జర్నలిస్ట్. బాలీవుడ్ దిగ్గజ నటుడు శశి కపూర్ కుమార్తె సంజనా కపూర్, వాల్మీకి థాపర్ దంపతులు కాగా వీరికి ఒక కుమారుడు ఉన్నారు.

ప్రాథమిక హక్కులను రద్దు చేసే అధికారం ఎవరికి ఉంది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రాథమిక హక్కులు- విమర్శనాత్మక పరిశీలన

ప్రాథమిక హక్కుల్లో ఆర్థిక పరమైన హక్కులను గుర్తించలేదు. ఉదాహరణకు పని హక్కు, విశ్రాంతి హక్కు, సామాజిక భద్రతా హక్కులను ప్రాథమిక హక్కుల్లో పొందుపరచలేదు.

మితిమీరిన పరిమితులు

'మూడో భాగంలో ఆరు ప్రాథమిక హక్కులుంటే రెట్టింపు సంఖ్యలో పరిమితులున్నాయి. ఒకవైపు హక్కులు కల్పిస్తూ మరోవైపు పరిమితులు విధించడం సమంజసం కాదు' అని విమర్శకులు అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని మూడో భాగం ప్రాథమిక హక్కుల జాబితా కాదని, ప్రాథమిక హక్కులపై పరిమితుల జాబితా అని జస్వంత్‌రాయ్ కపూర్ అనే రచయిత వ్యాఖ్యానించారు. ఒక చేత్తో హక్కులిచ్చి మరో చేత్తో వాటిని తీసుకునే విధంగా హక్కులున్నాయని ప్రఖ్యాత రాజ్యాంగ నిపుణుడు ఎం.సి. చాగ్లా వ్యాఖ్యానించారు.

స్పష్టత లేకపోవడం, కఠిన పదజాలం

ప్రాథమిక హక్కుల్లో ఉపయోగించిన భాష సంక్లిష్టంగా ఉంది.దీంతో ఇది సామాన్యులకు అర్థం కాదు. దీన్ని అర్థం చేసుకోవడం న్యాయకోవిదులకు కూడా తేలిక కాదు. భారత రాజ్యాంగం న్యాయవాదుల స్వర్గం అన్న ఐవర్ జెన్నింగ్స్ విమర్శ ఒక్క ప్రాథమిక హక్కులతోనే రుజువు అవుతుంది.

ఆస్తి హక్కు- తొలగింపు

మౌలిక రాజ్యాంగంలో ఉన్న ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. దీంతో ప్రాథమిక హక్కుల స్థాయిని తగ్గించినట్లయింది. అత్యవసర పరిస్థితి సమయంలో ప్రాథమిక హక్కులు రద్దవుతాయి. నివారక నిర్బంధ చట్టాల ఆధారంగా ప్రాథమిక హక్కులపై పరిమితులు విధించవచ్చు. రాజకీయ ప్రయోజనాలు, కక్ష సాధింపులకు ఇది ఆస్కారం కల్పిస్తోంది. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల మధ్య వివాదాలు ఏర్పడవచ్చు. అది శాసన, న్యాయ వ్యవస్థల మధ్య ఘర్షణ వైఖరికి దారితీసే అవకాశముంది.

అత్యవసర పరిస్థితి-హక్కుల రద్దు

జాతీయ అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో ప్రాథమిక హక్కులను రద్దు చేయవచ్చు. దీంతో ప్రజల స్వేచ్ఛకు, హక్కులకు రక్షణ ఉండదు. ప్రాథమిక హక్కులపై విమర్శ ఉన్నప్పటికీ, వాటి ప్రాముఖ్యతను, విలువను విస్మరించలేం. ఇవి వ్యక్తి స్వేచ్ఛకు మూలాలు. వ్యక్తి వికాసానికి అనివార్యమైనవి. వ్యక్తులు నైతికంగా, భౌతికంగా ఎదగడానికి ఇవి ఎంతో అవసరం. హక్కుల అమలు కేవలం న్యాయస్థానాల జోక్యం ద్వారానే కాకుండా పౌరుల చైతన్యం, అవగాహనపై కూడా ఆధారపడి ఉంటుంది. నిరంతర అప్రమత్తతే పై స్వేచ్ఛలకు మూలం అని జె.ఎస్.మిల్ అనే రాజనీతిజ్ఞుడు వ్యాఖ్యానించాడు.

ఇతర భాగాల్లో ఉన్న హక్కులు

మూడో భాగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులే కాకుండా రాజ్యాంగంలోని మరికొన్ని భాగాల్లో రాజ్యాంగ లేదా చట్టబద్ధమైన హక్కులున్నాయి. వీటినే ప్రాథమికేతర హక్కులు అంటారు.

ఉదాహరణలు:

- 12వ భాగంలోని ఆర్టికల్ 265 ప్రకారం చట్టపరమైన ఆధారం లేనిదే పన్నులు విధించరాదు.



- 12వ భాగంలో ప్రకరణ 300-ఎ ప్రకారం చట్టబద్ధంగా తప్ప మరే విధంగా వ్యక్తి ఆస్తికి భంగం కలిగించరాదు.
- 15వ భాగంలో ప్రకరణ 326 ప్రకారం వయోజన ఓటుహక్కును గుర్తించారు.

పై హక్కులకు కూడా న్యాయ సంరక్షణ ఉన్నప్పటికీ అవి ప్రాథమిక హక్కులతో సమానం కావు. వీటి అమలు, రక్షణ కోసం ప్రకరణ-32 ప్రకారం సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి వీల్లేదు. కానీ ప్రకరణ-226 ప్రకారం హైకోర్టు ద్వారా రక్షణ పొందవచ్చు.

రాజ్యాంగ సమీక్షా కమిషన్ సూచించిన ఇతర ప్రాథమిక హక్కులు

2000లో జస్టిస్ వెంకటాచలయ్య అధ్యక్షతన రాజ్యాంగ సమీక్ష కమిషన్‌ను నియమించారు. రాజ్యాంగంలోని మూడో భాగంలో ప్రాథమిక హక్కుల జాబితాలో కింద పేర్కొన్న హక్కులను కూడా పొందుపరచాలని ఈ కమిషన్ సిఫారసు చేసింది.

- పత్రికా స్వేచ్ఛ-సమాచార స్వేచ్ఛ
- క్రూరమైన శిక్షలకు వ్యతిరేకంగా రక్షణ
- పని హక్కు
- రహస్యాలను కాపాడుకునే హక్కు
- రక్షిత మంచినీరు
- పర్యావరణ హక్కు
- న్యాయం, న్యాయ సలహా పొందే హక్కు

ప్రాథమిక హక్కులు - ముఖ్య వివాదాలు సుప్రీంకోర్టు తీర్పులు

సజ్జన్ సింగ్ Vs రాజస్థాన్ -1964

ఈ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ సవరణ అధికారానికి సంబంధించిన వివాదాన్ని పరిశీలించింది. ఆస్తి హక్కుకు సంబంధించిన 17వ రాజ్యాంగ సవరణ రాజ్యాంగబద్ధమేనని ప్రకటించింది.

గోలక్‌నాథ్ Vs పంజాబ్ ప్రభుత్వం-1967

పంజాబ్ ప్రభుత్వం రూపొందించిన భూసంస్కరణ చట్టాన్ని ఈ కేసులో ప్రశ్నించారు. ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ప్రాథమిక హక్కులను సవరించాలంటే ప్రత్యేక రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ప్రకటించింది.

కేశవానంద భారతి Vs కేరళ ప్రభుత్వం-1973

ప్రాథమిక హక్కులను సవరించడానికి ఉద్దేశించిన 24, 25వ రాజ్యాంగ సవరణలను సుప్రీంకోర్టులో ప్రశ్నించారు. గోలక్‌నాథ్ కేసులో చెప్పిన తీర్పులకు విరుద్ధంగా ఉన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. 'పార్లమెంటుకు ప్రాథమిక హక్కులను సవరించే అధికారం ఉంది. కానీ రాజ్యాంగ మౌలిక స్వరూపం మార్చరాదు' అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. మౌలిక స్వరూపం (Basic Structure) అనే పదాన్ని తొలిసారిగా ఈ సందర్భంలోనే సుప్రీంకోర్టు ప్రయోగించింది.

మినర్వా మిల్స్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా -1980

ఈ కేసులో 42వ రాజ్యాంగ సవరణను ప్రశ్నించారు. 'ప్రాథమిక హక్కులు రాజ్యాంగ స్వరూపంలో భాగం. వాటిని తగ్గించడం లేదా రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధం' అని సుప్రీంకోర్టు ప్రకటించింది. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని నిర్వచించింది.

ఇందిరా సహానీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా -1992

వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని ఈ కేసులో ప్రశ్నించారు.

ఉన్ని కృష్ణన్ Vs ఆంధ్రప్రదేశ్;
మోహిని జైన్ Vs కర్ణాటక 1993

'ప్రాథమిక హక్కుల్లో విద్యాహక్కు లేకపోతే జీవించే హక్కుకు, వ్యక్తి గౌరవానికే అర్థం లేదు. ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించాలి' అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

- కింద పేర్కొన్న వాటిలో ఏ ప్రాతిపదికన సకారాత్మక వివక్షతను రాజ్యాంగం అనుమతించలేదు
  ఎ) విద్యాపరమైన వెనుకబాటు
  బి) సామాజిక వెనుకబాటు
  సి) ఆర్థిక వెనుకబాటు
  డి) ఏదీకాదు
  సమాధానం-సి
- 'న్యాయ సమీక్ష' ఏ ప్రభుత్వ లక్షణం?
  ఎ) ఏక కేంద్ర బి) సమాఖ్య
  సి) పార్లమెంటరీ డి) పైవన్నీ
  సమాధానం-బి
- కింది ఏ ప్రకరణను సుప్రీంకోర్టు ఉదారంగా వ్యాఖ్యానించి, దాని పరిధిని విస్తరించింది?
  ఎ) ప్రకరణ 32 బి) ప్రకరణ 13
  సి) ప్రకరణ 20 డి) ప్రకరణ 21
  సమాధానం-డి
- ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా రూపొందించిన చట్టాలను న్యాయస్థానాలు కొట్టివేస్తాయి. అయితే చట్టం అనే పదంలోకి రాని అంశం?
  ఎ) ఆర్డినెన్సులు బి) ఉపచట్టాలు
  సి) నోటిఫికేషన్లు డి) రాజ్యాంగ సవరణ
  సమాధానం-డి
- ప్రాథమిక హక్కులపై ఎలాంటి ప్రభావం చూపని అత్యవసర పరిస్థితి?
  ఎ) జాతీయ అత్యవసర పరిస్థితి
  బి) రాజ్యాంగ అత్యవసర పరిస్థితి
  సి) పై రెండూ డి) ఏదీకాదు
  సమాధానం-బి

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ప్రాథమిక హక్కులు?
   ఎ) నిరపేక్షమైనవి
   బి) ప్రభుత్వ అధికారాలపై పరిమితులు
   సి) సవరణకు అతీతం
   డి) న్యాయ సమీక్షకు గురికావు
2. ప్రాథమిక హక్కులకు మరోపేరు?
   ఎ) న్యాయ సంరక్షణ ఉన్న హక్కులు
   బి) న్యాయ సంరక్షణ లేని హక్కులు
   సి) నైతిక హక్కులు డి) పౌర హక్కులు
3. కింద పేర్కొన్న ఏ కేసును ప్రాథమిక హక్కుల కేసుగా పరిగణిస్తారు?
   ఎ) గోలక్‌నాథ్ బి) కేశవానంద భారతి
   సి) మేనకా గాంధీ డి) మినర్వా మిల్స్
4. సుప్రీంకోర్టు ఏ కేసులో సహజీవన హక్కును ప్రస్తావించింది?
   ఎ) ఖుష్బూ బి) అరుణా రాయ్
   సి) అరుంధతీరాయ్ డి) విశాఖ
5. ఒక వ్యక్తి నిర్బంధం చట్టబద్ధమైందా? కాదా? అని విచారించడానికి ప్రభుత్వం అమలు చేసే న్యాయబద్ధమైన పరిహారం?
   ఎ) హెబియస్ కార్పస్ బి) సెర్షియోరరి
   సి) మాండమస్ డి) కోవారెంటో
6. ప్రాథమిక హక్కులను రద్దు చేసే అధికారం ఎవరికి ఉంది?
   ఎ) సుప్రీంకోర్టు బి) రాష్ట్రపతి
   సి) ప్రధాన మంత్రి డి) పార్లమెంటు
7. రాజ్యాంగంలోని ఏ నిబంధన ప్రకారం ఒక వ్యక్తి ప్రాథమిక హక్కుల ఉల్లంఘనపై సుప్రీం కోర్టుకు అప్పీల్ చేయవచ్చు?
   ఎ) ఆర్టికల్-13 బి) ఆర్టికల్-32
   సి) ఆర్టికల్-14 డి) ఆర్టికల్-34
8. ఏ ప్రాథమిక హక్కును రాజ్యాంగానికి ప్రాణం, ఆత్మ, హృదయం అని అంబేడ్కర్ వర్ణించారు?
   ఎ) సమానత్వ హక్కు బి) స్వాతంత్ర్య హక్కు
   సి) పీడనాన్ని నిరోధించే హక్కు
   డి) రాజ్యాంగ పరిహార హక్కు
9. అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించమని ఆదేశించే రిట్?
   ఎ) హెబియస్ కార్పస్ బి) మాండమస్
   సి) సెర్షియోరరి డి) కోవారెంటో
10. ప్రాథమిక హక్కుల్లో సాంస్కృతిక, విద్యా హక్కుల ఉద్దేశం?
    ఎ) నిరక్షరాస్యతను రూపుమాపడం
    బి) ఒకే సంస్కృతిని రూపొందించడం
    సి) అల్పసంఖ్యాక వర్గీయుల సంస్కృతిని సంరక్షించడానికి సహాయపడటం
    డి) భారతదేశ సంస్కృతిని సంరక్షించడానికి ఇది సహాయపడదు.
11. ఆర్థిక సమానత్వాన్ని కల్పించేవి?
    ఎ) ప్రాథమిక హక్కులు
    బి) అవతారిక సి) ఆదేశిక సూత్రాలు
    డి) ప్రాథమిక విధులు
12. వార్తా ప్రచురణ హక్కును కల్పించే ఆర్టికల్?
    ఎ) 14 బి) 21 సి) 32 డి) 19
13. చట్టాల సమాన రక్షణను ఏ దేశ రాజ్యాంగం నుంచి గ్రహించారు?
    ఎ) బ్రిటన్ బి) అమెరికా
    సి) ఐర్లాండ్ డి) ఆస్ట్రేలియా
14. ఏ ప్రకరణ ప్రకారం జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం చేశారు?
    ఎ) ప్రకరణ 21 జీవించే హక్కులో భాగంగా ఆరోగ్యకరమైన పర్యావరణ హక్కు
    బి) ప్రకరణ 48 ఆదేశిక నియమం
    సి) ప్రకరణ 275 షెడ్యూల్డ్ ప్రాంతాలకు ప్రత్యేక ప్రతిపత్తి
    డి) ఏదీకాదు
15. విద్యాహక్కు చట్టం ఏ స్థాయి విద్యార్థులకు ఉపయోగపడుతుంది?
    ఎ) అన్ని స్థాయిల విద్యార్థులకు
    బి) కళాశాల విద్యార్థులకు
    సి) సీనియర్ సెకండరీ స్థాయి విద్యార్థులకు
    డి) 14 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులకు
16. చట్టం వల్ల సమాన రక్షణ అంటే?
    ఎ) ప్రత్యేక రక్షణ
    బి) సమాన అవకాశాలు
    సి) అసమానతను తగ్గించడం
    డి) పైవన్నీ
17. ప్రాథమిక హక్కులు ఎవరికి వర్తించవు?
    ఎ) ప్రభుత్వ చర్యలకు
    బి) న్యాయస్థాన చర్యలకు
    సి) ప్రైవేట్ వ్యక్తుల చర్యలకు
    డి) పైవన్నీ
18. నేరారోపణ ఎదుర్కొనే వ్యక్తిని బలవంతంమీద నేరం ఒప్పించడాన్ని ఏమంటారు?
    ఎ) సెల్ఫ్ ఇన్‌క్రిమినేషన్ బి) డబల్ జపార్డీ
    సి) ఎక్స్ పోస్ట్ లా డి) పైవేవీ కాదు
19. ప్రాథమిక హక్కులను అమలుపరచడంలో పార్లమెంటు కొన్ని వర్గాలపై ప్రత్యేక పరిమితులు విధించవచ్చు. ఆ వర్గాలు?
    ఎ) రక్షణ దళాలు బి) నేరస్థులు
    సి) విదేశీయులు డి) నిందితులు
20. కింద పేర్కొన్న వాటిలో వ్యక్తిగత స్వేచ్ఛలపై పరిమితులు?
    ఎ) శాంతి భద్రతలు బి) దేశ రక్షణ
    సి) నైతిక ప్రవర్తన డి) పైవన్నీ
21. కింది ఏ వర్గానికి ప్రాథమిక హక్కుల్లో ప్రస్తావన లేదు?
    ఎ) వికలాంగులు బి) మహిళలు
    సి) ఆర్థికంగా వెనుకబడినవారు డి) ఎ, సి

సమాధానాలు

1) బి	2) ఎ	3) బి	4) ఎ	5) ఎ
6) బి	7) బి	8) డి	9) బి	10) సి
11) సి	12) డి	13) బి	14) ఎ	15) డి
16) డి	17) సి	18) ఎ	19) ఎ	20) డి
21) డి				

కణాంతర జీర్ణక్రియలో ఎంజైములు ఉన్న భాగం?



జంతువుల్లో పోషణ

జంతువులు వాటి ఆహారాన్ని అవి తయారు చేసుకోలేవు. ఆహారం కోసం ఇతర జీవులపై ఆధారపడతాయి. అందువల్ల వీటిని పరపోషకాలు అంటారు. పరపోషకాలు రెండు రకాలు అవి.. పూతికాహారులు, జాంతవ భక్షకులు

- నీటిలో కరిగిన ఆహార పదార్థాలను శరీర ఉపరితలం ద్వారా పీల్చుకోవడాన్ని పూతికాహార విధానం అంటారు. **ఉదా:** కొన్ని రకాల ప్రోటోజోవన్‌లు, పరాన్నజీవులు.
- జంతువుల్లో ఎక్కువశాతం ఘన, ద్రవ, ఆహార పదార్థాలను ప్రత్యేక సేకరణ యంత్రాంగాల సహాయంతో తీసుకుని జీర్ణరసాల ద్వారా జీర్ణం చేసుకుంటాయి. దీన్ని జాంతవ భక్షణం అంటారు.
- అమీబా మిథ్యాపాదాలు, హైడ్రా స్పర్శకాల ద్వారా ఆహారాన్ని సేకరించి ముక్కలు చెయ్యకుండా ఒకేసారి మింగుతాయి.
- నత్త రాడ్యులా (నాలుక)తో ఆహారాన్ని చిన్న చిన్న రేణువుల రూపంలో మింగు తుంది.
- తేళ్లు, సాలీళ్లు భక్షకాన్ని చంపి దాని శరీరంలోకి జీర్ణరసాలను వదిలి జీర్ణమైన ద్రవరూప ఆహారాన్ని తీసుకుంటాయి.
- సీతాకోకచిలుకలు గొట్టం వంటి తొండంతో పుష్పాల మకరందాన్ని పీల్చుకుంటాయి.
- జలగ రక్తాన్ని ఆహారంగా తీసుకుంటుంది. రక్తం గడ్డకట్టకుండా ఉండేందుకు కొన్ని పదార్థాలను జీవి రక్తంలోకి విడుదల చేస్తుంది.
- కొన్ని జీవులు ఒకే రకమైన ఆహారాన్ని తీసుకుంటాయి. వీటిని ఏక రక భక్షక జీవులు అంటారు. ఉదా: పట్టుపురుగు (గొంగళిపురుగు దశలో) మల్బరీ ఆకులను మాత్రమే తింటుంది.
- కొన్ని జంతువుల్లో ఆడ, మగ జీవులు వేర్వేరు ఆహారాన్ని తీసుకుంటాయి. **ఉదా:** మగదోమ చెట్టు నుంచి రసాలను, ఆడదోమ మనిషి రక్తాన్ని ఆహారంగా తీసుకుంటాయి.
- ఆహారంలో ఉండే క్లిష్టమైన స్థూల ఆహార అణువులను సరళమైన అణువులుగా మార్చడాన్ని జీర్ణక్రియ అంటారు.
- జీర్ణవ్యవస్థ గోడల్లో ఉండే గ్రంథి కణాలు ఎంజైములను విడుదల చేస్తాయి. ఈ ఎంజైములు జీర్ణక్రియ రసాయనిక చర్య లను వేగవంతం చేస్తాయి. ఎంజైములు ఉత్ప్రేరకాల్లా పనిచేస్తాయి.
- ఉన్నతస్థాయి బహుకణ జీవుల్లో జీర్ణవ్య వస్థ అంతర్భాగాల్లోని కణాల బయట జీర్ణక్రియ జరుగుతుంది. దీన్ని కణబాహ్య జీర్ణక్రియ అంటారు.
- ప్రోటోజోవా వంటి ఏకకణ జీవుల్లో కణం లోపల ఆహార రిక్తికలోనికి విడుదలైన ఎంజైముల వల్ల జీర్ణక్రియ జరుగుతుంది. దీన్ని కణాంతర జీర్ణక్రియ అంటారు.
- బహుకణ జీవుల్లో కూడా కణాంతర జీర్ణక్రియ కొంతవరకు జరుగుతుంది. లైసోజోమ్‌లు ఈ జీర్ణక్రియలో ఎంజైము లను విడుదల చేస్తాయి.
- ఎంజైములు చైతన్యవంతంగా ఉండాలంటే సరైన పీహెచ్ (హైడ్రోజన్ గాఢత) ఉష్ణోగ్రత అవసరం.
- పెప్సిన్ చైతన్యరహిత రూపం పెప్సినోజన్. కైమోట్రిప్సిన్ చైతన్యరహిత రూపం కైమోట్రిప్సినోజన్.

నెమరువేసే జంతువుల్లో జీర్ణక్రియ

- ఆవు, ఎద్దు, గేదె, మేక వంటి పెంపుడు జంతువులు శాకాహారులు. ఇవి మొక్కలను తింటాయి. కాబట్టి వృక్షకణంలో తయారైన సెల్యులోజ్‌ను ఆహారంగా తీసు కుంటాయి. సెల్యులోజ్ అనేక గ్లూకోజ్ అణువులతో తయారైన పాలిసాకరైడ్.
- సెల్యులేస్ అనే ఎంజైము సెల్యులోజ్‌ను జీర్ణం చేస్తుంది.
- జంతువుల్లో కొన్ని కశాభజీవులు బ్యాక్టీరియా జీర్ణవ్యవస్థలో ఉండి సెల్యు లేస్‌ను ఉత్పత్తి చేస్తాయి. అంటే ఈ జంతు వుల్లో కశాభజీవులు, బ్యాక్టీరియా జీర్ణ వ్యవస్థలో ఉండి సహజీవనం చేస్తాయి.
- శాకాహారుల్లో కుంతకాలు (కత్తెర పళ్లు) బాగా అభివృద్ధి చెంది ఉంటాయి.
- నెమరువేసే జీవుల్లో జీర్ణాశయం పెద్దగా నాలుగు గదుల్లో ఉంటుంది. అవి ప్రథమ అమాశయం, జాలకం, తృతీయ, చతుర్థ అమాశయాలు.
- ప్రథమ అమాశయం అతి పెద్ద గది. ఇందులో అతి ఎక్కువ (వేల సంఖ్యలో) సెల్యులోజ్‌ను ఉత్పత్తి చేసే సూక్ష్మజీ వులుంటాయి. తృతీయ అమాశయంలో నీరు, బై కార్బొనేట్లు శోషణ చెందుతాయి.
- చతుర్థ అమాశయంలో ఆమ్లం విడుదలై సూక్ష్మ జీవులను చంపుతుంది. ప్రొటీన్ల నిర్మాణాన్ని విడగొడుతుంది. దీన్ని విస్వా భావకరణం అంటారు.
- పేగులో జీర్ణక్రియ పూర్తయిన తర్వాత జీర్ణమైన ఆహారపదార్థాలు శోషణ చెందుతాయి.
- గ్లూకోజ్ కిణ్వప్రక్రియ చెందడం వల్ల నెమరు వేసే జంతువుల్లో ప్రొపియోనిక్, బ్యుటేరిక్ వంటి కొవ్వు ఆమ్లాలు ఏర్పడతాయి.
  ఈ క్రియలో సూక్ష్మజీవుల శరీర నిర్మాణానికి, ఇతర కార్యకలాపాలకు కావలసిన శక్తి లభిస్తుంది.
- లాలాజలంలో ఉండే బై కార్బొనేట్ ఆమ్లా న్ని తటస్థీకరణం చేస్తుంది.
- నెమరువేసే జంతువుల్లో ఇతర జంతువుల రక్తంలో కంటే తక్కువ మొత్తంలో గ్లూకోజ్ కన్పిస్తుంది.
- కుందేళ్లు శాకాహారులు కానీ, నెమరువేసే జంతువులు కాదు. ఇవి రెండు రకాల మల పదార్థాన్ని విసర్జిస్తాయి. మెత్తగా బూడిద రంగులో ఉండే పాక్షికంగా జీర్ణమైన సెల్యులోజ్ కలిగిన మల పదార్థాన్ని కుందేలు తిరిగి తింటుంది. దీన్ని మల కబళనం అంటారు.
- కొన్ని శాకాహారుల్లో ఉండూకం(అపెండిక్స్) సెల్యులోజ్ జీర్ణక్రియకు ఉపయోగ పడుతుంది.
- కుందేలులో రెండు దవడలపైన, ఢీకో డాంట్, విషమదంతి, ద్వివారదంతి రకపు దంతాలుంటాయి. కుంతకాలుండవు. 3 రకాల దంతాలు మాత్రమే ఉంటాయి.

మాదిరి ప్రశ్నలు

1. తేలు, సాలీడు భక్షకానికి సంబంధించి సరైంది?
   1) పూతికాహార సేకరణ
   2) రాడ్యులాతో ఆహారాన్ని తినటం
   3) భక్షకాన్ని చంపి దాని శరీరంలోకి జీర్ణరసాలను వదలడం
   4) పొడవైన గొట్టంతో ఆహారాన్ని పీల్చడం
2. జీవుల రక్తాన్ని పీల్చేముందు రక్తం గడ్డకట్ట కుండా దానిలోకి పదార్థాలను విడుదల చేసే జీవి?
   1) తేలు 2) మగ ఈగ
   3) మగ ఎనాఫిలస్ దోమ 4) జలగ
3. ఏక రక భక్షక జీవులకు ఉదాహరణ?
   1) బొద్దింక
   2) పట్టుపురుగు(గొంగళిపురుగు దశలో)
   3) కప్ప టాడ్‌పోల్
   4) చిట్టెలుక
4. కణాంతర జీర్ణక్రియలో ఎంజైములు ఉన్న భాగం?
   1) రిక్తిక 2) కేంద్రకం
   3) లైసోజోమ్ 4) రైబోజోమ్
5. జీర్ణక్రియలోని ఎంజైములకు సంబంధించి సరికానిది?
   1) ఎంజైములు ఉత్ప్రేరకాలుగా పని చేస్తాయి
   2) ఎంజైములను హైడ్రోలేసులుగా పిలుస్తారు
   3) ఎంజైములు జీర్ణరసాల్లో ఉంటాయి
   4) ఎంజైములు జీర్ణక్రియలోని రసాయ నిక చర్యలో పాల్గొంటాయి
6. కిందివాటిలో ఎంజైమ్ చైతన్యరహిత రూపా న్ని తెలియజేసేది?
   1) ట్రిప్సిన్ 2) ట్రిప్సినోజన్
   3) పెప్సిన్ 4) కైమోట్రిప్సిన్
7. జీర్ణక్రియ ఎంజైములను హైడ్రోలేసులు అని కూడా అంటారు. ఎందుకు?
   1) జీర్ణక్రియ చర్యల్లో పాల్గొనకుండా చర్యావేగాన్ని పెంచుతాయి.
   2) సరళసమ్మేళనాలను సంక్లిష్ట అణువులుగా మారుస్తాయి
   3) క్లిష్టమైన అణువుల మధ్య ఉండే రసాయన బంధాలను నీటి అణువును చేర్చి విడగొడతాయి
   4) రసాయన చర్యలను ఆమ్ల మాధ్యమంలో ఉండే ఆహార పదార్థాల్లోనే జరుపుతాయి
8. ఎమైలేసస్ అనేవి చర్య జరపటానికి కావలసిన అధస్తరం?
   1) పిండి పదార్థాలు 2) కొవ్వులు
   3) మాంసకృత్తులు
   4) విటమిన్‌లు
9. శాకాహారుల్లో సెల్యులోజ్ జీర్ణక్రియకు సంబంధించి సరైన ప్రవచనం?
   1) నెమరువేయడం వల్ల సెల్యులోజ్ జీర్ణక్రియ జరుగుతుంది
   2) జీర్ణాశయం నాలుగు గదులుగా ఉండటం వల్ల సెల్యులోజ్ జీర్ణం అవుతుంది.
   3) సెల్యులోస్ జీర్ణక్రియకు కశాభజీవుల, బ్యాక్టీరియా సహాయాన్ని తీసుకుంటాయి
   4) సెల్యులోజ్ జీర్ణక్రియలో ఒక శాకాహారి మరొక శాకాహారికి ఉపయోగపడుతుంది
10. ఆవు ఏ జీర్ణాశయ గదిలో విస్వాభావ కరణం జరుగుతుంది?
    1) చతుర్థ అమాశయం
    2) తృతీయ అమాశయం
    3) ప్రథమ అమాశయం
    4) ద్వితీయ అమాశయం
11. ఆవు జీర్ణాశయంలోని తృతీయ అమా శయంలో జరిగే రెండు చర్యలు ఏవి?
    ఎ) ఎంజైముల వల్ల ప్రొటీన్ల జీర్ణక్రియ జరుగుతుంది
    బి) ఆహారం బాగా చిక్కగా అవుతుంది
    సి) నీరు, బైకార్బొనేట్లు శోషణచెందుతాయి
    డి) ఆహారంలో సెల్యులోజ్, ఇతర పదా ర్థాల మీద విశ్లేషక చర్యలు జరుగుతాయి
    1) ఎ,సి 2) బి, సి
    3) ఎ, డి 4) బి, డి
12. ఆవు జీర్ణాశయంలోని సూక్ష్మజీవులకు శరీర నిర్మాణం, ఇతర కార్యకలాపాలకు కావలసిన శక్తి ఏ ప్రక్రియల ద్వారా లభిస్తుంది?
    1) విస్వాభావకరణం 2) శోషణ ప్రక్రియ
    3) కిణ్వప్రక్రియ 4) మలకబళనం

సమాధానాలు

1) 3	2) 4	3) 2	4) 3	5) 4
6) 2	7) 3	8) 1	9) 3	10) 1
11) 2	12) 3			

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆవు ప్రథమ అమాశయంలో సెల్యులోజ్ నుంచి ఏర్పడిన గ్లూకోజ్‌లో కలిగే మార్పు? (డీఎస్సీ 2008)
   1) ఇంధనంగా ఉపయోగపడుతుంది
   2) కిణ్వప్రక్రియ ద్వారా సారాయిగా మారుతుంది
   3) శోషణం చెందుతుంది
   4) కిణ్వప్రక్రియ ద్వారా కొవ్వు ఆమ్లాలుగా మారుతుంది.
2. కొన్ని జంతువుల్లో కనిపించే మల కబళనం అనే ప్రక్రియ? (డీఎస్సీ 2008)
   1) పాక్షికంగా జీర్ణమైన కొవ్వులను గ్రహించడానికి
   2) పాక్షికంగా జీర్ణమైన ఖనిజ లవణాలను గ్రహించడానికి
   3) పాక్షికంగా జీర్ణమైన సెల్యులోజ్‌ను గ్రహించడానికి
   4) పాక్షికంగా జీర్ణమైన మాంస కృత్తులను గ్రహించడానికి
3. ఆవు, గేదె వంటి నెమరువేసే జంతువుల జీర్ణశయంలో సెల్యులోజ్‌ను ఉత్పత్తి చేసే సూక్ష్మజీవులు ఎక్కువగా ఉండే భాగం? (డీఎస్సీ 2008)
   1) తృతీయ అమాశయం
   2) చతుర్థ అమాశయం
   3) ప్రథమ అమాశయం
   4) ద్వితీయ అమాశయం
4. లాలాజలం లక్షణం? (డీఎస్సీ 2001)
   1) క్షారం, ఆమ్లం 2) కొద్దిగా క్షారం
   3) పూర్తిగా నీరు కల్గి ఉంటుంది
   4) కొద్దిగా ఆమ్లం
5. సోడియం కొలేట్, సోడియం డీ ఆక్సీ కొలేట్ అనేవి? (డీఎస్సీ 2006)
   1) పైత్యరస లవణాలు
   2) పైత్యరస వర్ణకాలు
   3) క్లోమరస లవణాలు
   4) క్లోమరస వర్ణకాలు
6. మానవునిలో సంవరణీ కండరాలు వ్యాకోచించినప్పుడు? (డీఎస్సీ 2006)
   1) జీర్ణక్రియ వల్ల ఏర్పడ్డ అంత్య ఉత్పన్నకాలు పేగులో శోషణమవుతాయి
   2) కొవ్వులు జీర్ణమవుతాయి
   3) జీర్ణక్రియ అంత్య ఉత్పన్నకాలను చూషకాలు పీల్చుకుంటాయి
   4) మలం పాయువు ద్వారా విసర్జితమవుతుంది
7. కైమ్ ఏ స్థితిలో ఉంటుంది? (డీఎస్సీ 2004)
   1) క్షారంగా, ఆమ్లంగా 2) ఆమ్లస్థితి
   3) క్షారస్థితి 4) సమతౌల్యస్థితి
8. మ్యూసిన్ అనే శ్లేష్మ పదార్థాన్ని స్రవించేది? (డీఎస్సీ 2004)
   1) అధోజంబిక 2) అధోజిహ్వక
   3) జఠర గ్రంథులు
   4) పెరోటిడ్ గ్రంథులు
9. రెనిన్ అనే ఎంజైము? (డీఎస్సీ 2004)
   1) కొవ్వులను కొవ్వు ఆమ్లాలుగా మారుస్తుంది
   2) అమైనో ఆమ్లాలను ప్రొటీన్లుగా మారుస్తుంది
   3 పిండి పదార్థాన్ని మాల్టోజ్‌లుగా మారుస్తుంది
   4) పాలను పెరుగుగా మారుస్తుంది
10. పెరిస్టాల్టిక్ చలనాలు ఉన్న మానవుని జీర్ణ మండలంలోని భాగం? (డీఎస్సీ 2004)
    1) జీర్ణాశయం 2) ఆంత్రమూలం
    3) కాలేయం 4) ఆహార వాహిక

సమాధానాలు

1) 4	2) 3	3) 4	4)2	5) 3
6) 4	7) 2	8) 3	9) 4	10) 4

మహా జనపదాల్లోని ఏకైక దక్షిణ భారత రాజ్యం?

షోడశ మహాజనపదాలు

క్రీ.పూ. 6వ శతాబ్దానికి భారతదేశ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానముంది. ఈ కాలంనాటి రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితుల ప్రభావం భారతదేశ చరిత్రపై ఎక్కువగా ఉంది. ఈ కాలాన్ని మహా జనపదాల యుగం, బుద్ధ యుగం, రెండో నగరీకరణ యుగం, మౌర్యుల పూర్వ యుగమని పలుపేర్లతో పిలుస్తున్నారు. దీనికి కారణం..దేశ చరిత్రలోనే తొలిసారిగా వేద కాలపు తెగ ఆధారిత జనపదాలకు భిన్న ంగా, ప్రాంతం ఆధారిత మహాజనపదాలు (ప్రాదేశిక రాజ్యాలు) ఏర్పడ్డాయి. ప్రపంచ మతంగా ఉన్న బౌద్ధమత స్థాపకుడు బుద్ధుడు జీవించిందీ, తన సిద్ధాంతాలను ప్రచారం చేసిందీ ఈ కాలంలోనే. సింధూ నాగరికత పట్టణాల తర్వాత మళ్లీ నగరాలు ఆవిర్భవిం చింది కూడా ఈ కాలంలోనే. ఈ యుగం అంతం కాగానే క్రీ.పూ. 325లో మౌర్య సామ్రాజ్యం ఏర్పడింది. అందువల్ల దీన్ని మౌర్యుల పూర్వయుగం అని అంటారు.

మహాజనపదాల ఆవిర్భావం

ప్రపంచంలోని అత్యంత సారవంతమైన మైదానాల్లో ఒకటైన గంగామైదానం సాగులోకి రావడంతో పాటు ఈ కాలంలో విస్తృత స్థాయిలో ఇనుమును ఉపయోగించారు. కొత్త కొత్త పనిముట్లు అందుబాటులోకి వచ్చి వ్యవసాయంలో మిగులు ఏర్పడింది. దీనివల్ల వ్యాపార వాణిజ్యాలు, నగరాలు అభివృద్ధి చెందాయి. పన్నుల వ్యవస్థకు అవకాశం కలిగింది. ఈ పరిణామాలన్నీ కలిసి ఈ యుగం లో 16 పెద్ద ప్రాదేశిక రాజ్యాల ఏర్పాటుకు దారి తీశాయి. బౌద్ధ గ్రంథం అంగుత్తర నికాయలో ఈ 16 రాజ్యాల ప్రస్తావన ఉంది. అవి..

- **అంగ:** రాజధాని చంపా. దీని రాజు బ్రహ్మదత్తుడిని అంతం చేసి బింబిసారుడు ఈ రాజ్యాన్ని ఆక్రమించాడు.
- **కాశీ:** రాజధాని వారణాశి. ఇది వరుణ, ఆసి నదుల సంగమ ప్రాంతం.
- **కోసల:** దీని తొలి రాజధాని అయోధ్య. మలి రాజధాని శ్రావస్తి. ఈ రాజులు కాశీని ఆక్రమించుకొన్నారు. ఈ రాజ్యం చివరికి మగధలో విలీనమైంది.
- **వజ్జీ:** వైశాలి రాజధాని. ఇది 8 గణ రాజ్యాలతో కూడిన సమాఖ్య. వైశాలి రాజు చేతకుని కుమార్తె చెల్లనను బింబిసారుడు వివాహం చేసుకున్నాడు. ఈ రాజ్యాన్ని చివరికి అజాతశత్రువు అంతం చేశాడు.
- **మల్ల:** దీని రాజధానులు కుసినార, పావ. కుశినారలో బుద్ధుడు నిర్యాణం చెందితే, పావలో మహావీరుడు మరణించాడు. ఈ గణరాజ్యం బుద్ధుడిని బాగా ఆదరించింది. బుద్ధుని శిష్యులు ఆనందుడు, ఉపాలి మొదలైన వారు ఈ రాజ్యానికి చెందినవారే. పావలో సంతాగార అనే శాసనసభ ఉండేది.
- **చేది:** రాజధాని సుక్తిమతి, ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్‌లో ఉంది.
- **వత్స:** దీని రాజధాని కౌశాంబి. దీని రాజు ఉదయనుడు. బౌద్ధమతాన్ని ఆదరించాడు. హర్షుని ప్రియదర్శిక, రత్నావళితో పాటు అనేక కథల్లో ఇతడు నాయకుడు.
- **పాంచాల:** దీని రాజధానులు అహిచ్ఛత్ర, కంపిల్య.
- **సౌరసేన:** దీని రాజధాని మధుర, గ్రీకు రచనల్లో ఈ రాజ్యాన్ని సౌరసేనాయ్‌గా, రాజధాని మేథోరాగా ప్రస్తావించారు.
- **మత్స్య:** దీని రాజధాని విరాట నగరం. ఈ రాజ్యం మగధలో కలిసిపోయింది.
- **కురు:** రాజధాని ఇంద్రప్రస్థ. ఆధునిక ఢిల్లీ పరిసరాల్లోని నగరం ఇది. 2వ రాజధాని హస్తినాపుర్
- **అస్సక/అస్మక:** రాజధాని పొదన లేదా పొటన. దీన్ని నేటి బోధన్‌గా భావి స్తున్నారు. ఇది షోడశ మహాజనపదాల్లోని ఏకైక దక్షిణాది రాజ్యం. ఇది ఆంధ్ర, మహారాష్ట్రలకు విస్తరించి ఉంది.
- **అవంతి:** రాజధానులు ఉజ్జయిని, మహి ష్మతి. బుద్ధుని సమకాలికుడైన అవంతి రాజు ప్రద్యోత లేదా చండ ప్రద్యోత మహాసేన. దీని చివరి రాజు నంది వర్ధ నుడిని ఓడించి మగధరాజు శిశునాగుడు ఈ రాజ్యాన్ని ఆక్రమించాడు.
- **గాంధార:** రాజధాని తక్షశిల. దీనిరాజు పుక్కుసతి లేదా పుష్కర సరీన్. బింబి సారుని వద్దకు రాయబారిని పంపాడు. ఈ రాజ్యాన్ని పర్షియన్లు ఆక్రమించుకున్నారు.
- **కాంభోజ:** రాజధాని రాజాపుర.
- **మగధ:** రాజగృహ (గిరివ్రజ) పాటలీపుత్ర రాజధానులు.

బుద్ధుని కాలానికి పైన పేర్కొన్న 16 జనపదాల్లో కేవలం నాలుగు రాజ్యాలు మాత్రమే ఉండేవి. అవి వత్స, అవంతి, కోసల, మగధ. మిగిలిన రాజ్యాలన్నీ ఈ నాలుగు రాజ్యాల్లో విలీనం అయ్యాయి. ఐతే క్రీ.పూ. 4వ శతాబ్దంలో ఈ నాలుగు రాజ్యాలు విలీనమై మగధ సామ్రాజ్యం అవతరించింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మగధను పాలించిన రాజవంశాలు: క్రీ.పూ.6వ శతాబ్దం నుంచి క్రీ.పూ. 4వ శతాబ్దం వరకు అంటే.. మౌర్య సామ్రాజ్యం ఏర్పడే వరకు మగధను మూడు రాజవంశాలు పాలించాయి.

హర్యాంక వంశం (544-413)

బింబిసారుడు : ఇతనితో ప్రారంభమైన మగధ సామ్రాజ్యవాదం అశోకుని కళింగ యుద్ధం వరకూ కొనసాగింది. బింబిసారుడు అంగను జయించి, తన కుమారుడు అజాత శత్రువును రాజ ప్రతినిధిగా నియమించాడు. కోసలరాజు ప్రసేనజిత్ చెల్లెలు కోసలదేవిని వివాహమాడి కాశీని పొందాడు. వైశాలీ లిచ్ఛవీ రాజు చేతకుని కుమార్తె చెల్లనను, పంజాబ్‌ను పాలించే మాద్రా రాకుమార్తె ఖేమాను వివాహమాడి పశ్చిమ ఉత్తర దిశలో రాజ్య విస్తరణ మార్గాన్ని సుగమం చేసుకొన్నాడు. ప్రధాన శత్రువు అయిన చండ ప్రద్యోత మహాసేనుడి వద్దకు బింబిసారుడు తన ఆస్థాన వైద్యుడు జీవకుడిని పంపి కామెర్ల వ్యాధి నుంచి విముక్తున్ని చేసి మిత్రునిగా చేసుకొన్నాడు. గాంధారరాజు పుష్కర సరీన్ కూడా తన రాయబారిని పంపి బింబిసారునితో స్నేహం కుదుర్చుకున్నాడు. బింబిసారుడు బుద్ధుని సమకాలికుడైనప్పటికీ ఏ మతాన్ని ఆదరించాడనే దానిపై స్పష్టత లేదు. బౌద్ధ, జైన మతాలు రెండూ ఇతన్ని తమ మతం వాడిగానే పేర్కొన్నాయి.

అజాతశత్రువు: తండ్రిని హత్యచేసి సింహాసనాన్ని ఆక్రమించుకొన్నాడు. తీవ్రమైన సామ్రాజ్యవాద విధానాన్ని అవలంబించాడు.

కోసలరాజు, తన మేనమామ ప్రసేనజిత్‌కు వ్యతిరేకంగా అజాతశత్రువు యుద్ధం చేశాడు. విజయం సాధించి కోసల రా కుమార్తెను వివాహం చేసుకోవడంతో పాటు కాశీని తిరిగి పొందాడు. వైశాలీ లిచ్ఛవుల నాయకత్వంలోని 36 రాజ్యాల కూటమికి వ్యతిరేకంగా 16 ఏళ్ల యుద్ధం చేసి విజయం సాధించాడు. ఇతడు తొలుత జైనాన్ని, తర్వాత బౌద్ధాన్ని స్వీకరించినట్లు తెలుస్తోంది. బుద్ధున్ని కలిసి తన తండ్రిని చంపిన నేరాన్ని అంగీకరించాడు. వీరి సమావేశ దృశ్యం బార్హుత్ శిల్పాల్లో చెక్కారు. ఇతని కాలంలో మొదటి బౌద్ధసంగీతి జరిగింది. అజాత శత్రువుకు కునిక అనే బిరుదు ఉంది.

ఉదయనుడు: ఇతడు పాటలీ గ్రామంలోని గంగ, సోన్ నది సంగమ స్థానంలో కోటను నిర్మించాడు. దాంతో ఉదయనుడిని పాట లీపుత్ర నగర నిర్మాతగా చరిత్రకారులు భావిస్తున్నారు.

శిశునాగ వంశం (413-364)

శిశునాగుడు: ఉదయనుడి తర్వాత పితృ హంతకులు రాజులుగా వచ్చారు. వీరితో విసిగిపోయిన ప్రజలు కాశీలో రాజ ప్రతినిధిగా ఉన్న శిశునాగున్ని రాజుగా చేసినట్లు కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఇతడు రాజధానిని వైశాలికి మార్చాడు. అవంతి రాజు ప్రద్యోతను ఓడించి అవంతి రాజ్యాన్ని మగధలో కలిపివేయడం శిశునాగుని గొప్ప విజయం. దీనితో ఈ రాజ్యాల మధ్య వంద ఏళ్లుగా సాగిన వైరం అంతమైంది.

కాలశోకుడు: ఇతడు రాజధానిని పాటలీ పుత్రానికి తిరిగి మార్చాడు. ఇతని కాలంలో రెండో బౌద్ధ సంగీతి జరిగింది. కాలశోకుడిని సేనాపతి మహాపద్మ నందుడు హత్యచేసి నంద వంశ స్థాపన చేశాడు.

నందవంశం: (364-321)

ఈ కాలంలో మగధను పాలించిన అత్యంత బలమైన వంశం ఇది.

మహాపద్మనందుడు: ఇతడు శూద్ర మహిళకు జన్మించినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. అనేక క్షత్రియ రాజ కుటుంబాలను రూపుమాపి రెండో పరశురామునిగా పేరుగాంచాడు. ఖార వేలుని హాతిగుంఫా శిలాశాసనం ప్రకారం ఇతడు కళింగను జయించి విజయచిహ్నంగా జైనతీర్థంకరుని విగ్రహం తెచ్చినట్లు తెలు స్తోంది. ఏకరాట్ అనే బిరుదును మహా పద్మనందుడు ధరించాడు.

ధననందుడు: మహాపద్మనందుడి తర్వాత అతని ఎనిమిదిమంది కుమారులు పాలిం చారు. వారిలో చివరివాడు ధననందుడు. ఇతనికి 2 లక్షల పదాతిదళం, 20 వేల అశ్వికదళం, 3 వేల గజదళం. 2 వేల రథ బలముండేది. అలెగ్జాండర్ సేనలు బియాస్‌ను దాటి భారత్‌పై దండెత్తక పోవడానికి ధననం దుడి బలసంపత్తి కూడా ఒక కారణం. ఐతే ఇతనికి మితిమీరిన ధన కాంక్ష ఉండేది. ప్రజలను పీడించి వారి మద్దతు కోల్పోయాడు. ఈ పరిస్థితులను అనువుగా చేసుకొని చంద్ర గుప్త మౌర్యుడు ఇతన్ని అంతమొందించి మౌర్య వంశ స్థాపన చేశాడు.



బుద్ధయుగంలోని గణతంత్ర రాజ్యాలు

ఈ కాలంనాటి పాళి గ్రంథాల్లో నాడు మనుగడలో ఉన్న కొన్ని గణతంత్ర రాజ్యాల ప్రస్తావన ఉంది. ఈ రాజ్యాల్లో కొన్ని షోడశ మహాజనపదాల్లోనూ కన్పిస్తాయి.

- నాటి గణరాజ్యాల్లో కపిల వస్తు, కుసినగర, పావ, వైశాలి ప్రధానమైనవి.
- కపిలవస్తును శాక్యవంశం పాలించేది. ఇది భారత్- నేపాల్ సరిహద్దు రాజ్యం. బుద్ధుడు ఈ వంశానికి చెందినవాడు. కోసలరాజు విరుధకుడు ఈ రాజ్యాన్ని అంతం చేసి శాక్యులను ఊచకోత కోశాడు.
- కుశినగర, పావ రాజధానులుగా మల్ల వంశం పాలించేది. అజాతశత్రువు ఈ రాజ్యాన్ని అంతం చేశాడు.
- దదవైశాలీ రాజధానిగా లిచ్ఛావీలు పరిపాలించారు. వీరు స్వేచ్ఛా పిపాసులు. యుద్ధ పిపాసులు. అందువల్ల అజాతశత్రువుకు ఈ రాజ్యాన్ని ఆక్రమించేందుకు 15 ఏళ్ల పట్టింది. అజాతశత్రువు ఈ యుద్ధంలో విజయం సాధించినా లిచ్ఛావీలు తీవ్ర నష్టాన్ని కలుగజేసారు. వీరి సమావేశ మందిరం పేరు సంతాగార,ఇందులో 7707 మంది ప్రతినిధులు పాల్గొనేవారని తెలుస్తోంది.

మాదిరి ప్రశ్నలు

1. షోడశ మహా జనపదాల్లోని ఏకైక దక్షిణ భారత రాజ్యం?
   ఎ) అవంతీ బి) అస్మక
   సి) కాంభోజ డి) శౌరసేన
2. భారత దేశంపై దండెత్తిన తొలి విదేశీ పాలకుడు?
   ఎ) సైరస్ బి) డేరియస్-1
   సి) జెక్లెస్ డి) డేరియస్-3
3. కింది వారిలో అజాతశత్రువుకు సమకాలీనులు కానివారు?
   ఎ) బుద్ధుడు బి) మహావీరుడు
   సి) మస్కరి గోషల పుత్రుడు
   డి) నాగసేనుడు
4. కింది రాజ్యాలు వాటి రాజధానుల్లో సరైన సమాధానాన్ని గుర్తించండి?

A	B
1. అంగ	a) తక్షశిల
2. గాంధార	b) చంప
3. కురు	c) మధుర
4. శౌరసేన	d) ఇంద్రప్రస్థ

	1	2	3	4
ఎ)	B	A	D	C
బి)	C	D	A	B
సి)	D	C	B	A
డి)	A	B	C	D

సమాధానాలు

1) బి 2) ఎ 3) డి 4)ఎ

Which of the following will be third..

ALPHABET AND ALPHA-NUMERIC-SYMBOL SEQUENCE

BANK EXAMS

REASONING

Questions on alphabet are based on the position of the letters of English Alphabet.

There are 26 letters in English Alphabet with 'A' - taking 1st position. 'B' - 2nd position and so on 'Z' takes the 26th position.

Similarly 'Z' takes the 1st posi tion, 'Y'- 2nd position and so on 'A' takes the 26th position. So the sum of the positions of any letter from the left end and from the right end is equal to 27.

A candidate is advised to reme mber positions of letters from the left end and if the position is to be found from right end subtract its position from left end from 27.

(E.g. 1-5): Answer these questions on the basis of the following alphabets.
A B C D E F G H I J K L M N O P Q R S T U V W X Y Z

E.g.1: Four of the following are alike in regard to their group. Which is the one that does not belong to the group?
1) FE 2) ML 3) JK
4) VX 5) RS

SOL: All the pairs of letters except 'VX' occupy consecutive position in English alphabet. So 'VX' does not belong to the group.

E.g. 2: Which letter is 9th to the left of 9th letter from the right end.
1) J 2) K 3) H 4) M
5) None of these

SOL: The letter will be 9+9=18th from right end.
⇒ The same will be 27–18=9th from left end. But 9th letter from left = 'I'.

E.g. 3: If the above alphabets, are divided in two equal halves from A to M and N to Z, which letter in the latter half would be corres ponding to letter J?



1) Q 2) V
3) X 4) W
5) None of these

SOL: If the alphabet is divided into two halves the difference bet ween any letter of first half and corresponding letter of second half is equal to 13.
⇒(Letter from second half)-(J) = 13
⇒Letter from second half = 13 + J = 13 + 10 = 23 = W

E.g. 4: If the above alphabets, are written in the reverse order whi ch letter will be 12th to the left of 16th from left?
1) X 2) W
3) D 4) V
5) None of these

SOL: 12th to the left of 16th from left = 16–12 = 4th from left since the alphabets are written in reverse order. Z becomes 1st from left, Y becomes 2nd and so on.
4th letter from left = W.

E.g. 5: What should come in place of question mark(?) in the follow ing letter series?
BD CEF DFGH ?

SOL: In each set letters are written starting from B,C,D respectively. Moreover the number of letters written are 2, 3 and 4 respe ctively. In continuation the next set should start with E and should have 5 letters i.e. EGHIJ.

PRACTICE QUESTIONS

1. Which of the following will come in place of question mark (?) in the following series based on English alphabetical order? ZA BY XC DW ?
   1) VF 2) EU 3) UE 4) EV 5) VE

Ans: 5
The two letters in each set are last and first alphabets, second and second last, third last and third, fourth and fourth last. So the next set will be fifth last and fifth, i.e. VE

2. Which of the following will come in the place of the question mark (?) in the following series based on the English alphabetical or der?
   ZXWY TRQS NLKM ?
   1) HGFE 2) IGFH
   3) HFEG 4) EFGH 5) IFGH

Ans: 3
The order of letters in the series are jumbled starting with the last letter of the alphabet. After 4 letters from the reversing alphabet, two letters are left and the series again continues.
The order of the letters first, fourth, second and third.
The next letters will be H, G, F, E. i.e. HFEG

3. If each vowel in the word POLITE is changed to the next letter in the English alphabetical series and each consonant is changed to the previous letter in the English alphabetical series, and then the alphabets so for-med are arranged in alphabetical order from left to right, which of the following will be third from the left?
   1) O 2) P 3) J 4) K 5) None

Ans: 4
The vowels in the given word 'POLITE' are O, I, E and conson ants are P, L, T.
Applying the changes the word will be 'OPKJSF'.
Arranging in alphabetical order, F J K O P S.
The third letter from left will be 'K'.

4. How many meaningful English words can be formed with the letters 'NSIK' (starting with S) using all the letters but each letter only once in each word?
   I) None 2) One
   3) Two 4) Three
   5) More than three

Ans: 3
The meaningful words starting with 'S' will be SKIN and SINK.
Only two words can be formed.

5. Which of the following is exactly in the middle of the twentieth element from the left and the ninteenth element from the right of the English alphabetical seri es?
   1) S 2) T 3) M
   4) N 5) None

Ans: 4
Left position = 20 (T)
Right position = 19
⇒ Left position = 27–19 = 8
Exactly middle letter =
8 1 30 = 17
14th letter from left will be 'N'.

6. How many such pairs of letters are there in the word 'BARG AINED', each of which has as many letters between them in the word (in both forward and back ward directions) as they have bet ween them in the English alphabetical series?
   1) Two 2) Three
   3) None 4) One
   5) More than three

Ans: 5
For questions like this, the number of letters between a set of letters in the word should be same as in the English alphabetical series.
For example, in the alphabe tical series, between G and I there is 1 letter.
BARGAINED

Directions (7-10): Study the following arrangement carefully and answer the questions given below :
6 C R % K B H # X D 2 @ G A 8 S 5 P E 3 F 4 L 7 M 9 $ Q U

7. What will come in place of the question mark (?) based on the above series?
   RK% #H 2G@ 5EP ?
   1) LM7 2) M$9
   3) 7M9 4) 79M
   5) M9$

Ans: 4
The series continues with a set of three letters. After first set one element (letter/number /symbol) is left, after second set two elements are left, after third set three elements are left. So after the fourth set leave four elements.
∴ The next set of letters will be 79M.

8. Which of the following is sixth to the left of the fifteenth from the right end of the above arrangement ?
   1) X 2) D 3) # 4) 2 5) H

Ans: 1
Sixth to the left of the fifteenth from the right end = 6 + 15 = 21st from right end
Total = 30
L + R = T + 1
∴ 21st from right end = (30 + 1) - 21 = 10th from left end = X

9. How many such consonants are there in the above arrangement which are immediately preceded by a symbol and imme diately followed by a vowel?
   1) One 2) Two
   3) Three
   4) More than three 5) None

Ans: 2
Required = Symbol-Consonant-Vowel (SCV)
@GA, $QU

10. Four of the following five are similar in a certain way based on their positions in the above arrangement and hence form a group. Which of the following that does not belong to the group?
    1) R%K 2) 7M9
    3) 5PE 4) H#X 5) FL7

Ans:
FL7 is different.
In the first four options, all the three elements are in a sequence. But in the 5th option
between F and L, there is one element.

Directions (11-15): Study the following arrangement carefully and answer the questions given below:
B U B D C E D B D E U B A D C B E A C D A E B A U A C D B C A C

11. How many such pairs of alphabets are there in the series of alphabets given in BOLD (A to E) in the above arrangement, each of which has as many letters between them (in both forward and backward directions) as they have between them in the English alphabetical series?
    1) None 2) One
    3) Two 4) Three
    5) More than three

Ans: 5
A D C B E
There are 6 pairs.

12. Which of the following is the eighth to the left of the twentieth from the left end of the above arrangement?
    1) C 2) E 3) U 4) B 5) A

Ans: 4
eighth to the left of the twentieth from the left end = 20 – 8 = 12
Twelfth from the left = B

13. How many meaningful Fwords can be formed with the alphabets which are first, second, fifth and sixth from the left end of the above arrangement?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three

Ans: 2
First letter = B, Second letter = U, Third letter = C, Fourth letter = E
Only one word can be formed with these letters i.e. CUBE

14. How many such consonants are there in the above arrangement, each of which is immediately preceded by a vowel and also immediately followed by a consonant ?
    1) One 2) Two
    3) Three 4) Four
    5) More than Four

Ans: 5
Vowel-Consonant-Consonant (VCC)
UBD, EDB, ADC, ACD, UAC
There are five such consonants.

15. If all As are dropped from the above arrangement, which of the following will be eleventh from the right end of the above arrangement?
    1) E 2) C 3) D 4) U
    5) None of these

Ans: 1
Leaving A's count the letters from the right end.